BROWN BOOK ONLY

UNIVERSAL LIBRARY
OU_204386
UNIVERSAL LIBRARY

# Osmania University

Call No. T81.04 A53V

Accession No. PGT 11026

Author అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి

Title వేమన - 1945.

This book should be returned on or before the date last marked below.

Andhra University Series No. 2.

# వేమన

(సర్. ఆర్. వేంకటరత్నము నాయుడు గారిచే బోధింపఁబడిన వ్యాసములు)

---

రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మచే

విరచితము

ఆంధ్ర విశ్వకళాపరిషత్తుచే

ప్రకటితము

---

1945

Copy Right Registered]

[వెల రూ. 1—8—0

First Edition 1929
Second Edition 1945 Feb.
Third Edition 1945 Sep.

*N. B:—For list of University Publications vide inside.*

Printed by A. Lakshmanaswamy Naidu
at the Saraswathi Power Press, Rajahmundry
and Published by the Registrar,
Andhra University, Guntur, 1945.

[C 4-7224-45 D/3-9-45]

# పీఠిక

శ్రీ సర్ రఘుపతి వెంకటరత్నముగారి యౌదార్యమును, ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి యభిమానమును ఈయుపన్యాసములు నాచేఁజేయించి నన్ను ధన్యుని జేసినవి.

శక్తిలో లోపములు చాలఁగలిగినను శ్రద్ధలో లోపములేకుండ ప్రయత్నించితినిగాని, దూరదేశమందుండుటచే తగిన సహాయసంపదలేక నాకే తృప్తిగా ఈకార్యమును నెఱవేర్చలేక పోయితిని. కడప కర్నూలు మండలములలో సావకాశముగా సంచారముచేసినఁగాని, వేమన కాలదేశములు నిర్ణయముగాఁ జెప్పవీలులేదు. పెక్కు వ్రాఁతప్రతులనుచూచి పద్యములన్నియు సంగ్రహింపనిది యతని సిద్ధాంతములు నికరముగా ఏర్పఱుప వీలుగాదు. కావున నేఁజేయఁగల్గినదంతయు, ముందు వేమన పద్యములను వ్యాసంగముఁ జేయఁగలవారి కొకవిధముగా పూర్వపక్షములను సమకూర్చుటయే కాని వేఱుకాదు.

ఇందు నే నుదాహరించిన పద్యములు సామాన్యముగా బందరుప్రతినాధారముగాఁగొని వ్రాయఁబడినవైనను, పాఠములలో నల్పభేదము అందందుఁ గనవచ్చును. నేను చూచిన తక్కిన వ్రాఁత యచ్చుప్రతులందలి పాఠములుగూడ నింకను విమర్శింపవలసి యున్నవి. ఆపని యిఁకముందు సవిమర్శముగా వేమన పద్యములచ్చువేయువారు చేయవలసినది.

మైసూరు
10-11-1928.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| పుట. | ౧–౨౧ | మొదటియుపన్యాసము. | ఉపోద్ఘాతము. |
| ,, | ౨౨–౪౩ | రెండవయుపన్యాసము. | వేమన కాలదేశములు. |
| ,, | ౪౪–౬౭ | మూఁడవయుపన్యాసము. | వేమనసంసారస్థితిగతులు. |
| ,, | ౬౮–౭౭ | నాల్గవయుపన్యాసము. | వేమన కాలమందలి మతధర్మముల స్థితి. |
| ,, | ౭౮–౧౧౪ | ఐదవయుపన్యాసము. | వేమనయోగసిద్ధి—మత ప్రచారము. |
| ,, | ౧౧౫–౧౩౭ | ఆఱవయుపన్యాసము. | వేమనవంటివారు. |
| ,, | ౧౩౮–౧౬౪ | ఏడవయుపన్యాసము. | వేమనకవిత్వము, హాస్యము నీతులు |

శ్రీః

## మొదటి యుపన్యాసము

# ఉపోద్ఘాతము

వేమన ఆంధ్రులలో సాటిలేని వ్యక్తి. అతీంద్రియములైన తత్త్వములను తెలిసికొనవలెనను నాశ, వాని ననుభవ పూర్వకముగా సాధించు సాహసము, తనకుఁ దెలిసిన వానిని నిర్భయముగా ప్రపంచమునకు బోధించు ధైర్యము, దానికి సాధనమై యిరుప్రక్కలందును మఱుఁగులేని మంచిపదనుగల చుఱుకత్తివంటి కవితాశక్తి, దానికి మెఱుఁగిచ్చునట్టి సంకేతదూషితము కాని ప్రపంచవ్యవహారములందలి సూక్ష్మదృష్టి, గాయపుమందు కత్తికేపూసి కొట్టినట్లు తిట్టుచునే నవ్వించు హాస్యకుశలత,—ఇవన్నియు వేమన్నను సృష్టిచేయునపుడు బ్రహ్మదేవుఁ డుపయోగించిన మూలద్రవ్యములు. తత్త్వ విద్యార్థులున్నారు కాని వారిదంతయు పుస్తకపాఠము. వారిశక్తియంతయు ఇతరులు చెప్పినదానిని వల్లించుటలో ముగిసినది. యోగమునుసాధించు వీరులున్నారు గాని వారిలో ననేకులకు మాటలాడుటయే రాదు; వచ్చినను ఇతరులకు బోధించుటకు కాలము ఖర్చుపెట్టుట నష్టమని భావించువారే యనేకులు: తక్కిన వారు చాలవఱకు తాముసత్యమని నమ్మినవానిని గూడ ఇతరుల మనసు నొచ్చునేమోయని చెప్పక తప్పించుకొని తిరుగునట్టి 'ధన్యులు.' కవులు మనలో దండిగ—కావలసినంతకన్న ఎక్కువగానే—యున్నారు. కాని వారిది మనప్రపంచము గాదు. గంధర్వనగరము. ఇఁక తిట్టుకవిత్వము తెలుఁగు వారు పెట్టిన భిక్షయే; కవిత్వమును తిట్లకై యుపయోగించుట తెనుఁగు జాతిలోని విశేషగుణము! కాని యా తిట్లలో స్వార్థమున్నంత పరార్థము లేదు. 'నాకియ్యలేద' ని తిట్టినవారే కాని 'నీవుచెడిపోవుచున్నా' వని తిట్టిన వారరుదు. ఇఁకహాస్యమా? అది మనతాతలగు సంస్కృతము వారికే రాదు, మనకెట్లువచ్చును? నవ్వించువారున్నారు; 'అసహ్యముతో నవ్వుదుము; వెక్కిరింతలకు నవ్వుదుము; అంతేకాని నయముతోడి నవ్వు మనకింకను ఎవరైన నేర్పవలసి యున్నది. పైగుణము లన్నియు ఒకచో నేకీభవించినమూర్తి వేమనతప్ప తెలుఁగు వారిలో ఇతరుఁడు నాకంటఁబడలేదు.

ఆంధ్రులలో కొన్ని విచిత్రములు గలవు. వానికి తృప్తికరముగా నిదివఱకెవరును సమాధాన మిచ్చి యుండలేదు. భరతఖండమున ప్రసిద్ధములగు నన్ని భాషలలోను ప్రవేశించి అసంఖ్యగ్రంథములను వ్రాసిన జైనులు మనభాషలో గ్రంథములు రచించి నట్లే కానరాక పోవుట యొకటి. ఆంధ్రభాష ద్రావిడ శాఖనుండి చాలనాళ్ళక్రిందనే చీలి వేఱుపడిన దని స్పష్టముగా నూహింప వీలున్నను, పదునొకండవ శతాబ్దికి వెనుక సారస్వత వ్యాపారమే యందులో జరిగినట్లు తెలియక పోవుట వేఱొకటి. సంస్కృత వాఙ్మయములో చక్కని నాటకరచన రెండువేల యేండ్లకుముందునుండి జరిగివచ్చుచున్నను, ఆవాఙ్మయమునే ఆధారముగాఁ గొని శబ్దము, అర్థము, భావముఁ గూడ అనువాదము చేయుచు వచ్చిన యాంధ్రులలో ఒక్కనికైన మొన్నటివఱకు అట్టి నాటకములను తెనుఁగునఁ గూడ వ్రాయవలయునను నాశ జనించినట్లే తోఁపక పోవుట మఱియొకటి!

ఈయన్నిటి కంటె విచిత్రమైన విషయము, సుప్రసిద్ధమతస్థాపకు లెవరును ఆంధ్రులైపుట్టి ఆంధ్రదేశమున మతబోధచేయక పోవుట, ప్రాచీన కాలమున—అనఁగా ఉపనిషత్తుల కాలమున—శిష్యులే గురువును వెదకుకొని పోయి తత్త్వబోధను బొందుచుండిరంటే; కాని, తత్త్వజ్ఞుఁ డితరు లున్నచోటికిఁ బోయి బలవంతముగా నైనను బోధించి మతపుగుంపులను తయారుచేయ మొదలిడినవాఁడు బుద్ధుఁడే కాఁబోలు. వానికి తరువాతి వారిలో మొదటివ్యక్తి శంకరాచార్యులు. ఇతఁడు మలయాళమున జనించి, ఆసేతుహిమాచలము సంచరించి యద్వైతప్రధానముగా వైదికమతమును బోధించి యందందు మఠములను స్థాపించెను. ఇతని ముఖ్యపీఠమైన శృంగగిరి జన్మదేశమునకు సమీపమందే కన్నడదేశమందున్నది. కాని యాంధ్రదేశ మందితనిమఠముగాని, సంచారము చేసినట్లుగుర్తులుగాని, కానరావు. రామానుజాచార్యులు అరవదేశమందు జనించెను. శంకరాచార్యులవలె భరతఖండ మంతయు సంచరించి, వైదికమతము భక్తిప్రధానమైన విశిష్టాద్వైతమని బోధించి మఠము లందందు స్థాపించెను గాని, యితని కాంధ్రదేశమందు సంచారము చేయునవకాశము లభింపలేదు. మఱి ఆంధ్రులు తన్ను భయపెట్టఁగా కన్నడదేశమునకు పాఱి పోవలసి వచ్చెను. శుద్ధకర్ణాటకుఁడగు ఆనందతీర్థాచార్యుల ద్వైతమతవ్యాప్తి కర్ణాటమహారాష్ట్రదేశములను దాఁటినట్లే కానరాదు. వీరివలె, వైదికమతమునే వేఱువేఱు విధముగా బోధించిన నింబార్కాచార్యులును వల్లభాచార్యులును ఆంధ్ర జాతికిఁ జేరినవారైనను వారి మతమంతయు ఆంధ్రదేశము వెలుపలనే యున్నది. ఏకారణముచేతనైనను స్వదేశము, స్వజాతి వారికి పనికిరాదయ్యెను. ఇఁక బసవేశ్వరుఁడు ఆంధ్రుఁడనుకొనుటలో అభిమాన మెంతయున్నదో అసత్య మంతయున్నది.

అతని వ్రాతలన్నియు కన్నడమందే కలవు. శ్రీవైష్ణవులకరవమువలె నేటికిని వీరశైవులకు కన్నడ మభిమాన భాష.

ఇట్లగుట కేమి కారణము? తెలుఁగు వారికి తీవ్రములగు తత్త్వములను విచారించుటకుఁ గావలసిన మేధాశక్తి లేదని చెప్పుట సాహసము. వారికి తత్త్వవిచారము లందు రుచిలేదని యూహించుట యన్యాయమగును. మతమనునది, యొకఁడు తా నెఱిఁగినది యింకొకనికిఁ జెప్పి, యతఁడు వినకున్న నీయిష్టమని వెడలి పోవుట కాక, యొకవ్యక్తి యొకసంఘమునకే తత్త్వమును దెలిపి దాని నాశ్రయించినందుకు గుఱుతుగా వేషము, భాష, ఆచారము, మొదలగు వానియందు ఆసంఘమునకంతయు మార్పును గలిగించునది యగుటచే, సహజముగా స్వాతంత్ర్యరక్తియు, స్వాభిమానమును బలముగాఁగల యాంధ్రజాతిని గొఱ్ఱెలమందలవలె నొకమతపుదొడ్డిలోఁ దోలుట కేతత్త్వజ్ఞానికిని సాధ్యముగాక పోయెనేమో! వివేకానందుఁడు, రామతీర్థస్వామి మొదలగు మహాపురుషు లెన్నియుపన్యాసములిచ్చి యెంత ప్రయాస పడినను, స్వతంత్రబుద్ధి బలసిన పాశ్చాత్త్యజాతి హిందూమతము నాశ్రయింపఁ దలఁప లేదని మన మెఱుఁగుదుము గదా. మఱియు మొదటినుండి రాజకీయ విప్లవములచేతను అంతరంగ బహిరంగ కలహములచేతను నెమ్మదిని శాంతిని క్రమముగా ననుభవించిన వారు కారు గావున మనవారికి తిండఱితే చాలినన్ని యుండుటచేత, పారలౌకిక విషయములను తత్త్వవిషయములను విమర్శించి నిర్ణయించునంతటి యోప్పలేకుండును. ఆంధ్రులు కొంత నెమ్మది ననుభవించిన కాలము కాకతీయుల సామ్రాజ్యమందును విజయనగరపు సామ్రాజ్య కాలమందును. అందు మొదటి కాలమున వీరశైవమతమును రెండవకాలమున రామానుజమతమును ఆంధ్రదేశమునఁ బ్రవేశించి నిల్చినవి. కాని యామాత్రము గూడ మతకర్తల మూలమునఁ గాక, వారి యనుయాయులగు మత ప్రచారకుల మూలమున వచ్చినందువలన, ఆంధ్రజాతియందు వైమతములకు దృఢమైన నిలుకడ కలుగలేదు. మొదటినుండియు తత్త్వవిచారమును మతమును ఎక్కువగాఁ బట్టుకొన్నవారు బ్రాహ్మణులు. ఆంధ్రబ్రాహ్మణులలో ముక్కాలుమువ్వీసము అందఱు అద్వైతులే. వీరందఱును ప్రాయశః దేశాంతరమునుండి వలసవచ్చి చేరి నిలిచిన శాంకరమతానుయాయులు. తెనుఁగు దేశమందలి మాధ్వరామానుజీయ బ్రాహ్మణు లెవరుగాని నిజమైన యాంధ్రులుగారు. ఇఁక బ్రాహ్మణేతరులలో వీరశైవముగాని వీరవైష్ణవముగాని వేఱూఁతి నిలువలేదు. భస్మధారణముచేసిన పాప మని గాని నామాలువేసిన వరక మనిగాని తీవ్రముగా నమ్మిన బ్రాహ్మణేతరు లాంధ్రులలో నెక్కువగాలేరు. కావుననే శ్రీశైలము, అహోబిలము తప్ప సుప్రసిద్ధమైన శైవవైష్ణవక్షేత్రము లేవియు తెలుఁగు దేశమున లేవు. అందు రెండవది యిప్పటికిని

అరవవారి యాజమాన్యమందే యున్నది. శ్రీశైలపు సమాచారము నేనెఱుఁగను. ఇఁక తిరుపతి మాదనుకొని సంతోషించు తెలుఁగువారు ధన్యులుగాని యదంతయు అరవసామ్రాజ్యమే. అది యట్లుండె. (చెప్పవచ్చిన దేమనఁగా, ఆంధ్రులలో మత ప్రచారకులందందపురూపముగాఁ గలరు గాని మతకర్తలు లేరనుట. ఆమతప్రచారకులును చాలవఱకును తత్త్వబలముచేఁగాక తామాశ్రయించిన రాజుల కత్తిబలముచే స్వకార్యమును సాధించిన వారుగానే కానవచ్చుచున్నారు.)

వేమన యిందు కొక విధముగా అపవాదమనవచ్చును. తనకుఁ దోఁచిన తత్త్వమును నిర్భయముగా ప్రజల కందఱికిని బోధించుటకై ఆంధ్రదేశమంతయు నిండుమించుగా తిరిగి, యందందు మఠములను స్థాపించి, తనకు తరువాత తనమతమందు నమ్మికగలవారు కొందఱుండునట్లు చేయఁగలిగిన తెనుఁగువారిలో నితఁడుముఖ్యుఁడు. బహుశః మొదటివాఁడే కావచ్చును. 'ఒకవిధముగా' నని చేరపు మాట యేల చెప్పితిననఁగా, ఇతఁడు బోధించిన మతమున కితఁడు మూలకర్త గాఁడు. అది యనాదిగా హిందువులలో నుండు అద్వైతమతము. కాని దాని నితఁడు అనేకులవలె పుస్తకములనుండి పారాయణము చేయక, యోగ సాధనచే నందలి తత్త్వమును గ్రహించి, నిస్సందేహముగా తా ననుభవించి, తన దేశమువారిని గూడ నట్లు తరింపఁజేయవలయునను ఉదారాశయముచే ఉపన్యసించుట కుపక్రమించిన వాఁడు. కావుననే యితని బోధనలలో జీవమున్నది. ఇతరుల మాటలను గాక తన యనుభవమును నమ్మిన వాఁడగుటచేత, సిద్ధాంతమందలి తత్త్వమును కొందఱు సందేహించినను, బోధన లందలి నిష్కపటత్వమును సందేహించువారు పలువురుండరు. కనుక అట్లు సందేహించుటకు శక్తిలేనివారందఱును వెంటనే యతనిమాటలు నమ్మి భక్తులైన శిష్యులౌదురు. అనఁగా, మతకర్తలు కాని మత ప్రచారకులలో మతకర్తల కున్నంత విలువను వ్యాప్తిని కొంతవఱకు సంపాదించుకొనఁ గలిగిన ధీరుఁడు వేమన యన్న మాట. ఇతని శిష్యుఁడనఁదగు కట్టార్లపల్లె వేమన్న, ఏగంటి వారు, పోతులూరి వీరబ్రహ్మము, సదానందయోగి మొదలగు వారనేకులిట్టి మతమునే ప్రచారమునకుఁ దెచ్చినవారు. ప్రాచీనులలో శివయోగసారమును వ్రాసిన గణపతి దేవుఁడు మొదలగు వారు ఇదేమతమును పండితరంజకముగా గ్రంథములందుపపాదించినవారు. ఇట్లే భక్తి ప్రధాన మగు వైష్ణవమతమును సామాన్యజనులలో వ్యాప్తికిఁ దెచ్చిన రామదాసు, త్యాగరాజు, తాళ్ళపాకవారు మొదలగు కీర్తనకారులును, శృంగారము మూలమున విష్ణుభక్తిని వ్యాపింపఁజేయఁ బ్రయత్నించిన క్షేత్రయ మొదలగు అనేకపదకర్తలును ఇట్టిమతకర్తలు కాని మత ప్రచారకులే. కాని వీరిలో నెవరికిని వేమన్నకున్నయత వ్యాప్తి, చనవు, రాలేదు.

కారణము స్పష్టమే. వీరిలో కొందఱనుభవము గలవారు. పలువురది లేని వట్టి నమ్మకము గలవారు. అనుభవించినవానిని గాని నమ్మినవానిని గాని ఇతరులకు నచ్చఁజెప్పు ధారాళమైన వాగ్ధాటి గలవారరుదు, ఉన్నను ఇతరుల నుపదేశింపవలెనను నుద్దేశముగలవారరుదు. మతమనునది మోక్షము మీఁద తనకు సంబంధించినది: అనఁగా ఇందులోఁ గోరఁబడినవాఁడు ముఖ్యముగా తనగతిని తాను చూచుకొనును. అందును అద్వైతమతము. అయద్వైతానుభవానందమును వదలి తెలియనివారికి, నమ్మిక లేనివారికి, దానిని తెలిపి నమ్మించు నంతటి స్వార్థత్యాగులు అనేకు లుండరు. ఉండినవానికి పాండిత్యమే మైనఁ గొంత యలవడినా యిఁక పామర ప్రపంచమునకును అతనికిని సంబంధముండదు. చేసిన పనికి పండితతృప్తి వాని పరమార్థము; ఫలము 'శివయోగసారము' వంటి గ్రంథములు. సామాన్యజనులకు వీనివలన నేమియు లాభములేదు. త్యాగరాజువంటి వారి కీర్తనలలో భక్తియెంత యున్నను వారి గాన పాండిత్యము దానిని కప్పి పెట్టినది. పల్లవి దాఁటులను జూపుదమనియందు మనసే కాని, వానిని పాడునపుడు ప్రాయికముగ భక్తిని ప్రకటింత మనిపింపదు. క్షేత్రయ వంటి వారి శృంగార పదములలో మూలభూతమైన భక్తి మునిఁగిపోయి, వినువారి కందఱ పచ్చి పచ్చి మాటలు మాత్రము తటాలున తల కెక్కును. ఇఁక రామదాసు పాటలకంటె వానిలో రచన లేదు. గుంపులుగ గట్టి కోలాహలము చేయు గచ్ఛభజనలకు పనికి వచ్చునే, కాని వినువారి హృదయమును పట్టి యుండునట్టి కావ్య శక్తి వానిలోలేదు. మఱియు నొక్కొక్క కీర్తనయును విశేష మేమియు లేక దిక్కులేనంత పొడుగుగా నీడ్వఁబడి యుండుటచే నందు భక్తియున్నను భావసంగ్రహము లేదు. వేమన పద్యము లట్టివి కావు. అతనివి చిటికలో ముగింపఁగల చిన్న పలుకులు; అచ్చ తెనుఁగు పద్యపు నడక; గుండుదెబ్బవలె గుఱి తప్పని చిక్కని చెక్కిన మాటలు. నోరుగల తెలుఁగు వారందఱును నేర్వవచ్చును. మఱియు 'నేనొకగ్రంథము వ్రాసినాను. చదువుఁడు. మీకు తత్త్వము కరతలామలకమగును' అని చెప్పవలసిన పనిలేదు. పోయిన చోట్లనెల్ల పద్యములే. ప్రశ్నించిన వారికెల్ల పద్యములే. నిన్న చెప్పిన పద్యమే నేఁడు చెప్పుటకు అనుడయులేదు. ప్రాఁతపద్యము కొంత మఱచి పోయిన క్రొత్తగా నప్పుడే కూర్చి యతికించుటకును కొంకులేదు. విషయములను జెప్పునప్పుడొకరి లక్ష్యము లేదు. భయము, సంకోచము సున్న. తా నాడుమాట లలో తన కెప్పుడును సందేహము లేదు. కనుకనే సామాన్యప్రజల కితనియందు నమ్మిక భక్తి జనించినవి. పండితులగువారికిఁ గూడ నితనిని పూర్తిగా తిరస్కరించుట సాధ్యము కాదు.

మతికర్తలు కాని మతప్రచారకులవలె కవులను పేరు లేక కవిత్వమును రచించినవారు మనలో ననేకులున్నారు. పైఁ జేర్కొనిన శతకములు, కీర్తనలు, పదములు వ్రాసిన యసంఖ్యాకులు ఈ తెగకుఁ జేరినవారు. లాక్షణిక దాసులగు ప్రాచీనులు వీరిని కవులలో లెక్కింపకపోవుట యొక వింత గాదు. వీరేశలింగము పంతులు గారివంటి "నవ్యభావ ధురంధరులకును" వీరు కవులని తోఁపలేదు. వేమన గూడ నీగతిని దప్పించుకొన్నవాఁడు గాఁడు. మఱియొక వింత యేమనఁగా, మన వారితనిని కవిగాఁ దలఁపకపోయినను, ఇతని పద్యముల నన్నిటిని బహు శ్రమచే సంపాదించి, తిద్దించి, వ్రాయించి, తానే యింగ్లీషున టీక వ్రాసి, ప్రకటించి, శాశ్వతకీర్తి సంపాదించిన బ్రౌను దొర కూడ ఇతనిని కవి యనలేఁడయ్యెను. *వేమన యందుఁగల యసాధారణ కవితా ధర్మములను గూర్చి వేఱుగా చర్చింతును. నిఘంటుపండితులును వ్యాకరణ పండితులును ఏమనుకొన్నను, ఇతని కాంధ్రదేశ మందుఁ గల మర్యాదయు, ఇతనిబోధ లింకను చెడక తెలుఁగు వారిహృదయముల నాఁటుకొని యుండుటయును, ఇతని సూక్తులయందుఁ గల కవితానైశిత్యమే ముఖ్య కారణమనుట నిస్సందేహము. కావున మతాభిమానము కవిత్వమందభిరుచి గలవా రందఱును వేమన వాక్యములను చూడక పోయిన నష్టపడినవారగుదురు. అతని సిద్ధాంతముల నమ్మి యంగీకరించుట వేఱు మాట.

కాని వేమన పద్యములను జదివి యందుమూలమున నతని వివిధసిద్ధాంతములను నిర్ణయించుటకుఁ బూనుకొంటిమేని మనకు కొన్ని కష్టములున్నవి. వానిలో మొదటిది ఇతని పద్యము లేవి, కానివేవి, యని నిర్ణయించుట. ఇతరులు వ్రాసిన గ్రంథములలో మన మాటలు దూర్చుట మనలో ననాదియైన యాచారము. వేదములు, ఉపనిషత్తులు గూడ నీయవస్థకు లోబడినవే; కావుననే యందందు వేదవాక్యముల సంఖ్యను నిర్ణయించు వాక్యములు వానిలో చేర్పఁబడినవి. ఇఁక పురాణములగతి యడుగఁ బనిలేదు. కాళిదాసాది కవుల కావ్యములుగూడ నీయవస్థకుఁ దప్పలేదు. అట్లుండ వేమనను మాత్రము మనవాఁరు మన్నించుటకుఁ గారణములేదు. మఱియు వేమన యొక గ్రంథముగా వ్రాసినవాఁడు కాఁడని మొదలే చెప్పితిని. 'నాలుకందని పద్యముల్ వేలసంఖ్య' † (౨-౨౬౪) గాఁ జెప్పినవాఁడు.

---

*('The Verses of Vemana' వావిళ్ళవారి ముద్రణము. పీఠిక మూఁడవ పేజి చూడుము)

† ఈసంఖ్య బ్రౌనుగారిచే ప్రకటింపఁబడిన 'వేమన సూక్తిరత్నాకర' మను గ్రంథమందలి పద్యసంఖ్యను దెలుపును. వేఱు వేఱు ప్రతులలో నుండి యుదాహరించునపుడు వానిని ప్రత్యేకముగఁ జేర్కొందును. కాని పద్యసంఖ్య యొందున్నను అది యీమూలప్రతి కన్వయించునని తెలియునది.

"క. భువి రాజ తారకంబులు
ప్రవిమల తరహంసయోగ భావంబులకున్,
వివరంబులు గావించెద" (౨౯౫౩)

అనుపద్యమొకటి యితఁడొకగ్రంథము వ్రాయనారంభించినట్లు సూచించుచున్నది; అందందు కొన్ని పద్యములు, ముఖ్యముగా కందములు, ప్రాయికముగ కేవల యోగ రహస్యాదివిషయములను దెలుపునవియు, వేమనకు సహజమగు వేఁడిలేక, నిదానముగా కూర్చుండి వ్రాసిన గ్రంథములోని వేమో యనిపించును. కాని, ఆగ్రంథము నతఁడు పూర్తిగా ముగించినాఁడను నమ్మిక నాకులేదు.

"తే. శ్రీకరుండగు వేమన చెప్పినట్టి
పద్యముల నెవ్వఁడేనియు పఠనచేయు
నట్టిపురుషుఁడు మనమున నిట్టిదనుచుఁ
జెప్పరానట్టి వస్తువుఁ జేరు వేమ" (౩౭౪౭)

అనుపద్యమువంటివి గొన్ని పద్యములున్నవి కాని యవి గ్రంథాంత మందలి ఫలశ్రుతి పద్యములే యని చెప్పుటకు తగిన సాధనములు లేవు. గ్రంథము సమగ్రముగా లభించువఱకును ఈ పద్యములు,

"వేదాంతికుఁడు వేమన సుమ్మీ
వేమన వాక్యము వేదము సుమ్మీ." (౩౮౩౩)

ఇత్యాది పద్యములవలె, సమయమువచ్చినప్పు డాత్మప్రశంసకై యతఁడే చెప్పినవో, లేక, తరువాతి భక్తులు చేర్చినవో యగుననియే మనము నమ్మవలసియున్నది. బందరు వారు ముద్రించిన 'వేమనసూక్తిరత్నాకరము' లో అతఁడు తనచరిత్రమును వ్రాసి కొన్నట్లుండు పద్యములు నాకుఁ జూడఁగా వేమనవి గావు. ఇదివఱకున్న యనేక ముద్రణములలోఁ గాని, బ్రౌనుదొర సంపాదించిపెట్టిన సుమారు ఏఁబది వ్రాఁత ప్రతులలోఁ గాని, యవి లేవు.

మఱియు తా నిన్నిపద్యములు వ్రాసితినన్న జ్ఞానమే వేమనకుండెనని నేను నమ్మను. 'శతసంఖ్య పద్యము' లని (౩౮౯౦) యొకచోట, 'వేయి పద్యంబు' లని (౩౮౫౨) మఱియొకచోట, 'వేయు నేనూఱుపద్యము' లని యింకొకచోట *'పదియునైదువేల పద్యములని' (వేదాంతసిద్ధాంతము. ప ౩) వేఱొకచోటఁ గానవచ్చుచున్నది! ఇందులో నేది నిజము? నాకుఁ జూడఁగా వేమన యేసంఖ్యయు నెఱుఁగఁడనుటయే నిజము. అచ్చైన ప్రతులలో నాలుగువేలకు మీఁదుగా పద్యములు

* (ఈపద్యము శ్రీవంగూరి సుబ్బరావుగారు తమ 'వేమన' గ్రంథములో నుదాహరించిరి. పే. ౧౧౨)

గలవు. బ్రౌనుదొర సంపాదించిన ప్రతులలో నిన్నిలేవు గాని అచ్చుప్రతులలో లేని పద్యము లనేకములందుఁ గలవు. కావున వేమన యొక్క శతకము, సహస్రము అను సంఖ్యానియమమునకు లోపడక స్వతంత్రముగా నవకాశము వచ్చినపుడెల్ల పద్యములు చెప్పినవాఁడనియు, వానిని విన్నవారిలో నభిమానము గలవా రప్పుడప్పుడు గుర్తు వేయుచు వచ్చిరనియు, అతనికి తరువాతఁ గొందఱు గురుభక్తితో నతని పద్యము లన్నియుఁ జేర్చి కూర్పఁ బ్రయత్నించిరనియు నమ్ముట క్షేమము. ప్రక్షేపములు చేర్చువారికింతకన్న మంచి యవకాశ మెందు లభించును? ఇతని పద్యములలో ప్రక్షేపము లెక్కువయుండవని యొకమాఱు తలఁచితిని. * కాని యిటీవల నాకా భావము కొంతవఱకును మాఱినది. అన్ని ప్రతులకంటె నెక్కువ పద్యములు గలిగి, విశ్వకర్మ వంశీయులగు బందరు పూర్ణయాచారిగారు ప్రకటించిన ప్రతిలో, తక్కిన యేపోటను లేనివి, విశ్వకర్మను బొగడి వ్రాసినపద్యము లనేకములు గలవు.

ప్రక్షేపముల పాపమట్లుండఁగా దానికిఁ దోడు తిద్దుఁబాట్లతొందఱ యొకటి యున్నది. ప్రాయశః మొదటినుండి వేమన పద్యములు వ్రాసిన వారందఱును అవ్యుత్పన్నులే. భక్తియున్నంత జ్ఞానముగలవారరుదు. కాని తమకుఁ దెలియనిదానిని తిద్దుటకు మాత్రము వెనుదీయరు. ఇట్టివారిని గూర్చియే బ్రౌను దొర ఒక వ్రాఁత ప్రతిపై స్వహస్తముతో,

"తే. తప్పు గమనించి వ్రాయు టుత్తమము, లేక
ప్రతి సమానముగా వ్రాయుటతిముదంబు;
రెండు విడనాడి వ్రాసెడి లేఖకుండు
గలుగు టరయంగఁ గవి యభాగ్యంబు గాదె;"

యని వ్రాసికొనెనఁట † చూడుఁడు: 'ఉప్పుకప్పురంబు' అను వేమన్న ముద్దు పద్య మెఱుఁగనివారు లేరుగదా. ఇది యొకానొక ప్రాఁతప్రతిలో నిట్లున్నది.—

"ఉప్పుకప్పురంబు వొక్కరీతున నుండు
చెప్పుదెప్పు వారి చెవులు వెజ్జి
పురుష రూపొకట్టి పుణ్యపురుషుఁడు వేఱు"

(ఓరియంటల్ లైబ్రరీ మద్రాసు, (౧౩-౧-౨-౨౦)

వ్రాఁత ప్రతుల స్థితి యిట్లుండఁగా అచ్చుప్రతులు మఱింత యసహ్యముగా నున్నవి. అందును 'గుజిలీ' ప్రతులకన్న 'పరిశోధించి' వేసిన నవనాగరకుల

---

* (చూ. వావిళ్ళవారి కడపటి ముద్రణపు పీఠిక)

† శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారు చెప్పినది.

ముద్రణములు చాల అశ్రద్ధతో వెలిఁబుచ్చుచున్నవి. వేమన స్వభావము, మతము, కవిత్వధర్మము, భాష, మొదలగు వాని నేమియుఁగమనింపక, వ్రాఁతప్రతుల పాఠములను విచారింపక, అర్థభావములకు వచ్చునర్థమును లక్ష్యపెట్టక, దిద్ది ముద్రించిన పాఠము లనేకములందుఁ గలవు. మచ్చుకు ఒకటి రెండు.—

“ఆ. తెవులుఁ బడ్డవాఁడు దేవతాభక్తుండు,
ఈటె లేనివాఁడు పోటుబంటు,
కాసులేని వాఁడు కడుబ్రహ్మచారియౌ
విశ్వదాభిరామ. (ఓ. లై. ౧౨-౯-౧౯)

ఇది ప్రాచీన పాఠము. దీనికి బందరు ప్రతిపాఠము :—

“తెలుపఁబడ్డవాఁడు దేవతాభక్తుండు
మాట లేనివాఁడు పోటు బంటు.” (౧౯౬౬)

వావిళ్ళవారి కడపటి ముద్రణము తప్పుదులేకుండ దీనినే యనువాదము చేయుచున్నది. (చూ-పే-౧౭౮) మఱియు ;

“క. పసరపు నంజూడు మెక్కియు
మసలక సురఁద్రాగ ముసలిమానులఁ గూర్చెన్
కుసుమాంగి కధర మాంసము
కుసుమాస్త్రుని బెట్టి చెఱిచె కుంభిని వేమా” (౨౪౭౭)

ఇది బందరు ప్రతిపాఠము. ‘అర్థమేమిరా’ యని తల పగులఁ గొట్టుకొంటిని. వ్రాఁత ప్రతులు సాహాయ్యమునకు వచ్చినవి :—

“క. పసరపు మాంసముఁ బెట్టియు
మసలక సులతాను ముసలిమానులఁ జేసెఁ
శశిముఖుల యధరమాంసము
కుసుమాస్త్రుఁడు పెట్టి చెఱిచె కులములు వేమా”
(ఓ-లై-౧౧-౬-౧౫)

ఇట్లే ‘ఉత్తమాంశమూని యున్మనిలోఁజేరి’ అనుచోట, ఉన్మని యర్థము కాక కాఁబోలు ‘ఊని యున్మహిలోఁజేరి’ అని ముద్రింపఁబడినది. (౫౦౪) ‘వేఁడు బట్టువాని వినయంబు లధికఁబు’ అని యుండఁగా ‘పేడుముట్టువాని, యని యర్థములేని సవరణగలదు. (౨౯౦౭) ‘నూనెలేకదివ్వె నూలిచే (దారముచే) వెల్గునా, యనునది ‘నువ్వుల వెల్గునా’ యని మార్పఁబడినది. (౯౪౪) కాని వట్టి నూవులుదంచి “నడుమ వత్తిఁ బెట్టినను దివ్వె మండుననుట యాఁడువారికందరికిని దెలియును. ఇట్టివనేకములు,

2

నెట బాలవ్యాకరణము, అప్పకవీయము, మొదలగు వానిదెబ్బలకు వేమన పద్యము లెంత నలినలియైనవో చెప్పితిమి. తక్కిన వారిమాట యట్లుండనిండు. బ్రౌను దొరయే 'గృహము గూడుఁ జేసి గుణము వత్తిగఁ జేసి' 'గూబ యొక్కనట్టి గృహము పాడుగఁ జేసి' యనుపద్యములలో యతి చెడనేయని, 'గృహము'ను 'గురము'నుగా ముద్రించి, క్రింది టీకలో,

'గురము, ఇది గృహశబ్దము యొక్క అశాస్త్రీయమైన తద్భవము. దీనిని వేమన యొక్కఁడే యుపయోగించిన వాఁడని తలఁచెదను.'

(Brown's Verses of Vemana, P. 113)

అని ఇంగ్లీషున వ్రాసెను. లేనితద్భవమును గల్పించి యంటఁ గట్టుటకంటె యతియే కొంత దారి తప్పిన దనుకొన్న నష్టమేమి?

వ్రాఁత కాండ్ర తప్పుల నట్లుంచి మూలమునే కొంతవఱకు సూక్ష్మముగాఁ బరీక్షించితిమేని వేమన్న కచ్చితముగా నేనియమమునకును లోబడినవాఁడు కాఁడని స్పష్టమగును. విసంధులు, వ్యవహారమందలి కొన్ని భాషా రూపములు, సామాన్యమైన పద్యపు నడకకు నష్టమురాని ఛందోభంగములు—ఇత్యాదుల నతఁడు గమనించిన వాఁడు కాఁడు. అసలు గమనింపఁ గలిగినంత చదువు చదువుకొన్నవాఁడే కాఁడని సందేహింపవలసి యున్నది. కావున 'కల్లు కిచ్చునట్లు చల్లకీయఁగ లేరు' ఇత్యాదులలో అపశబ్ద భ్రాంతిచే 'కల్లున కిడునట్లు' (౧౦౧౧) ఇత్యాదిగా దిద్దుట వేమన శైలిని ధ్వంసము చేయుటయే. 'తెలియ నీదుమాయ దీనిల్లపాడాయ' అను దానిని 'పాడాయె' (౩౧౮) అనియును 'ఉత్తమపురుషుండు ఒక్కఁడు చాలదా' అను దానిని 'పురుషుఁడొకఁ డొక్కఁడు చాలఁడా' యనియును (౨౪౦౧) ఆధునికులు చేసిన సవరణలు, స్వచ్ఛందముగా పరువెత్తుబిడ్డల కాళ్ళకు సంకెళ్ళు తగిలించుటవంటివి.

ఇదిగాక వేమనయే మనకర్థము గానట్లు వ్రాసిన పద్యములనేకములు గలవు. ముఖ్యముగా తత్త్వవిషయములను దెలుపు పద్యములు చాలవఱకు దుర్బోధములు. సామాన్యముగా తత్త్వశాస్త్రవిషయముల నెఱుఁగని నావంటి వానికా శాస్త్రపరిభాషాపదము లర్థము గాకపోవుట సహజము. కాని, అందఱెఱిఁగిన పదార్థములకే మాఱు పేరులు పెట్టి వ్రాసినప్పుడా చిక్కును వదలించుట సామాన్య కార్యముగాదు. బ్రహ్మరంధ్రమందలి సహస్రారచక్రమునకు 'నంది దుర్గ' మని పేరుపెట్టిన నెవరు దానిని భేదింపఁ గల్గుదురు? (౨౧౫౫) ఇట్లు మఱుగు పఱచి వ్రాయుట వేదముల కాలమునుండి కలదు. చూడుఁడు:—

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే

తయో రన్యః పిప్పలం స్వాద్వత్తి
అనశ్నన్నన్యో అభిచాకశీతి" (ముండకోపనిషత్తు 3-౧-౧) "పరస్పర మిత్రములై యెప్పుడును ఒకటినొకటి వీడని రెండు పక్షులు ఒక రావిచెట్టును కౌఁగలించికొనియుండును. వానిలో నొకటి తీయనియా ప్రమాని పండ్లను దినును. మఱొక్కటి తినక చూచుచుండును" అని యర్థము. ఒకటే సంసారమందు జీవాత్మ పరమాత్మ లిరువురును ఎడతెగక యుందురనియు, పుణ్యపాప ఫలములను జీవుఁడు భుజించుచుండఁగా పరమాత్మ యూరక నిర్లేపుఁడై చూచుచుండు ననియును భావము. వేమన్నదాఁకఁగూడ నీసంప్రదాయము దిగి వచ్చినది:—

"ఆ. నీరు కారమాయె కారంబు నీరాయె
కారమైన నీరు కారమాయె
కారమందు నీరు కదు రమ్యమై యుండు" ([illegible])

ఇది నాకర్థము కాలేదు. మఱియు దీనికి చిక్కులేనన్ని పాఠాంతరములున్నవి. దేనికేమి యర్థమో! ఇట్టివి లెక్కలేనన్ని. ఇట్లగుటచే వేమన పద్యముల కన్నిటికిని కొద్దిగనో గొప్పగనో గూఢార్థము గలదను నొక యభిప్రాయము బైలుదేఱినది. చూడుఁడు.—

"ఆ. చెప్పులోనిరాయి, చెవిలోని జోరీగ,
కంటిలోని నలుసు, కాలిముల్లు,
ఇంటిలోని పోరు ఇంతింత గాదయా
విశ్వదాభిరామ వినర వేమ." (౧౪౩౦)

ఇందులో తెలుఁగు వారికి తెలియనిదేమున్నది? కాని, పెన్నగని సంప్రదాయజ్ఞులనఁ బడువారు గంభీరముఖముతో ప్రత్యుత్తరమిత్తురు. మనలో సకలదుర్వ్యాఖ్యానములకును ఆధారము సంప్రదాయము. 'ఇందులో నేమో యంతరార్థమున్నట్లున్నది' అని బ్రౌనుదొరకూడ ముంగమూతి వేసుకొని వ్రాసెను. * కాలము, చెడినది గాని, వేమన్న శిష్యుఁడు దీని రహస్యార్థము దెలుసుకొనవలెనన్న గురుసేవ కనీసము పండ్రెండేండ్లయినను జేయవలసి యుండును. కాని అచ్చు వచ్చి గురువులవారిగుట్టు చెఱిచినది. దమ్మిడీకి తరముగాని దీని యంతరార్థమును శ్రీవంగూరు సుబ్బరావుగారు సంగ్రహించి ప్రకటించిరి. † కుతూహలము గలవారందు చూడవచ్చును.

ఇట్లగుటచే మొదలు వేమన పద్యముల సంఖ్యనిర్ణయించుట, వాని మూలపాఠమును గుర్తించుట, గ్రంథకర్త యుగము నెఱుఁగుట, యను మూఁడు చిక్కులు, సామాన్యముగ తెగనివి, యున్నవి.

---

* (See Brown's verses of Vemana, P. 109.)

† (చూ. వం. సు. గారి వేమన ' పే. ౧౩౯)

ఇప్పుడు ప్రకటించిన పద్యములు నాలుగు వేలకు మించియున్నవంటిని. అవి బందరు ప్రతిలోనివి. దీనిలో లేనివి ౧౨౫ పద్యములు 'వేమనయోగి వేదాంత సిద్ధాంతము' అను ప్రతిలోఁగలవు. వావిళ్ళవారి ముద్రణమందును కొన్ని గలవు. కాని విమర్శించి చూచితిమేని కనీసము వేయి పద్యములైనను అచ్చుప్రతులనుండి మనము త్రోసి వేయవలసి యున్నది. వేమన పద్యములతో బోధించినవాఁడు విషయ మొక్కటియైనప్పుడు జ్ఞప్తి చక్కఁగా నుండెనా యిన్నిటి పద్యమే వచ్చును; లేకున్న భావమును ననుసరించినఁ జాలునని యప్పటికిఁ దోఁచిన మాటలతోఁ జెప్పి పోవుచుండెడివాఁడు. అట్లగుటచేత ఆ పద్యములలో అర్థభేదమును రూపభేదమును లేక ఒకటిరెండు పదములుమాత్రము భేదించిన పద్యములనేకములు గనుపట్టును. మఱియు ఒకటే పద్యమును వేఱువేఱుచోట్ల విన్నవారు మరలఁ జెప్పునప్పుడు జ్ఞప్తి చక్కఁగ లేక, వేమన కవిత్వమునకు వారి పైత్యము కొంతచేరి, పాఠభేదములు గలుగును. ఇట్టి పద్యము లన్నియు, ప్రకృతము ముద్రించిన వారివలె, వేఱుగా లెక్కించుట యన్యాయము. వేమన 'పదియు నైదువేల పద్యములను' చెప్పినట్లు తానే చెప్పికొనుట నిజమేని, ఆ సంఖ్యయిట్లే పదాక్షరభేదముచే పెరిగినదేని, ఆ కాలమున నతనికి వచ్చిన 'వెఱ్ఱి వేమన' యనుబిరుదు సార్థకమనుటకు నేఁడు నేనును వెనుదీయను! సంఖ్య విషయమున మనవారికి ఊహ పాటించినట్లు మఱెవరికిని సాధ్యపడ దనుకొందును. రామాయణము మొదట వాల్మీకి వ్రాసినది శతకోటి గ్రంథము! శుక్రనీతి శతలక్షలు! అంతి యేల? మొన్నటి త్యాగరాజు వ్రాసిన కీర్తనలు ఇరువదినాల్గువేలు!! ఇప్పటి 'రామాయణ సంఖ్య' యున్నస్థితికిని మాకూహను ఎంతదూరమైన నంతిసంతోసమేమో మనకు! అది యట్లుండె. పదములకుఁ గల పాఠాంతరములు పద్యములకే రూపాంతరములుగా భావించుటచేత ఇప్పటి వేమన పద్యముల సంఖ్య యింతయైనది. (అట్టివి త్రోసివేసి వ్రాఁతప్రతులలోని యముద్రిత పద్యములను చేర్చుకొంటిమేనియు మూఁడు వేలకు మించునట్లు కానరాలేదు. వేమన్న నామము అజరామరముగా ఆంధ్రలోకమున నిలుచుటకు అయిన్ని పద్యములు చాలునను కొందము.)

ఇఁక వీనిలో ప్రక్షిప్తము లెన్ని? ఈనిర్ణయమే కష్టతరము; కాని యసాధ్యము గాదు. వేమనకు వలచి వచ్చినది ఆటవెలఁది. ఆ పద్యములలో తొంబది పాళ్ళాతనివే యని శైలీసామ్యము పట్టి చెప్పవలసి యున్నది. ఇఁక నిప్పటి ముద్రితప్రతిలోని కందముల సంఖ్య ౬౯౧. (వే. సూ. ర. మూడు) చెన్నపట్టణము ప్రాచ్యలిఖిత పుస్తక శాలలోనివి సుమారు ఏఁబది వ్రాఁతప్రతులను జూచితిని గాని వానిలో నింకను ఇన్ని లేవు. ముఖ్యముగా నొక వ్రాఁతప్రతిలో (ఓ. లై. ౧౧-౬-౨౮) వేమన కందములనే యెత్తి యొకచో వ్రాయఁ బ్రయత్నము చేయఁబడినది. అందు ౧౦౨ మాత్రము

కందములుగలవు. అచ్చు ప్రతిలో ౩౮ తేటగీతులున్నవి. (వే. సూ. ర.) కానిప్రాంత ప్రతులలో తేటగీతుల సంఖ్య చాలతక్కువ. బ్రౌనుదొర ప్రకటించిన సుమారు ఏడు వందల పద్యములలో రెండే తేటగీతులు గలవు. అందులో నొకటి సీసగీతము! ప్రాంత యచ్చుప్రతులలోని యనేక తేటగీతుల మకుటము 'విమలగుణ రాజయోగీంద్ర వేమనార్య' యని యుండును. కాని ప్రాంతప్రతులలో నీమకుటముతోడి పద్యమే నేను జూచినట్లు జ్ఞప్తిలేదు. కావుననే కాఁబోలు బందరువారి ప్రతిలోను, దానినే పూర్తిగా ననుసరించిన వావిళ్ళవారి కడపటి ప్రతిలోను, పైమకుటమును పూర్తిగా వదలి, ఆ గీతుల అతికీ యతుకని ముక్కల నట్లే చేపవేసినారు! వేమన తత్త్వ విచారములను ముఖ్యముగాఁ జెప్పుటకు అప్పుడప్పుడు కందములను గీతములను ఉపయోగించునని యూహింప నిలుచున్నది గాని, బలమైన హేతువు లభించుటలేదు, ఇప్పటి కందగీతులలో ననేకములతనివి గావని నేను నమ్ముచున్నాను. ఇది గాక చంపకాది వృత్తములు కొన్ని యతని పేరనున్నవి. పాటల వంటివి కొన్ని గలవు. అందుఁగొన్ని ప్రాంతప్రతులలోనే యున్నవి. వాని నన్నిటిని వేమనవని నమ్మఁజాలను. ఈ క్రింది పద్యములఁ జూడుఁడు:—

"మ॥ తిలలం దైలము, పాలవెన్న, శిలలం దెల్లంబుగా లోహము
ల్జ్వాల దీపాంకురమందు కజ్జలము, కాష్ఠశ్రేణియం దగ్ని భూ
తలఖాతంబున నీరు గల్గుటయుఁ దథ్యంబంచు నూహించి తాఁ
దెలియన్ యత్నము సేయకున్నఁ దగునే ధర్మంబు వేమాహ్వయా."

(వేదాంత సిద్ధాంతము. పే. ౧౦౫)

"ఇనుమున జేసిన యినపు కడ్డి,
ఇంటి వెనుక నట్టావుల దొడ్డి,
అపటికి మేపిన కుందుమ గడ్డ, (?)
విప్పిచెప్పరా వేమారెడ్డి." (ఓ. లై. ౧౩-౯-౧౯)

రెండును వేమన పేరనే యున్నవి. కాని సహృదయుఁడెవ్వఁడుఁగాని రెండును ఒకఁడే వ్రాసెననలేఁడు. వ్రాసి యుండిన రెండవది వేమన వ్రాసి యుండవచ్చునేమో. వేమన కైవాడము మొదటి దానియందు శూన్యము. అది భారతకయ్య. రెండవదానియందు కొంచెము వేమన్న వాసన యున్నది. మఱియు,

"ఉ. వాసనలేని పూవు, బుధవర్గములేని పురంబు, చాల వి
శ్వాసములేని భార్య, గుణవంతుఁడు గాని కుమారుఁడున్, సదా
భ్యాసము లేని విద్య, పరిహాసములేని ప్రసంగ వాక్యముల్,
గ్రాసములేని ప్రాపు కొఱగావయ భూమిని వెఱ్ఱివేమనా"

(వేదాంత సిద్ధాంతము. పే. ౧౦౪)

ఈ పద్యము 'కోఁగానివి వెమ్మయసెంగ ధీమణీ' యను మార్పుతో జక్కన చెప్పిన 'వెమ్మయ ధీమణి శతకము' లోనిదని, శ్రీ॥ వేటూరి ప్రభాకరశాస్త్రులుగారు చాటుపద్యమణిమంజరిలోఁ బ్రకటించిరి. (చా. ప. పే. ౧౧౨) సుమతిశతకము, తిరుమలేశుని పద్యములు, మొదలగు వానిలోనివి గూడ వేమన్న పేరున బ్రకటింపఁబడినవి. ఇట్టివెన్ని కలవో!

వేమన పద్యములందలి ప్రక్షిప్తములను నిర్ణయించుటలో అర్థభావములకన్న పద్యరచనాస్వరూపము ముఖ్యముగా గమనింపవలెనని నా యభిప్రాయము. ఎందుకనఁగా: వేమనకు విరుద్ధము కాని యర్థభావములను ఇతరులును జెప్పవచ్చును; వేమనయే సహజమైన స్వాచ్ఛంద్యముచేతనో, సన్నివేశము, వయస్సు, అనుభవము మొదలగు వాని భేదముచేతనో, తానాడిన వానికి విరుద్ధములైన భావములు తానే యాడవచ్చును. కాని, ప్రకృతిసిద్ధమైన శైలీవిశేషమును అతఁడు మార్చుకోలేఁడు; ఇతరులనావాఁడుము చేయలేరు. శైలి కవియొక్క ముఖమువంటిది. అంతరంగమెంత మాఱినను అది మాఱదు. కారణాంతరములచేఁ గొంత మాఱినను స్వత్వమును పూర్తిగాఁ బోఁగొట్టుకొనఁజాలదు. కావుననే ఒకవస్తువు నొకచోటఁ బొగడి వేఱొకచోట దానిని ఖండించినాఁడన్న మాత్రాన, పైరెండు పద్యములలో నొకటి యతనిది గాదని నిర్ణయించుట సాహసమని నేను తలఁచుచున్నాను. మఱి యిప్పుడు వేమన్న పేరనున్న పద్యములన్నియుఁ జదువఁగా, నందులో విశేషభాగము వేమన్నదనుటలో సందేహముండదు గావున, నందువలన వేమన శైలీస్వరూపము దృఢముగా భావమున నందేర్పఱుచుకొని తద్విరుద్ధములైనవి యతనివి కావని నిశ్చయించుట సహృదయునకు అసాధ్యకార్యము కానేరదు. అనఁగా అర్థభావములు పూర్తిగా వదలవలెనని కాదు. అది యసాధ్యము. (కాని, ఒకయుద్దేశముతో అత్యంతములుగల గ్రంథము వ్రాయుటకు సమయము వచ్చినప్పుడు హృదయమునఁ దోఁచిన భావములను మఱుగుపఱుచుకోలేక బైటఁబెట్టు వేమనవంటి తీటనాలుక వాని కవిత్వమునందు, అతని శైలీస్వరూపము నిర్ణయించుటకు అర్థభావములకంటె, ఛందోగతి, యతివిశేషము, పదములకూర్పు మొదలగు బహిరంగములే యెక్కువ పనికి వచ్చుననుట నా మనవి. ఈ దృష్టితో చూడఁగల్గితిమేని, ప్రక్షిప్త పద్యముల సంఖ్యను నికరముగా, చరిత్రకారుల పటకారులకుచిక్కునట్లు, చెప్ప చూపలేకున్నను, స్థూలముగానైనను తెలియఁగలము. ప్రకృత మింతకన్న నెక్కువచేయలేము. నేనిందుదాహరించు పద్యముల నెల్లప్రాయికముగ నిట్టి దృష్టిచేతనే చూచి నిర్ణయింపఁ బ్రయత్నింతును.)

ఇట్లే మూలపాఠమును గుర్తింపవలసి యున్నది. ఇది వఱకును సామాన్యముగ సవరించినవారు తమకు రుచియైన పాఠమును గ్రహించుట యలవాటైనది. అందేదియు రుచింపని యెడల, అర్థము కాకున్న, స్వేచ్ఛగా దిద్దుటయు వాడుకయైనదని మొదలే చెప్పియుంటిని గదా. ఇవి యొకటికంటె నింకొకటి యన్యాయమని చెప్పఁబనిలేదు. మనరుచి వేమన్నకుండవలెనని యూహించుట పొరఁబాటు. మన కర్థము కానిదానిని కాలేదని యంగీకరించిన నవమానమని తలంచుట యంతకంటె పొరఁబాటు. ఇది వఱకు బైలుపడిన తెలుఁగు గ్రంథములు శోధించిన వారనేకులు ఈయకృత్యపాలైన వారే. ఇట్టి పరిశోధకుల పిలువనిపేరంటమునుండి మూలమును విడఁదీయవలయునన్న వ్రాఁతప్రతులే శరణ్యము. వేమనపద్యములు వ్రాసినవారుఎక్కువ చదువరులుగారు గావున వారివి కలము పొరఁబాట్లే కాని కవిత్వపు పొరఁబాట్లెక్కువ యుండవు. ఈపద్యము వినుఁడు.—

"ఆ. ఇహమునందు సుఖము ఇంపారకుండిన
పరమునందు నెట్లు పడయ వచ్చు
మొదట లేని చేవ తుద నెట్లు కల్గురా, విశ్వ."

ఇందలి 'చేవ' పదమును వ్రాఁతగాండ్రు, 'చావ' యని వ్రాసిరి. సామాన్య జనులపద్ధతి ప్రకారము ఇందలి చకారము తాలవ్యముగా నుచ్చరింపఁబడుచుండెను. చదువుకొన్న శోధకుఁ డొకఁడు బాలవ్యాకరణ ప్రకారము 'చావ' యని దంత్యముగా దాని నుచ్చరించి యర్థము గాక 'చావు' అని యుండవలెనని తీర్మానించెను. ఒకానొకరు దానికి విచిత్రముగా వ్యాఖ్యానము గూడ చేసిరి! (మా. వేదాంత సిద్ధాంతము, పే. ౭౩) ఇంకఁ గొందఱు చేవయనువ్రాఁతలోని వకారమును తకారముగా చదువుకొని 'చేఁత' యనుకొనిరి. ఈగందరగోళమేలయని యింకఁగొందఱు అస్థానమందు 'సుఖము' అని మార్పుచేసిరి. వీనిలో 'చావు'ను మాత్రము వదలి బందరువారు, చేఁత, చేవ, సుఖము మూఁడును దీసికొని మూఁడు వేఱువేఱుపద్యములుగా ముద్రించిరి! (వే. సూ. పే. ౩౬) విమర్శకులు పరిశోధకులుగా నేర్పడవలసి యవస్థయిది. వ్రాఁతప్రతులను సవిమర్శముగా పరీక్షించితిమేని యీకష్టము చాలవఱకు నివారణయగును.

ఇఁక అర్థమును గూర్చిన కష్టమునకు వారివారి స్వశక్తితప్ప వేఱుశరణము లేదు. వేమన పద్యములలో కొన్నిటికి వ్యాఖ్యవ్రాసినవారు నేనెఱిఁగినంత వఱకును ఐదుగురు గలరు. వీనిలో (౧) బరంపురమునందలి శ్రీతారక బ్రహ్మానుభవి పూడి పెద్ది సాంబశివ రావుగారు 'శ్రుత్యుక్త్యనుభవములతో' రచించిన 'వేమన పద్యరహస్యార్థతాత్పర్య బోధిని.' ఇదిగాక, వీరు, 'వేమన జ్ఞానపంచపద్యరత్నములు' 'హేమతారక విద్య' 'వేమనార్యనివాక్యార్థానుభవశిరోమణి,' 'గగనవిద్య' మొదలగుగ్రంథములు, వేమన

పద్యములకు పీఠికారూపములైనవి, వ్రాసినారు. (౨) శ్రీదత్తాత్రేయ పరంపరాగత శ్రీజ్ఞానానందయోగి విరచితమైన తత్త్వార్థబోధిని.' (3) వావిళ్ళవారు కడపట ముద్రించిన పేరులేని యాంధ్రతాత్పర్యము. (౪) కరూరు బంగారయ్యగారు రచించిన 'వేమనార్యుని పద్యపదశబ్దార్థము.' (౫) బ్రౌనుదొర వ్రాసిపెట్టియుం గొంతవఱకు ప్రకటించియునున్న ఆంగ్లేయ పరివర్తనము.

ఇందు మొదటి దానిలో ఒక్కొకపద్యముక్రింద పుటలకొలఁది వివరణము గలదు. అనేకశ్లోకములు, స్మృతులు, శ్రుతులు, పురాణములు ఉదాహరింపఁబడినవి. ఈ వ్యాఖ్యాతకు వేమన్న యందు చాలభక్తికలదు: అతని తత్త్వములను తానను భవపూర్వకముగా నెఱిఁగినవాఁడని పలుమాఱు తెలుపుచుండును. కాని యొకటే తక్కువ మూలమునకును వ్యాఖ్యానమునకును సంబంధము. రెండవది కొంతమేలు. కాని యిందును మనకుఁ గల సందేహములు తీఱుటయరుదు. అందందు అపపాఠములకు సాహస వ్యాఖ్యానము గలదు. ఈయిరువురును కొన్ని పద్యములకు మాత్రము టీక వ్రాయఁ బ్రయత్నించినవారు. మూఁడవదియగు వావిళ్ళవారి వ్యాఖ్యలో దొరికిన యన్ని పద్యములకును అర్థతాత్పర్యములు వ్రాయుప్రయత్నము చేయఁబడినది. అందటికి నర్థమగు పద్యముల కల్లారు ముద్దగుటీక, సందిగ్ధములైనపద్యము లందు చల్లని రెండుమాటలతో చప్పున జారుకొనుట, ఇందలి విశేషములు. వేమన్న యందలివ్యాసఘట్టముల కెన్నిటకో 'సులభము' 'స్పష్టము' అనుటయే వీరివ్యాఖ్య. * నాలుగవది ఈయన్నిటికంటె వింతయైన ప్రతిభాశక్తిని జూపును. ఒక్కపదమునకు దీనియందలియర్థముమచ్చుకు: "లంజ. లం-పృథివి జ—పుట్టబడినది, పుష్పం—అనఁగా పుష్పముయందు బుట్టిన లక్ష్మి. యగుటవల్ల తల్లి," ! (చూ. వేమనార్యుని పద్యపద శబ్దార్థము, పే. ౯) ఇంతచాలును. ఐదవదగు బ్రౌను దొరది భాషాంతరీకరణమే కాని టీక కాదు. కాని మూలార్థమెఱుఁగుటకు నిష్కపటముగా ప్రయత్నించిన పుణ్యాత్ముఁడితఁ డొక్కఁడే. ఐనను ఇతని భాషాంతరీకరణము అనేక పద్యములకు భావమెఱుఁగకయే చేయఁబడినది.

ఇట్లు ప్రకృతము మనకు పనికి వచ్చు వ్యాఖ్యయొకటియు లేదు. కావున ఎవరి యోగ్యతకొలఁది వారే వేమన పద్యముల కర్థనిర్ణయము చేయవలసియున్నది. నాశక్తి కొలఁది నేనును బ్రయత్నింతును.

---

* ఈముద్రణమున ప్రకాశకులు నాచే నొకచిన్నపీఠిక వ్రాయించి టీక వ్రాసిన వారిపేరు ప్రకటింపకపోవుటచే దీనిని నేనే వ్రాసినానను అపఖ్యాతి నాకుఁ గలిగినది. ఇట్లే శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు రచించిన 'కవిత్వతత్త్వవిచారము'ను గూడ నేను రచించినట్లు కొందఱి తలఁపు. అయుపకీర్తికిఁగాని ఈకీర్తికిఁగాని నా కర్హత లేదని మాత్రమ్ము ఈసందర్భమునఁ బ్రకటింపవలసి యున్నది.

ఈసందర్భమున వేమనపద్యములందనేకములకు మకుటమైన 'విశ్వదాభిరామ' యను పదమున కర్థము విచారింపవలసియున్నది. దీనికి, విశ్వధాభి, విశ్వదాభి, విశ్వతోభి—యని మఱి మూఁడు పాఠాంతరములు గలవు. కడపటి రెండును వ్రాఁతప్రతులలో నపురూపముగఁ గానవచ్చును. 'విశ్వదాభిరామ' యనియే తొంబది పాళ్ళు. 'విశ్వతాభి' యనునది దానికి తరువాత తక్కినవానికంటె నెక్కువగాఁ గాన్పించును. (చూ. ఓ. లై. ౧౧-౬-౨౨; ౧౧-౬-౨౪; ౧౩-౧౦-౯.) కాని, 'విశ్వదాభిరామ' యనునదియే మూలపాఠముగా భావించి యనేకవిద్వాంసు లనేకవిధములుగా నర్థము చెప్పిరి. [(౧) విశ్వమును ప్రపంచమును ఇచ్చువాఁడు విశ్వదుఁడు—భగవంతుఁడు. అతనికి అభిరాముఁడు ప్రీతిపాత్రుఁడు—అని యొకరు. (౨) విశ్వమును సమస్తమును, ద—ఇచ్చుటచేత అభిరాముఁడు—అని యింకొకరు. (3) వేమన్న యుంపుడుకత్తెకు 'విశ్వద' యని నామకరణముచేసి, దానికభిరాముఁడని వేఱొకరు (౪) విశ్వమును సంహరించువాఁడు విశ్వదుఁడు=శివుఁడు, అతనికి ప్రియుఁడని మఱియొకరు. (చూ. వం.సు. గారి 'వేమన' పే. ౧౯౪) ఇన్నిటికతోడు నాదియునొక వ్యాఖ్యానముండిన నష్టమేమియనుకొని నేను, అసలీ పాఠమే తప్పని, 'విశ్వతాభిరామ'యను పాఠమునే గ్రహించి 'విశ్వతా—ప్రపంచత్వము=అనఁగా సర్వమును తానైయుండుట-దానిచే నభిరాముఁడు' అను నొక యర్థము వెలుదీసియుంటిని. (చూ. వావిళ్ళవారి ప్రతి పీఠిక. పుట XVIII) శ్రీవంగూరి సుబ్బారావుగారు, 'విశ్వదుఁడు సమస్తము నిచ్చినవాఁడు (అనఁగా త్యజించిన వాఁడని కాఁబోలు) అగుటచే నభిరాముఁడు'అని వాడుకలో నున్న యర్థమే యుచితమనిరి. ఎవరి వాడుకలో నీయర్థమున్నదో యెఱుఁగను. వేమన్న పద్యములు పఠించువారందఱును ఈనాల్గవ పాదము 'తందనానతానా'వంటిదని తలఁచి యూరకున్నవారే కాని, దానియర్థము విచారించినవారరుదు. పోనిండు. నా వ్యాఖ్యానమే నాకిప్పుడనుచితముగాఁ దోఁచినది. ఎలగు కనఁగా; అప్పుడు తానేసమస్తమును అను అద్వైతానుభవసిద్ధి కలిగిన తరువాతనే యితఁడు పద్యములు వ్రాయ మొదలుపెట్టెనని చెప్పవలసివచ్చును. వేమన స్వచ్ఛందచారిగను సంసారిగాను ఉన్నప్పుడు వ్రాసినవని యూహింపవలసినపద్యము లనేకములు గలవు. ఈవిషయము ముందు స్పష్టమగును. గనుక 'విశ్వతాభిరామ' పాఠమును దానికి నాయర్థమును వదలుకొనవలసియున్నాను. మనలో వ్యాఖ్యానము వస్తుస్థితిని జెప్పుటకుఁగాక, తమ తమ శక్తిని జూపు వినోదముగా నేర్పడినది గావున ఆ పద్ధతి ప్రకారము దీని కింకొక యర్థముగూడ నిష్టమున్న వారు చెప్పుకొనవచ్చును. విశ్వదుఁడు—ప్రపంచమున నందఱిని ఖండించినవాఁడు, అగుటచే నభిరాముఁడు, అనఁగా అన్ని జాతులను వారి పద్ధతులను జంకులేక ఖండించిన వాఁడగుటచే, అందఱును తమ్ముఁ దిట్టిన

పద్యములను మఱచియో మఱుఁగున పఱచియో యితరులనుదిట్టినదిమాత్రము చెప్పుకొని సంతోషింతురు. కావున నిఘంటవులకిని అక్కఱయుండదే! ఇట్టి టీకల కేమిలెండు. సహజమైన యర్థము దీని కిదివఱకు లభింపలేదు. ఇఁక ముందు లభించుననే నాశయు నాకులేదు. దీని కర్థమే లేదనుకొని యింతటితో నూరకుండుట క్షేమము. ఉన్నంతలో మొదటిది మేలు.

ఇఁక నిందుకు సంబంధించిన అభిరామయ్య కథ కాల్పనికమైనది. ఈకథ తెలిపెడు పద్యములు బందరు వారి ముద్రణములోఁ గలవు. అవి వేమన స్వకీయచరిత్రము వ్రాసినట్లున్నవి. నేనుజూచిన యేవ్రాఁతప్రతులందును ఇదివఱకు అభిరామయ్య పేరైన కానరాదు. వ్రాఁతయచ్చుప్రతులలో పీఠికలో నీతని కథ సంగ్రహముగాఁగలదు. అసలుఅభిరామయ్య యను పేరే వింతపేరు. రామయ్యలు గలరు, పట్టాభిరామయ్యలు గలరు; లోకాభిరామయ్యలును ఉండవచ్చును. కాని వట్టి యభిరామయ్య కర్థమేమి? ఒకవేళ పైపేరులలో నేదోయొకటి వాడుకలో నిట్లు సంగ్రహింపఁబడినదనుకొన్నను 'విశ్వదాభిరామ' పదమున కర్థమేమి? విశ్వదుఁడనఁగా విశ్వము నిచ్చినవాఁడు—అనఁగా చేసినవాఁడు—అనఁగా విశ్వకర్మ—అనఁగా అతని కులమునకుఁ జేరిన వాఁడు—ఐన అభిరామయ్య యని యర్థమా? అట్లైన తుదలోని వేమన్న కేమిపని? మఱియు బందరుప్రతి పీఠికలోని వేమన చరిత్రములో అభిరామయ్యకు రామయ్యయను పేరును గలదని చెప్పఁబడినది. అట్లైన మనకంత తలనొప్పి లేకుండ 'విశ్వకర్మ వంశ్య వినర రామ' యనియే వేమన వ్రాయ వచ్చుఁగా నుండెను గదా!

అభిరామయ్య కథ కల్ల యనుటకు వేఱొక సాక్ష్యము గలదు. లంబికా శివయోగి యను నాతఁడు, తత్త్వరహస్యము నుపదేశించెదను రేపు రమ్మని కంసాలి యభిరామయ్యకుఁ జెప్పఁగా, దానిని రహస్యముగాఁ గాంచి వినుచుండిన మనవేమన్న, తన వదినెయైన రాణిగారి మూలమున మఱునాఁడు అభిరామయ్య నగరు విడిచి పోలేకుండఁజేసి, తాను యోగివద్దకుఁ బోయి, అతఁడే తనకు ప్రతిగా నన్నుఁ బంపెనని చెప్పి, శివయోగిని వంచించి యతనిచే బీజాక్షర మంత్రోపదేశమును బొందెనఁట. తరువాత తాను సంపాదించినవిద్యవిలువ నెఱిఁగి జ్ఞానియై పశ్చాత్తాపమును బొంది, మొదలు జాగ్రత్తగా అభిరామయ్యకాళ్ళుపట్టుకొని తప్పుక్షమించెదనని బాసచేయించుకొని తరువాత తన యపరాధమును దెలిపెను. అతఁడు పాపము, మొదలే క్షమించినాఁడుగదా. అతని దయకు కృతజ్ఞతను జూపుట ధర్మమే కాని యదే బీజాక్షరోపదేశమును తానే యతనికేల చేయలేదు? పాపము దానికై యాతఁ డెన్నినాళ్ళు ఆబైరాగి శివయోగిసేవచేసెను? పోనిండు; అభిరామయ్యవలె శివయోగి గూడ వంచి

తుండే కదా! తనకు ప్రధాన గురువగు నతని కింతమాత్రము కృతజ్ఞత చూపవలదా? వేమన పద్యములలో నా పేరే లేదే! మఱియు పైయభిరామయ్య కథలోని యీ పద్యము చూడుఁడు.

“ తే. దేహశక్తియు లేనట్టి దీనుఁడనుచు
నక్కఁగా బోధ చేసెడి నతనుఁడనుగను
నిక్కముగ విశ్వకర్మ తానెఱుఁగుమెఱయ
రామయాఖ్యను విలసిల్లెరఘ్నాభి వేమ ” (౨౧౩౨)

వేమన్న ‘దేహశక్తి లేని దీనుఁడుగా’ నుండెనా? అట్లయిన నట్టి క్షయ రోగావస్థ మందులతోఁ దీఱును గాని బోధలతోఁ దీఱునా? మఱియు రామన్న వేమన్నకు చేసిన బోధయేమి! పాప మతఁడే బోధ బాధలు తెలుఁగఁడే! తుమిలించుటయే బోధయా? ఈ పద్యములు కృత్రిమములనుట కింతచాలును. ఈ ప్రతియందుఁగల విశ్వకర్మ పేరిట యసంఖ్యపద్యములను, ‘కంసలికిని మించు కడజాతి లేదయా’ యని యన్ని వ్రాఁతప్రతులందును అచ్చు ప్రతులఁదును నుండఁగా ‘ఘనజాతి లేదయా’ యని దిద్దియుండుటను (౩౧౯౪) గూర్చిమేని, సంపాదకులు సుత్తిదెబ్బలు అకురాయికోఁతలు వేమన్న చాల తిన్నాఁడని స్పష్టముగాఁ గానవచ్చును. అది యట్లుండె.

పైఁ జెప్పిన పద్యములు పాటలుఁ గాక ‘వేమనవాక్యము’ లని కొంత కొంత అక్కడక్కడ పద్యపునడక గల వచనములు కొన్ని యున్నవి. వాక్యమనఁగా పెక్కు చిన్న వాక్యముల గుంపు. ఇట్టివి ఆఱు వాక్యములున్నవి. ప్రతిదాని తుదను ‘విశ్వదాభి రాము’ మకుటము గలదు. ఇందలి ముఖ్య విషయములు యోగసాంఖ్యతత్త్వములు. ఇట్టి వచనరచనలు కన్నడమున బసవేశ్వరుఁడు ప్రక్రమించెను గాఁబోలు. అతనితరువాతి కన్నడ శైవులు తెలుఁగు శైవులును, వారివలె తెలుఁగు వైష్ణవులును ఇట్టి వచనములు పెక్కులు వ్రాసిరి. శివయోగిశిష్యుఁడైన వేమన్నయు నట్లే వ్రాసి యుండుట యసంభవము గాదు. కాని యిప్పటివాక్యములు వేమన్న వ్రాసెనని నేను నమ్మఁజాలకున్నాను. వేమనయందుఁగల సంగ్రహశక్తి, భావమును స్పష్టముగా చదరముగా కత్తిరించినట్లు చెక్కి యతికించుశక్తి—మొదలగు గుణము లేవియు ఇందుఁ గానరావు. ఒకటి విని మీరే నిర్ణయింపుఁడు.—

“పూర్ణ సమాధిలో రేచించి పూరించి కుంభించి—పెద్దగాలివలె నే బరిగుచుండు—రొదుకోట్ల వెట్టి నాదంబులు గానబడును—మేసుచల్లని గాలి విసరును—గాలి లోపలనుండును గంధర్వ నాదంబు—గానపడు విను బాటలో నుండు (?) ఎంతైన నడువీధి నాడుచుండు ”—ఇత్యాది. (చూ. ఘటశోధని. పు. ౨౦).

ఇవి కృత్రిమములనుటకు ఇంకొక సాక్ష్యము గలదు. ౧-వ వాక్యమందీపద్య గంధి వాక్యముం జూడుఁడు.

“అది మూలమందు అంబికా శివయోగి-మూలగురుఁడుమాకు ముక్తిఁ జూపె” వేమనకు గురువని చెప్పఁబడినవాఁడు లంబికాశివయోగి గాని అంబికా శివయోగి గాఁడు. పట్టి శివయోగులున్నారుగాని అంబికాశివయోగులను నే నెఱుఁగను. ఇందలి పద్యపు నడకకు సహజమైన యతినిబట్టి అంబికాశివయోగి యనియే వ్రాసినవాని యభిప్రాయమనుటలో సందేహము లేదు గదా. లంబికాశివయోగి పదమునకర్థము ముందు విన్నవింతును. తెనుఁగు వ్రాఁతలోని అకారలకారములకుఁ గల సామీప్యమే యీ భ్రాంతికిఁ గారణము. కాఁబట్టి పైరెండు శబ్దములకుఁ గల యర్థభేద మెఱుఁగనివాఁడు, యోగశాస్త్రశబ్దముల నెవరివలననో విన్నవాఁడు, అనుభవము లేనివాఁడు-ఎవఁడో పైవాక్యములను వ్రాసి వేమన తల కింటఁగట్టినాఁడని సందేహించుటలో తప్పు లేదు.

ఇట్లే బందరువారి ముద్రణములోను కొన్ని వచనములు గలవు. అవియును అందందు పద్యపునడక గలిగి తుదలో వేమ శబ్దములో ముగియును. వేమన్నవి కావని సందేహింపవలసిన వానిలో నివియును జేరినవి.

పై చర్చవలన వేమనపద్యములను శ్రద్ధతోఁ జదువువారికిఁ గలుగు చిక్కులు కొంతవఱకు స్పష్టమగును. సరియైన విమర్శముతోఁ జేసినముద్రణము ఒకటైనను ఈవఱకు బైలుపడలేదు. వేమన్న పద్యము లిట్లున్న మేలని తలఁచిన వారే కాని, యెట్లుండి యుండవచ్చునని విమర్శించిన వారు లేరు. అర్థము తెలియనివారు, అర్థములేని సంప్రదాయములకుఁ జేరినవారు, అనర్థకరమగు అభిమానము గలవారు, ఈపద్యములను తలయొక దిక్కుగా నీడ్చి చెఱచినారు. ఇతరుల భావములును రచనలును మనకెంత యసహ్యముగానున్నను వానిని దిద్దునధికారము మనకు లేదని తలఁచుట మనవారనేకు లింకను నేర్వనివిద్య. కావుననే, అందందు కొన్ని యనావశ్యకమైన సవరణలున్నను, చిన్నదైనను, ఇప్పటికిని బ్రౌను దొర ముద్రణమే సర్వోత్తమమని చెప్పుటకు సిగ్గగుచున్నది. అతఁడు మనకుఁ జేసిన మహోపకారమును నే నరగంట చూచుచున్నానని తలఁపకుఁడు. చెన్నపట్టణములోని ప్రాచ్యపుస్తకశాలలోని వ్రాఁత ప్రతుల నొకమాఱైనను చూచిన వారికి తప్ప తక్కినవారి కామహనీయుని యప్పు తెలియదు. కాని యతఁడు దోసిలి నిండఁ బెట్టినను, పెట్టినదెంతమంచి వస్తువైనను, అది బిచ్చమే. అతని యౌదార్యమున

దండుగ తెలుఁగు వారుండి వేమనవంటి వాని విషయమైకూడ ఇంకను తెల్లదొరగారి తిరిపెమునకే యొడిఁ బట్టవలసినందు కేడ్వవలదా? ఆంధ్రమహాపురుషులందఱితోడ వేమన్నకును యూనివర్సిటీ కుర్చీలపై సమానముగాఁ గూర్చుండఁ జోటిచ్చి ధన్యులైన ధీరులు ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారు. వారు ఇంకఁ గొంత యౌదార్యము వహించి వ్రాఁత ప్రతులను ప్రాఁతయచ్చు ప్రతులనూ సేకరించి, సంప్రతించి, సవిమర్శముగ వేమన్న పద్యముల నూతన ముద్రణ మొకటిచేసి పుణ్యము గట్టుకొందురుగాక సామాన్యలోకరిద్దఱితో ఆ కార్యము సాధ్యము కాదు గావున నాభారము ప్రకృతము వారినే చెందియున్నది. – 20-10-63

శ్రీః.

రెండవ యుపన్యాసము

# వేమన కాలదేశములు

హిందువుల యన్ని చరిత్రములవలెనే వేమనచరిత్రమునుగూర్చి నమ్మఁదగిన సాక్ష్యములు లేక పోవుటచే సత్యము బైలుపడుట చాల కష్టముగా నున్నది. ఐనను అందు ముఖ్యములైన కాలదేశములను గూర్చి నేఁడు కొంత చర్చింతును.

ఇంగ్లీషు వారి సహవాసముచే మనము నేర్చుకొన్న విచిత్రవిద్యలలో చరిత్ర రచనయొకటి. చరిత్రములు వ్రాయుట మనపూర్వులు తెలియక పోలేదు. అది మానవ సామాన్యధర్మము. కాని వారెన్నఁడును ఇప్పటివారివలె దానినొక ప్రత్యేకమగు విద్యగా, ఒకరిద్దఱు వ్యక్తులకుఁగాక యొక దేశమునకే—జాతికే చేరిన ముఖ్య శాస్త్రముగా, పరిగణించినవారు కారు. పూజ్యమైన వ్యక్తియందు ప్రజలకు గౌరవమును గల్గించుట వారి ముఖ్యసాధ్యము. చరిత్రము దానికి సాధనమంతే. కావున విన్న విషయములు కన్నవిషయములు అన్నియు నమ్మి, చాలకున్న క్రొత్తగా చేర్చి, సరిపడకున్న దానిని త్రోసివేసి, వారు వ్రాయుచుండిరి. ఇప్పటి మతము వేఱు. పూర్వ కాలమున సంస్కృతతర్కశాస్త్రము తక్కినవిద్యలయందెల్ల నెట్లు ప్రవేశించెనో, యట్లే నేఁడును ప్రతివిద్య నేర్చువానికిని ఆవిద్యయొక్క చరిత్ర మత్యావశ్యకముగా నేర్పడినది. చరాచర వస్తువుల కన్నిటికిని, నేఁడు చరిత్రము గలదు. చరిత్రమునకును చరిత్ర మెవరైన వ్రాసినారో లేదో యెఱుఁగను గాని వ్రాయవచ్చు ననుటలో సందేహము లేదు.

మనకు చరిత్రమువలనఁ గలుగవలసిన లాభము యథార్థజ్ఞానము. అది మంచిదైనను కాకున్నను, ఇష్టమున్నను లేకున్నను, సరే. కావున నేఁటి చరిత్రకారుని కొకవిషయము సత్యమని స్థాపింప ననేకసాక్ష్యములు కావలయును; అవి పరస్పర విరోధము లేక యుండవలయును. అట్లగుటచే సాక్ష్యము దొరికినఁ జాలునని తృప్తి పడక యది నమ్మఁదగినదా కాదా యని మొదలు పరీక్షింపవలసి యుండును. కావున నిప్పటి చరిత్రకారుఁడు తానొక న్యాయాధిపతిగా వ్యవహరించుచున్నాఁడు. ప్రతి

సాక్ష్యమును కల్పితమై యుండవచ్చునను నపనమ్మకముతోనే విచారణ కుపక్రమించును. ఇట్లగుటచే సందేహము చరిత్రకారుల స్వభావమైనది. ప్రాచీనులు అన్నిటిని నమ్మిరి. ఆధునికులు దేనిని నమ్మరు—అనఁగా బలవంతమైన సాక్ష్యము, ఇతర చరిత్రకారులు బలవంతమని నమ్మునట్టిది, లేనిది సాక్ష్యమున్నను లేకున్నను అన్నిటిని నమ్ముట యెంత అన్యాయమో, సాక్ష్యము లేనివాని నన్నిటిని నమ్మకపోవుటయు నంతే యన్యాయము. ఫలమేమనఁగా: ప్రాచీనపురాణములలో వస్తుస్థితిని మించి వేయిరెట్లు విషయములు లభించుచుండఁగా, ఆధునికుల చరిత్రలలో అసలు సత్యమే పూర్ణముగా లభింపక తునకలు తునకలుగా లభించును. వేమనతండ్రివిషయమై వ్రాయవలసివచ్చె ననుకొనుఁడు; ప్రాచీనులు అతని ఒడ్డు, పొడవు, పేరు, ఊరు, ఔదార్యము, ధైర్యము మొదలగున వన్నియు వినియో యూహించియో వ్రాసి, మనకొక సర్వాలంకార పూర్ణమైన వ్యక్తిని చేతికందిత్తురు. ఆధునికులు ఉన్నదనుటకు సాక్షి లేనప్పుడు లేదనుకొనుటయే మంచిదిగాన, వేమన్నకు తండ్రియే లేఁడని యందురుగాని, తండ్రి లేని కుమారుఁడు సృష్టిలో లేకపోవుటచే, ఒకవేళ నుండినను అతని విచారము మనకేమియు తెలియదని చెప్పి, తండ్రియను నొక పదార్థమును మాత్రము నామరూపాదు లొక్కటియు లేక మనతలఁపునకుఁ జెత్తురు.

మఱియు నమ్మవలసిన సందర్భము లందును ఇరువురినమ్మకములందు చాల భేదము గలదు. ప్రాచీనులలో నమ్మకమునకు అనుభవప్రమాణము గాని యనుమాన ప్రమాణము గాని పనిలేదు. వేమన చేనిలో పండిన పుచ్చకాయలను పాపరకాయలును రాసులుగాఁ బోసి, వానినొకమాఱు చేతితో తాఁకిన మాత్రమున బంగారుముద్దలుగాఁ జేసి యన్నగారికి ఇనామిచ్చినాఁడని వారు సందేహము లేక నమ్మి వ్రాయుదురు. (చూ—వే-సూ-ర—పీఠిక. పు. ౨౬) ఇట్టి దానిని ప్రత్యక్షముగాఁ జూచుట యట్లుండనిండు. 'ఈ సామర్థ్యము గలవాఁడు, చేనుదున్ని, విత్తి, కోసి, కూలియిచ్చి—ఇంత యవస్థపడనేల? ఇంటిలోని యన్నగారి యినుపపెట్టెనో లేక పెరటి మట్టిగోడనో తాఁకి బంగారుగాఁ జేయవచ్చునే! ఏమి వెఱ్ఱివాఁడు వేమన్న!' యని యూహింపవలసిన యక్కఱయే పురాణములు వ్రాయువారికుండదు. విషయమెంత యసాధ్యమైన వారికంత యెక్కువ నమ్మకము. ఇఁక చరిత్రకారుని తీరు వేఱు. అతనికి పరమ ప్రమాణము ప్రత్యక్షము. అనుభవబలములేని యనుమాన ప్రమాణమును అతనికి పనికిరాదు. మఱియు తనకాలపు టనేకజనుల ప్రత్యక్షానుభవమే తప్ప తనయొక్కని యనుభవము నకు వచ్చియుండినను తన్నుతానే యతఁడు నమ్మఁడు. ఇతరులు నమ్మరనుభయ మతనికి మెండు. బంగారము కృత్రిమమైన వస్తువుగాక సహజములైన ప్రకృతులలో నొక్కటిగావున వేఱుపదార్థమేదిగాని బంగారముగా మార్పవీలులేదని యాధునిక

రసాయన శాస్త్రజ్ఞుల సిద్ధాంతమఁట. కావున తనకుఁ దెలియనిది తనతాతకును దెలియదు, అను నహంకారశాస్త్ర ప్రథమసూత్రము ప్రకారము, అతఁడు రసవాద విద్యయే మిథ్యయని సిద్ధాంతముగా నమ్మెను. తానొకవేళ ప్రత్యక్షముగాఁ జూచి నను 'ఇదేదో కనుకట్టువిద్య' యనుకొని తృప్తిపడును.

పైయిరువురికిని సమానధర్మమొకటి కలదు. అదేదనఁగా అభిమానము. తమ జాతి, మతము, దేశము, భాష మొదలగు వానిపై నిరువురికిని అభిమానము మెండు. పురాణకారుల యభిమానముచే అతిశయోక్తులు ప్రబలినవి; చరిత్రకారుల యభిమాన ముచే అసత్యములు ముందుకు వచ్చినవి. అతిశయోక్తులును అసత్యములే యైనను అందలంకార మున్నది. ఇందులో భేదంతే. బసవేశ్వరుఁడు ఆంధ్రుఁడని సాధించు అసత్యమునకన్న, భీముఁడు బండెఁడు పనసపండ్లను ఏకాదశి ఫలాహారము చేసెనను అతిశయోక్తిలో సొగ సెక్కువగదా. పురాణముల వారు, తమజాతియే సృష్టికర్త తలమీఁది తుది వెంట్రుకనుండి పుట్టినదని, తమ మతమే భగవంతుఁ డుపదేశించిన మోక్షమార్గమని, తమదేశమందలి వీధులమన్ను గూడ పుణ్యభూమి యని, తమ భాషయే దేవభాషయని; ఇతరజాతిని స్పృశింపరాదని, ఇతరమతము నరకహేతువని, ఇతరదేశమున కాలుపెట్టినఁ గత్తిరించు కొనవలెనని, యితరభాషలాడిన నాలుకను దర్భతోఁ గాల్చవలయునని, వ్రాసుకొనిరి. చరిత్రకారులు, తమజాతియే సర్వగుణముల కాకరమైన యార్యజాతి; తమమతమే సర్వమతసారము; తమదేశమే వీరశూరవిక్ర మాదిత్యుల జన్మభూమి; తమభాషయే ముద్దుపలుకుల మురిపెములమూట, యని వ్రాయుచు, ఇతరులను తిరస్కరించుచు విధిలేక ప్రపంచమున వారిఁబతుకు నోర్చి యుందురు! కన్నడము వారికి కవిత్వమును వ్యాకరణమును, ఛందస్సును-ఇంతయేల? అఆఇఈలనే నేర్పిన యుపాధ్యాయు లాంధ్రులనియు, అరవము 'వినుటకు శ్రుతి కటువుగ నుండు బొమ్మరాళ్ళతంబళము' అనియు మనవారు వ్రాసికొన్నారు. (మా-వం-సు-గారి ఆంధ్రవాఙ్మయ చరిత్రము. పీఠిక XXXIV; పే. 120) అరవ మందును కన్నడమందును మళయాళమునందునుగల ழ కారము తెలుగునఁగూడ నెన్నఁడో యుండెనని యెవరైనఁ జెప్పిన నెదగ్రుద్దుకొనువారు మనలో నున్నారు. ఇదిగాక ఆంధ్రులలోనే బ్రాహ్మణాబ్రాహ్మణులరగడ, సర్కారు దత్తమండలముల వివాదము, నియోగివైదిక భేదము-మొదలగు పాక్షికవ్యవహారములచేత నెన్ని యసత్యములు అన్యాయసిద్ధాంతములు బైలుదేఱినవో తేలుచున్నవో మీ రెఱుఁగుదురు. నన్నయకవిత్వమునం దున్నంతమాధుర్యము తిక్కన కవితయందు లేదని యొకానొక వైదికపండితులు నాతో వాదించిరి! కాని యిటీవల నన్నయ అసలు బ్రాహ్మణుఁడే కాదు క్షత్రియుఁడని యొక వాదము బైలుదేఱుచున్నట్లు జ్ఞాపకము!

నన్నయ బ్రాహ్మణుఁడైన నేమి క్షత్రియుఁడైన నేమి మన కేమిలాభమని తలఁచిన కొందఱు, కాపువారు కాఁబోలు, నన్నయకుఁగల యాదికవిత్వకీర్తిని వేమన్న కీయఁ దలఁచి వేమన్న నన్నయకన్నఁ బూర్వుఁ డనిరఁట! (వం. సు. గారి వేమన పు. ౪౫) ఇట్లే రామరాజ భూషణుఁడు , బ్రాహ్మణుఁడే కాని శూద్రుఁడు కాఁడను వాద మొకటి గూడ నాచెవిని బడినది.

తమ యభిమానపు వాదమున కనుకూలమగు పూరిపుడకనైనను బ్రహ్మాస్త్రముగా భావించుట, విరుద్ధములైన సాక్ష్యముల నన్నిటిని సందేహించి తిరస్కరించుట, యేదైనను నూతనసిద్ధాంతమును తప్పక బైటికిఁ దీయవలయునను సంకల్పము—ఇవి యాధునిక చరిత్రకారులలో ననేకుల మనస్తత్త్వములు. కాళిదాసు తనగ్రంథములలో నందందు 'గుప్త' పదము వాడుటచేత నతఁడు గుప్తరాజుల కాలమువాఁడని సుప్రసిద్ధచరిత్రకారులగు 'కీతు' గారు వాదించిరి! (See the Journal of Royal Asiatic Society, 1909. P. 438) ఒకానొక యాంధ్రచరిత్రకారులు ద్రోణాచార్యులు కుంభసంభవుఁడనుట కర్థము అతఁడు కుమ్మరివాఁడై యుండునని తలఁచిరఁట! అంతదూర మెందుకు? పేరు సవ్వఁడిబట్టి అతఁడు దోణినడుపు బెస్తవాఁడనియు, ధర్మరాజు దొమ్మరి వాఁడనియుఁగూడ జెప్పవచ్చును గదా!

ఇట్లు మనచరిత్రములు విచిత్రసిద్ధాంతముల కాకరములై యుండుటకు ముఖ్య కారణము మనలో చరిత్రరచనకు పనికివచ్చు బహిరంగ సాధనము లెక్కువగా లేకుండుటయే. ఉన్నవి యతిశయోక్తిమయములైన పురాణములు. ఇఁక అంతరంగ సాధనములు అనుమానమునకు పనికివచ్చునే కాని, దృఢమైన సాక్ష్యమును సమకూర్చునవి యేగ్రంథములందును ఉండవు. తమ చరిత్రమును ముందువ్రాయువారికి పనికి రావలయునను నుద్దేశముగలవారు తప్ప, తక్కిన యెవరును స్వకీయ చరిత్రవిషయములకు తమగ్రంథములలో నవకాశమియ్యరు. అవి అకస్మికముగా నందు రావలసినవి.

ఇట్టి యిరువురినడుమ పురాణమును చరిత్రమును దేనిని వ్రాయ నేర్వని నావంటి వానికి వేమనజీవితమును దెలిసికొనవలెనన్నప్పుడు। కలుగుకష్టము చెప్పి తీఱదు. ఐనను ఈ రెంటిని యథాశక్తి పరీక్షించి ప్రకృత ముపయోగించుకొనవలసి యున్నది.

//వేమనసూక్తిరత్నాకరమున పీఠికలోని వేమన చరిత్రమనుపురాణమున ఈక్రింది విషయములు గలవు: క్రీస్తుశకము ౧౩౨౫ నుండి ౧౪౨౫ వఱకును నూఱేండ్లు సరిగా కొండవీటిలో రాజ్యము చేసిన రెడ్డిరాజులలో కడపటివాఁడగు రాచవేమారెడ్డికి మన వేమన తమ్ముఁడు. కోమరుగిరి వేమారెడ్డి కొడుకు. తల్లి మల్లమ్మ. అన్న భార్య తల్లి

కంటెది నరసాంబ. వేమన చిన్ననాఁటినుండి వేశ్యలలోఁ జిక్కియుండి బొక్కసమంతయు దానికి దోచిపెట్టుచుండఁగా, వదిన నరసమ్మ యుక్తితో నాతనికి దానిపై రోఁతజనించునట్లు చేసెను. నగరికంసాలి అభిరామయ్య. అతఁడు లంబికా శివయోగియను వానిని తత్త్వోపదేశార్థము రహస్యముగా సేవించుచుండెను. ఒకనాఁ డాయోగి అభిరామయ్యతో రేపుదయమువచ్చి యుపదేశముపొందుమని చెప్పఁగా దానిని పొంచివిన్న వేమన్న, మఱునాఁడు అభిరామయ్యను బలవంతముగా నగరియందే నిలుచునట్లుచేసి, తాను పోయి యోగితో 'అభిరామయ్య తానురాలేక నన్ను పంపినాఁడు' అని చెప్పఁగా 'వాఁడునిర్భాగ్యుఁడు, నీవే రారా' యని యతఁ డితనికే యుపదేశముచేసి యెందో పోయెను. జ్ఞానియై వేమన్న యభిరామయ్య క్షమాపణ వేఁడి, విరక్తుఁడై, దేశదేశములుఁ దిరిగి పద్యరూపముగ తత్త్వోపదేశము ప్రజలకుచేయుచు, తుదకు 'కటార్లపల్లె' లో సమాధి విష్ఠుఁడయ్యెను.

ఇందు చరిత్రమునకు ముఖ్యవిషయములగు వంశము, కాలమూ, దేశము, పేర్కొనఁబడినవి: కోమటి రెడ్డిరాజులవంశీయుఁడు; ౧౫-వ శతాబ్దమున నున్నవాఁడు; కొండవీటిలోఁబుట్టి పెరిగి కటార్లపల్లెలో ముక్తుఁడైనవాఁడు. దీనిని వ్రాసినవారు ఇది 'నిక్కపు చరిత్ర' యనుచున్నారు కాని యేయాధారములచేత నిది నిక్కమను కొనిరో తెలియదు. మఱియు పైవంశవృక్షమును సుగృహీతనామములగు కీ॥ శే॥ కొమర్రాజు లక్ష్మణరావుగారు అసత్యమని ఖండించిరి. వేమన్న తండ్రియనఁబడు కొమరగిరికి సంతానమే లేదఁట. కావున నతని తరువాత నతని దాయాదియగు కోమటి వేమారెడ్డి రాజ్యము చేసినవాఁడు. కొమరగిరిరెడ్డికి కొడుకనఁబడు రాచవేమారెడ్డి ఈకోమటివేమారెడ్డి కొడుకఁట! వేమనయోగి కిం దేసంబంధమును ఉన్నట్లు కానరాదఁట. *

శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు కుమారగిరికి కుమారుఁడున్నట్లు శాసనాదుల వలన తెలియవచ్చుచున్నది యనిరి † కాని యతఁడు రాజ్యమునకు రాలేదు. ఈ రాజ్యమునకు రాని కుమారుఁడే బైరాగులసావాసమునఁబడి పోయిన మన వేమన్నయై యుండునా యను సందేహము గలుగును. కాని 'వేమన వాక్యము' లనఁబడు వానిలో వేమన తండ్రి ‡ 'రెడ్డన్న' యని చెప్పఁబడినది. ఇట్లే బందరుప్రతిలోని వేఱొక వచనమందును గలదు. (౩౯౦) కుమారగిరివంటి ప్రభువును రెడ్డన్న యను

* చూ. వం. సు. గారి వేమన, పుట ౨౫.

† ఆంధ్రుల చరిత్రము. భా. 3. పు. ౧౯౪,

‡ చూ. ఘటశోధని. పు. ౭౮,

సామాన్య నామముండునని యూహించుట యసాధ్యము. మఱియు 'వేదాంత సిద్ధాంతము' పీఠికలో కొమరగిరికి కొడుకులిద్దఱనియు వారిలో రాచవేమారెడ్డియే మన వేమన్న యనియు వ్రాయఁబడినది. కాని రాచవేమారెడ్డి నాలుగేండ్లు రాజ్యమేలెననియు తుద కాకస్మికముగా తన భృత్యునిచేతనే చంపఁబడియె ననియు 'కొండవీటి దండకవిలె' లోఁగలదఁట. కాఁబట్టి ప్రకృతస్థితిలో కొండవీటిరెడ్డిరాజులకును వేమన్నకును సంబంధము గలదని యూహించుట దుష్కరము.

మఱియు అంతరంగసాక్ష్యములచేత నీ యంశము దృఢమగును. వేమన ప్రబంధకవులవలె తానుండు ప్రపంచమును దాఁటి వ్రాసినవాఁడు కాఁడు. అతని పద్యములందెల్ల స్వానుభవమను కవితాధర్మము తాండవమాడు చుండును. ఇతఁ డాగర్భశ్రీమంతుఁడై నడిమివయసువఱకును రాచనగరియందే పెరిగినవాఁడై యుండిన, పెద్దన్న, కృష్ణదేవరాయలు మొదలగువారి కవిత్వమందుఁ గానవచ్చు సంపత్సమృద్ధివాసన యించెందును గానరాక పోవునా? వానియందభిమానము లేకున్నను ఖండించుటకైన పనికి రావా? మఱియు వేమన్న 'కుక్కయిల్లు సొచ్చి కుండలు నాకుట' చూచినాఁడు. (౩-౨-౨౩) 'పండినచేనిలోని పల్లేరుగాయలు' త్రొక్కినాఁడు. (౨౯౦౨) 'గడ్డివేసినను పాల్లనొడ్డు కొమ్మ్మడించు' నని యెఱిఁగినాఁడు. (౧౭౮౯) 'పచ్చిసంపులో నీళ్ళు పట్టిన నిలువ' వని కనుగొన్నాఁడు. (౧౩౮౭) 'కుండ చిల్లిపడిన గుడ్డదోఁపగవచ్చు' ననుసంసారపు నాజూకును నేర్చుకొన్నాఁడు. (౧౧౩౨) 'కడుపునిండ తపుడు గంపలోఁ బెట్టక, నన్నుముట్టనీదు కొన్నబఱ్ఱె' యను మహిషీదోహనమర్మమును గుదువుకొన్నాఁడు. (౫౭౧) ఇట్టి యనుభవములు రాజవంశీయులకు, అందును రాచరికపు జవాబుదారీ లేక యూరకతిని తిరుగమరగిన యువరాజులకు. కలుగునా? మఱియు వేమన,

"ఆ. ఎంతసేవఁజేసి యేపాటుపడినను,
రాచమూక నమ్మరాదు రన్న!
పాముతోడి పొందు పదివేలకైనను, విశ్వ." (౬౩౮)

అని చెప్పినవాఁడు ఇంతపైన 'రాచకొడుకు గాకున్నను దూరబంధువై, బీదవాఁడై మైసూరుదేశమందలి కొందఱు 'అరసు' లవలె నేల యుండరాదు?' అని తలఁచువారుండిరేని నా యాక్షేపణలేదు; వారికి ఫలమును లేదు.

ఇట్లితఁడు రెడ్డిరాజుల వంశమువాఁడై యుండఁడని సందేహముగలిగిన వెంటనే వారు రాజ్యముచేసిన ౧౪-౧౫ శతాబ్దములలో నున్నవాఁడను కాలమును నిరాధారమగుచున్నది.

§ చూ. ఆం. చ. భా. ౩. పు. ౧౯౩.

ఇఁక కొండవీటిలో పుట్టి పెరిగినాఁడనుటకు వేమన పద్యములలో నొక యాధారమున్నది.

"ఆ. ఊరుకొండవీడు ఉనికి పశ్చిమ వీధి
మూగచింతపల్లె మొదటి యిల్లు
ఎడ్డెరెడ్డికులమదేమని తెల్పుదు విశ్వ...(౫౮౭)

కాని దీని యర్థము సందిగ్ధము. కొండవీటి పశ్చిమ వీధిలో నునికికిని మూగచింతపల్లె మొదటి యింటికిని సంబంధమేమి? దీనికంతరార్థమేమో కలదఁట. పాఠాంతరములకును కొరవు లేదు. అవి యట్లుండనిండు. కొండవీటివద్ద మూగచింతలపల్లె కలదఁట. కడపజిల్లాలో కూడ నొక మూగచింతపల్లె కలదనియు నందలి వారొకబయలుచూపి యిదే వేమన్న పుచ్చకాయలు పండించిన చేనని చూపెదరనియుఁ జెప్పఁగావిన్నాను. కొండవీటిలోఁబుట్టి కొన్నాళ్ళుండి, తరువాత ఆ రంటిలో నేదోయొక పల్లెలో మొదటి యింట వసించినాఁడను నర్థమిచ్చు పాఠాంతర మొకటి పైపద్యమున కుండవలెనని నను కొంటిమేని, ఇతఁడు కొండవీటిలోఁ బుట్టినాఁడు కాఁడని సాక్షి ప్రమాణము లభించువఱకును మనమతఁడందుఁబుట్టినవాఁడే యని నమ్మదముగాక. ఈనమ్మికకు తోడు కర్నూలుజిల్లా క్రిష్టిపాడువాఁడనియు, గుంటూరికిఁ జేరిన 'ఇనుకొండ' వాఁడనియు, కడపమండలపు 'చిట్టివేలు' వాఁడనియును బ్రౌనుదొరవిన్న యుపపురాణములు కనీసము మూఁడున్నవని మనము గమనింపవలసి యున్నది. *

ఇఁక నితఁడు కటార్లపల్లెలోవచ్చి సమాధి యయ్యెనాయను విషయమింతను సందిగ్ధము. ఇదివఱకు వేమన పద్యముల నచ్చువేసిన వారనేకులు ఇతఁడు కదిరి తాలూకా కటార్లపల్లెలో శార్వరి సంవత్సరచైత్రశుక్ల నవమినాఁడు తన జీవితమును చాలించె ననియే వ్రాసియున్నారు. 'క్యాంబెలు' దొరయును ఇట్లేతలఁచి కటార్లపల్లెకుఁ బోయిచూచి యక్కడిసన్నివేశములు గుట్టలు, వాఁగులు మొదలగువానిని విపులముగా వర్ణించి వ్రాసెను. † బ్రౌనుదొరకు కటార్లపల్లె సమాచారమే తెలిసినట్లు తోఁపదు. నేనును ప్రత్యక్షముగా నాయాప్రదేశములను చూచి రావలయునని పోయితిని ‡ కాంబెలు దొరకన్న ఘనముగా విపులముగా మీకువర్ణించి చెప్పవలెనను కుతూహలముతో త్రోవలోని తుమ్మచెట్లు, పాపాసుకళ్ళు రాళ్ళు రప్పలుగూడ వదలక గుర్తులు వేసికొంటిని. మొదలు కదిరి దగ్గరనుండు 'నల్లచెఱువు' గ్రామము

* See Brown's Verses of Vemana. Preface P. III

† See Mad. Christ. Coll. Mag. March, 1898.

‡ ఈప్రయాణమందు మన్మిత్రులు శ్రీ. అనంతపురపు వారకవి రామచంద్రరావు, బి. ఏ., బి. ఎల్., గారును, కదిరి వసంతాచార్యులుగారు, రెడ్డిపల్లి వెంకటశ్రేష్ఠిగారును నాకు చేసినసాహాయ్యము ఎన్నఁడు మఱవరానిది.

నందును వేమన్నకు సంబంధము గలదని విని యక్కడికిఁబోయి యందలి గుడి దర్శించి యందలి వేమన్న చెక్కు విగ్రహము మొగమున పట్టె నామములు చూడఁగనే 'శివయోగియైన వేమన్న మొగమున నామాలేమిటిరా' యని సందేహము కలిగినది. కాని యహింసావ్రతియైన వేమన్న పేర నేఁటేట మేకఁబోతుల బలియిచ్చినట్లే యిదియు విచిత్ర కాల పరిణామములలో నొకటియై యుండుననుకొని, యక్కడి పూజారి చెన్నయ్యను విచారింపఁగా, నాతఁడొక వేమన్న పురాణమును జెప్పెను. అదంతయు మీకు బరువు పెట్టదలఁచుకోలేదు; కాని విధిలేక ముఖ్యాంశములు మాత్రము సూచించుచున్నాను.

— వేమన కొండవీటివాఁడు. పైఁడిపాలకొండిది రష్టవంశమువాఁడు. కనుగోళ్ళ గోత్రము. మొదటనతని పేరు పుల్లారెడ్డి. రాజైనయన్నతో కలహించి తల్లితో నల్లచెఱువుకు వచ్చెను. అక్కడ సేద్యము చేసికొనుచు సుఖముండఁగా నొకనాఁడు త్రోవలో నతని తలపై పడుగుపడి నిర్జీవుఁడాయెను. తరువాతి కార్యము జరుప నక్కడివారు ప్రయత్నింపఁగా తల్లికి స్వప్నమునందతఁడు కాన్పించి 'ఇఁక నేడునాళ్లు సహింపుఁడు. మరల నేను జీవింతును' అని చెప్పెనఁట. అట్లే యెనిమిదవదినమున సజీవుఁడై 'ఏమి పుల్లారెడ్డి! ఎట్లు ఏడు నాళ్ళు చచ్చి బ్రతికితివి?' అని యక్కడివా రడుగఁగా 'నా పేరు పుల్లారెడ్డి కాదురా, వేమన!' యని చెప్పెనఁట. అది మొదలు మహాత్ముఁడై శిష్యపరివారముతోఁ దూర్పుదేశము తిరిగి యనేక మహత్త్వములను జూపెను. అప్పటి మద్రాసులోని యింగ్లీషుదొరలు ఇతని యద్భుతశక్తికి మెచ్చి చాల గౌరవించిరి. సంచారములో కడపజిల్లా రాజంపేట దగ్గర కోమార్తిలో నతని తల్లి అచ్చమ్మయు, కుచ్చెర్లపాడు గ్రామములో భార్య అంగలక్ష్మమ్మయు, మరణించిరి. ఇరువురికిని అతఁడు కట్టించిన సమాధులిప్పటికి అందుఁ గలవు. తరువాత కటార్లపల్లెకు మరలివచ్చి వేమన సమాధిలో సజీవుఁడుగా నుండి మూఁత వేయించుకొనెను. నల్లచెఱువులోని గుడి తరువాత నతనివంశీయులగు జ్ఞాతుల కలహముచే నేర్పడిన ప్రతిబింబము.

ఈకథ విన్నప్పుడే నా సందేహము బలమయ్యెను. పుల్లారెడ్డియని మొదట పేరుండి తరువాత 'వేమన్న'గా ఏల మార్చుకొనవలెను? తల్లి పుస్తకములలోని మల్లమ్మ గాక అచ్చమ్మ యయినది. ఇంక ప్రసిద్ధమైన భోగమువాండ్ర మాటయే లేదు!

ఈసందేహములతోనే కటార్లపల్లెకుఁబోయి విచారింపఁగా నక్కడి ధర్మకర్త యగు చెన్నరాయుఁడను నాయన 'ఆ వేమన్న యీ వేమన్న కాదండీ. వేఱు' అని చెప్పి నాయాశలు నిరాశ చేసెను! కారణమేమని యడిగితిని. తమవద్దనున్న తాటాకుల

గ్రంథములో నట్లున్నదని చెప్పెను. దానిని తెప్పించి చూడఁగా నది వంగూరు సుబ్బరావుగారికి ఆంధ్రసాహిత్య పరిషద్గ్రంథాలయమునఁ గానవచ్చిన ద్విపద వేమన చరిత్రముగా తేలినది. అందలి యీక్రింది వాక్యములను వెన్నరాయఁడెత్తి చూపెను. సనకసనందనాది మునులు,

"ఇతఁడు శ్రీహరిపుత్రుఁ డితఁడు పావనుఁడు,
మున్ను వేమన పరమ ముఖ్యుఁడై నాఁడు
అతఁడే యితఁడని పల్కి ఆశ్చర్యమంది
మా తాతతండ్రుల మహిమచేఁ ...
వేమవాక్యలమీఁద వెదఁ జల్లిరంత...'

ఈ గ్రంథము చాలవఱకుఁ దే చూచితిని. ఇది చరిత్రము గాదు. పురాణములలో పురాణము. గ్రంథము చేసినవాఁడు వ్రాసినవాఁడు కల్పించిన చిక్కులు లెక్కలేనన్ని. ఇంక నల్లచెఱువు చెన్నయ్య చెప్పిన యీలోకపు కథలేవియు లేవు. అక్కడివారి కది పరమపవిత్రగ్రంథము గావున దాని నెరవు తెచ్చుకొని నిదానముగాఁ జూడవీలు లేమిచేతను, ఆంధ్రసాహిత్య పరిషత్తులో నున్నది గావున తెప్పించుకొనవచ్చునను నమ్మికచేతను నందలి విషయములు కొన్నిమాత్రము గుర్తువేసికొంటిని.

శ్రీవైకుంఠములో చెన్నకేశవుఁడును ఆదిలక్ష్మియు వేమన్నను పిలిచి నీవు భూలోకమున నవతరింపుమని చెప్పఁగా అట్లే యతఁడవతరించెను. ఇతని తండ్రి తుంగ వంశపు కేశవుఁడు. తల్లి లక్ష్మమ్మ (అచ్చమ్మ) కేశవనారాయణ మాలకూర్మి తమ్ములు. వీరు నారక్కపురము చెన్నకేశవస్వామిభక్తులు. తమ వాత కదిరిదగ్గఱ నుండు రేపల్లెకు వచ్చినట్లు తోఁచును. ఇదే యిప్పుడు ప్రాఁతరేపల్లె పట్టణమనియు, పాతర్లపల్లెపట్టణ మనియు వ్యవహరింపఁ బడుచున్నది. ఈ వేమన యిక్కడనే జన్మించెను. వేమన అందఱికి తత్త్వబోధ చేసి కటార్లపల్లెలో నుండెను.

ఇంతకన్న నెక్కువవిషయములు గ్రహింపవీలు లేదయ్యెను. గ్రంథము గ్రచ్చ పొదవంటిదని మొదలే చెప్పితిని. శ్రీ॥ క్రొత్తపల్లె సూర్యారావుగారు నాప్రార్థన ప్రకారము ఆంధ్రసాహిత్య పరిషత్తులోని ప్రతిని నాకొఱకై దయయుంచి వ్రాయించి పంపిరిగాని, మూలప్రతి చాలశిథిలమైయుండుటచే వారికి వృథా ప్రయాసమునిచ్చినది తప్ప నాకేమియు ఫలము లేదయ్యెను. అది యట్లుండె.

నల్లచెఱువు చెన్నయ్య చెప్పిన కథయంతయు నొక్కటి తప్ప సత్యమని యిక్కడి వారందఱు నంగీకరించిరి; అదేమనఁగా కొండవీటి సంబంధము. 'నెల్లూరు మొదలగు ప్రాంతములందు ఆ వేమన్నభక్తులనేకులున్నారు. గావున వారు వేమన్న

పేరనిచ్చు వర్షాశనాదులను సంపాదించుటకును, మర్యాద లనుభవించుటకును, ఈ వేమన్న వంశీయులమగు మేము, ఇరువురు నొక ఓటియని యుల్లు కొండవీటిముడి వేసి కొన్నామే కాని మేము కాద'ని కటార్లపల్లె వేమన్న వంశీయుఁడగు. చెన్నరాయఁడు సంకోచించినను స్పష్టముగాఁ జెప్పెను. ఈసత్యప్రీతి కతనిని మన మభినందింపవలసి యున్నది. మన వేమన్నకు కటార్లపల్లె సంబంధమున్నను లేకున్నను కొండవీటి సంబంధము మాత్రము గలదని యిక్కడివారును నమ్మి యున్నారనుట యొకముఖ్య విషయము.

ఈవేమన ఆవేమన కాఁడనుటకు వేఱొక ప్రబలాధార మున్నది. ఆదే తాటాకుల పుస్తకమున అతని ననుసరించి యితఁడు వ్రాసిన ఆటవెలది పద్యములు నూటికి పైఁబడి కలవు. వానిమకుటము 'బాలచక్రవేమ భవ్యనామ' యని. అర్థమడుగకుఁడు. అది నాకుఁ దెలియని యనేక రహస్యములలో నొక్కటి. 'పరవరామ' యనియు 'బౌద్ధరామ' యనియు పాఠాంతరములు గలవు. పైపద్యములలోఁ గొన్ని 'విశ్వదాభిరామ' మకుటముతో ఆవేమన్న పద్యాలతో సంగమించినవి. లేక ఆవేమన్న పద్యములకే మకుటముమార్చి యిందులోఁ జేర్చినారేమో! ఒకటి రెండుదాహరింతును.

"ఆ. అది త్రిమూర్తులు ఆత్మలోనున్నారు
బంధించి తెలిసితే బైటఁబడును
హృదయమందు గురుని వుండ జూడగ లేరు, బాల..."

"ఆ. యాత్రబోయినవాఁడు యెన్నాళ్ళుతిరిగినా
పారమైన ముక్తిపదవిలేదు.
మనసు నిల్పినవాఁడు మహనీయ మూర్తిరా, బాల..." *

ఈ రెండవ పద్యము మకుటభేదముతో వేమన సూక్తిరత్నాకర మందున్నది. (౩-౨౮౫)

ఈ తుంగ వేమన్న జన్మకాలమును దెలుపు పద్యమొకటి యాపుస్తకమందొకచో వ్రాయబఁడి యున్నది.

"సీ. వలనొప్ప తుంగాన్వవాయ పావన మూర్తి కేశవనామ కుశేశయాక్షు?
రమణిపోలిక శ్రీలరంగ లక్ష్మాంబకును అగ్రతనయుఁడై కొమరుమిగిలి
ఘనతర రాజయోగ స్ఫూర్తి శార్వరి సంవత్సర చైత్రశుక్లపక్ష నవమి
శాలివాహన శకాబ్దములు వేయునాన్నూటొకనూరు వెసను రెండు

* ఈతని పద్యము సుమారు ముప్పదివఱకు మచ్చుకు శ్రీ॥కదిరి వసంతాచార్యులు గారు నాకు వ్రాయించి పంపి నాకృతజ్ఞతకు పాత్రులైరి.

పరగ మిగిలినదినము శ్రీబాల చక్ర, వేమనార్యుండునను భవ్యనామమమర
ఆదిశ్రీలక్ష్మినారాయణావతార మైన శ్రీచెన్నరాయఁడై యవని వెలసె"

ఇందుచే-నితఁడు శా. శ. ౧౬౦౩ వ శార్వరి సంవత్సరమున (క్రీ. శ. ౧౬౮౧) చైత్రశుక్ల నవమినాఁడు జనించెను. ఇతని తల్లి లక్ష్మమ్మ సిద్ధార్థి సంవత్సర పుష్య బహుళ చతుర్దశి నాఁడు—అనఁగా ఇతని ఇరువదవయేఁటను, భార్య అక్కలమ్మ (ఆదిలక్ష్మమ్మ) నలసంవత్సర పుష్యశుద్ధ షష్ఠి నాఁడు, ఇతని ౩౬ వ యేఁటను, ఇతఁడు విభవ సంవత్సర పుష్యశుక్లాష్టమి—అనఁగా తన ౮౯ వ యేఁటను, ఇహలోక యాత్ర ముగించినట్లు ధర్మకర్తల యింట వ్రాఁతలు గలవు. అనగా ఇతఁడు క్రీ-శ- ౧౭౬౯ వ సంవత్సరము వఱకును జీవించి యుండెనని చెప్పవలయును. కాని యీ తేదీలు సరియైనవి కావేమో! ఎందుకనఁగా; ముగ్గురి మృతియు పుష్యమాస మందే జరుగుట యొక వింత. మఱియు నేఁటికి ౫౦ సంవత్సరముల క్రింద చనిపోయిన వానిని చూచిన వారా యూరిలోఁగాని చుట్టుపక్కలఁగాని యొక్కరైన నుండవలదా? అక్కడ డెబ్బది యేండ్లు దాఁటిన ముసలివారనేకులున్నారు' వేమన్న కూఁతురగు అచ్చమ్మను తన చిన్నవయస్సున చూచితిననియు అప్పుడామెకు సుమారు డెబ్బది యేండ్లుండవచ్చుననియు 'షేక్ ఆలం' అను నొకానొక ముసలిసాహేబు చెప్పెను. అతని కిప్పుడు సుమారు ఎనుబదియేండ్లు. మఱియు నీ వేమన్న ౧౭౬౯ లోనే సిద్ధుఁడగుట నిజమేని, ౧౭౯౯లో—అనఁగా ముప్పది యేండ్లైనను గాక, మును పే-యీతని విషయమై విచారణచేసి వ్రాసిన కాంబెల దొర, ఇతఁడు సుమారిన్నూట యేఁబదియేండ్ల క్రిందటి వాఁడని వ్రాయుట చిత్రముగదా.* కాని దొరగారు కటార్లపల్లెను చూచినారు గాని యక్కడివారి నెవరిని ఎక్కువ విచారించినట్లు తోఁపదు. బ్రౌనుదొరకితఁడు సమకాలము వాఁడే కావునఁ గాఁబోలు అతనికీతని సమాచారమే తెలియదు. అది యట్లుండె. తల్లిభార్యల మృతికాలమును, ఈ వేమన్న సమాధి కాలమును సందేహించినను ఆతని జన్మకాలమును సందేహించుటకు కారణము లేదు.

ఇట్లు కొండవీటి వేమన్నయు మూఁగవేమన్నయు వేఱువ్యక్తులైననుఁ అతని మరణ కాలమును ఇతని జనన కాలమును శార్వరి చైత్రశుక్ల నవమి గానే యుండుట వింతలో వింతగదా! ఇది యిరువురు నేకవ్యక్తియను భ్రాంతిచేఁ గలిగిన దనుకొందమన్న ఈ భ్రాంతికిఁదోడు పుట్టినపండుగ తద్దినము నొకటిగాఁజేయు నింతభ్రాంతిని గూడఁగట్టుకోవలసివచ్చును! అట్లైన నీయిరువురిలో నెవరో యొకరు పుట్టినదో

* See Mad. Christ. Coll. Mag. March, 1898: P. 524

గిట్టినదో శార్వరి సంవత్సర చైత్ర శుక్లనవమి కావలయును. కొండవీటి వేమన్న పై తేదీలో సిద్ధిపొంది నాఁడని వ్రాసినవారందఱును నిన్నమొన్న యతని పద్యముల నచ్చువేసి పీఠికలు వ్రాసినవారే కావున, వారికన్న ప్రాచీనమైన తుంగవేమన్న వంశమువారి వ్రాఁతయే మనకెక్కువ ప్రమాణము గావలసియున్నది. మఱియు వారిప్పటికి చైత్రశుక్లనవమి యాతని తిరునాళ్ళ నడుపుచున్నారు. కావున పై తేదీ తుంగ వేమన్నదే యనుకొని యాతంటా నింతటితో వదలించుకొందము! ఇట్లు కట్టకడపట మన వేమన ఆద్యంతశూన్యుఁడైన సిద్ధమూర్తి యయినాఁడు.

ఐన మన వేమన్నకు కటార్లపల్లెతో సంబంధమే లేదా? ఉన్నదని సందేహింప వలసియున్నది. కారణ మేమనఁగా; ఈప్రదేశమందతఁడు సంచరించి కొన్నాళ్ళు నిలిచి తనమహాత్త్వమును ప్రకటింపక యుండెనేని, తుంగ పుల్లారెడ్డి తాను వేమన్న యని మాఱుపేరు పెట్టుకొని, యతనివలెనే పద్యములు వ్రాసి, యతనియోగసిద్ధాంతములనే యవలంబించుట, ప్రజలతని నతని యవతారమే యని నమ్మి పూజించుట, సంభవింపదనుకొనుచున్నాను. ఆంధ్రదేశమంతయు వేమన్న సంచరించినవాఁడైనను తక్కిన స్థలములకంటె నిక్కడ కొన్నాళ్ళెక్కువగ నిలిచి యుండఁడేని, అతని పద్యములను వినుట మాత్రమే కాక యతని యోగసిద్ధులు రసవాదము మొదలగు మహాత్త్వములు అందఱు నెఱిఁగియుండరేని, తుంగపుల్లారెడ్డి 'నాపేరు పుల్లారెడ్డి కాదురా, వేమన' యని చెప్పినవెంటనే నమ్ముట యట్లుండఁగా 'వీనికేమి వచ్చెరా నడివయసులో నామకరణము!' అని పరిహసించి యుందురు. ఇదిగాక వేఱొక సాధనము గలదు. వేమనసూక్తిరత్నాకరములో నీక్రింది పద్యముగలదు :—

"ఆ. కదళి తూర్పునందు ఘనత శోభిల్లఁగా
బరగు వర కటార్లపల్లె వెలసి
యచలనిష్ఠఁగూడ నమరి యుండెదరయా విశ్వ...(౨౨౩)

ఈపద్యము వేమన్నది కాకపోవచ్చును. తుంగవేమన్న శతకమునందును గానరాలేదు. నేను చూచిన తక్కిన వ్రాఁతప్రతులలోను లేదు. కాని యచ్చువేసినవారు కృత్రిమముగా తయారుచేసినది మాత్రము గాదు. వారికి 'కదిరి తూర్పునందు' అను పాఠముండవలయునని తెలియదు. 'కదళి' యనియే పాఠమున్నఁ దప్పేమియుందురా, తూర్పునందు కటార్లపల్లెయనఁగా నేయూరికి తూర్పున? ఆంధ్రదేశమునకు కటార్లపల్లె సుమారు దక్షిణమగును. అక్కడివారు తెనుఁగుదేశమును తూర్పుదేశమందురు. కదిరికి కటార్లపల్లె తూర్పుననున్నది. కావున 'కదిరి' గ్రామజ్ఞానములేని వ్రాఁతకాఁడెవఁడో దిద్ది వ్రాసుకొన్న పాఠమిది. లేక కదిరిపద మర్మముగాక సంపాదకులే దిద్దియుందురు. చెప్పవచ్చిన దేమనఁగా, పైపద్యము బందరువారి యచ్చుప్రతికంటె ప్రాఁతది,

అందులో వేమన కటార్లపల్లెలో వెలసియున్నట్లు స్పష్టమగుచున్నది. కావున పూర్వ కాలమందును దీని నమ్మినవారు కొందఱుండిరనవచ్చును కాని యతఁ డిక్కడనే సమాధియైనాఁడని చెప్పుట కేసాధనమును ఇదివఱకులేదు. వాఁడుకడయైనను గానరాదు. మీఁదుమిక్కిలి, కడపజిల్లా పామూరు గ్రామమువద్ద కొండగుహలో వేమన కట్ట కడపట ప్రవేశించినాఁడని యక్కడి వేమనమతానుయాయులగు యోగులు కొందఱు చెప్పుకొనుచున్నారని శ్రీ॥ వేటూరి ప్రభాకర శాస్త్రిలవారు నాతోఁ జెప్పిరి. ఇది పురాణముల కథ.

ఇఁక వేమన చరిత్రమును చాల పరిశోధించి వ్రాసిన వారిలో ముఖ్యులగు కీర్తిశేషులైన వంగూరు సుబ్బరావుగారు వేమనవంశమును గూర్చి సందేహముగా వ్రాసిరి. దేశమునుగూర్చి యంతకన్న నెక్కువ నిశ్చయముఁ జేసికొని, మొదలు కొండవీడు, దత్తమండలములు, గోదావరిదేశము — ఈ మూఁడిటియందును వేమన సంచరించి యుండవచ్చుననుకొన్నను, తరువాత, వారికి దక్కిన యన్నిసాక్ష్యముల కంటె 'నక్కతోఁకఁబట్టి గోదావరీదునా' యను నొక వాక్యమే ప్రబల ప్రమాణముగాఁ గానవచ్చి 'గోదావరి మండలమున వీధులలోఁ బాఱవైచిన పుల్లాకులలోని యాహారమును మృగపక్షులతోఁ గలిసి భుజించువాఁడు' అని నిర్ణయించుకొనిరి! * కాలమునుగూర్చి యింకను ఎక్కువ నిశ్చయముగా నూహచేసిరి. పదునాఱవ శతాబ్దాదియందు కృష్ణదేవరాయల సమకాలికుఁడగు ఎడపాటి ఎఱ్ఱాప్రెగ్గడ తన 'కల్యాణ చరిత్రము' నందును, ఆశతాబ్దాంతమందలి తురగా రామకవి తన 'నాగరఖండ' మందును, పదునేడవ శతాబ్దమందలి పింగళి యెల్లనార్యుఁడు తన 'తోభ్యచరిత్రము' నందును వేమనను జేర్కొని యుండుటచేత నతఁడు ౧౫-వ శతకమందున్నవాఁడని వారి యూహ. కావుననే,

"ఆ. పరఁగరాయని కులబాచని ధనమెల్ల
భటులపాలు కవుల పాలు తలప,
ఒసర హీనజనుని ధనము దాయాదుల
పాలు జార కాంతపాలు వేమ" (౨౪-౨౨) †

అను పద్యమును వేమన ౧౪-వ శతాబ్దము తుదలోనున్న రాయని భాస్కరుని గూర్చియే వ్రాసెనని తలఁచిరి. మఱియు,

---

* చూ. వం. సు. వేమన. పు. ౧౭౦.

† ఈప్రతిలో 'రాజకులులు పాతినధనము' అని పాఠముగలదు. కాని బ్రౌంటి. వ్రాఁతప్రతులలోను ప్రాఁతప్రతులలోను 'బాచని ధనము' 'బాచన్నధనము' అనియే కలదు. 'బాచన్న' యను పాఠమును గలదు. అదియు పొరఁబాటే. ముందు చూడుము.

"శ్లో॥ నిర్మాయ నూతన ముదాహరణానురూపం
కావ్యం మయాత్ర నిహితం న పరస్య కించిత్*
కిం సేవ్యతే సుమనసాం మనసాఽపి గన్ధః
కస్తూరికా జననశక్తిమతా మృగేణ'
(రసగంగాధరము)

యని స్వాభిమానపూర్ణుఁడై చెప్పిన పండితరాయఁడు,

"ఆ. ప్రస్తుతంబు వేళ పద్యంబు చదివిన
తప్పు లెన్నియున్న నొప్పియుండు...—" (౨౬-౩౮)

అను వేమన్న పద్యమునే,

"అవసరపఠితా వాణీ గుణగణరహితాపి వహతి పరమానమ్' అన్నట్లు సంస్కృతమున భాషాంతరీకరించుకొని యుండెనని చెప్పిరి! † ఇంతేకాక,

"క. భవదూరుఁడు శరభాంకుఁడు
శివశీలుఁడు వేయుఁగోటి సద్దేశ్వరుఁడున్
శివభృత్యుఁడు వటమూలుఁడు
శివమయ చిన్మయుఁడు సోమశేఖరగురుఁడున్' (ఓ.లై.౧౨-౧-౩౫.)

అను వేమన పద్యములలోని యొకానొక పద్యమున వేమన్నకు గురువుగా జెప్పఁబడిన సోమశేఖరుఁడును, వీరభద్రవిజయమున బమ్మెరపోతన్న తన గురువుగాఁ జెప్పుకొన్న 'ఇవటూరి సోమవిభుఁడును' ఒకరేయని తలఁచి పోతన్న వేమన్న లిరువురును సహాధ్యాయులై యుండవచ్చునని యూహను సాఁగఁదీసిరి!

కాని వీరి యీ కాలనిర్ణయము నెవ్వరును అంగీకరింపలేదు. శ్రీ బండారు తమ్మయ్యగారును శ్రీ ప్రభాకర శాస్త్రులుగారును దీనిని సయుక్తికముగా ఖండించిరి. § పై రాయని భాస్కరుని పద్యమునకు తరువాతనే పెక్కు వ్రాఁతప్రతులలోను అచ్చు ప్రతులలోను ఈ క్రింది పద్యము గలదు.

"ఆ. ప్రాకటముగ నిట్టిలోకములో గంటి
పల్లెముత్తఁడొవ్వఁ బరమ గురుఁడు,
అన్నదానమునను హరు పూజ చేతను
హరునిలోన ఐక్యమాయె వేమ" (ఓ-లై-౧౩-౩-౩౯)

---

* "ఉదాహరింపఁదగిన వాని నెల్ల నేనిందు క్రొత్తగా రచించితిని గాని యితరుల పద్యము లిందేవియుఁ జేర్పలేదు. కస్తూరిని బుట్టింపఁగల మృగము పువులవాసన మనసునకైనఁ దలఁచునా?" అని తా

† వం-సు-వేమన. పు. ౧౨౮.

§ చూ-ఇంథ)పత్రిక, రక్తాక్షి, క్రోధన, అక్షయ సంవత్సరముల సంచికలు.

సుప్రసిద్ధదాతయైన యీ గుంటుపలి ముత్తమంత్రి,

"క. పాండుగ శరజల నిధిహరి
చందనతరు చంద్రసంఖ్య శక వర్షంబుల్
దుందుభినాషాఢంబున
నందముగా వీరముత్తఁ డరిగెన్ దివికిన్ "

అను చాటుపద్యము ప్రకారము క్రీ-శ-౧౬-౨౩ లో మరణించెను. కావున నీపద్యము వ్రాసిన వేమన ౧౮ శతాబ్దిమధ్యమందలివాఁడగును. అంతకు పూర్వుఁడు కాఁజాలఁడు. పైగుంటుపల్లి ముత్తమంత్రి పద్యము బందరు ప్రతిలో 'లోకమందును గంటిఁ బల్లిముత్తఁడు' అని ప్రకటింపఁబడి యుంట పొరబాటే. నేనును మొదలు గంటిపల్లె ముత్తఁడనియే తలఁచితిని. కాని, ప్రాచ్యలిఖితపుస్తకశాలలోని రెండు వ్రాఁతప్రతులలో,

"కీర్తైన నందవరీకులలో చాల
గుంటుపల్లి ముత్తన్న గుణగరిష్ఠుఁడు" (ఓ. లై. ౧౩-౯-౨౨, ౧౧-౬-౨౫)

అను పాఠముతో పైపద్యముగలదు. * యతిస్థానమందుండుటచే పద్యము రుయోగ్యత చెుట్టిదైనను, పేరు నిస్సందేహముగదా. కాని వంగూరు సుబ్బరావుగారు వేమన కాలము నిదివఱకె నిర్ణయించుకొన్నారు గావున దానిని మార్చుకొననిచ్ఛలేక, ఈ పద్యము ఏభట్రాజులో వేమన మకుటమున కతికించిన ప్రక్షిప్తమనుకొని తృప్తిపడిరి! † ప్రక్షిప్తముగాకున్న పదునారవ శతకమందే వేమనను ఇతరులు పొగడుట యెట్లు సంభవించునని వారి ప్రశ్న. కాని ప్రత్యుత్తరము లేకపోలేదు. పైయెడపాటి యెఱ్ఱాప్రెగడ మొదలగువారు, పాల్కురికి సోముఁడు, భవమూరుఁడు మొదలగు శైవాగ్రేసరులగు కవులనడుమ వేమనయును పేరుఁ జేర్చియున్నారు. § మన వేమన శైవప్రపంచములో పుట్టి పెరిగిన వాఁడే కాని కడకు త్రిమూర్తులను తోసిరాజని శుద్ధాద్వైతిగా మాఱినవాఁడు. 'హరిహరాదులందు నాసవిడిచి' (౩౮-౨) న వాఁడు మాత్రమే కాక,

---

(*) పైప్రతులలో నీపద్యమునకు మొదలీక్రింది పద్యములు గలవు.

" సర్వజ్ఞ సింగన్న సంతరించిన ధనము పరగ భూమి పాలు పరుల పాలు
పరగ పెదవేమన్న సంతరించిన ధనము సురభూసురుల పాలు చూడువేమ "

" పరగ రాయనిమంత్రిబాచన్న ధనమెల్ల భటకవియాచక పరుల పాలు
పరగ శ్రీనాథుఁడు సంతరించిన ధనము వారజారస్త్రీల పాలు వేమ "

† చూ-శతక కవుల చరిత్రము. పు. ౮౯

§ చూ-వం-సు-వేమన-పు. ౩౯ నుండి ౪౧ వరకు.

"ఆ. బ్రహ్మవ్రాఁత కెదురు పల్కెడు వాఁడును
ఆది విష్ణు మూర్తి మడఁచు వాఁడు,
మూఁడు కనులవాని మొనసినిల్చినవాఁడు,
కానఁబడరు నీవు కాని వేమ" (ఓ-లై-౧౨-౧-౩౦)

అని చెప్పుకొన్న వాఁడు. మఱియు ఎఱ్ఱాప్రెగడ వంటి విద్వత్కవులు వేమన్నను కవియని పొగడి రనుకొనుట సాహసము. ఇతని కవిత్వమునందు చదువుకొన్న వారికిని గౌరవము నేఁడు కలుగుచున్నది గాని పూర్వకాలపు పండితులకుఁ గలదని నేను నమ్మఁజాలను. వారికి, ముఖ్యముగా ౧౫, ౧౬ వ శతకములందు, కావలసినవి, శ్లేషయమకముల చిత్తులు, కల్పనాకవిత్వపు గత్తులు. అట్టివారికి యతిప్రాసభంగములు గలవి, [illegible] దారితప్పినవియగు 'ఉప్పుకప్పురంబు' వంటి చప్పిడి పద్యములు తలకెక్కునా! కావున మన వేమన వారిదృష్టిలో శైవుఁడును గాఁడు; కవియును గాఁడు: వారితనిని పొగడను లేదు. ఇఁక ఆ వేముఁడెవ్వఁడంటిరేని, పండితారాధ్య చరిత్రమున వర్ణింపఁబడిన చేటలవేమయ్యగాని జెలిదేవర వేమనారాధ్యుఁడుగాని కావచ్చుననియు, ఈ రెండవవాఁడు శివానుగ్రహసమర్థుఁడగు కవియైయుండెననియు * శ్రీ॥ బండారు తమ్మయ్యగారు వ్రాసిరి. వంగూరు సుబ్బరావుగారును ఈ వేమన్నల నెఱుఁగుదురు.† కాని వేమన్న కాలమును గూర్చి తమ వ్రాఁత నిర్ణయము మార్చుకొనఁ దలఁపలేదు!

ఇదిగాక, మన వేమన మహమ్మదీయుల రాజ్యకాలమున హిందువు లనుభవించిన కష్టములు బాగుగా నెఱిఁగినవాఁడు.

"క. పసరపు మాంసముఁ బెట్టియు
మసకల సులతాను ముసలిమానులఁ జేసెన్" (ఓ. లై. ౧౧-౬-౧౫)

"ఆ. రాళ్ళు నమ్మియున్న రాజాధిరాజులు
కూటి కెడలి భువిని గూలిచనిరి;
రాళ్ళు పగులఁ గొట్టి రాక్షస పుత్రులు
మాళ్ళు మూళ్ళు గలిగి మనిరి వేమ" (ఓ. లై. ౨౧-౧-౩౦)

"ఆ. లింగమతములోన దొంగలు గాఁబుట్టి
యొకరినొకరు నిందనొనరఁజేసి
తురకజాతిచేత ధూళియైపోదురు, విశ్వ (ఓ. లై. ౧౩-౩-౩౯)

---

* చూ—ఆంధ్ర పత్రిక, రక్తాక్షి సంచిక.

† మా—వం—సు—వేమన పే. ౨౦౧.

వేమన ముఖ్యముగా సంచరించిన పశ్చిమాంధ్రదేశములో మహమ్మదీయుల యాస్వాతంత్ర్యము విజయనగర వినాశానంతరమే సంభవించెను. మహమ్మదీయులు ప్రభువులుగా కడపసీమయందున్న కాలమున, అనఁగా ౧౭ వ శతాబ్దముయొక్క కడపటిభాగమం దితఁడుండినవాఁడని బ్రౌనుదొర గూడ తెలిపెను. (చూ. ఓ. లై. ౧-౨-౧-౫౮ వ్రాఁతప్రతి పీఠిక) మఱియు నితని కాలమందు మహమ్మదీయుల యుచ్ఛ్రాయస్థితి చాలవఱకు తగ్గియుండెననియు నీక్రింది పద్యముచే నూహింపవచ్చును.

"ఆ. షేకు సైదు మొగలు చెలఁగు పఠాణులు
తురకల దొరతనము తొలఁగఁజేసి
రాఁగ రాఁగ విడిచి రైతులై కొలిచిరి. విశ్వ...(౩౭౬౫)

కావుననే,

"ఆ. ఒక్కఁడె జగ నేల మగుడఁ గారాదేల
ఏకమైన చిత్త మందుఁ గలదు,
అన్నిటఁ బరిపూర్ణ మల్లా మహమ్మదు, విశ్వ...* (౨౭౭౯)

అని ధైర్యముగా మహమ్మదీయులకును మతబోధచేయ సాహసించినవాఁడనియుఁ జెప్పవచ్చును.

మఱియు వేమన వైష్ణవఖండన చాలతీవ్రముగాఁ జేసినవాఁడు. ఆంధ్రదేశమున వైష్ణవమతము కృష్ణదేవరాయల తరువాతనే కొంత వేళ్ళూనినది. ప్రాచీనమైన శైవమతమును రాజాశ్రయబలముచే నెదుర్కొని జనసామాన్యమును వైష్ణవులనుగాఁ జేయఁ బ్రయత్నించినవారు తాతాచార్యుల వంశమువారు. వీరి కాలముననే మాలలు మొదలు చాలవఱకు నీదేశమున నించుమించుగా సామాన్యజనులు ముక్కాలుమువ్వీసము వైష్ణవులయిరి. తాతాచార్యుల వీఁపుముద్రలమాట మనవారింకను మఱువలేదు. వెంకటపతి రాయల కాలమున వీరేర్పఱచిన నామధారణమతము స్థిరమైనది. దాసరులు సాతానిపురుషాకారులు బసివిరాండ్రును వీరివలన నిర్ణయింపఁబడిన మర్యాదల నిప్పటికిని అనుభవించుచున్నారు. వేమన్న కాలమున శ్రీవైష్ణవప్రాబల్యము పరమార్థదృష్టిలేక పరార్థస్పృష్టిగలిగి కేవలము వేషముక్రిందికి దిగినట్లున్నది. మతము పేర నెన్నియో యకార్యములు చేయుచుండిరి.

---

* ఈపాఠమే వ్రాఁతప్రతులం దెల్లఁ గలదు. మహమ్మదు అల్లా కాఁడని యెఱిఁగిన యాధునికులు 'అల్లా మహాత్మ్రుండు' అని దిద్దిరి. కాని సామాన్య మహమ్మదీయుల పాలికి మహమ్మదే అల్లా. వేమనకంతకన్న నెక్కువ 'ఇస్లాము' మతజ్ఞానము గలుగ నవకాశములేదు.

"ఆ. ఎంబెరు మతమందు నెసఁగ మాంసముదిని
మాఱుపేరుపెట్టి మనుపుద్రావి
వావి వరుసదప్పి వరికిపాలౌదురు, విశ్వ..."
(వేమన జ్ఞానమార్గపద్యములు. ద్వి. భా. ౧౪)

"ఆ. రంగధామమునకు హంగుగా తానేగి
కల్లుకంపుసొంపుఁ గల్గియుండు......" (ఓ. లై. ౧౩-౩-౩౯)

బ్రౌను దొరకాలముకంటెను ఈముకృత్యములు వైష్ణవులు చేసెదరను భావము అనువర్తించివచ్చినది. పై రెండవ పద్యమునకు టీకలో 'వైష్ణవులు పూజచేయునపుడు కల్లుత్రాగుదురు' అని యతఁడు గుర్తువ్రాసికొన్నాఁడు' దీని సత్యాసత్యనిర్ణయము ప్రకృతవిషయముగాదు. అన్నిమతములు మొదలు మహోదారాశయములతోనే బైలుదేఱినను, క్రమముగా దానివేఁడి యాఱిన వెంటనే సహజములైన యింద్రియచాపల్యములు ప్రబలించి, మనుష్యులు తమ తప్పులను సమర్థించుకొనుట కామతములనే యుపయోగించి పతితులగుట యన్నిదేశములందును అన్ని కాలములందును గలదు. అట్టి యవస్థకు కొంతకాలమైనను పట్టునుగాన, పదునాఱవశతాబ్దపు మొదట వ్యాప్తికి వచ్చిన వైష్ణవమతమునకు పైదురవస్థ పదునేడవశతాబ్దమందు కలిగియుండవచ్చునని యూహింపవచ్చును. ౧౬౩౩లో మరణించిన ముత్తమంత్రి నెఱిఁగినవాఁడు గావునను, వేమన్న యాశతకమధ్యభాగమునకన్న వెనుకనుండి యుండఁడు.

ఇఁక పదునేడవశతకపుటాదియందే, అనఁగా ముత్తమంత్రి మరణించిన కొన్నాళ్ళలోపుననే వేమన మరణించియుండునని శ్రీ॥ ప్రభాకరశాస్త్రులవారి తలఁపు.

"గజపతింట గ్రుడ్డిగవ్వలు చెల్లవా" (౯౧)
"గ్రద్దవంటివాఁడు గజపతిగాదొకో" (వే. జ్ఞా. పద్యములు. ౭౫౦)

అని వేమన దూషించిన గజపతుల ప్రాబల్యము ౧౭_వ శతకపు పూర్వభాగమందే కావునను, సుమారిన్నూటేఁబది వయసుగల వ్రాఁతప్రతులు తంజావూరి గ్రంథాలయములో నుండుటచేతను, వేమునను ౧౭–వ శతకపు తుదికీడ్చుట సాధ్యము గాదని వారి వాదము. * కాని బండారు తమ్మయ్యగారు వేమన ౧౭–వ శతి కాంతము వఱకును బ్రతికియుండెనని యూహించుచున్నారు. గుంటుపల్లి ముత్తమంత్రి గోలుకొండ నవాబగు మహమ్మదల్లీ పాదుషాయధికారము క్రింద కొండవీటిసీమకు అమీనాగా నియమింపఁబడినవాఁడు కావున, అతని కాలమునందు 'షేకుసైదు' అను పద్యము చెప్పనవకాశ ముఁడదనియు, ఈ పద్యమునాఁటికి తురకలవౌరతినము నశించిన

* (ఆంధ్ర. సం. సచిక. క్రోధన)

దనియు వారి వాదము. *బ్రౌనుదొర, వెనుకఁజెప్పి, ట్లు వ్రాఁతప్రతిలో ౧౬-వ శతకపు తుదలోను ౧౭-వ శతకపు టాదినుండుగు నున్నాఁడని వ్రాసికొన్నను అచ్చుప్రతి పీఠికలో 'పదునేడవ శతాబ్దపుటాదినుందు ఇతఁడున్నాఁడని నమ్మెదను' అని దిద్దుకొనెను. †

నాకుఁ జూడఁగా ౧౫-వ శతాబ్దియాదియందు వేమన్న యుండెనని యూహించుట యనుకూలముగాఁ దోఁచుచున్నది. తాటాకుల పుస్తకముల వయస్సు నిర్ణయించుట కష్టము; గజపతులకథ, ముత్తమంత్రి మరణము మొదలగునవి వినియైనను వ్రాయవచ్చును. కాని ౧౬౦౦ లో జనించిన కటార్లపల్లె పుల్లారెడ్డి తాను వేమన యపరావతారమని చెప్పుకొనుటకును, ప్రజలు, అందును వ్రాఁతచదువులు రానివారు, దానిని నమ్ముటకును, వేమన మఱుఁగు పడి చాల సంవత్సరములైయుండిన సాధ్యము గాదు. కావున ఆవేమన్న సమాధి కాలమును ఈవేమన్న జనన కాలమును ఎంత సమీపమందున్న నంతమేలు. కాని, వంగూరు సుబ్బారావుగారు వేమననెంత పైకీడ్చిరో నేనంత క్రిందికీడ్చుచున్నానేమో యను భయము నాకు లేక పోలేదు. ఐనను మనచరిత్రములెల్ల చాలవఱకు ఊహాప్రపంచమునకుఁ జేరినవే కాన, ఇన్ని యూహాజాలములో నాదియు నొక యూహయైయుండిన సంతోషము గలుగు గాఁ దలఁచుకొను చున్నాను. ఇంతకన్న దీనికెక్కువ సత్యత్వము నిచ్చుటకు నాకాధారము లేదు.

ఇట్లే వేమన యెక్కువగా వసించిన స్థలమునుగూర్చియుఁ గొంత యూహింపవచ్చును. వావిళ్ళవారి ముద్రణపు పీఠికలో ఇతఁడు దత్తమండలముల వాఁడనుట న్యాయ్యమని వ్రాసియుంటిని. దత్తమండలములనఁగా, కదిరి తాలూకా యిప్పుడనంతపురమునకుఁ జేరుటచేత ఈజిల్లాకును కొంత వేమన ప్రసాదము దొరకిన శాస్త్రీయమైనదే కాని, యంతకుముందు, అనంతపురము బళ్ళారిజిల్లాలకితని సంబంధము కానరాదు. కావున నితఁడు కడప కర్నూలు జిల్లాలవాఁడని బ్రౌను, కాంబెలు, మొదలగు వారివలె నేనును తలఁచితిని. దానికి నా స్వదేశాభిమానమే కారణమని శ్రీ॥ వం॥ సుబ్బారావు గారు తలఁచిరి. నా స్వదేశాభిమానము సత్యమునే మఱుఁగుపఱుచునంత దట్టముగ ముదిరి బలిసినదని నేనిఁకను అనుకొనలేదు. అపలీగా వంటి అవాంతర భాగములందభిమానము కృత్రిమమే కాని సహజము గాదని నామతము. అభిమానమను పేరుతో, పిల్లలకు దొరకిన పెసరయుండను పంచిపెట్ట వచ్చిన కోఁతివలె, పరిపూర్ణమైన వస్తువును ప్రక్కలు కొఱికి తినుట యిప్పటి నాగరకత దుష్ఫలములలో నొకటి. ఇట్లే చేయుచుండినచో పూర్తిగా అసలే నశించుటకు

* (ఆంధ్ర-అక్షయ, సంచిక.)

† (See Brown's Vemana, Preface. III.)

ముగింపుండదు. వేమనయాంధ్రుఁడని యెఱిఁగి తగిన మర్యాదను చూపఁగల్గితిమేని మన యభిమానమునకుఁ జాలును. అట్లుగాక మా దత్త మండలముల వాఁడని, మా యనంతపురము జిల్లావాఁడని, మా కల్యాణదుర్గము తాల్లూకా వాఁడని, మా రాళ్ళపల్లి వాఁడని, అందును మాయింటనే పుట్టిన వాఁడని, ఉల్లిగడ్డ పొరల నొలుచుచుఁ బోయిన, తుదకు నేనే వేమన్న యనుకొనవలసివచ్చి శూన్యము శేషించును! కావున వేమన దత్తమండలముల వాఁడని సామాన్యముగ నేనూహించుటకు అతఁడట్టివాఁడు గాఁ గానవచ్చుటయే తప్ప వేఱు కారణమేదియు లేదని విన్నవించుచున్నాను.

అట్లు కాన వచ్చుటకు కారణము లిదివఱకే కొన్ని సూచించితిని. ఇదిగాక : గండికోట నితఁడు పేర్కొన్నాఁడు, [౧-౨౪౮] నంది దుర్గమును జూచినాఁడు. [౩౯-౨] కడపజిల్లా జమ్ములమడుగు తాలూకా కాముడియను గ్రామములో వేమన శిష్యుల పీఠము గలదఁట. 'యోగాభ్యాసము వారివృత్తి; ఇట్టి వారీమండలమున నూఱు కుటుంబముల వఱకుఁ గలరు' అని శ్రీ కావ్యతీర్థ జనమంచి శేషాద్రిశర్మ గారు నాకు వ్రాసిరి. ఇట్టిమఠము గండికోటలో నొకటి కలదఁట ; పామూరను గ్రామము వద్ద కొండగుహలో వేమన కడసారి ప్రవేశించినట్లు కలవాడుకను మొదటే తెల్పితిని గదా. వేమన దక్షిణదేశమంతయు ఇంచుమించుగా సంచరించినాఁడని తలఁపవలసి యున్నది నిజమే ; అఱవదేశమునఁ గూడ నితఁడు మఠములు స్థాపించినాఁడని వదంతి. ఎంతవఱకు నిజమో చెప్పలేను. తంజావూరి రాచనగరులో వేమన్న చిత్రపటమున్నదఁట కాని దత్తమండలములలో వేమన కున్నంత ప్రచారము తక్కినచోట్లనున్నట్లు కాన రాదు. ఇప్పటికిని 'వేమన్న' యను పేరు గలవారీ దేశమందెందఱో కలరు.

మఱియు వేమన వాడిన ఈక్రింది పదములు చూడుఁడు. మంకు [౩౬-౪] తారాడు [౨౯౦] సంబళము [౧౩౯] సొడ్డు [౪౬౭] కళవళము [౯౩౯] కూరయు [౧౧౧౬] చాడి [౧౫౦౪] దుడ్డు [వే-జ్ఞా-౧౧౪౩] తాళిక [౨౧౧౪] బిత్తరి [౨౫౫-౨] ఇత్యాదులుకన్నడ సీమకు సమీపమగు తెలుఁగు దేశమందే వాడుకలోఁ గలవు. మఱియు అకుటక్క [౨-౨౦] బైసి [౩౯౬] వలికి [౬౮౩] బిక్కపొద్దు [౮౯-౨] రుద్దు [౧౧౧౬] పిసు [౧౧-౨౫] కుళ్ళుపోతు [౧౧౪౮] మొదలగు శబ్దములు వల్లమలకీవలి వారికి తప్ప అవల వారి కర్థమగు నాయనియే నా సందేహము. వీనికితోడు కుంక (౧౦౩౩) చెంబడి (౭౭౦) ఊరఁక [౫౪౯] వంటివి. ఈ దేశమున వాడుకలేని పదములు అపురూపముగాఁ గలవు కాని, యివి వేమనవంటి దేశద్రిమ్మరికి వచ్చుట వింతగాదు.

ఇదిగాక వేమన బసివిరాండ్రను పలుమాఱు పేర్కొని యున్నాఁడు. బసవ శబ్దము వృషభశబ్దపు కన్నడమూ. శివదేవాలయములకు కుఱ్ఱదూడను వదలిపెట్టుట, అద్ది

స్వేచ్ఛగా నెవరితోఁటలలో మేసినను సహించి యూరకుండుట. దానిని పూజించుట. కన్నడశైవుల సంప్రదాయము. దానిని వారు బసవుఁడందురు. అట్లే యింటిలో నొక యాఁడుబిడ్డను వివాహము చేయక వదలుట కొందఱు వీరశైవులలో నిప్పటికిని గలదు. వారు వ్యభిచారవృత్తిచే జీవింతురు. వారికిని 'బసివి' యను పేరు సమాన ధర్మముచే వచ్చినది. తాతాచార్యులవారి వైష్ణవము రాకమునుపు ఈ దేశమందును ఆ పద్ధతి యుండి యుండును. దానిని పూర్తిగాఁ ద్రోసివేయలేక కాఁబోలు, వైష్ణవ గురువులు, శిష్యులలో బసివిరాండ్రకు భస్మరుద్రాక్షలకు బదులుగా తిరుమణి తులసి పూసలనిచ్చి, దాసగుంపులో వారిని జేర్చినారు. క్రమముగా బసివిరాండ్రను తయారు చేయుటకుఁ గూడ గురువులవారి యాజ్ఞ కావలసివచ్చినది. ఇట్లు గురువుగారి యనుమతిచే దాసీత్వమును వహించిన వైష్ణవ బసివిరాండ్రు ఈదేశపు 'నామధారుల' లో చెందఁజొకలరు. వీరొకవిధముగా పల్లెటూరి వేశ్యలు. ఇక్కడ తప్ప ఇతరాంధ్ర దేశములలో వీరిపేరు వినరాదు. కావున వేమన్న పేర్కొనిన బసివిరాండ్రు శైవులైనను వైష్ణవులైనను వారి పరిగణనమునకు నీ దేశమందే కలిగి యుండుననుకొనుచున్నాను.

ఇఁక నేయితరస్థలములందుఁగాని వేమన వసించినట్లు ఇంతకంటె ప్రబలములైన సాధనములుండెనేని, యవి నాకు తెలిసిన వెంటనే, అవశ్యముగా మీ యూరికి విచ్చేయుమని వేమన్నను పల్లకీలో మోసి యక్కడికి సాఁగనంపుటకు నేను మొదటి బోయీగా నిలుతును.

వెనుకనే చెప్పవలసిన వేఱొక్క విషయమును మఱచితిని. ఇప్పుడు విన్నవింతును. వేమన్న కాలజ్ఞానము వ్రాసెనఁట! కాలజ్ఞానమనఁగా భూతమును భవిష్యత్తుగాఁ జెప్పుట: జరిగినదానిని జరుగఁబోవునదిగా చెప్పి తన కాలమును తానే వెనుక కీడ్చుకొనుట! పురాణములలోని భవిష్యద్రాజ వర్ణనమిట్టిదే. వ్యాసుఁడే యీ పద్ధతికి ప్రథమాచార్యుఁడు గాఁబోలు. అతఁడు ఇతరపురాణములలో వ్రాసిన చిల్లర భవిష్యత్తుకు తృప్తిపడక భవిష్యత్పురాణమని దానికే వేఱుపురాణమును వ్రాసినాఁడు. అనఁగా వ్రాయుచున్నాఁడు! దానిలో సృష్టిమొదటినుండి మొన్న ఇంగ్లీషువారు రాజ్యమునకు వచ్చువఱకు భవిష్యత్తు చెప్పి, చిరంజీవిని గదా తక్కినది నిదానముగా వ్రాసికొందమని కాఁబోలు, ప్రకృతము విశ్రాంతి ననుభవించుచున్నాఁడు. కర్ణాటక శైవులలో నిట్టి కాలజ్ఞానములు వ్రాయుట యెక్కువ. బసవేశ్వరుఁడు మొదలగు వారెల్ల తలకొకటి వ్రాసినవారే. వేమనవంటివాఁడైన సర్వజ్ఞుని పేర నొకటి గలదు. తెనుఁగులో పోతలూరి వీరబ్రహ్మము మొదలగువారి పేర నిట్టివి గలవు. కావున ఆగుంపునకే చేరిన వేమన్నగూడ నొకటి వ్రాసియుండిన నుండును. వ్రాయకుండినను

శిష్యులలో నెవఁడో వ్యాసమహర్షి గురుసేవ చేయుటకై యతనిపేరు పెట్టి వ్రాసి యుండును. కాని యాగ్రంథము నేఁ జూడలేదు. అందులోనిదే కాఁబోలు నీపద్యము.

"క. నందనసంవత్సరమునఁ
బొందుగ కార్తికశుద్ధ పున్నమనాఁడీ,
వింధ్యాద్రిసేతుబంధన
సందున నొకవీరుఁ డేలు చాటరవేమా.'' (౨౧౫౧)

ఇది వేమన్న తన్నుఁగూర్చి చెప్పుకొని యుండుననియు, కావున అతఁడా తేదీలో పుట్టియుండవచ్చుననియు, 'ఏలు' ననఁగా మతప్రచారముచే నేలినవాఁడనియు, నొక యూహ. (వం. సు. వేమన. పు ౪౩) ఇట్టిదే మఱియొక పద్యమును గలదు.

"ఆ. ఒకటు రెంటమూఁట యోగీంద్రులను గూడి
ఉదయ పర్వతంబు మొదలు గిరుల
క్రమ మెఱింగి యల్ల ఘనపట్టణము లెల్ల
వీరుఁ డొక్కఁ డేలు వినర వేమ'' (౨౨౨)

తక్కిన పద్యమంతయు నర్థముచేసికొనఁ గలవారు, ఇక్కడఁ గూడ 'ఏలు' శబ్దమునకు పైయర్థమునే చెప్పి, యిదిగూడ వేమన్న తన్నుఁగూర్చియే చెప్పుకొన్నాఁ డనుకొనవచ్చును. ఇట్టి పద్యములు వేమన్న భవిష్యత్కాల జ్ఞానమునకుఁ గాని, వన భూతకాలజ్ఞానమునకు గాని, పనికిరావు గావున వీనినిగూర్చి చర్చించి ఫలము లేదు.

శ్రీః

## మూఁడవ యుపన్యాసము

# వేమన సంసార స్థితిగతులు

ఇదివఱకును వేమన వంశము, కాలము, దేశము—వీనినిగూర్చి కొంతవఱకును ఎక్కువ ఫలములేని చర్చ జరిగినది. ఇఁక నతని సంసార స్థితిగతులను గూర్చి యేమైన తెలియఁగలదేమో యని చూతము.

ఈవిషయమును గూర్చి చర్చింపఁ దలఁచిన వెంటనే వేమన యింకెవ్వో సన్నివేశమున చెప్పిన యీ క్రింది పద్యము జ్ఞప్తికి వచ్చుచున్నది.—

"ఆ. సతులు సుతులు మాయ, సంసారములు మాయ
ధనము ఘనము మాయ తలఁపు మాయ
తెలియనీదు మాయ దీనిల్లు పాడాయె—విశ్వ...(౩౫౩౪) *

మన పాలికిప్పుడు వేమన సతీసుతులు, సంసారము, సంపాదించిన ధనము, ఘనత, చదివిన చదువు—ఇవన్నియు నిర్ణయించు సాధనములు లేక 'మాయ' గానే కానవచ్చుచున్నవి. ఇట్టిచో లేనివి కల్పించుటకుఁగాని, లేవనుకొని యూరకుండుటకుఁ గాని యిష్టము లేనప్పుడు, ఉన్న యాధారములనుబట్టి యూహించుటయు కొంత తృప్తిని గలిగించును. ఆయాధారములు వేమన పేరిటి పద్యములలో నతనివే యని నమ్ముటకనుకూలమైనవి. వానిలో అకస్మికముగా చేరిన కొన్ని యంశములను బట్టి పైవిషయములను మనము కొంత నిర్ణయింపవచ్చును.

కాని, కవుల గ్రంథములందలి వ్రాఁతలనుబట్టి వారి చరిత్రమును నిర్ణయింప శక్యమా? అట్లైనచో ఆంధ్రవాఙ్మయమందలి కవులెందరికో ఇష్టదేవత స్వప్నమున వచ్చి గ్రంథకరణమును యాచించె ననవలసి యుండును; ఎందఱికో, రేయిము

* పైపద్యపు మూఁడవపాదము (౩౧౪) పద్యముది. వేమన పద్యములలో పెక్కింటికి దేనిపాదము దేనికతికించినను అచ్చుగాని యందముగాని చెడదు గావున నట్లు ఆనుకూల్యముకొఱకు మార్పఁబడినది.

వ్రాయకమునుపే, గ్రంథభర్తలు జాంబూనద డాంబరాగ్రహారాదులు సంచకారమిచ్చి నా రచనలని యుండును; ప్రతి ప్రబంధ కవియును మాతులుంగలుంగలవంగములు మొదలగు తల తోఁకలేని మహీరుహమాలికలతో తిద్ది తీర్చిన యారామమందు, మల్లెమొల్ల జాజి సంపెఁగల పొదల నడుమ, గొజ్జఁగి నీటి కాలువలు పూఁదేనియ సోనలు నావరించియున్న చంద్రకాంతశిలావేదికలపై, పుష్పాదుల మెత్తలపైఁ బనుండియే కవితా కాలక్షేపమును జేయుచునో, లేక మధ్యాహ్నపు వంటకు మార్గము నెఱుఁగని యిల్లాలితో కలహించుటచే విరహమున కోర్వఁజాలక చంద్ర మలయమారుతాదులను దూషించుచునో, ప్రొద్దుగడపుచుండెననవలసి యుండును! (ఇట్లు 'శాలీముక్కాదికోకమ్మన్యులు' గాలేకున్నను ఇంటి ముంగిలి వీధులకల్ల ముత్యాల ముగ్గులు పెట్టువారు మనకవులు.) వారి వ్రాఁతలనుబట్టి వారి సంసారస్థితిగతులను నిర్ణయించుట ప్రమాదము గదా! యని యాక్షేపింపవచ్చును.

(నిజమే, కాని వేమన యట్టి కవిగాఁడు. పొట్టపోసికొనుటకు, పరుల పొగడ్తలను కోరికాని పరుల మన్ననలను గాంచికాని యితఁడు పద్యములు వ్రాయలేదు. స్వానుభవమితని కవిత్వమునకుఁ బ్రాణమని మొదటే విన్నవించితిని. ఇతరాశలకు లోఁబడి పద్యములు వ్రాయువారిని,

"ఆ. తోఁటకూరకైనఁ దొగ్గలికైనను
తమిఁదకుడుముకైన తవుటికైన
కావ్యములను జెప్పుఁగంట్యాలు ఘనవైరి—విశ్వ"...(౧౯౭౭)

యని తిరస్కరించి మొగము ద్రిప్పుకొన్నవాఁడు. కావున ఇట్టివాని వ్రాఁతలను బట్టి యతని పూర్వోత్తరముల నూహించునప్పుడు మనము మన భావనాశక్తికి స్వేచ్ఛాచార మిచ్చుటకు వీలులేదు.

వేమన కాఁపువాఁడు; కాఁపులలోను రెడ్డి. అనఁగానే 'వడ్లలో నెన్ని భేదములో రెడ్లలోనన్ని కలవు గావున ఇతఁడే రెడ్డి?' యని చెక్కుతీర్చిన చరిత్రకారుఁడు లేచి ప్రశ్నించును. కాని యాచర్చ నతనికే వదలిపెట్టెదను. ఎందుకనఁగా అంతకన్న నెక్కువ విభాగము వేమనకే అవశ్యకముగఁ దోఁపలేదు. మఱియు తాను 'రెడ్డి' యని యొక్కడనో యొకటి రెండు చోటులఁ జెప్ప తక్కిన స్థలములందెల్ల తాను పట్టి 'కాఁపు' నని చెప్పుటయందే యతని కభిమాన మెక్కువ.

"ఆ. కలియుగమున నున్న కాఁపు కులానకు
వేమన తనకీర్తి విక్రయించె..." (౯౯౫)

అని మాత్రము మనఁడు చెప్పకొని సంతోషించెను. తక్కిన యన్ని కులముల కంటె నీ కాఁపు కులముపై నతని కభిమానమును దయయు నెక్కువ గాఁగలదు.

"ఆ. కాఁపుకులజులెంత కష్టులైనను గాని
పాపరాశి కొంత పరిసి పోవు
వివర మెఱుఁగనట్టి వెట్టిజీవులుగాన, విశ్వ..." (ఓ-లై-౧౩-౫-౩౧)

మనదేశమునందు మొదటినుండియు ధనధాన్య సంపదగలిగి, శౌర్యౌదార్యములకు పేరైనజాతులలో ఈ కాఁపురెడ్లు ముఖ్యులైనవారు. మొదలు స్వతంత్రముగ రాజ్యముచేసి, తరువాత విజయనగరపురాజులు మొదలగువారిచేతిక్రింద పాళెయగారులుగాను అధికారులుగాను ఉండి, ప్రధానరాజ్యములు నశించిన పిమ్మట వీరక్కడి వారక్కడ స్వతంత్రులై వర్తించినవారు. సహజమైన స్వాతంత్ర్యాభిమానము, కాయశక్తి, పరంపరగా వచ్చిన రాచరికపుఠీవి, స్నేహసాహసములు గలవారగుటచేత, నితరులగు జనులు వీరియెడ భయభక్తులు గలిగి వర్తించుట సహజము. దీనికి తోడు స్వదేశాభిమానము, స్వదేశీయాభిమానము మొదలగు ఉదారాశయములను బెంపొందించు చదువుసంధ్యలెక్కువగా నేర్చియుండిరేని భరతఖండమునకు వీరిచే నెంతయౌన్నత్యము లభించుచుండెడిదో యూహింప నసాధ్యము. అట్లుగాక సైనికధర్మ మెక్కువగలిగి సేనానీప్రతిభాసంస్కారములు చాలనివారగుటచేత సామ్రాజ్యమును స్థాపించు ప్రాచీనశక్తిని గోలుపోయినను, తామున్నచోటనే చిన్నపల్లెరాజ్యమును స్థాపించి తక్కినవారికి సామాన్యముగ లొంగక వర్తించుట నైజస్వభావమైనది. మంచి చెడులకు రెంటికిని లక్ష్యము లేక ద్రవ్యము వెచ్చపెట్టుట, అడిగినది లేదనక యిచ్చుట, చేత లేనప్పుడు, న్యాయాన్యాయమార్గములు రెంటిచేతను ద్రవ్యము సంపాదించుట, భట్రాజులో బ్రాహ్మలో ప్రాంతపద్యములు పేరులు మార్చి చెప్పినను ఆ పొగడ్తలకు సంతోషించి బహుమానములు చేయుట, ప్రణయమున్నచోట ప్రాణముల నిచ్చుట, కోపమువచ్చినప్పుడు కుత్తుకకోఁతలతోనైన కసదీర్చుకొనుట-ఇవన్నియు నిప్పటికిని వారి రాజసగుణములు. పూఁత మెఱుఁగులు, వీఁపు వెనుకటిమాటలు, మొగమోటపు మానములును ప్రాయికముగ వీరెఱుఁగరు. వీరిలో ప్రబలులైనవారు నేఁటికిని 'ప్రభురెడ్లు' అని వ్యవహరింపఁబడుచున్నారు.

వేమన యిట్టి పల్లెటూరి ప్రభురెడ్లగుంపునకుఁ జేరి, అన్నవస్త్రములకు గొదవ లేక, అప్పుసప్పుల పాలుగాక, భూమి కాఁడ గలిగి, ఆవులు గొఱ్ఱెలు సమృద్ధిగాఁ గల మంచి నెమ్మదియైన సంసారమందు జన్మించినవాఁడని యూహింపవలసి యున్నది.

"ఆ. నేయిలేని తిండి నీయాన కసువది
కూరలేని తిండి కుక్కతిండి" (౨౩౦౪)

" పప్పులేనికూడు పరుల కసహ్యము" (౨౪౦౪)

అని చెప్పఁగలవాఁడు బీదసంసారి గాఁడు. మఱియు,

"పెట్టి పోయలేని వట్టిదేబెలు భూమిఁ
బుట్టిరేమి వారు గిట్టిరేమి" (౨౫౯౧)

"సద్దిమిగులనింట సంసారమేలరా" (౬౫౦)

"అప్పులేని వాఁడె యధికబలుఁడు" (౨౪౦౧)

అను మంచి సంసార ధర్మముల. నితఁడు బాగుగా నెఱిఁగినవాఁడు. తల్లి దండ్రులు చదువుకొన్న పండితులు గాక పోయినను, చదువుకొన్న పండితుల, పౌరాణికులు, కవులు మొదలగువారి కాశ్రయమిచ్చు స్వభావము గలవారు గావున, వేమన చిన్ననాఁటినుండి తమయింటికి వచ్చి పోవుచుండు చదువరుల, కవుల సహవాసమున సంస్కారమును బొందినవాఁడు. మఱియు నా కాలమున కొంచెమున్న వస్త్రములకుఁగల కాఁపువారందఱును వ్రాఁత చదువుల నేర్చియుండిరనుటలో సందేహములేదు. కాని, రామరాజభూషణాదులవలె అవి కేవల పాండిత్యసంపాదనకై యుపయోగించినవారరు. సిద్ధములైన మతనీతితత్త్వములను తెలిసికొనుటను వలసినంత దేశభాషాపరిశ్రమము సామాన్యజనుల కావశ్యకముగాఁ దలఁపఁబడుచుండెను. అట్టి తత్త్వములను వ్యాప్తిచేయుట కేర్పడినవి పురాణములు. మొన్న మొన్నటి వఱకును పల్లెటూళ్లలో ప్రతినిత్యమును కొంతప్రొద్దైనను పురాణములు చదివియో చదివించియో కాలక్షేపము చేయని రెడ్డి యుండలేదు. కావున వేమన సామాన్యముగ వ్రాఁత చదువులు చక్కగా వచ్చువఱకును కొన్నాళ్లు బడిపంతుల బెత్తపుదెబ్బలు తిని, తరువాత భారతము, రామాయణము, బసవపురాణము, శివపురాణము మొదలగు గ్రంథములను పలుమాఱు తండ్రిగారికి చదివి వినిపించి యుండును. పురాణములందలి కథలలో సామాన్యముగ నందఱు నెఱుఁగని కథల నితఁడెఱిఁగినట్లు అనేకపద్యములు తెల్పును. పాదరసమువంటి ప్రతిభాశక్తి కలవాఁడగుటచే, తిక్కన మొదలగువారి గ్రంథములు ఊరక యెవరికోఱకో పారాయణము చేయక వాని యర్థమును గ్రహించువఱకు వదలకుండెనని తోఁచుచున్నది.

"ఆ. కబ్బమొకటి పూని గడగడ చదివిన
లోనియర్థ మెల్ల తానెఱుంగు,
ఎఱుకమాలు చదువు లేటికో తెల్పరా-విశ్వ-" (౯-౨౯)

అని యితఁడు తరువాత నెవనికో యుపదేశించెను. ఇంతే కాక తానుగూడ, ఆ గ్రంథకర్తలవలెను, తమ 'ఆస్థానము'నకు, వచ్చిపోవుచుండు కవులవలెను, కవిత్వము చేయవలెనని సంకల్పించుకొని యుండును. మన యదృష్టముచే వేమన్న చదువు పురాణములు దాఁటి కావ్యశాస్త్రములకు పోయినదిగాదు గావున, చిక్కులేని,

ధారాళమైన భావము మీఱిన భాష కాని భాషనుమీఱిన భావము గాని లేని నిష్కల్మషమైన పురాణ కవితాశయ్యయే యతనికి లభించినది. కాని తానేమి వ్రాయవలయునో యింకను ఏర్పడలేదు. నాలుక తీటమాత్ర మపరిమితముగా గలదు. అది యూరకుండనీక యుద్రేకించుచున్నది. కాని ఛందోవ్యాకరణాలు తెలియను నేర్వలేదు. మఱియు పద్యములు వ్రాయుటకు నివి యావశ్యకములను భావమే అతని కప్పటికి—ఎప్పటికిని—దోఁచియుండదేమో! కావున పల్లెటూరివారు ఇతని వంటి నవయౌవనులు, మనసుకు వచ్చిన విషయముపై, తమయూరికందిన నడకలో, ఇప్పటికిని కపిలెపదములల్లు నట్లు, ఇతఁడును, అంతకన్న మేలైన విన్యాసంపాకము గలదు గావున, విషయ నిర్బంధములేక, తెలుఁగు పద్యములలోనెల్ల చిన్నదియు కొంతవఱకు పాటలవలె స్పష్టమైనలయగతి గలదియునగు 'ఆటవెలఁది' లో రచనచేయ మొదలిడినాఁడు. ఇతని చిన్నతనపు పద్యములేవియో మన మెఱుఁగము గాని, యింతధారాళమైన రచనప్రకృతి దత్తమైన వరప్రసాదమే కావునను, అది యాకస్మికముగా నొకనాఁడు పొంగిపొరలివచ్చు నీటి బుగ్గవంటిది కాదు కావునను, చిన్ననాఁట నుండియే యితని కావాడుక కలదని మన మూహింప వలసియున్నది.

దీనికి తోడు ఇతనికి కొంత సంగీత విద్యయందును అభిరుచి లభించినది. కవులకు పండితులకెట్లో అట్లే గాయకులకును ఆకాలపు రెడ్లు ఆశ్రయభూతులు. కావున తమయూరిలో జరిగిన పాటకచ్చేరీలలో నెల్ల అగ్రాసనము వహించిన పెద్దరెడ్డిగారి ప్రక్కలో చిన్న వేమారెడ్డియు కూర్చుండి తదేకధ్యానముతో వినుచుండెననుట నిస్సందేహము.

"క. గంగాధరుఁడే దైవము, సంగీతమె చెవులకింపు..." (౧-౨౩౩)

అందుము, "క. విద్యలలోపల నీతియు, వాద్యంబులలోన వీణ" (౩౫౦౪)

యని నిర్ణయించుకొన్నాఁడు సూక్ష్మములైన విషయములు గ్రహింపవలయు నను తీవ్రభావము గలవానికి తప్ప తక్కినవానికి 'వీణ' యందభిరుచి కలుగుట యసాధ్యము. సంగీతమందును ఒక్కొక్కరి కొక్కొక్క రాగము రుచించును. కవిచౌడప్ప 'రాగంబులలో గాంభీర్యముగల రాగము కాంభోజి' యనెను. భట్టుమూర్తియు 'కాంభోజీరాగ విపంచికారవసుధాపూరంబు' అని దానియందే పక్షపాతము చూపెను. మనకవులలో నింకెవఁడో 'సావేరి' ని అంగీకరించినట్లు జ్ఞప్తి. వేమన్నకు 'తోడి' పై అభిమానము. దానియోగ్యతను గ్రహించుట కందఱికిని శక్తిలేదఁట; 'దున్నపోతునకును తోడిరాగంబేల' (౨౧౪౦) అనుచున్నాఁడు. ఏమోచాలదను అతృప్తి, జుగుప్స, తనయశక్తిచేఁ గలిగిన దైన్యము, దానికితోడు కార్యసాధనమునందలి పట్టుదల, స్వాతంత్ర్యశక్తి—ఇత్యాదిభావములు చూపుటకు

తోడి రాగము వంటిది లేదు. వేమనకీ రాగమందుఁ గలిగిన యభిమానము అతని మనో ధర్మములను స్పష్టముగా సూచించుచున్నది. కాని యింతకంటె నావిద్యాయందును ఇతని కెక్కువ ప్రవేశము గలుగలేదు.

వేమన్నకు శివభక్తి యీ చిన్నతనమందే యలవడి యుండవలెను. తల్లిదండ్రులు తాతాచార్యుల ముద్రకుఁదప్పిన పూర్వికశైవులై, కేవల వీరశైవమును బోధించు జంగముల యుపదేశములకు పాత్రులై యుండియుందురు. కాని అప్పటికి వీరశైవ ప్రాబల్యము తక్కువయై యుండుటచే, శివకేశవులకు భేదములేదని చెప్పునను సహజముగా శివభక్తి నెక్కువగాఁ జూపు అద్వైతబ్రాహ్మణ పండితుల సహవాసములో మెలఁగినవారనుకొనెదను. కావుననే వేమన్నకు చిన్ననాఁడే యిట్టి కేశవ ద్వేష మెక్కువలేని శివభక్తి కుదిరినది. లింగధారిగఁ గూడ నుండవచ్చును. అప్పటి వీరశైవులు బ్రాహ్మణులు ఏర్పఱచిన దేవాలయములందలి పూజ పునస్కారములు, ఉత్సవములు గ్రామసామాన్యములగు పోతులరాజుల పూజలు-ఇవన్నియు చిన్నతనమందే చూచి, తండ్రిగారితోడ వానిని నిర్వహించుటయందును పూజారులిచ్చు మర్యాదలందును పాల్గొనినాఁడు. ఈపొంగలి పులిహోరల పూజలందును, బాజా బజంత్రీల మెరవణుల కోలాహలములందును, జంగాల పాదతీర్థములందును, బ్రాహ్మణుల సమారాధనలందును, పూజారుల తలత్రిప్పుల యావేశములందును, ఎనుబోతు గొఱ్ఱెల బలిదానములందును—నిజముగనే యేమి సత్యమును సత్ఫలమును గలదా యను శంకయప్పటికే యొక్కడనో యొకమూలలో నతని కంకురించి యుండును. కాని వయసుచిన్నది; అనుభవము లేదు; ధైర్యము చాలదు; మీఁదు మిక్కిలి ప్రక్కలో తన్నుదండించు తలిదండ్రు లున్నారు; బెత్తపుబడిపంతు లున్నాఁడు. కావున పై విషయముగా నేసందేహములు గలిగినను 'ఛీ వెధవా, నోరుమూసుకో' అని యదరఁ గొట్టు వారే కాని, తీర్పఁగలవారు లేరైరి. కావున నవి యట్లే యడఁగఁ బొచ్చినవి. మఱియు నితఁడు తల్లి తండ్రి మొదలగు పెద్దలయెడ భక్తి, దయ, మెండుగాఁ గల వాఁడని కానవచ్చుచున్నది.

"ఆ. తల్లి కెదురుకొంట తండ్రి కెదురుకొంట
అన్న కెదురుకొంట యరయ మీఁదు
పాతకములటంచు వర్తింపుమెఱుకతో..." (౧౫౪౨)

"ఆ. తల్లితండ్రిమీఁద దయలేని పుత్రుండు
పుట్టనేమి వాఁడు గిట్టనేమి?..." (౧౫౫౩)

కాని, యితనిది అట్లుపుట్టిన సందేహములను చాలనాళ్ళు అడఁగించుకొని యుండఁగలహృదయము గాదు. తనచుట్టుప్రక్కలనుండువారి నడవడులలో తప్పులు

పట్టుట, పట్టినవానిని నిర్దాక్షిణ్యముగా వారి మొగముల ముందఱనే చెప్పవలయు నను ధైర్యము, ఆధైర్యము నుద్రేకింపఁజేయు వాగ్మిత్వము, ఇవి యితని స్వభావసిద్ధ గుణములు. కావుననే, తానేదో ఘనకార్యమును జేయఁగలవాఁడని, చేయవలయు నని, సామాన్యజనులకన్న తనయందు విశేషముండెనని యితఁడు నమ్మెను. మనుజుఁడై పుట్టినందుకుఁ 'పుట్టలోని చెదల' వలె నిరర్థకముగా, ఒకపని చేయక, పుట్టి గిట్టరాదనుకొన్నాఁడు.

"ఆ. పుట్టలోన చెదలు పుట్టిన రీతిని
గట్టుమీఁద మణియు పుట్టునట్లు
కట్టెలోన నగ్ని పుట్టిన విధమున
పుట్టి మెట్టవలెను భువిని వేమ" (౨౫౩౯)

అని దృఢసంకల్పము చిన్ననాఁటనే యితనికుండి యుండవలెను, ఇట్టి సంకల్పము లనేకులకుఁ గలవు. ముప్పొద్దును మంచముమీఁదనే పరుండి ముల్లోకముల యాధిపత్యమును సంపాదించు సంకల్పములు చేయువారము మనమందఱమును. దానికిఁ గావలసినశక్తియుక్తులట్లుండఁగా - ముఖ్యమైన పట్టుదలయే యసలనేకుల కుండదు. వేమన్నకు మనస్సునఁ గలిగిన సంకల్పమును నిర్వహించు దార్ఢ్యము మొదటినుండి కలదనవచ్చును.

"ఆ. పట్టి విడువరాదు పదిలక్షలకునైన" (౨౩౫౨)

"ఆ. ఊఁపఁబోయి కొంత యూఁగించి విడిచిన
నూఁగుఁగాని గమ్యమొందలేదు
పట్టు పూన్కి—కొలఁది పనిచేయు లక్ష్యంబు—విశ్వ—(౫౫౯)

"ఆ. పట్టుపట్టరాదు పట్టి విడువఁగరాదు
పట్టెనేని బిగియఁ బట్టవలయు
పట్టువిడుటకన్న పడిచచ్చుటయె మేలు...విశ్వ...(౨౭౫౭)

అచ్చపు శ్రేష్ఠ రాజసము! ఇదిగలవానికి దేవుఁడేలొంగి యతఁడు పట్టినపని నిర్వహించి యిచ్చి తంటా తప్పించుకొనును! ఇట్టు దృఢసంకల్పము చేయుస్వభావము గలిగినను, ఏది పట్టవలెనో యేది విడవవలెనో నిర్ణయించుకొను వివేకము, అనుభవము చేతనో అనుమానముచేతనో సంపాదించుకొనఁగల్గుటకు ముందు కేలోక ప్రబలమైన మార్పు వేమన జీవితమందుఁ గలిగినది.

ఆ దేదనఁగా యౌవనము. చిన్నయనూరి చెప్పిన 'కలిమి, దొరతనము, అరయమి' యను తక్కిన మూఁడును కొంతకుఁ గొంత కలవని మనమెఱిఁగి

యున్నాము. ఇట్లు సర్వసాధన సంపూర్ణమైన యౌవనము స్వచ్ఛందముగా ప్రవర్తించుటకు వలసిన సమయసందర్భములకును ఆకాలమందు కొదవలేదు.

పదునెనిమిదవ శతకము నాఁటి హిందువులకు రాజ్యకార్యనిర్వాహములు శాస్త్రతత్త్వవిచారములు మొదలగు శ్రీవిషయములందు ప్రతిభాబలము ప్రవహించుట నిలిచినది. 'ఎవరికి వారే యమునాతీరే' యన్నట్లు స్వతంత్రులగుట కందఱును తమశక్తికొలఁదిఁ బ్రయత్నించిరి. సామ్రాజ్యస్థాపనకు శ్రద్ధతోఁ బ్రయత్నించినవారు లేరైరి. ఉన్నవారికి శక్తి లేదయ్యెను. రాజులు నవాబులనఁబడువారికిని తమ సెలవులకు ద్రవ్యము నార్జించుటయే ప్రధానోద్దేశముగా నుండెను. ప్రజలగతి యేమైనను పన్నులు వసూలైనఁ జాలును. కాఁబట్టి బలవంతుఁడు ప్రబలుఁడై ప్రభుత్వము చెలాయించెను. ప్రజలు 'సర్కారు' వారితో లేక 'దొడ్డిగారి' తో యీయవలసిన దిచ్చి లేని తరువాత తక్కిన విషయములందు వారిని దండించుదారిగాని రక్షించుమార్గముగాని లేకుండెను. ఇఁక చదువుసంధ్యలు నేర్చి సాంఘికవర్తనముల నియమించు బ్రాహ్మణులు మొదలగు సంఘనాయకులకు మతము, శాస్త్రము, ధర్మము —ఇవన్నియు సిద్ధములైన వస్తువులు. తమ ప్రాచీనుల పుస్తకములలో నన్నియుఁ గలవు. వానిని నేర్చుకొనుట, శక్తియున్న నవియే సత్యములని స్థాపించుట, యింతకన్న వేఱుచేయ వలసినపనిలేదు. అవి యుక్తములా కాదా యని సందేహించుటయే మహాపాతకము! వానిని తప్పక యాచరించిన ముక్తిసిద్ధము! సామాన్యజనులం దట్టి మనోభావమునకు పరిణామ మేది? సహజముగా నాచరించుటగాక ఆచరించినట్లు చూపుకొనుట. ప్రాణాయామము చేయుటకు ముక్కు మూసికొనవలెను. రెండు వ్రేళ్ళతో ముక్కుపట్టుకొన్నఁ జాలును. దానిని మూసినావా తెఱచినావా యని, ఊపిరి నిలిచినదా యాడుచున్నదా యని, సంధ్య వార్చెడువారిముక్కు లన్నియు పరీక్షించు మూర్ఖుఁడెవ్వఁడు! స్నానము చేయవలెనని ధౌతవస్త్రమునే కట్టవలెనని శాస్త్రమున్నది. దానికి, ఒక చెంబెఁడు నీళ్ళు మీఁదఁ బోసికొన్నను, ఒకమాఱు నీటిలోనద్దిపిండి ఆరవేసిన వస్త్రమును గట్టుకొన్నను జాలును. అంతేకాని దేహమునందును వస్త్రమందును పంచమైలలున్నను పరవాలేదు. ఇట్లు అశక్తిచేత, అజ్ఞానముచేత, శాస్త్రములన్నియు 'శాస్త్రము' నకై పోయినవి. వేషము ప్రధానమైనది. కావున మనుష్య సంఘమందు ప్రధానములైన రాజ్యము, మతము, ధర్మము, అను మూఁటినిగూర్చి యెవరును ఎక్కువగా చింతించి, ఊహించి, చర్చించి, నిర్ణయించవలసిన పనిలేదయ్యెను. ఇఁక నీతి మనచేతిది. మనలను దండించువాఁడు కల్గువఱకును మనము చేసినదే నీతి. కాఁబట్టి ప్రజలు ప్రాయికముగ స్వేచ్ఛావర్తనులైరి. విషయవాంఛలు అడ్డులేక ప్రబలెను. రాముని యేకపత్నీవ్రతముకంటె

కృష్ణుని యనాది బ్రహ్మచారిత్వము అనుకూలముగాఁ దోఁచెను. బహుపత్నీకత్వము భరింపరాని బరువు. కావున వేశ్యల వ్యాపారము ఎప్పటికన్న నెక్కువయయ్యెను. ఊరూరను కనీస మొక దేవాలయము. దేవ్రన కొక దాని చొప్పునను భక్తులకు చాలక పోయెను. ఇఁక ఇరుగుపొరుగింట్ల సహవాసము మొదటినుండి అన్నిమతముల వారును దేశములవారును ఖండించినది. మఱియు ఆ యిండ్లలో పట్టియాఁడువారు మాత్రమే కాక వారిభర్తలు మొదలగు మగవారు నుండుటయు, వారికిని తమవలెనే మానాభిమానములుండుటయు కొంచెము నిదానించి యాలోచింప వలసిన విషయము.

"ఆ. పరసతి గమనంబు ప్రత్యక్ష నరకంబు
అరయ నిందలకును నాలయంబు
పురుషుఁడు వినఁజంపు భూపతి నొప్పించు, విశ్వ" (౨౪౫౦)

కావున వేశ్యాసంఘాభివృద్ధి కావలసివచ్చెను. వారికి మర్యాదలు, పెండ్లి పేరంటములలో సంభావనలు ప్రబలినవి. కాని వారి సంఖ్య యాకస్మికముగా పెరుగుట కష్టము. దేవదాసీలవలె సంఘదాసీలను బసివిరాండ్రను బయలుదేర్చవలసి వచ్చెను. శైవులలోను వైష్ణవులలోను సంఘయజమానులే దానికి సమ్మతించిరి. ఇది గాక నిత్యమును సంసారులుగానుండి సంతలలో మాత్రము వేశ్యావృత్తినవలంబించు 'సంతజనవి' రాండ్రు కొందఱు కావలసి వచ్చెను. చాలనందుకు దొమ్మరీండ్ర వేశ్యల తోంతెక్షేమము గలిగెను. పరస్త్రీసంగమువలె వేశ్యాసహవాసమును పాపకర్మములని ధర్మశాస్త్రములున్నను, ఈ విషయమై చర్చలు జరిపి సిద్ధాంతముచేయు తొందఱ లేకుండ, మొదటికన్న రెండవది మేలనియు, అది పాపమే కాదనియు, ఐనను క్షమింపఁదగినదనియు, జనులందఱును పరస్పరహృదయ సంవాదముచే నిర్ణయించుకొనిరి. నియమపరాయణులెవరైననున్న వారిలో ననేకులకు వీరియెడల నసహ్యముకన్న అసూయయే యెక్కువయై, పైకి ఖండించినను, లోలోన గ్రుక్కిళ్ళు మ్రింగుచుండిరి. క్రమముగా ఏకపత్నీవ్రతము పురుషలక్షణమే కాదనుకొనఁ జొచ్చిరి. వ్యభిచారము చిన్నవారియందే కాని పెద్దవారయందంత దోషము గాదని చెప్పుకొనిరి! పూర్వకాలపు వృద్ధులలో ననేకుల కిప్పటికిని ఈభావము లిట్లేయున్నవని మన మెఱుఁగుదుము.

వేమన యిట్టి సన్నివేశములలో పెరిగినవాఁడు; తన కాలపు పెద్దలు (వీరిలో పండితులుగూడఁ జేరి యుండుదురు) బాహాటముగ గణికాలోలురై యుండుటను చూచినాఁడు; దేవాలయముల యుత్సవములలో పెండ్లి పేరంటములలో వేశ్యల నాట్యమును జూచినాఁడు; సంగీతమందాశ సహజముగాఁ గలవాఁడు కావున, వారి మధుర గానముచే పదనెక్కిన పచ్చిపదములను విని వాని యభినయమునుజూచి పరవశమై

నాఁడు. ముగ్ధవయస్సు, ఐశ్వర్యము, అధికారముఁ గల తనపై అవకాశము దొరికినప్పు డెల్ల వారు ప్రయోగించు కటాక్షపు కటారుల పాల్పడినాఁడు. ఇట్టివారికి లోఁబడుట అన్యాయమని అధర్మమని తాను పురాణములలో చదివిన చదువులు జ్ఞప్తికి వచ్చినవి. మనోనిగ్రహము చేయఁ బ్రయత్నించెను గాని, తనకుఁ దానుదప్ప సహాయపడు వారెవ్వరును లేక పోయినారు. చదువుకొన్నవారు పెద్దలు ఈ విషయమున తనకన్న దుర్బలులై యుండినారు. ఇఁక తానెంతటివాడు!

"ఆ. ఆఁడుదానిఁ జూపె నర్కంబుఁ జూడఁగ
బ్రహ్మకైన నెత్తు రిమ్మ తెగులు......" (౨౩-౨)

అను సృష్టిసిద్ధమైన దోషము దెలిసికొన్నాఁడు. 'ఈ బుద్ధులు పాపకృత్యములైనచో నివి లేకయే బ్రహ్మ సృష్టి చేసియుండరాదా?' యను ప్రశ్నకు ప్రత్యుత్తరము దొరకనయ్యెను. తుదకు మన పాపముల కన్నిటికి నా బ్రహ్మయే కారణమని ఈ "బ్రహ్మ గాలిత్రాడు ఉండిరేవుఁ ద్రెంప!" అను యొక తిట్టుతిట్టి ప్రపంచప్రవాహములోఁ బడిపోయినాఁడు!

వేమన్న యిట్లు వేశ్యలోలుఁడయ్యెనన్న వెంటనే అభిమానులు కొందఱు నాపై నాగ్రహింతురు. కాని యతనిమీఁది యభిమానమున నేను వారెవరికిని దీసి పోనని మాత్రము మనవి చేయవలసి యున్నది. వేమన్నను గూర్చిన కథలలో నెల్ల నీ వేశ్యాసంబంధము కలదు. అతని యనుయాయులు, అతనినే దైవముగాఁ గొలుచువారు అందఱును దాని నాక్షేపింపక యంగీకరించినారు. కథలలోని విషయములన్నియు నసత్యములనుటకు సాక్ష్యము లేదు. అత్యుక్తులను, ఇతరసాధనములచే అసత్యములని స్పష్టముగా తేలినవానిని వదలిపెట్టి తక్కిన వాని నంగీకరించుట క్షేమము, న్యాయము. ఇఁక వేమనవంటి వేదాంతి వేశ్యచేఁ జిక్కుట యసంభవమని తలఁచుట యజ్ఞానము. ప్రాఁత కాలపు సంఘస్వభావమును గమనించిన యెవరికిఁ గాని, ఇట్టి విషయములలో తమదేశపు పుచ్చులన్నియుఁ గప్పిపెట్టి పాశ్చాత్యులు మనకు బోధించుచుండు తమలో లేని నీతిపద్ధతులు మన తాతముత్తాతలకు లేవనియు, వారే న్యాయాన్యాయములను జేసిన మతమంత చేసిరి గాని, యితరులెవ్వరును వారికి మనకువలె 'వంకాయపురాణములు' చెప్పలేదనియు స్పష్టమగును. కవికులశిరోమణి సరస్వతి యపరావతారము, కాళిదాసు గణికాప్రియుఁడని మన ప్రాచీనులు తలఁచుచు నది యసంభవమని భావింపలేదు. అధర్మమని భావించియుండవచ్చును. త్రివిధ నాయికలలో రెండవది పరస్త్రీ, మూఁడవది వేశ్య! వారిద్దఱికిని రసికలాక్షణికులందఱు స్వీయయగు మొదటిదానితోడ సమాన మర్యాదను కావ్యప్రపంచమున నొసఁగిరి. శ్రీనాథుని నైషధమును పంచకావ్యములలో పరిగణించిన వారే యతఁడు స్త్రీలోలుఁడనియు నెఱుఁగుదురు. ఇవన్నియు న్యాయ

మూలని నేఁజెప్పరాలేదు. అది వేఱుమాట. మఱిగొప్పవారందఱును అన్నివిధముల గొప్పవారేయని భావించుట, వారియెడ దోషము అసంభవమనుకొనుట, మనయవివేకమునే వెల్లడించుననియే నామతము. దోషములుండిన నష్టమేమి? అందువలని కష్టము ననుభవించినవారు వారు. మనము వారి గుణములచేత, మహత్త్వముచేత మేలుపొందవలసిన వారము. వేమన పరనారీసహోదరుఁడై శుకమహర్షి యపరావతారమైయుండి, యొకపద్యమును వ్రాయక యేమూలలోనో ముక్కుపట్టుకొని మురిగియుండిన మనము సంతోషించుచుంటిమా? మన్నించుచుంటిమా! నన్నడిగిన వేమనవలె పద్యములు వ్రాయఁగలవాఁడెవఁడైన నేఁడు లభించునేని యతనికిఁ గావలసియున్న మనమందఱును చందాలెత్తి వేయిమంది వేశ్యలను సంభావన సమర్పింపవచ్చును.

మఱియొకటి మాటఁడు; వేమన 'జిహ్వచేత నరులు చిక్కునొచ్చిరిగదా' (౧౫౦౩) యని పరితాపపడి దానికి లోఁగుట తప్పని చెప్పుచున్నాఁడు. అనఁగా పుట్టిననాఁటినుండి యేది దొరికిన నది తిని, దొరకకున్న నుపవాసముండియే కాలక్షేపముచేసిన నిత్యోపవాసి యతఁడని చెప్పవచ్చునా? అట్లైన 'పప్పులేనికూడు పరులకసహ్యము' ఇత్యాదులు వేమన్న చెప్పినవి గావా? విషయలోలత్వమెల్ల నిట్టిదే. మఱియు వేమనవంటివాఁడు కొన్నాళ్ళైనను విషయాధీనుఁడై యుండకపోవుటయే యసాధ్యమనుకొనుచున్నాను. ఇతని యుద్రేకము ఏవిషయమునందు ప్రవర్తించినను చాల వేగము. వేఁడి గలది, తోఁచినపని చేయించుటయే దానిస్వభావము. దానిచేతనే వేమన యింటివాఁడైనాఁడు. ఎక్కువ సందేహములు శంకలుగల మనుష్యులు గ్రంథములు వ్రాయుటకు పనికి వత్తురేమో కాని కార్యములను సాధింపలేరు. మనసుకు వచ్చిన దానిని వెంటనే సాధింపఁ బ్రయత్నించువాఁడు పది పనులలో రెండైనను సత్కార్యములు చేయును. తక్కిన యెనిమిదియు కార్యములు ప్రపంచప్రవాహములో మునిఁగిపోయి యీ రెండే స్థిరముగా తేలును. అంతమాత్రముచేత నాయెనిమిదియు నతఁడు చేయలేదని కాని చేయఁజాలఁడని కాని వాదించుట సాహసము.

మఱియు కవిత్వము సంగీతము మొదలగు కళలకు లోఁగిన వారికి విషయలోలత్వము తప్పనిదేమో! ఇది కొంత సాహస సిద్ధాంతమేయగును. కాని, హృదయమున జనించిన భావములను అడఁగించుకోలేక బైటఁబెట్టుట కళాధీనుల స్వభావము. కొందఱితరులకువెఱచి కొన్ని భావములను బైలుపఱుపక యడఁచుకొన్నను, అభయము లేదని తెలిసిన వెంటనే స్వతంత్రముగ వానిని వెల్లడింతురు. కవులలో పచ్చిబూతులు వ్రాయువారు, గాయకులలో వానిని పాడువారు, చిత్రకారులలో దిగంబరాది రూపములను చిత్రించువారు, చెక్కువారు, అట్టివానికి సంతసించి మెచ్చుకొనువారును, అన్నిదేశములందును అన్ని కాలములందును, నీతివిఱువ నెఱిఁగిన చదువరులే కలరు.

ఈస్వభావమే వారివ్యవహారములందును వర్తించును. తోఁచినది చెప్పక పోవుట యెంతకష్టమో తలఁచినది చేయకపోయుటయు నంతే కష్టము. ఇందు న్యాయా న్యాయముల, ధర్మాధర్మముల. విచారణ కెక్కువ చోటులేదు. సహజమైన రసార్ద్ర హృదయమును నియమజ్యోతిచే గట్టిచేసికొన్నవారనేకులు. గలరుగాని వారట్లు గట్టి పడుటకు మొదలు కేవల రసపరవశులై హృదయదాసులైయే వర్తించియుందురు. ఇందు కపవాదములు కలవు కాని మృగ్యములు.

పైని యనుమానములు మాత్రమే కాక వేమన వేశ్యలస్వభావమును చక్కఁగా నెఱిఁగినవాఁడని యతని పద్యములే ఘోషించుచున్నవి. ఒక్క పద్యమునైన నుదాహరింపక విధిలేదు. మన్నింపుఁడు.

"ఆ. లంజ లంజకాని లాపెల్లఁ గొనియాడు,
అంజతల్లి వానిలజ్జ గడుగు"

కావున సిద్ధాంత మేమనఁగా,

"తల్లి గలుగు లంజఁ దగులుట చీకాకు, విశ్వ" (౩౩౫౧)

ఇందుపై వ్యాఖ్యానమనవసరము. ఇదిగాక "స్రానిదాని పొందు సౌభాగ్య భాగ్యము" అని అచ్చునకెక్కని పద్యభాగ మొకటిగలదు. (ఓ. లై. ౧౪-౪-౪౨) ఇవి ప్రక్షిప్తములనుకొని సంతోషించువారు సంతోషింపనిండు. ఒకవేళ నట్లైనను, వేమనవంటి మహాత్ముని కిట్టిభావము లంటఁగట్టినను అతనిమహత్త్వమునకు కొఱఁత రాదని నమ్మినవారు, అంగీకరించినవారు, ఉన్నప్పుడు, అతనికే యిట్టిభావములు జీవితమందొకానొక సమయమందుండియుండుననుట యసంభవము గాలేదు. ఒక విషయము అసంభవము కాకపోవుటకును సంభవించుటకును నడుమ నంతరము చాల స్వల్పము. సాధ్యములగు విషయములు సిద్ధములగునని నమ్ముట కెక్కువహేతువు లక్కరలేదు.

ఇంతదూర మీ విషయము చర్చించుటకు మీరు నన్ను మన్నింపవలసి యున్నది. కారణము గలదు. ఈవల మనలో మహాపురుషులందఱు అన్నివిధముల దోష దూరులుగా నుండవలెనను భ్రాంతి విమర్శకుల నావేశించుచున్నది. నన్నయ, పెద్దన మొదలగు వారు మత్సరగ్రస్తులై యుండిరనియు శ్రీనాథాదులు స్త్రీలోలురైరనియు, కృష్ణదేవరాయలు మొదలగువారు క్రూరకర్ములైరనియుఁ జెప్పుకథలు నమ్మరానివని అసత్యములని ఆధునిక విమర్శకులనేకులు రాద్ధాంతము చేయుచున్నారు. ఇవి సత్యము లైనను అసత్యములైనను అసంభవములుగావనియు, దోషసామాన్యము దగ్గఱఁ జేరనీకుండచేసిన పరిశుద్ధమహత్త్వము ప్రపంచములో లేదనియు, కావున ఒకరియందు దోషములుండవని సిద్ధాంతీకరించుటకు వారియందలి మహత్త్వము మాత్రమే చాలినంత

హేతువు కాఁ జాలదనియు నాపునవి. సహజముగా వచ్చునవి దోషములు. సాధింప వలసినవి సద్గుణములు. కావున వీనిని సాధించులోపల అవి కొంతకాఁ డెక్కుడైనను తమ హక్కును జెల్లించుకొని తీరునన్నట సత్యము. అది యట్లుండె.

ఇట్లు ఇంద్రియపరవశుఁడైన వేమన యెంతదూరము పడ్డెనో చెప్పుట కష్టము. కథ ఒక్క వేశ్యకధీనుఁడైయుండె ననుచున్నది. దాని ననుసరించిన పద్యమొకటి 'ఒక్క వెలయాలి పొందే మిక్కిలి సౌఖ్యమ్మటంచు నలరితి వేమా' (౧౬౨౩) యనుచున్నది. కాని వ్రాఁత ప్రతులలో,

"క. ఒకతెకు లోలత భ్రమయక
సుకుమారుండెన్ని రుచులఁ జూడఁగవలెఁబో
సకల వనంబులఁ దుమ్మెద
మకరందము గ్రోలినట్లు మహిలో వేమా" (ఓ. లై. ౧౧-౬-౨౮)

అను పద్యము గలదు. ఈ రెండుపద్యములును వేమన్నవి కావని తిరస్కరించినను, వేమనవని స్పష్టముగా నున్న యాటవెలఁదులలోనే, యితఁడేక ప్రియావ్రతమును పాలించిన వాఁడు కాఁడనియు, ఇంద్రియచాపల్యమున, మాటలయందును ఆటలయందును సౌమనస్యమునుగాని, నియమమునుగాని, పాటించినవాఁడు కాఁడనియును బలమగు సందేహమును గలిగించునవి కలవు. ఇంద్రియలోలురను తిరస్కరించి ఖండించు పద్యములే కాక, ఇతరులయొక్క స్త్రీమదనోన్మాదమును వెలిపుచ్చు పద్యము లనేకములు గలవు. బ్రౌనుదొర యీ అసభ్యపద్యముల నన్నిటిని ప్రత్యేకముగా నేరి యొక్క కూర్పుఁజేసి వానికి ల్యాటినుభాషలోఁ గాఁబోలు, టీక వ్రాసి పెట్టుకొన్నాఁడు!

ఎట్టికాలమందైనను ఇతఁడిట్టి యవస్థలో నుండఁగా తల్లిదండ్రులుగాని తక్కిన బంధువులుగాని యోర్చియుండుట కష్టము. ఎప్పుడును వేశ్యలు, బసివిరాండ్రు, దొమ్మరిసానులు మొదలగు వారి సావాసముననుండియున్న ద్రవ్యమంతయు వెచ్చపెట్టుచు, చేతలేనప్పుడు సుప్రసిద్ధచరిత్రముగల వేశ్యామాతల చేత 'అర్ధచంద్రప్రయోగము' లనుభవించుచు చాల దుర్బల హృదయుఁడైన యితని నెట్లు త్రోవకుఁ దేవలయునా యని వారాలోచించి, వివాహముచేసినఁ గొంత మేలుగానుండునని తలఁచి యట్లు చేసిరి కాఁబోలు. సంపన్నుల యింటివాఁడు గావున నితనికి అట్టి వంశమందే జనించిన సౌభాగ్యవతి యొకతె ముడివడి యుండును. ఇదివరకు వేశ్యాప్రియత్వముచే పలు కష్టములు పడినవాఁడు గావునను, వారివన్నియు 'పూఁత మెఱుంగువంటి వలపులే' కాని పడుపువృత్తిలో హార్దమైన స్నేహము లేదని యెఱిఁగినవాఁడు గావునను, ఆత్రోవ యొక్కమాఱు చాలించి, తనధర్మపత్నియగు

నామెపై ప్రేమనంతయు నిలిపినాఁడు. ఏపనియు అరవాయితో చేయు స్వభావము గలవాఁడు కాఁడు గావున ఎప్పుడును ఆ మనువదలి యుండనేరనంత ముగ్ధుఁడైనాఁడు.

“ఆ. తుంట వింటివాని తూఁపులఘాతకు
మింటిమంటి నడుమ మిడుకఁదరమె?
ఇంటియాలివిడిచి యెట్లుండవచ్చురా!” (౧౯౫౭)

ఇదియేదో సందర్భమున గ్రామాంతరమునకుఁ బోవుటచేఁ గాఁబోలు నొంటిగా నుండవలసిరాఁగా నప్పుడు చెప్పిన పద్యమై యుండును. క్రొత్త భర్తృపత్ని క్షీరిమి మగఁడైన యీకాలమందే యితఁడిట్లు నిర్ణయించుకొనెను

“ఆ. ఇంటియాలి విడిచి యిల జారకాంతల
వెంటఁదిరుగు వాఁడు వెఱ్ఱివాఁడు,
పంటచేను విడిచి పరిగె యేరినయట్లు” (౩౫౯.)

కాని యీవివాహము సుఖముగా పరిణమింపలేదు. కారణము స్పష్టమే. నవవధువు నవవరుని నభిలషించును. ఆమెను వేమన వరియించి యుండెనేమో గాని యామెమాత్రము ఇతనిని తానై వరించియుండదు. అది తొంబదిపాళ్ళు ఇరుప్రక్కల పెద్దల యేర్పాటు. కావున భర్త యిప్పుడు తనయెడల నెంతవిశ్వాసముతో వర్తించినను అతని మొదటినడవడిని ఇరుగుపొరుగుల ‘సఖీమణులు’ తప్పక యామెకు వన్నెపెట్టి చెప్పియుందురు. అతనికి ప్రీతిపాత్రమైయుండిన యే ‘సంతజపిపి’నో చూపి, ‘అదిగో! నీ లెక్కలేని యక్కలలో నొక్కతె’ యని వేళాకోళము చేసియుందురు. ఏమియు నెఱుఁగని వారి విషయముననే వేడుకకో వెక్కసమునకో యిట్టికథల నల్లి సంసారములు ధ్వంసముచేయువారందఱో కలరు. అట్లుండ వేమనవంటి వాని విషయమున నడుగవలెనా? పాపము, ముగ్ధయగు నామె ‘యిట్టివానికి నన్నుఁ గట్టిరి గదా’ యని వగచి, ఎట్లైనను అతనికి తాను లోఁగి యుండక తనయాజ్ఞలో నతని నుంచి యిల్లు కడప దాఁటనీక చేయవలెనని, వారి బోధనలప్రకారము యత్నించి యుండును. ఎత్తిపొడుపుమాటలు, బొమముడులు, అనాదరణములు, మౌనముద్రలు మొదలగు అస్త్రశస్త్రము లెన్నియో యామె ప్రయోగించియుండును. ఇఁక వేమన్న పుట్టుకతో అగ్గిరాముఁడు! క్రొత్తపెండ్లికొడుకునకు ఇవన్నియు అలంకారముగానే తోఁచవచ్చును గాని వెయిన్ని [illegible]న్నియు ననుభవించి యెఱిఁగిన ప్రౌఢకాఁపు. అక్కడ సౌఖ్యములేదని యిక్కడనది గలదని యాశతో పెండ్లాడినవాఁడే కాని వేఱు కాదు. మఱియు ఆమె కితనియం దట్టి సందేహముగలదో యితని కామెయందును అట్టి సందేహమే కలదు. అనఁగా నామెయందు దోషముండెనని కాదు. ఉండవచ్చునని కాని కలుగవచ్చునని కాని వేమన్నకు సందేహము గలదన్నమాట.

మొదటినుండి స్త్రీని కేవల భోగ్యవస్తువుగా మాత్రము భావించి, వారికి వేఱు తమకు వేఱుగా శాస్త్రములు వ్రాసుకొన్నవారి గుంపులోనే యితఁడును పెరిగినవాఁడు; కాఁబట్టి,

"ఆ. పరుఁడు చక్కనైన బ్రహ్మలగనియైన
తగుకు మెఱుఁగుబోటి తత్త్వమున్న
అన్యపురుషవాంఛ అంటుదానికినుండు..." (౩౪-౨-౨)

అని చిన్ననాఁటినుండియే యితని కుపదేశము జరిగినది. గనుకనే భర్త భార్యను స్వాధీనమందుంచుకొనవలెననియు, దానికి స్వాతంత్ర్య మీయరాదనియు నితఁడు దృఢముగా నమ్మినవాఁడు.

"ఆ. మాట వినని యాలు మగనికి మరగాలు." (౩౧-౨౫)

"ఆ. ఆలు మగని మాట కడ్డంబువచ్చెనా
ఆలుగాదు నుదిటి వ్రాలు గాని
అట్టియాలి విడిచి యడవినుండుట మేలు..." (౩౧౧)

"ఆ. కావలయు మగఁడు కాంత నెల్లప్పుడు
కావలేని వాఁడు చావవలయు!
కాఁపు లేనిదాని కాఁపురమదుగరా..." (౧౦౯-౨)

యని యితని బోధ. అట్లగుటచే, ఇట్లు తనయందు గౌరవములేని—

"ఆ. అలి వంచలేక యధమత్వమున నుండి
వెనుక వంతునసుట వెఱ్ఱితనము
చెట్టుముదరనిచ్చి చిదిమినఁ బోవునా..." (౩౦౧)

అని నిర్ణయించి, ఇతఁ డామెను ఇల్లు కదలనీక, ఇతరులను కన్నెత్తి చూడనీక, తన మాట కడ్డమాడనీక, దండింప మొదలుపెట్టెను. ఇఁక ఆమెమాత్రము రెడ్డికూఁతురు గాదా! ఇతని రక్తమునందున్నంత వేఁడి, స్వాభిమానము, ఆమెరక్తమునందు నుగలదు గదా. కావున చూచినన్నాళ్ళను చూచి తుదకు నిర్లక్ష్యముచేసి ప్రతిఘటించి నిలచినది. ఇట్టి రెడ్డిసానుల స్వాభిమానకలహములో నున్న యీ యింటి ప్రణయమును పటాపంచలైనది. వేమన్న కిల్లు నరకప్రాయమైనది. ప్రభుత్వము చేయ వలసిన రెడ్డివంశమువాఁడు; అట్టివానికి తనభార్యయే యెదిరించి నిలిచిన పౌరుషమున కంతకంటె హానికలదా? మాటయెత్తిన వెంటనే యతనిభార్య,

"ఆ. వాడమటికి తిట్టు వలదన్న మొఱఁబెట్టు
ముందుమగని దిట్టు ముసుకుఁ బెట్టు,
గడుసుగాల్లు మగని గంపఁబెట్టమ్మురా..," (౩౪౪౬)

కనుకనే "యిట్టి యాలితోడ నెట్లు వేగింతురా!" (౩౪౪౫) దేవుఁడా"
యని వేమన్న విసిగి వేసరినాఁడు. సహజముగా హింసానులను సహించు స్వభావము గలవాఁడు కాఁడుగావున, ఇట్టి పనికిరాని భార్య నొక మాఱు గొంతుపిసికి చంపి పాఱవైచి యింకొకతెను పెండ్లాడుదమను రాక్షస కృత్యమునకు చొరఁగలవాఁడు కాఁడయ్యెను. మీఁదుమిక్కిలి తానే 'చాపలయు' నని తలఁచిన మానశాలి!

"ఆ. భావమరసి తన్ను భార్య సేవించిన
ఇంటికైన నగును ఈశ్వరుండు
అదియు లేక బ్రతుకు టధమము భువిలోన..." (౨౫౪౧)

ఈ మనస్సులోనే తన యదృష్టమును గూర్చి యిట్లు దీనముగా విలపించెను—

"ఆ. సుఖసుఖాన నేను సుగుణుఁడై యుండఁగా
నన్నుఁ బెండ్లిసేసి నయముఁ జెప్ప
దీని గూర్చిన విధి నే నేమియందును..." (౩౫౦౨)

అనుపదేమి? 'తప్పులెన్నువారు తమతప్పులెఱుఁగరు' (౧౭౯౯)
అను తన న్యాయమును తనకే యన్వయించుకొని నోరుమూసికొని యుండుటతప్ప! అపరాధము స్వయంకృతము! అనుభవమే ప్రతీకారము.

ఈ భార్యయందితనికిఁ గలిగిన సంతానముగూడ సుఖకరముగా పరిణమించినట్లు కానము. తల్లిదండ్రులకుఁ గల యిట్టి యనుకూలదాంపత్యమందు పుట్టిన బిడ్డల గతిని విచారించువారెవరు! వారు స్వేచ్ఛగాఁ దిరిగిరి. స్వేచ్ఛగా వర్తించిరి. ఇట్టి సంతానమును గూర్చిన పద్యమొకటి.—

"క. ఎండిన ప్రానొకటడవిని
నుండిన నందగ్ని పుట్టి యూరెల్లను జెట్టక
దండి గలవంశ మెల్లను
చండాలుం డొకఁడు పుట్టి చెఱుచును వేమా" (౬౨౪)

ఇట్లు వేమనను,

"ఆ. సుగుణవంతురాలు సుదతియై యుండిన
బుద్ధిమంతులగుచుఁ బుత్రులొప్ప
స్వర్గమేటికయ్యె సంసారికింకను..." (౩౯౦౩)

అని పలికిన పేరాసలన్నియు వమ్మై పోయినవి. ఇందుకుఁ గొడుకు వేశ్యాప్రియుడవు మహాత్మ్యచేత ఆస్తియన్నగిపోఁగా, పేదఱికమును గూడ ననుభవించినట్లు గానవచ్చుచున్నది. ఇదియంతయు తన్నాశ్రయించి తనయొక్క ధనమును భక్షించు స్నేహితులు చూపినవారెల్ల వారిని సహవాసము వలనటయో కాక వేశ్యాలోలము గూడ చేసినటులున్నది.

"ఆ. కుడువఁ గూడు లేక కూడఁ బెట్టఁగ లేక
విడువ ముడువ లేక గడన లేక
నడవసాఁగియున్న నడపీనుఁగందురు..." (౧౧౩౪)

ఇతరులు తన్నేమన్నను మానెను గాని యింటిలోనే,

"ఆ. కూలి నాలి చేసి గుల్లాము పనిచేసి
తెచ్చి పెట్టెనేని మెచ్చునాలు,
చిక్కుపడ్డ వేళ చీకాకు పఱచురా..." (౧౧౬౩)

"ఆ. ధనము లేమి సుతులు తప్పులనిడుదురు
ఘనము లేమిఁ బత్ని తాఁక రాదు..." (౨౧౧౮)

కాఁబట్టి,

"ఆ. ధనము లేమి యనెడు దావానలంబది
తన్నుఁ జెఱచు మీఁది దాఁపుఁ జెఱచు,
ధనము లేమి మదిని తలఁపనె పాపంబు..." (౨౧౧౩)

అని వేమన్న విసిఁగి పోయినాఁడు. తనకొడుకు లేమియుఁ బనికిరాకపోయిరి. యోగ్యులగు పుత్రులను గన్నవారినిఁజూచి యిట్లు పేరాసపడెను:—

"ఆ. ధనము లేని పేద తండ్రి గర్భంబున
భాగ్యపురుషుఁ డొకఁడు పరఁగఁ బుట్టి,
బహుళ ధనముఁ గూర్చి భద్రమార్గంబున
పరులకుపకరించి ప్రబలు వేమ" (౨౧౧౧)

వేమనకీ కాలమునకు ధనము స్వార్థముకొఱకను భావము నశించినది. జన్మమెత్తి జందులకు గతిలేని వారిని పోషించి యుపకరించుట పరమార్థమని తెల్పుకొన్నాఁడు. తన కాలమందలి స్వతంత్రులగు నిరంకుశప్రభువులు, రెడ్లు, పాళెయగాండ్రు, పరదేశీయులగు మహారాష్ట్రులు మొదలగువారు, ధనముకొఱకై,

"ఆ. పెక్కుజనులఁ గొట్టి పేదల వధియించి
దొక్కకొఱకు మాళ్ళు దొంగిలించి" (౨౨౯౮)

చేసిన యుల్లకల్లోలమును చూచినాఁడు. క్షామడామరముల దాడిని కనుఁగొన్నాఁడు. నిలువ నీడలేక, కడుపునకు కడిలేక ఉన్నచోటువిడిచి యూరూరు దిరుగుచు మల మాఁడువారి నెందఱినో యెదుర్కొనినాఁడు. చేతనైనంత వఱకు నట్టివారిని రక్షించుట తనధర్మమని తోఁచినది. అన్నదానమునకు మించిన దానము లేదని తేలినది.

"ఆ. ఆఁకలన్న వాని కన్నంబుఁ బెట్టిన
హరుని కర్పితముగ నారగించు" (౨౦౯)

కనుక పేదల సేవయే పెరుమాళ్ళసేవ. ఇఁక తనకాలమందలి ధనికులు కేవలము కుక్షింభరులై, లోభులై, పరసుఖదుఃఖిత్వము లేక నిర్దయులై యుండిరి. మఱికొందఱు విషయపరాధీనులై దుర్వ్యయముల పాలయియుండిరి. ఇట్టి వారిని జూచి,

"ఆ. ఆఁకలిగొని వచ్చెనని పరదేశికి
పట్టెఁడన్నమైనఁ బెట్టలేఁడు.
లంజెదాని కొడుకు లంజల కిచ్చురా..." (౨౧౦)

అని యసహ్యపడినాఁడు. "ధనము వెంటరాదు ధర్మంబు సేయరో" (౨౧౧)
యని గొంతెత్తియఱచి, ప్రార్థించి, తిట్టినాఁడు. కాని వినువారు లేరైరి. వారి కిచ్చినట్లు ధనము బ్రహ్మ తనకేల యియ్యఁడని కొదవపడి,

"ఆ. విత్తమొకరి కిచ్చి వితరణగుణమును
చిత్తమొకరి కిచ్చి చెఱిచినాఁడు.
బ్రహ్మచేత లన్ని పాడైన చేతలు..." (౩౮౯ా)

"ఆ. ఉదధిలోని నీళ్ళు ఉప్పులుగాఁజేసె
పసిఁడి గల్గువాని పిసినిజేసె
బ్రహ్మదేవుచేత పదడైన చేతరా..." (ఓ. లై. ౧౩-౩-౩౯)

అని యానిర్హేతుక బ్రహ్మ కొకవషట్కారము వేసినాఁడు; కాని తనకెంత బీదతిక మైనను,

"ఆ. ఆరయ నాస్తి యనక యడ్డుమాటాడక
తట్టుపడక మదిని తన్నుకొనక
తనది గాదనుకొని తాఁబెట్టినది పెట్టు..." (౧౫౬)

అని నిర్ణయించుకొనెను. అందును ఎంతకష్టమైనను ఎంగిలియన్న మితరులకుఁ బెట్టిన కుక్కలై పుట్టుదురని తలఁచినవాఁడు. (౬౩౯) కాని యిందులో నొకకష్టము. 'ఇచ్చేవానిని చూస్తే చచ్చేవాడునులేడు' అను శాస్త్రము సత్యములలో సత్యము. బిచ్చగాండ్రకు బిడియములేదు సరిగదా దయా దాక్షిణ్యములును సున్న.

"బిభర్తి భృత్యాన్ ధనికో దత్తాం వాదేయ మర్థిషు
యావద్యాచక సాధర్మ్యం తావల్లోకో నమృష్యతి" *
(నీలకంఠ దీక్షితుని కలివిడంబనము. ప. ౬౯.)

---

* ధనికుఁడు భృత్యుల నెంత పోషించినను, అడిగినవారి కెంత యిచ్చినను, యాచకుల తోఁడ నగఁడును సమానుఁడగు వఱకును జనులు ఓర్చి యూరకుండరు;

అన్నట్లు, తనవలె దాతయు బిచ్చగాఁడగువఱకును యాచకులకు తృప్తిలేదు. ఇంతమాత్రము వేమన్నగారి దానమువాసన తగిలినఁ జాలును. దేశములోని వారందఱును, కలవారును లేనివారును, ఇతనివంటియింటనే వచ్చి కూర్చుండి కాపురము చేయుదురు! ఇఁక నింటిలోని యాపెసమాచారము మన మెఱుఁగుదుము. ఇంకను వినుఁడు.—

"ఆ. భాగ్యవంతురాలు పరుల యాఁకలి దప్పి
తెలిసి పెట్టనేర్చు తీర్పనేర్చు;
తనదు దుష్టభార్య తనయాఁకలియె కాని
పరుల యాఁకలెఱుఁగ దరయ వేమ" (౨౮౩౩)

ఈయవస్థలో ఈయతిథిపూజకుఁ గావలసిన ద్రవ్య మెందుండివచ్చును? ఊరక యింటఁ గూర్చున్న జరుగదని సంపాదనకుఁ బ్రయత్నించి కొన్నాళ్ళవఱకో యొకరాజును గొలిచి చూచెను. కాని యా కాలపుసామాన్యరాజుల సమాచారము వేఱుగా చెప్పఁబనిలేదు. మఱియు ఈ వట్టి వెచ్చగానికి వలసినంత జీతమిచ్చిన, వారికితఁడు చేయఁగలిగిన సేవమాత్ర మేమియున్నది? కత్తిఁబట్టి యుద్ధముచేయు నేర్పున్నట్లు తోఁపదు. ఇఁక వారితో నిచ్చకాలాడి వారిని ఇంద్రచంద్రులని పొగడఁగల యోర్పును ఇతనికి లేదు. కోపము వచ్చినచో పద్యాలతో తిట్టఁగలఁడంతే. తుద కదియే జరిగినది.—

"ఆ. ఎఱుక లేని దొరల నెన్నాళ్ళు కొలిచిన
బ్రతుకు లేదు వట్టిభ్రాంతిగాని
గొడ్డుటావు పాలు గోఁకితే చేపునా?..." (౬౯౧)

రాజుయొక్క మాటే కాఁ దంటూ వదలించుకొన్నాఁడు. కాని ముందుమార్గము? మానమర్యాదలు వదలి ధనవంతులను యాచించి సంపాదింపఁ బ్రయత్నించెను. కాని యిచ్చువాఁడెవఁడు? తుదకు వారికిని రెండు ఆశీర్వాదములు:—

"ఆ. కండ లెల్లఁగోయఁ గానీయఁజాలని
బండలోభి కాసపడినఁగలఁడె?
కొండక్రిందఁ బసిఁడి గోరిన చందంబు..." (౯౬౬)

"క. మృగములు మృగముల నడుగవు
ఖగ నడుగవు పక్షిజాతి తన సరివానిన్
మగవాఁడడిగిన నీయని
మగవాఁడా మగువ గాక మహిలో వేమా!" (౩౨౩౨)

ఎంతటైన ఒకరద్దఱికిచ్చు బుద్ధియున్నను వారు దుర్మంత్రుల చేతి, కీలుబొమ్మలు.

"ఆ. ఇచ్చువాని వెంత నీయనివాఁడున్న
చచ్చుఁగాని యీవి సాఁగ నీఁడు,
కల్పతరువు క్రింద గచ్చచెట్టున్నట్లు..." (౩౮౭)

వేమన్న వ్రాసినాఁడు. కాని కష్టపడువారిని జూచి మొగము త్రిప్పుకొనిపోవు స్వభావ మతనికి సాధ్యము గాదు గావున, అడిగినవారి కష్టము తన నష్ట మేమయినను, 'ఎవరి దైనను, గమనింపక వెచ్చపెట్ట మొదలిడెను.

"ఆ. ధైర్యయుతున కితరధనమైన నెవరేమి?
దానమిచ్చినప్పుడె తనకుఁ దక్కు,
ఎలమి మించుపనికి నెవరేమి సేయును
రడుగుదప్పఁ దప్పు విడుగు వేమ" (౨౧౪౦)

అందుచే సన్మార్గమున పరార్థముగా వెచ్చింపని ధనవంతుని ధనమును వాని యనుమతి లేక మనము సత్కార్యమునకై సెలవుచేసినను పాపములేదని యతఁడు నమ్మెను! మఱియు నదియు నొక ధైర్యకృత్యముగా నతని రెడ్డిరక్తమునకుఁ దోఁచెను!

"ఆ. తనదు సొమ్ముఁజూడ దానమియ్యఁగ వచ్చు
నతని దొడ్డగా దెవరికైన
అదరుబెదరు లేక యన్యుల సొమ్ముల
దానమిచ్చువాఁడు దాతవేమ."*

వేమన యిట్టి యౌదార్యభ్రాంతి ప్రవాహములోఁబడి యింకను చాలదూరము పోయినాఁడేమో యని భయపడవలసియున్నది. చూడుఁడు:—

"ఆ. ద్రోహబుద్ధినైన దొంగతనమునైన
పటిమనైన సాహసమునైన
సంపదవలన సాధించి ధనమును
బడుగునకు నొసంగ బాగు వేమ." (౨౧౯౭)

సత్కార్యసాధనకై దుష్కార్యముతో ద్రవ్యమార్జించినవారు, అరవలలో తిరుమంగయాళ్వారును, తెలుఁగులలో గోలకొండగోపన్నయు మనకు పరిచితులే. వేమన

* 'దానమిచ్చుటేటి తగవొ వేమ' యని వే-నూ. 'దానమివ్వరాదు ధరను వేమ' యని 'వేమనజ్ఞానమార్గపద్యములు.' కాని యిదే ప్రాఁతప్రతుల పాఠము. పద్యార్థపుధాటిని జూచినను ఇట్లే తోఁచును. బ్రౌనుదొర యీపాఠమునే అంగీకరించెను. కాని యీపద్యములు వేమన్నవిగావేమో యని సందేహించెను. (చూ. వావిళ్ళవారి బ్రౌనుప్రతి. పే. ౧౬౧.) కాని నాకా సందేహములేదు. ప్రాచీనులు దుర్మార్గుల ధనము నపహరించి సన్మార్గమందు వెచ్చపెట్టవచ్చునని, వలయునని, చెప్పిరి. చూ. మనుస్మృతి. ౧౧ అధ్యా. శ్లో-౧౯.

నిజముగా పైపద్యమున సూచింపఁబడిన దుర్మార్గమునకే వచ్చియుండెనేని, అట్లు ద్రవ్యమార్జించి రాళ్ళురప్పలలోఁ బోసి గుడులు గట్టిన పైయుద్ధతికంటె, కూడులేక చచ్చువారిని పోషించుటకు వినియోగించిన యతనియందే యెక్కువ న్యాయమున్న దనుకొనవలసియున్నది.

కాని, వేమనవంటి విశుద్ధహృదయమునకు చాలనాళ్లు ఇంటిపనులు, గట్టి యుండుట యసాధ్యము. విశుద్ధహృదయమనఁగా దోషమే లేనిదని కాదు; కపటము, మోసము మొదలగునవి లేనిదనుట. తప్పో యొప్పో తలఁచినది తలఁచినట్లుగాఁ జెప్పి, చెప్పినట్లుగా జేయు త్రికరణశుద్ధి గలవాఁడన్న మాట.

"ఆ. మాటలెల్ల కల్ల మనసెల్ల దొంగయౌ
నేటి ప్రాణమింక నేటి బ్రదుకు!
మాటసత్యమైన మతికెతాయుష్యంబు..." (3౦-౨౬)

కనుక ఈమార్గముతో ద్రవ్యమార్జింప సాధ్యము గాదు. కాని తనది ప్రపంచసంసారము; పథము జరుగుట యెట్లు?

ఈసందర్భమునందే కాఁబోలు ఇతనికి చౌకలోహములను వెండిబంగారులుగా మార్చు రసవాదవిద్యపై మనసు పోయినది. ఇనుము, ఇత్తడి, రాగి, మొదలగు లోహముల పాత్రము లెంత బీదసంసారమందైన నుండును. వాని నెల్ల బంగారుగా మార్పఁగల్గిన యెడల నీతిరిపెపు తంటాలుండవు కదా! ఇందుకై యితఁడు వాదగ్రంథములుకొన్ని చదివియుండును. ఏబైరాగులనో కంసాలులనో యాశ్రయించి యుండును. ఎట్లును అనేకరసవాదయోగముల నితఁడు స్వయముగా చేసి చూచి నాఁడు. ఇంతేకాదు, ఆవిద్యలో సిద్ధినిగూడ బొందినట్లున్నది. కాని 'యితఁడు సాధించిన సిద్ధిస్వరూప మెట్టిది? పైలోహములకు బంగారపుతూకము, వన్నె, మార్దవము మొదలగు గుణములన్నియు పూర్తిగావచ్చునట్లు చేయగల్గెనా! లేక వన్నె మాత్రము గలిగించి తాను వంచితుఁడై లోకమును వంచించెనా! యను ప్రశ్నలకు సమాధానము నే నీయఁజాలను.

ఇఁక నీ రసవాదవిద్యయే మిథ్యయని, మోసమని భావించి, వేమన యీపద్యములు వ్రాయనేలేదని నమ్మి యానందముతో నుండువారు ధన్యులు. కాని నా కంత నెమ్మది లేదు. ఈవిషయమును బోధించు అనేకపద్యము [illegible] యొక్క యనన్యసులభమైన శైలి ప్రతిపదమునందును తాండవమాడుచుండును.

"ఆ, బింబలములుండ బిగువైన ఘరసముండ
పసిఁడి కొలకు తిరిగి పాట్లుపడిరి;
సత్తు వెచ్చఁజేసి సాధింపలేరొకో....." (౨౪౮౯)

"ఆ. ఇంగిలీక మహిమ హేమించనేరక
చిత్రపటము వ్రాసి చెఱచినారు;
బొంతజెముడు పాలఁ బొంగించ నేరరు..." (౩౩౮)

ఇత్యాదిపద్యములు వేమన్నవి కావనువారిని, మఱలనొకమాఱు వేమన్న పద్యములన్ని చదివి యామాట చెప్పుఁడని వేఁడుచున్నాను. అసలీవిద్య మిథ్యయని యేల యనుకొనవలెను? పాశ్చాత్యశాస్త్రముల కిది తెలియదనియా? లేక మనలో నిప్పు డెవరును చేసి చూపువారు లేరనియా? మొదటి పక్షమున తూర్పువారలెఱిఁగి పడమటివారెఱుఁగని విచిత్రవిద్యలు లేవా? ఈజిప్టువారు వేలకొలఁది యేండ్లు పీనుఁగులను కుళ్ళిపోకుండ భద్రముగా పెట్టెలలో దాఁచియున్నారే పాశ్చాత్యులకు దాని రహస్యమర్థమైనదా? మనలో సామాన్యయోగులు నిరాధారముగ నంతరిక్షమందు నిలుతురే (ఇది నేను ప్రత్యక్షముగాఁ జూచినది) యది యేపాశ్చాత్యశారీరకశాస్త్ర ప్రకారము సాధింపవచ్చును? కరఁగిన సీసము కాలకూట విషము మొదలగు పదార్థములను గిన్నెలకొలఁది గటగట త్రాగి జీర్ణించుకొన్న 'స్వామిసీతారామ్‌జీ' యను అద్భుతశక్తిగలవాఁ డిప్పుడును ఉన్నాఁడు గదా; వేలకొలఁది జీతములనుదిను పాశ్చాత్యవైద్యులు, ఏదీ దాని రహస్యమును బైటఁబెట్టనిండు! ఇఁక మనలో వట్టిశాస్త్రములు చెప్పువారే కాని చేసి చూపువారు ఇప్పుడు లేరనుట చాలవఱకు సత్యము. అది యిప్పటి మన సర్వదరిద్రావస్థ. కాని యిదియొక రసవాదమందేనా? గోమటేశ్వరునివంటి అఱువది యడుగుల యెత్తుగల యేకశిలా విగ్రహమును దీర్పఁగలవారు మనలో నేఁడున్నారా? చుట్టుప్రక్కల నామడల కొలఁది చూచినను అఱచేతి వెడల్పురాయి దొరకక, బట్టలుతుకుటకుఁగూడ చెక్కపలకల నుపయోగింపవలసిన దేశమందు, శ్రీరంగపుదేవళమువంటి విచిత్రవిశాల శిలామయమైన మహోన్నత మందిరమును మన ప్రాచీనులు నిర్మించిరిగదా, నేఁటిమనకు కలలోనైన నాశక్తి సాధ్యమనితోఁచునా? ఈ కారణముచేత పైఁజెప్పినవన్నియు మన ప్రాచీనులు చేసినవి కావని తలఁపలేము.

ఇఁక నీవిద్య సత్యమని చెప్పుటకు నీకేమి యాధారమందువేమో; సత్యమని నేను జెప్పలేదు; సత్యము కావచ్చునన్నాను. కారణము ఈ స్వర్ణవాద యోగములను దెలుపు అసంఖ్య గ్రంథములుండుటయే. వానిని వ్రాసిన వారందఱును వంచకులని కాని, భ్రాంతులని కాని చెప్పఁజొచ్చుట సాహసము. నాకంతటి ధైర్యము లేదు. ఇది గాక ఈ విద్యను సాధించుటకై అనేక సంవత్సరములు వ్యయప్రయాసములకు లోనై కొంతవఱకు దాని మర్మముల నెఱిఁగినవారు—పూర్తిగా దానిని తాము సాధింపలేకున్నను, సాధించినవారు ప్రత్యక్షముగా నిస్సంశయముగా రసము మొదలగు వానిని

బంగారముగా మార్పఁగా కన్నులారఁ జూచినవారు—కపటవంచనాదులులేని నిష్కల్మష చిత్తులు—అగుకొందఱిని చెప్పుఁగుదురు. కావున యిప్పటి పాశ్చాత్యుల యజ్ఞానముగాని, మన యజ్ఞానముగాని ప్రాచీనుల యజ్ఞానమును స్థాపించుటకు చాల వని నా మనవి. ఇట్టిసందిగ్ధవిషయములలో లేదనుకొనుటకన్న ఉండవచ్చుననుకొనుటయే యుత్తమమార్గము.

మఱియు ఇందఱు అధునికరసాయనశాస్త్రజ్ఞులలో నల్లవారైనను తెల్లవారైనను ఏవరుగాని, పాశ్చాత్యుల సిద్ధాంతముల ప్రకారము, ఆ గురువుల యుపదేశము ప్రకారము, వారిపద్ధతులనే యవలంబించి లక్షలకొలఁది వెచ్చించి పదార్థపరీక్ష చేయుచున్నారే కాని, ఇట్టి యోగములను చక్కఁగాఁ దెలిసికొని పరీ ..ఆ మును బైలుపఱుపవలెనని పరిశ్రమించు వారేరి? పాశ్చాత్యపద్ధతులకై దిక్కుదిశలేక కోట్లకొలఁది వెచ్చించు 'తాతా ఇన్‌స్టిట్యూటు' వంటి శాస్త్రపరిషత్తువారిట్టి : ము ములకై యేలప్రవేశించి పనిచేయరాదు? ఇట్టి విషయములను మనవారివద్దనుండి సి కొనుట చాలకష్టమనియు, సామాన్యముగా వారుచెప్పరనియు చెప్పుఁగు ం. అర్థముకాని యప్రయోజకములైన మనవారి సంప్రదాయములలో నిదియొకటి. వ శాస్త్రములకు పట్టినపెద్ద చీడపురుగది. కాని సత్యాన్వేషకులని పేరుపెట్టుకొన్న వారిట్టివిఘ్నముల నెదుర్కొన లేక పోవుట, అది కారణముగా అసలేలేదనిచెప్పి యజ్ఞానానంద మనుభవించుట, క్షమింపరాని దోషములు. ఇట్టివారి పేఁడిమాటలకు మందొకటే, ఉదాసీనము.

మఱికొందఱీరసవాద పద్యముల్కు వేఱువిధముగా అపార్థములుచేయుదురు. ఈ క్రింది పద్యము వినుఁడు:—

"ఆ. ఉప్పు చింతపండు నూరిలోనుండఁగా
కరువదేల వచ్చె కాఁపులార
తాళకంబెఱుఁగరొ తగరంబు నెఱుఁగరో..." (౫౩౬)

దీనికి రసవాదజ్ఞు లాకరిట్లు అర్థము చెప్పిరి. "తాళకము అగ్గిసెగకు నిలువని వస్తువు. దానికి అగ్నిజయమును గల్గించి భస్మముఁ జేసిన నది స్వర్ణయోగసాధనములలో ముఖ్యవస్తువగును. ఈపద్యమందాభస్మీకరణ మార్గము చెప్పఁబడినది. తాళకము తగరపురేకులో చుట్టి పెట్టిమీఁద చింతపండుమెత్తి క్రింద మీఁద నుప్పుపోసి పుటము వేసిన అది భస్మమగును. తరువాత దానిని ఇతరలోహములతో చేర్చి పుటము వేసిన బంగారు సులభముగా నగును." కాని యీ సులభవిషయమే రహస్యమట! దాని నెఱుఁగుటయే కష్టమఁట! కాని, తాళకమును తగరమును, ఉప్పుచింతపండ్లతో చేర్చి ః న్నారో క్షారయోగా చేయు (క్రొత్తపాకశాస్త్రి) మర్మమొకటి తెలియుఁడుటకును, పైపద్యము

నకు మీరు చెప్పిన యర్థమువంటిదేదో కలదని మనమంద అంగీకరింపవలసి యున్నది గదా. కాని ఈవాదవిద్యలో సత్యమేమియు లేకయో, ఉన్నను హిందువులీవిద్యను నేర్చియుండరను నూహ చేతనో, నేర్చియుండినను వేమన్నవంటి విరాగి కీవిద్యయం దాశ కాని ఆసక్తి కాని యుండదని తలంచియో, బ్రౌనుదొర ఈపద్యమున కొక విచిత్ర విపరీత వ్యాఖ్య చేసెను. ప్రతిపదార్థము తెలుగున వ్రాసి తరువాత,

"That is, I advise you to poison yourselves either with natural poisons or with immoderate quantities of salt or tamarind acid" "అనఁగా మీరు (కరువువచ్చినపుడు) సహజములైన విషములను గాని, లేక మితిమీరిన ఉప్పును చింతపండుపులుసును గాని భక్షించి ప్రాణములు వదలుఁడు" అని వేమన్న క్షామమునకు చావును మందుగా హితోపదేశము చేసెనని భావము వ్రాసెను! *

ఇఁక వేమన పద్యములన్నిటి యందును వేదాంతార్థము కలదనుకొని మనవారొకరు వ్రాసిన వ్యాఖ్య మచ్చుకు :—

"దీనికి రహస్యార్థముగలదు :—ఎట్లనగా ఉప్పు నీళ్ళలో వేసిన యెడలఁ (అనఁగా అది పుట్టుచోట) ఎట్లు కరిగిపోవునో అట్లే యీశరీరము నశించి పోవును. చింతపండు ఎట్లు పైబెరడున్ను లోపలిగింజయున్ను పండును అంటుకొనియు అంటుకొనకయు నున్నదో అట్లే సంసారములో నుండువాఁడును భార్యాపుత్రాదుల యెడ అంటి అంటక యుండవలయును. తాళింబు నిప్పులో వేసినయెడల ఎట్లు మాయమై పొగగా పోవునో అట్లే ఈ శరీరమును నిప్పులో వేసినయెడల కాలిపోవును. తగరమెట్లు భూమిలో వేసినయెడల సన్నతావు తెలియక నశించిపోవునో అట్లే ఈశరీరమును నశించి పోవును. కాబట్టి మీరు దీనినంతయు చూచుచుండియు దుర్భిక్షము సంభవించెనని దుఃఖించ వలదని భావము. ఇంతే యీపద్యార్థముగాని బంగారము చేయుదానికై చెప్పినట్లు భ్రమపడ గూడదు" †

ఇన్ని తొందరలేల? వేమనగూడ నొకానొక కాలమందు దీని నమ్మియుండెనేమో పోనిమ్ము నమ్మకొనినయెడల ప్రపంచము మునిఁగిపోవునా? పోనిండు. ఈ సందర్భమున ఇటీవల జర్మనీలోనో జపానుదేశమందో యొవఁడో శాస్త్రజ్ఞుఁడు రసమును బంగారముగా మార్పఁగలిగినాఁడని పత్రికలలో నెల్ల ప్రకటింపఁ బడిన విషయము మీజ్ఞప్తికిఁ దెచ్చుచున్నాఁడను. అది యసత్యమని మరలఁగొన్ని పత్రికలలో ప్రకటింపఁ బడెననియు నామిత్రులొకరు చెప్పిరి. ఇది యసత్యమని దృఢము గావమ్మి

* ఓ. లై. ఈ ప్రతి నంబరు గుర్తు వేయుటలేదని )

† (వేదాంతసిద్ధాంతము. పు. ౬౧)

మనమే నెమ్మదిగా నున్నాము గాని, పరదేశమువారింకను ఈ విషయమై కష్టపడు చునే యున్నారు. ఇంతలోనే యెప్పుడో దీని తత్త్వము వారికంఖములోఁబడిరాఁగా అప్పుడా తీర్థమును మనము భక్తితో నెత్తిపై ప్రోక్షించికొని పవిత్రుల మగుదుము! అదియట్లుండె.

రసవాదములో పరిశ్రమించిన వారికి వైద్యము సహజముగా లభించును. 'వాదభ్రష్టో వైద్యశ్రేష్ఠః' అను మాట మీ రెఱుఁగుదురు. అట్లే వేమనకును కొంత వైద్యము వచ్చినట్లున్నది. కుక్క కఱచినందు కితని చికిత్స.—

"ఆ. కుక్క గఱచెనేని కూయనీయక పట్టి
ప్రక్క విఱుఁగఁదన్ని పండఁబెట్టి
నిమ్మకాయఁదెచ్చి నెత్తిన రుద్దిన
కుక్క విషము దిగును కుదురు వేమ" (౧౧౧౬)

ఈ చికిత్సను దప్పించుకొనుటకైనను నాకెప్పుడును కుక్క కఱవకుండ భైరవుని ప్రార్థింప వలసియున్నది! ఇదిగాక,

"భూమి క్రొత్తయైన భుక్తులు క్రొత్తలా" (౬౩౪)

"అంటనీయక శని వెంటఁదిరుగు" (౬౬౬)

యను నిట్టి కొన్ని మాటలచే వేమనకు కొంచెము జోస్యమును తెలిసినట్లున్నది. కాని యంతలోనే "జ్యోతిషము జనముల నీతులు దప్పించు" (౨౩౧౫) ననుకొని చాలించుకొన్నాఁడు.

ఈ రసవాదవిద్య నేర్చి వేమన్న యెంతయో సంపన్నుఁడయ్యెనని యూహింప వీలులేదు. ఈవిద్య ముఖ్యముగా విరక్తులగు బైరాగులవద్ద నుండును. దీనికొఱకై వేమన్న మొదట కంసాలి వారినిగూడ నాశ్రయించినట్లున్నది. వారు దొంగలని యెవరో తిట్టఁగా నిట్లు వాదించెను:—

"ఆ. కల్లలాడుదురిల కంసాలి దొంగని
అతని సొమ్మికెట్లు అతఁడు దొంగ!
మన్ను బంగరుగను మఱిచేసి పెట్టఁడా?..." (౯౫౧)

కాని యితఁ డాశ్రయించిన కంసాలిగురువు, సామాన్యముగ నిట్టి రసవాదగురువుల వలె, తుదకు 'దగా' చేసెనేమో. కావున కోపించి, విసిగి, "కంసలికని మించు కడజాతి లేదయా" (౩౧౯౪) యని యాసులమునకే యొక్క తిట్టుతిట్టి తరువాత బైరాగుల నాశ్రయించెను గాఁబోలును. ఇతనికి గురువనఁబడు 'లంబికాశివయోగి' యీ తెగవాఁడే యనుకొనుచున్నాను. వీరిసేవచే వాదము వైద్యము వచ్చుటతు తోడను, వీరి సహవాసము వేమన్న జీవితమునకే గొప్పమార్పును గలిగించినది. దానిని గూర్చి ముందు విన్నవింతును.

శ్రీః

నాలుగవ యుపన్యాసము

# వేమన కాలమందలి మతధర్మముల స్థితి

వేమనకు ఇంటిసంసారమునందు కలిగియుండవచ్చునట్టి పరిణామములను కొన్ని యిదివఱకే నూహించితిమి. దీనికన్నను పెద్దసంసార మొకటున్నది. సంఘము, ఆలుమగల కలహము, బిడ్డలకు నిష్ప్రయోజకత్వము, దారిద్ర్యము—మొదలగునవెన్ని యుండినను వేమనవంటివాని యొక్క మనసు అంతగా చెదరియుండదు. అరాచకము, అజ్ఞానము, స్వార్థపరత, వంచన, మొదలగు నన్యాయములచే తన కాలపు సంఘము పడుచున్న యవస్థ వేమనను 'ఇంటిలోని పోరు' కన్న ఎక్కువగా కలతపెట్టినది.

నాలుగు పురుషార్థములలో ఇప్పటి సాంఘిక రాజకీయ పరిణామములను గలిగించు ప్రధానశక్తి కామసాధకమగు నర్థము. ప్రాచీనసంఘమును, రాజ్యమును ముప్పుతిప్పలఁ బెట్టినది మోక్షసాధకమగు ధర్మము. అనఁగా, ఇహలోక సౌఖ్య కాముకులై దానిని సాధించు నర్థమును సంపాదించుట. తన్మూలమున సంఘమును బలవంతముగాఁ జేసికొని రాజకీయస్వాతంత్ర్యమును సాధించుట, ఇప్పటి మన పరాయణము. మోక్షధర్మముల చింత యెవరో కొందఱు వ్యక్తులను కలతపెట్టవచ్చును గాని మొత్తముమీఁద మనము కాముకులమగు అర్థికులము. ప్రాచీనులలో నిట్లుగాక మోక్షధర్మములను గూర్చిన సంస్కారము చిన్ననాఁటినుండి ప్రజలకు బోధింపఁబడుటచే వారి కార్యాకార్యములను అదే నిర్ణయించుచుండెను.

అనఁగా నిప్పటి వారందఱును అధార్మికులైన భ్రష్టులని కాని, ప్రాచీనులందఱును ముక్తులగు ధర్మావతారులని కాని చెప్పరాలేదు. మఱియు ఇప్పటి మనమందఱును కుబేరులము, మన్మథులమునై వారందఱు బికారిసన్యాసులుగానుండిరనియుఁ జెప్పుట నాయభిప్రాయము కాదు. పంచేంద్రియములును హృదయమును వారివలె మనకున్నవి. మనవలె వారికినుండినవి. కావున ఇహలోకమందలి సుఖస్వాతంత్ర్యములందాశ కాని, ఇందలిబంధముల నుండి తప్పించుకొనవలెనను కోరికగాని యిరువురికిని సమానమే. అప్పటి ధర్మమెంత మంచి చెడ్డలను జేసినదో యిప్పటియర్థమును అంతే

చేయుచున్నది. ధర్మబుద్ధితో సర్వశక్తులను వెచ్చించి సత్రములు, సోపానములు, చెఱువులు, కాల్వలు మొదలగునవి నిర్మించి పరోపకారముతో జన్మము సార్థకము చేసికొనిన త్యాగశీలురు వారిలోఁగలరు. ధర్మభ్రాంతితో జనులను హింసించి, చంపి, దోచి, దొమ్మిచేసినవారును వారిలోనుండిరి. అహోరాత్రమును అన్వర్గనచేసి ప్రజాభివృద్ధి కెంతయు వెచ్చించువారు నేఁడును గలరు. అక్షరలక్షలిచ్చినాఁడని చెప్పఁబడు భోజరాజుకన్న అజ్ఞానులై చెట్టగా రెమిటటువంటి నంగతి ? ఇట్టి ద్రవ్యలోభముచే ఇతరులను వశపఱుచుకొని నిర్గతికులనుగాఁజేసి వారిజాతినీతిజీవనములను ధ్వంసము చేయుచున్న వ్యాపారులిప్పటి ప్రపంచమున ననేకులుండుట మీ రెఱుఁగనిది కాదు.

కావున నేనిందు ధర్మమనుపదమును న్యాయమనునర్థమందుపయోగింపలేదు. సామాన్యవ్యవహారములలో నీరెండుపదములును ఒకటిగానే వాడఁబడుచున్నను మన మిప్పుడు కొంత భేదమును గల్పింపవలసి యున్నది. న్యాయము, మనుష్యుని హృదయమునందు సహజముగా జనించు దయ, దాక్షిణ్యము మొదలగు సద్భావములచే నిర్ణయింపఁబడును. ధర్మము ఒక జాతితో వ్యక్తితో గలయోగక్షేమములు కలుగవలయునని తప్పక యాచరింపవలననదిగా పెద్దలు ఏర్పఱచిన నియమము. న్యాయము ఎవరికిని కష్టనష్టములు రాకుండఁ బ్రయత్నించును. ధర్మము ఎవరి కష్టసుఖములను గమనింపదు. న్యాయము ధర్మము గావచ్చును, ధర్మము న్యాయము కావచ్చును ; కాని అయిరేయే తీరవలయునని నిర్బంధములేదు. శైవునిఁజూచిన సచేలస్నానము చేయవలయుననుట వైష్ణవుని ధర్మము ; కాని న్యాయము కాదు. పంచములను గూడ మనవంటి మనుష్యులుగా భావించి దగ్గఱకుఁ జేర్చుట న్యాయము ; కాని హిందువుల ధర్మము కాదు. అనఁగా న్యాయము మనుష్యజాతి సామాన్యము ; ధర్మము అవాంతరభేదములకు చేరినది. న్యాయమునకు ఇహలోకమందు దృష్టి, ధర్మమునకు పరలోకమందు. కావున న్యాయము సార్వకాలికము : ధర్మము మార్పులకు లోఁగునది. పరలోకదృష్టి చాలవఱకు నశించిన యీ కాలమందు ధర్మము నశించుచున్నది. పరలోకము అతీంద్రియ వస్తువుగావున దానియందు నమ్మికగలవారు తమయనుభవముకొలఁది, అనుమానము కొలఁది, దానిని సాధించుటకు వేఱు వేఱు మార్గములను వెదకుదురు. వెదకలేనివారు తమకెవరియందు గౌరవముగలదో వారిమాటనమ్మి వారు చెప్పినత్రోవ నడతురు. ధర్మభేదమిట్లేర్పడును. ప్రకృతము ఆనమ్మిక చాలవఱకు నశించుచున్నదిగావున ఆభిన్నధర్మములును మనలో నశించుచున్నవి. ఇందుచే మనకు నష్టమా లాభమాయను విషయము ఎవరియంతకు వారే పరలోకయాత్ర యొదిగివచ్చినప్పుడు, నిర్ణయించుకొనవలెను గాని వేఱుమార్గము గానను, అదియిట్లుండనిండు.

ప్రాచీనులు మోక్షకాంక్షులంటిని. అనఁగా ఆధునికులకు మాత్రము మోక్ష మక్కఱలేదా! మోక్షమునుగోరుట మనుష్యస్వభావము. కోరక యుండుట యసాధ్యము. తక్కినజీవరాసులకంటె మనుష్యునకు విమర్శను ఊహ యను రెండు మనోధర్మము లెక్కువగా నుండుటచే, ఫలమున్నను లేకున్నను దాఁచినవిషయములను విమర్శించుట, తెలియనిదానిని నూహించుట, అతనికి సహజములైనవి. దశదిక్కులందు ఇన్నివిధములని కాని యింతసంఖ్య గలవని కాని తెలియరాని చరాచరవస్తువు లెచ్చటఁజూచినను గలవు. వానిలో గొన్ని పరస్పరము మిత్రములు; కొన్ని శత్రువులు; కొన్ని రెండును గానివి. ఇవి యేల యున్నవి? రూపము, రుచి, వన్నె, పరిమాణము, గుణము, శక్తి మొదలగు నన్ని విషయములందును ఇవి యొకదానివలె నొకటి యుండక పోవుట యేల? ఇవి పరస్పరసుఖదుఃఖముల నెందుకు కలిగించును? ఇవి పుట్టుట, పెరుగుట, చచ్చుట యేల? మఱియు అట్లనఁగా నేమి? వీని యసంఖ్య క్రియలన్నియు తమంతటనే జరుగుచున్నవా! వీనిని మార్పసాధ్యము లేదా?— ఇత్యాదిప్రశ్నలకు ప్రత్యుత్తరమును గోరుట, తెలియక పోయిననేమో చింతపడుట, మానవధర్మము, ఇట్లు తెలియవలెనను నాశ గలిగియు తెలియలేక పోవుట మనుష్యునకుఁగల యన్నిబంధములలో మొదటిబంధము. చలి వేఁడులు, పుట్టుచావులు మొదలగుబంధములు తక్కిన సృష్టిలోని వస్తువులకువలె మనుష్యునికిని సమానమైనను ఈబంధ మొక్కటి యితనికెక్కువగాఁగలిగి, తక్కినవానికున్న నైశ్చింత్యసుఖమును ఇతనికిలేక పోయి, బ్రతుకు సహింపరానిదైనది. నాఁటినుండి నేఁటివఱకును మానవజాతిప్రయత్న మంతయు ముఖ్యముగా నీయజ్ఞానబంధమునుండి తమ్ము వదలించుకొనుటకే వినియోగ మగుచున్నది. ఈసహజమైన ముక్తికాంక్ష నాకస్మికముగా వదలుటకు ఆధునికులందరు తటాలున పశువులో పశుపతులో కాలేరు గదా! ఆబంధమట్లే యున్నది. తెగలేదు. తెంచుకొను ప్రయత్నములును నిలువలేదు. కాని తెలిసికొనుటకు వేఱుమార్గము వెదకుచున్నారింతే. ప్రాచీనులు సర్వసందిగ్ధమైన యీసృష్టిని సముదాయముగాఁ బరీక్షించి, ప్రతివస్తువునందును గలుగు సందేహమును ప్రత్యేకముగాఁ దీర్చుకొనుట యసంభవముగా నెఱిఁగి, ఈవిచిత్ర వైరుధ్యమునకు మూలకారణ మొకటి యుండవలయునని నిశ్చయించి, తమ ప్రయత్నమంతయు నాప్రక్కకుఁ ద్రిప్పి పనిచేసిరి. ఫలమేమనఁగా ఒక్కొక్కరి యూహయు అనుభవమును వేఱువేఱు కారణములచే వేఱువేఱుగా నుండుటచేత, ఆమూలమూర్తి యొకటియైనను ఒకవిధముగా నుండక, పలువిధములుగా మాఱి మనకష్టమును మఱింత హెచ్చించినది. అది సగుణమని కొందరు, నిర్గుణమనికొందఱు, శూన్యమని కొందఱు రెండును గానిదని కొందఱును తలంచిరి; బోధించిరి. ఇఁక సగుణమూర్తి యని

యంగీకరించిన వారిలో నెన్ని సిద్ధాంత భేదములు? దానియాకారము, లింగము, వర్ణ్నె, అవయవములు, గుణము, భాష మొదలగు దేనియందును ఒకటివలె నొకటిలేని వేఱువేఱు రూపము లామూలమూర్తికి వచ్చినవి. ఇట్లు చెఱసాల వదలి పోవలయు నని ప్రయత్నించి వాకిట కాలుపెట్టఁగనే ఉన్న సంకెళ్లు వదలుట యట్లుండ క్రొత్త సంకెళ్ళు వచ్చినట్లయ్యెను! అన్ని బంధములకన్న పెద్దబంధము మోక్షమే యయ్యెను! కావున నీమార్గము ఫలములేదని అధునికులగు పాశ్చాత్యులును వారినాగరకత ననుసరించినవారును, కంటికిఁ గానవచ్చు పదార్థము నొక్కొక్క దానిని ప్రత్యేకముగ పగులఁగొట్టి యంగాంగములు పరీక్షించి, దానిగుణనియమాదులను గనిపెట్టి, ఆపదార్థ విజ్ఞానమూలమున సృష్టి రహస్యములఁ దెలిసికొన యత్నించుచున్నారు. కాని యీబావిని ద్రవ్వినకొల్ల భూతములు బయలుదేరుచున్నవి! ఈ యిసుకపాతర కంతేది? మఱియు నెన్నఁడును మనుష్యునిచేతికందని, కొలఁతకుఁ జిక్కని పదార్థములు ఖగోళాదులు కోట్లకొలఁదిఁ గలవు. వానిని దెలిసికొనుట కనుమానముతప్ప వేఱేమిమార్గము! కావుననే సూర్య చంద్రాదులనుగూర్చి అధునికుల యూహలు వింతవింతలుగా బయలుదేఱుచున్నవి. ఇంతకష్టపడి మనుష్యజాతి బ్రతికినన్నాళ్ళు పరీక్షించి పరీక్షించి తమ సంపాదించినజ్ఞానమును వ్రాసిపెట్టినను, అదియే వేఱొక సృష్టి యంతయై, యొకమనుష్యునికే కాదు, అందఱుఁజేరినను జీర్ణించుకొన వీలులే నంత యైపోవును గాన, ఇందుచే బ్రదుకు మఱింత కష్టమే యగునేమో! మఱియు ఇట్లు వస్తువులను ప్రత్యేకముగా పగులఁగొట్టి పరిశోధించుటచేత, ఇదివఱకును మన మెఱుఁగనివానియందలిశక్తులు కొన్ని యెఱుఁగగలము: వాని నుపయోగించుకొని బ్రతుకులో కొన్ని యనుకూలములను కల్పించుకొనఁగలము: 'ఇది యెట్లు?' అని యడిగిన కొంతవఱకును జవాబియ్యఁగలము. ఇదియొక విధమైన చిన్న మోక్షము. ఇంతే కాని యీప్రపంచమేల యిట్లు జరుగుచున్నది? దీనికి మూలమేమి? ఇత్యాది ప్రథమ ప్రశ్నలకు ప్రతిధ్వనితప్ప వేఱుప్రత్యుత్తరము గలదా? ఇట్లు అధునికులు మోక్షమును సంపాదించుటకై వేఱుమార్గమునఁ బ్రయత్నించి ప్రాచీనులవలె తుదకు బద్ధులే యగుచున్నా రింతే కాని వారు మోక్షద్వేషులు గారని చెప్పవచ్చి చాలఁ బెంచితిని.

ఈమోక్షదృష్టియే ప్రాచీనులను ధార్మికులనుగాను అధునికుల నార్థికులనుగాను జేసినది. పరలోకసుఖము వారిపరమార్థము, ఇహలోకసుఖము వీరి పరాయణముగాఁ బరిణమించినవనుట వేఱుగా చెప్పఁబనిలేదు.

వేమన యిట్టి ధార్మికులగుంపులోఁ బుట్టినవాఁడు. అతని కాలమునకు చాల నాళ్ళ క్రిందనే మనలో మోక్షధర్మములు వేఱువేఱుగా స్థిరములై యేర్పడినవి. వాని

సత్యమును సందేహించుటయే పాపమని తలఁపఁబడెను. మఱియు, ప్రత్యేకవ్యక్తులకు సంబంధపడవలసిన, అనఁగా ఎవనికిఁ దక్కువాఁడు పరీక్షించి నిర్ణయించుకొనవలసిన, మోక్షధర్మములు సంఘమునకుఁ జేరి, ఆసంఘము వారందఱును కాని యుద్ధకారణమునకు లోపడవలసి వచ్చుటచేత, తమ స్వతంత్రబుద్ధి నుపయోగించు ధైర్యమే ప్రజలకు నశించియుండెను. ఏజాతిలోఁ బుట్టినవాని కాజాతిలో పెద్దలు నిర్ణయించిన ధర్మమే సత్యమైన మోక్షపథమని నమ్ముట, ఇతరమతములు నీచములు, అసత్యములని, తిరస్కరించుట, వైరంటిని సాధించుటకుఁ గావలసిన తర్కశాస్త్రకౌశల్యము సంపాదించుట—ఇవి చిన్ననాఁటినుండి మనుష్యులకు నేర్పఁబడుచుండెను. ఇందుచే భుక్తి గోరి సంభవించు రాజకీయకలహములకన్న, ముక్తిని నిర్ణయించు మతకలహములే ప్రబలములై సంఘము నావరించి, దేశము నన్యాక్రాంతముచేసి, పరలోక మోక్షమెట్లున్నను, ఇహలోకబంధము ముడిని మఱింత బిగువుచేసెను.

ఆ కాలమందు మనదేశము నవ్యాప్తిలోనుండిన ప్రధానసిద్ధాంతములు రెండు: ద్వైతము, అద్వైతము. బహుదేవతావాదులైన జైనులు ఆంధ్రదేశమును చాలనాళ్ళ క్రిందనే వదలిపోయిరి. వారాంధ్రదేశమందు మతవ్యాప్తి కెక్కువ ప్రయత్నించిరా యను విషయమే సందిగ్ధము. శూన్యవాదులైన బౌద్ధులన్ననో భరతఖండమందే నిలువ నీడలేక వలసపోయిరి. పాపమిఁక ఇట్లు తలకందని విషయములకై తగవులాడలేక, కన్నులకుఁ గానవచ్చినదే సత్యమనియు తక్కిన దంతయు మిథ్యయనియుఁ దలఁచి, 'అప్పుచేసియైనను నేయిద్రాగి చావవలయు' నని నిర్ణయించిన సుకుమారబుద్ధులు చార్వాకులు, అన్నిమతములవారికిని శత్రువులై బ్రదుకు బెరుపుగానక యంతర్ధానమే యైరి. సృష్టిచేసిన వాఁడు, సకలకళ్యాణ ఈ చరాచర ప్రపంచమును వినోదమునకై గుణములచే నిండినవాఁడు, దుర్గుణశూన్యుఁడు. దీనిని రక్షించువాఁడు, తుదకు తన కిష్టము వచ్చినప్పుడు ధ్వంసముచేయువాఁడు నగు చేతన మూర్తి యొకఁడు గలఁడనియు, అతని నారాధించి భక్తిచే ప్రసన్నుని జేసికొంటిమేని తనలీలాసృష్టియందలి బంధములను దప్పించి, మనలను తనవంటి నిర్గ్వంద్వులను గాఁజేసి, తనవద్ద స్థిరముగా నుంచుకొనుననియు, అదే మోక్షమనియు, సగుణ బ్రహ్మవాదులగు ద్వైతులు తలఁచిరి. వీఁకి విరుద్ధముగా బ్రహ్మ యొక్కటే సత్యమనియు, తక్కిన నామరూప విశిష్టమగు ఈ చరాచర ప్రపంచమంతయు మిథ్యయనియు, బ్రహ్మకే యొక్కొక్కమాఱు మాయ యావరింపఁగా, ఇట్లు వేఱువేఱు గుణరూపములు గలిగినట్లు గానవచ్చునే కాని, యది నిర్గుణమనియు, కావున ప్రతివస్తువును - మాయావృతమైన బ్రహ్మమే యనియు, ఇట్లు 'నేను బ్రహ్మను' అనుజ్ఞానమును సంపాదించి అవిరతముగా అట్లే ధ్యానము చేయుచుండిన న్యాయభేదానుభవము గలుగుననియు, అదే మోక్షమనియు

నిర్గుణైకబ్రహ్మవాదులగు నద్వైతులు తలంచిరి. కాని యీయద్వైతజ్ఞానమును అనుభవపూర్వకముగా సాధించి ద్వైతబంధమునుండి విముక్తిని జెందుటకు సామాన్యులకు సాధ్యముగాదనియు, దానికిఁ గావలసిన ఓర్పు, దార్ఢ్యముసంపాదించుటకు మొదలు సగుణమగు వస్తువు నుపాసింపవలయుననియు, అట్టిదైన యొక మూర్తిని సర్వసద్గుణపరిపూర్ణమగా ధ్యానించుచుండిన నది నిర్గుణోపాసనకు దారి చూపుననియు, నిది లేనిదది యసాధ్య మనియు అద్వైతులు తలంపవలసివచ్చెను.

"క. ఉడుగని సగుణోపాస్తికిఁ
గడఁగక నిర్గుణమె యాడిఁ గైకొనినన్ జె
ప్పెడిదేమి యడుగుపోయిన
కడవను బోసిన జలంబు కైవడియె కదా"

(శివయోగ సారము. ౫-౧)

కావున అద్వైతవాదులందఱును చిన్ననాఁటనుండి సగుణబ్రహ్మోపాసనయే చేయవలసివచ్చెను ఫలితముమనఁగా, వారిలో తొంబది పాళ్ళు సగుణబ్రహ్మవాదుల పూజలు, ఉత్సవములు, వేషములు, వినియోగములు మొదలగు నన్నిపద్ధతులను నవలంబించి, సిద్ధాంతమునకద్వైతులైనను వ్యవహారమునకు ద్వైతులేయై యంతటితోనే తృప్తిఁ బొందిరి. సగుణోపాసకులకును వీరికిని భేదము లేక పోయెను. అప్పటికి హిందువులలో ప్రధాన దేవతలై పరస్పరము భిన్నులైన శివుఁడును, విష్ణువును ఒకటే బ్రహ్మయొక్క పరిణామరూపములేయని చెప్పి 'శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే', యని యొకవిధముగా సమాధానము చేసికొనిరే కాని, సర్వమును బ్రహ్మయే యను మహోదారమతమునకుఁ జేరినవారయ్యు 'శివాయ బుద్ధరూపాయ' యని కాని, 'జినరూపాయ' యని కాని చెప్పఁగలిగినంత విశాలసంస్కారము వారికిఁ గలుగకపోయినది. వారినిగాని వీరినిగాని ప్రత్యేకముగఁ గొలుచుననుకూలము తప్పి, యిద్దఱికి మ్రొక్కులు చెల్లించుట, ఇద్దఱికిని దేవళములు గట్టుట మొదలగు పనులలో ద్విగుణవ్యయమునకు పాల్పడవలసి వచ్చెను. కొందఱు బుద్ధిమంతులీకష్టమును దప్పించుటకు ఈ రెండుమూర్తులను ఒకటే దేవళమున నొకటే మూర్తిలోఁ జేర్చి హరిహరస్వామి యనుపేరఁ గొలువఁజూచిరి కాని, వేషము, వన్నె, గుణము, శక్తి మొదలగు నన్నిటియందును పరస్పరము భిన్నులైన ఈ రెండు మూర్తుల నేకీకరించుట మనుష్యశక్తికి మీఱిన పనిగావున నా ప్రయత్నము సఫలము గాలేదు.

నిర్గుణ బ్రహ్మవాదులగు నద్వైతుల యవస్థయే యిట్లైన నిఁక సగుణ బ్రహ్మవాదుల పరిణామము నడుగవలెనా? గుణమనుపదార్థము చెప్పుడు అంటఁగట్టితిమో అప్పుడే అగుణము, మన యనుభవము, అభిరుచి, వీని కొలఁది మాఱును. మనుష్యుల

కొందఱకు ఒకటేవిధమగు అనుభవమును అభిరుచియుఁ గల్గువఱకును వారి యుపాస్యమూర్తి యేకరూపము సంభవింపదు. కావుననే మాధుర్యము, సౌందర్యము ప్రధానముగాఁ గల మహావిష్ణుమూర్తిని కొందఱు ధ్యానించి పూజింపఁగా, మఱికొందఱు, ధైర్యము, శౌర్యము, నిరర్గళవిక్రమమును గల పరమశివుని నుపాసించిరి. ఇంతటితో నిలుచునా? మనుష్యుల యోగ్యత, సంస్కారము, సమయము, సందర్భము—వీనినిబట్టిగూడ వేఱువేఱు గుణములయందభిమానము గల్గుట సహజముగావున, పైహరిహరవ్యక్తులందు జారత్వము, చోరత్వము, పక్షపాతము, కపటము మొదలగు గుణములు చేరఁగల్గినవి! ఇట్లు సృష్టిలోని రహస్యములను దెలిపి బంధమోక్షములను నొసఁగునవిగా నేర్పడవలసిన యీ హరిహరమూర్తులలో పరస్పరభేదమట్లుండఁగా ఒక్కొక్క మూర్తియును అనేక భేదములు గలదైనది. ఉపాసనసాధనములుగా నుండవలసిన విగ్రహములు దేవతలుగానే తలఁపఁబడెను. సంఘదేవతలు జాతిదేవతలుగను, ఊరిదేవతలుగను, ఇంటిదేవతలుగను అవతారభేదములు దాల్పవలసివచ్చెను; ఉపాస్యదేవతలలో నిన్ని భేదములున్నప్పుడు ఉపాసకులలో భేదములుండుటలో విచిత్రమేమి? ఉపాస్యదేవతలమాట యట్లుండఁగా, మనుష్యులలోనే కాలము, దేశము, సంస్కారము, వాడుక, స్వభావము—మొదలగు వానిచే నసంఖ్యభేదము లేర్పడును గదా. అవన్నియు నుపాస్యదేవతయందును సంక్రమించును. చూడుఁడు. మాధ్వులకును రామానుజీయులకును దేవత యొకటే కదా. ఇరువురును ఊర్ధ్వపుండ్రము (నిలువునామమును) ధరించువారే. కాన వారిదేవతకును ఊర్ధ్వపుండ్రమే వేషమైనది. కాని యది గోపీచందనముతోనా తిరుమణితోనా యనుటలో భేదము గలిగినది. మాధ్వులదేవత గోపీచందనపుదేవత; శ్రీవైష్ణవులది తిరుమణి దేవత. వీరిలో తిరుమణిపుండ్రము రెండు తెఱఁగులు: తెంగల, వడగలయని. శ్రీరంగములో తెంగల రంగనాథుఁడు; కుంభకోణములో వడగల శార్ఙ్గపాణి. ఈ యిరువుర నామముల కలహము నింకను ఏకోర్టువారును తీర్పఁగలుగలేదు. భేదమునకు తరువాతి మెట్టు ద్వేషము. ఒకరిపై నింకొకరి కసహ్యము. పరస్పర కలహములు. ఇట్లు మోక్షమునకై యున్న ముప్పుత్రిప్పులఁబడి తుదకీ మొసలినోటికే వచ్చి పడినట్లైనది మనుష్యుల యవస్థ!

ఎప్పుడిట్లు సగుణనిర్గుణవాదములు రెండును ఏకమై సత్యమును నిర్ణయించుటకు బదులు సంసారమును వృద్ధిచేయుటకే మొదలుపెట్టెనో, అప్పుడే తత్త్వజ్ఞానమునకుఁ గావలసిన నిష్పక్షపాతము, విరక్తి మొదలగు సదాచారగుణములు నశించి, స్వార్థపరత, స్వాభిమానము మొదలగు సంసారిలక్షణములు మతములలో చేరినవి. బ్రాహ్మణులలో సన్యాసులు కర్తృత్వమును వదిలిపెట్టి మఠములను చేసికొని, చాలవఱకుగా స్వాధీనము చేసికొనిరి. తక్కినవారికి మతబోధచేయుటనెడు ధర్మములచే వారిని తమమతము

నకుఁ ద్రిప్పుకొనుచు, జనుల కులాచారముల నిర్ణయించి, బహిష్కారములు, పాదతీర్థములు, ప్రాయశ్చిత్తములు మొదలగు మార్గములచే సంభావనలు సంపాదింప మొదలిడిరి. యమనియమములు నిత్యకర్మములుగాఁ గలిగి, విరక్తి జాతిధర్మముగాఁ గలిగి, 'స్వస్తి ప్రజాభ్యః' అనియు 'జనయతు జగతాం శర్మ వైకుంఠనాథః' అనియు నిత్యజపము చేయుచు, ప్రజాసేవకై దారిద్ర్యమే వ్రతముగాఁ బూనవలసిన విప్రులా కాలమం దెట్టులుండిరో, యీక్రిందిపద్యమునం దొకానొక బ్రాహ్మణపండితుఁడే యిట్లు వర్ణించినాఁడు.

"జారాంశ్చోరాన్ కిరాతాన్ జనపదమథనాన్ రాజపాశాన్ మహీశాన్
శిష్యాన్ కృత్వాఽతిమత్తాః శ్రుతినయవిధురాః శ్రోత్రియైర్బ్రహ్మనిష్ఠైః,
సాకం నో భుఞ్జతేఽమీ సకృదపి వినతిం పర్యతేఽగ్రే న తేషాం
సంకేతేనైవ సిద్ధం తదిదమవిదుషాం శ్లాఘ్యమాచార్య పుంస్త్వమ్॥"*

(విశ్వగుణాదర్శము)

ఇట్లు సంఘమునకు సేవచేయుటకు బదులుగా దానిపై నధికారము సంపాదించుట కొందఱి ధర్మోద్దేశమాయెను. దానికై మొదలు బలవంతులగు ప్రభువుల నాశ్రయించి వంచించి లోపఱుచుకొనుట విద్యగా నేర్పడియెను. ఆకాలమందలి చిల్లర ప్రభువులను ఎట్లు వీరు లోపఱుచుకొనుచుండిరో యీక్రిందిపద్యములు విశదీకరించుచున్నవి.

"ఆనన్దబాష్ప రోమాఞ్చౌ యస్య స్వేచ్ఛావశంవదౌ
కింతస్య సాధనైరన్యైః కింకరాస్సర్వపార్థివాః"
"కౌపీనం భసితాలేపో దర్భా రుద్రాక్షమాలికాః
మౌన మేకాసికా చేతి మూర్ఖసంజీవనాని షట్" †

(నీలకంఠదీక్షితుని కలివిడంబనము)

---

* ఈ యాచార్యపురుషులు— జారులు, దొంగలు, బోయలు, దోఁపిడికాండ్రు, పాళెయగాండ్రు, దొరలు–వీరిని శిష్యులనుగాఁ జేసికొని, మిగుల మదించి, వేదవిద్య యెఱుఁగకయున్నను, శ్రోత్రియులగు బ్రహ్మనిష్ఠులతోడ పంక్తిని భుజింపరు; వారెదుర నొకమారును మ్రొక్కరు. ఈయజ్ఞానుల యాచార్యపురుషత్వము సంకేతముచే మాత్రమే యేర్పడినదిగాని వేఱు కాదు–అని–తా.

† ఎవని కానందబాష్పములు, రోమాంచము, స్వాధీనముగా నుండునో యట్టివాని కితర సాధనము లేల? దొరలెల్ల సేవకులే. కౌపీనము, భస్మధారణము, చేతులలో దర్భ, రుద్రాక్షమాలికలు, మౌనము, ఒంటరిగా నుండుట ఈయాఱును మూర్ఖుల బ్రదికించునవి. తా.

ఇట్లు దంభమే జీవనముగావర్తించినను అంత నష్టముండదు. మఱేమనఁగా సంతతాభ్యాసముచేత ఈదంభమే స్వభావముగా మాఱుట, ఇది యన్యాయమను జ్ఞానమే లేకపోవుట, యనునవర్థములు సంభవించినవి. బ్రాహ్మణులు నిజముగా మేము భూలోకదేవతలమనియే తలఁచిరి. జంగాలు తాము సాక్షాత్తు జంగమపరమశివులనియే నమ్మిరి. కావిబట్టలు గట్టినమాత్రమున అందఱును తన్ను పూజింపవలయుననియు, లేకున్నవారు పతితులగుదురనియు, ఇంచుమించు ప్రతిసన్న్యాసియు విశ్వసించెను. గొప్పవారియందలి గొప్పతనమును జూచియే, లేక కలదనుభ్రాంతిచేతనో, అల్పులు వారిని పూజించి గౌరవించుట తప్పు గాదనుటయేకాదు; ధర్మముగూడ. కాని, ఆగొప్పవారే ఆపూజకు తామర్హులనియు, అదిచేయనివారు నిజముగా చెడుదురనియు, నమ్ముటకు మొదలిడినప్పుడే ప్రపంచము పాడగుటకు ప్రారంభము.

ఈవిధముగా తత్త్వములు మతములుగామాఱి యహంకారాభిమానములు ప్రబలించినవెంటనే మునుపొకటే యొకవిధముగానున్న జాతిభేదస్ఫులింగములు ప్రజ్వరిల్లి ఉపజాతులు, ఉపోపజాతులును అసంఖ్యముగా సృష్టిచేసెను. బ్రాహ్మణులు మొదలు చండాలురవఱకును అందఱును తమకన్న నొక తక్కువజాతికలదనుకొని సంతోషించిరి. చండాలురను బ్రాహ్మణులెంతదూరమున నుంతురో యంతదూరమున చండాలురచే నుంపఁబడిన 'డొక్కలవారు' అను అడవిజాతివారిని నాచిన్నతనమందు చూచినాను! జన్మభేదములకు తోడు మతభేదములును జేర, ఈజాతులలో నొకరితో నింకొకరు భోజనము, వియ్యము మొదలగు సాంఘికధర్మములట్లుండ, స్పర్శమునుగూడ సహింపనట్లు చేసెను. వీరందఱిపైనను అవకాశము దొరికినప్పుడెల్ల అధికారము చెలాయించి, బ్రాహ్మణులు మర్యాద, ధనము మొదలగువానిలో 'దేవాంశము'ను * సంపాదించుకొనఁ జొచ్చిరి. వీరిలో విద్య వివాదమునకుమాత్రము పనికివచ్చునది యాయెను. ఏశాస్త్రమును ఏకొలను నేర్చుకొన్నను దానికిఫలము పరముఖభంగమై తర్కశాస్త్ర పాండిత్యమావశ్యకమాయెను. రాజసభలలో నిట్టికోవిదుల కొట్లాటలు నిత్యకార్యములై, అందు గెల్చినవారికి 'దుశ్శాలువలో' సుశాలువలో బహుమానము దొరకుచుండెను. ఇట్టి వాదములనుగూర్చి వేమన్న యేమన్నాఁడు?

" ఆ. సాటిచేయవచ్చుఁ జదివివాదములాడు
చదువరులను జెట్టి సముదయమును
పోరిపోరి గెల్చు నోరు నోవనివాఁడు..." (౩౫౭౩)

* దేవస్థానమునందు నైవేద్యమును భక్తులకు వినియోగము చేయుటకుముందు పూజారులకిచ్చు పెద్దముద్దకు 'దేవాంశ' మని పేరు.

తుచ్ఛ పండితుఁడైనవాఁడు దేవళమునకుఁ బోయినప్పుడు తనకుఁదగిన మర్యాదలు జరుగకుండినఁ, బూజారులను విడిచి,

"ఐశ్వర్యమదమత్తోసి మాం న జానాసి దుర్మతే
పరైః పరిభవే ప్రాప్తే మదధీనా తవస్థితిః" *

( ఈపద్యము పలువురుపండితులు చెప్పినట్లు వాడుక )

అని బ్రహ్మనే బెదరించు స్థితికి బ్రాహ్మణులు వచ్చిరి !

అనఁగా మనుష్యులందఱు నష్టులైయుండిరని కాదు. అది యసంభవము. నిజమైన విరక్తులు, తత్త్వద్రష్టలుఁ గలరు. శమదమాది సంపన్నులును అందందుండిరి; కాని వారికి సంఘమందు వ్యాప్తి చాలకుండెను.

"ఆ. భూమిలోన పుణ్యపురుషులు లేకున్న
జగములేల నిల్చు పొగులుఁగాక,
అంత తెలుచదొరక రాడవాడను గాని..." (౨౭౩౮)

అని వేమన్నయే యన్నాఁడు. ఇట్లు సంఘమందెల్ల నింపమించుగా నొకప్రక్కన జ్ఞానమును వేఱొకప్రక్కనన్యాయమును పరస్పరసహాయముతో వృద్ధిఁ బొందుచుండె ననుటలో సందేహము లేదు.

వేమన కాలమందలి సంఘస్థితి యిది. ఇతఁడు శైవమతము నాశ్రయించిన కుటుంబములోని వాఁడని మొదలే చెప్పితిని. అందును బసవేశ్వరునిచే వ్యాప్తికి తేఁబడినదియు, బ్రాహ్మణులకన్న నితరజాతులలోనే చాల వ్యాప్తిఁగాంచినదియు నగు లింగధారి వీరశైవమతమునకుఁ జేరియుండును. ఈమతము జాతిభేదతిరస్కారముతోనే మొదలైనను, దీని నాశ్రయించినవారే "కులజాతియై, అందులోను, అవాంతర భేదములు గలిగి యిప్పటికి నష్టేయున్నది. ఇఁక చుట్టుప్రక్కల ప్రబలియున్నది వైష్ణవమతము. సహజముగా నితరులు చెప్పిన మాటలు విచారింపక నమ్మని వేమన వంటి విమర్శకునకు, యీరెండు మతములలో నేదిగాని తత్త్వపిపాసనార్పఁగలిగి యుండ లేదు.

"ఆ. పునుఁగు పిల్లికేల పుట్టించె వాసన ?
కనకము తనకేమి కల్లఁజేసె ?
బ్రహ్మచేతలెల్ల పాడైనచేఁతలు..." (౨౫౭౧)

---

* ఓ దుర్మతి! నీ ఐశ్వర్యముచే పొగరెక్కి మదించినావు. నన్ను లక్ష్యము చేయవు. ఇతరులు నీ కవమానము కలిగించునప్పుడు నీమర్యాద నాచేతిలో నున్నది. అని తా.

సృష్టియందుఁగల సుఖదుఃఖములు, పుట్టుచావులు, పుణ్యపాపములు, మొదలగు వానినిగూర్చి కలుగు నట్టి శాశ్వతప్రశ్నలకు సరియైన, తృప్తికరమైన ప్రత్యుత్తరము వైదికమతములలో దొరకుట కష్టము. పామరులు చెప్పలేరు; పండితులు చెప్పినను విచిత్రములగు పారిభాషికశబ్దములతో సంకేతసిద్ధమైన యుక్తులతో నిండియుండును గావున నవి యర్థమే కావు. ఐనను అంగీకరించుట కష్టము. వేదములు ఎవ్వరును వ్రాయకయే తమంతట పుట్టిన ప్రమాణములని కాని, పరస్పరవిరుద్ధములగు పురాణములన్నియు భగవంతుని యవతారమగు వ్యాసుఁడే వ్రాసెనని కాని, సంకేతముతో పెరిగినవారికి తప్ప, తక్కినవారి మనసులకు పట్టుట కష్టము. తెలివిలేని చిన్నబిడ్డల వలెనో లేక తప్పఁద్రాగిన దొరలవలెనో, భగవంతుఁడు నిర్ద్వంద్వుఁడై వినోదమునకు ప్రపంచమును పుట్టించి రక్షించి చంపుచున్నాఁడను నిత్యాది సగుణబ్రహ్మవాదుల లీలావాదము గాని, కేవల చిద్రూపమగు బ్రహ్మకు ఆకస్మికముగా మంకు మూసికొనుటచే నది తన్ను తానే మఱచి, 'నేను మనుష్యుఁడను, రాయిని, చెట్టును, గుట్టను, అనుకొనుచున్నది' యను నిర్గుణ బ్రహ్మవాదుల మాయావాదము గాని, మనఃపూర్వకముగా నంగీకరించుట యెట్లు? ఎక్కువ చదువుకొన్నవాఁడు గాకపోవుటచే ఒకవేళ వాదమాడలేక యోడిపోవచ్చును గాని, హృదయమను పదార్థ మొకటున్నదే, దాని నేమి చేయవలయును? మఱియు వేమన్న మనసు చాల మృదువై, దయ, ప్రేమము మొదలగు భావములకు లోఁగడియైనను, తీవ్రమైన వివేచనాశక్తి దానిని స్వాధీనపఱచుకొని గట్టిచేయుచుండును గాన, అది కేవలము భక్తిచేతనే తృప్తిపొంది భజింపఁబడు వస్తువునందలి గుణదోషములను విమర్శింపలేనంత నమ్మకము గలిగి యుండఁ జాలినది గాదు. మూలతత్త్వము సగుణమైనను నిర్గుణమైనను అది యొక్కటేకదా! అట్టిచోట నీ శివకేశవాది భేదములేల? మఱియు వీరిని గూర్చిన పురాణములలో వీరు మనకంటె శక్తులని తెలియును గాని, మనవంటి పొరబాట్లనే వీరును జేసినట్లున్నదే?

"ఆ. అగ్నిబాణముచేత అంబుధింకి నపుడె
రాముఁడవలికేఁగ లావుమలచె.
వరుస కొండలుమోసి వారి ధేటికిఁగట్టె?" (ఓ. లై. ౧౩-౪-౧౦)

"ఆ. కనకమృగము భువిని కద్దులేదనకుండ
తరుణివిడచి పోయె దాశరథియు
తెలివిలేనివాఁడు దేవుఁడెట్లాయెరా" (౪౯౪)

ఇట్లే 'ధ్యానములను శివునిధ్యానమే శ్రేష్ఠంబు' అని మొదలుగా సంప్రదాయసంస్కారమునుబట్టి యొకటి రెండుమాటలు చెప్పినను, శివుని యందుఁగూడ

సర్వశక్తుఁడను నమ్మిక సడలి యుండుటచే, నితఁడాతని నసహాయునిగూడ ప్రశ్నించు విడువలేదు. కాని స్వరములో భేద మున్నది.—

"ఆ. కంటిమంటచేత కాముని దహియించి
కామమునను గడవ గౌరిఁ గూడె
ఎట్టివారికైనఁ బట్టు ప్రారబ్ధము…"
(వేదాంత సిద్ధాంతము. ప. ౩౯౧)

విష్ణువుకన్న శివుఁడు గొప్పవాఁడని వాదించు శైవులతో నొకమాఱు విష్ణు పక్షము వహించి యితఁడిట్లు వాదించెను.—

"ఆ. కొడుకును బ్రదికించుకొనలేదు శంభుండు
కొడుకును బ్రదికించుకొనఁడె శౌరి!
దేవతాంతరములు దీననే కనిపించె" (వే-జ్ఞా-౭౯౪)

ఇట్లు తత్త్వజ్ఞాన పిపాస, వివేచనాశక్తియు మాత్రమే కాక, తీవ్రమైన న్యాయదృష్టియుఁ గలవాఁడగుటచే, శివభక్తులు, విష్ణుభక్తులు అనఁబడు వారి దాంభిక వృత్తి, స్వార్థపరత, పాపభీతిలేమి, అర్థములేని-కాని-కర్మలు మొదలగునవి యితనికి చాల నసహ్యమును కోపమును గలిగించినవి. శివభక్తులు,

"ఆ. రాతి బసవని గని రంగుగా మ్రొక్కుచు
గునుక బసవని గని గ్రుద్దు మంద్రు
బసవభక్తులెల్ల పాపులు తలపోయ…" (330౭)

"లింగధారి కన్న దొంగలు లేరుగా" (౭౫౭)

అని తిట్టెను. తనదైవమగు శివునిభక్తులకే యీ మర్యాదయైనప్పుడింక వైష్ణవుల గతి చెప్పవలయునా?

"ఆ. వైష్ణవులనిమొదు వార్థమాత్రమె కాని
ప్రజలఁ జెఱుతురయ్య భ్రష్టులుగను" (౩౫౭౪)

ఇట్టి దాంభికుల, అజ్ఞానుల యాజమాన్యమున నడుపఁబడుచున్న పూజలు, ఉత్సవములు, పూర్వోత్తరకర్మములు, యజ్ఞములు, యాత్రలు మొదలగునవియు, వానిశాస్త్రములును—ఏవిగాని వేమనకు సహ్యములు గాలేదన్న నాశ్చర్యమేమి? వీనిని గూర్చి వేమన వ్రాసిన పద్యములుదాహరింపఁబోయిన వేలకు మీఱును. మచ్చుకు ఒకటి రెండుదాహరింతును:

"ఆ. రాతిబొమ్మకేల రంగైనవలువలు
గుళ్ళుగోపురములు కుంభములును,
కూడుగుడ్డఁ దాను గోరునా దేవుఁడు?" (3303)

"ఆ. విప్రులెల్లఁ జేరి వెఱ్ఱికూఁతలు గూసి
పతితులను గూర్చి సమ్మతమున
మునుముహూర్తముంచ మండ్రెట్లు చూపరా?" (౩౫౩౪)

"ఆ. లంజకొడుకు మేక నంజూడు శివసాఁకి
యజ్ఞ మెల్లఁ గామ యజ్ఞమాయె!
మొదటసోమయాజి తుద కామయాజిరా." (ఓ.లై. ౧౧-౫-౨౨)

ఇట్టివన్నియు నిరర్థకములని నిర్ణయించుకొన్న పిమ్మట, సిట్టివాని కాచార్యులై స్వధర్మ చ్యుతులైన బ్రాహ్మణులను నోటికసిదీఱఁ దిట్టినాఁడు. వారి కులగోత్రముల గుట్టంతయు బైటఁబెట్టినాఁడు. వారు పేరుకు బ్రాహ్మణులే కాని పరబ్రహ్మము 'తెలుపా నలుపా యెఱుపా' తెలిసినవారు వారిలో లేరన్నాఁడు. తుదకు సంఘమందలి యిన్ని యవస్థలకును వీరే జవాబుదారులనుకొని,

"ఆ. బ్రహ్మవంశభవులు ప్రబలులై యుండఁగా
నితరజాతులకును గతులు గలవె...", (౨౮౯౯)

యనివాపోయినాఁడు! గతులనఁగా సర్కారుజీతములని కాదు. అది యిప్పటి యనేక బ్రాహ్మణద్వేషుల మొఱ్ఱ. బిచ్చమెత్తియైనను విద్యనేర్చు సంప్రదాయము, కొంతవఱకు వంశపరంపరాసిద్ధమగు మేధాశక్తియుఁ గలవారు గావున, విద్యాశాలల వేలము పాటలలో నెక్కువ సవాలుచేయఁగలిగి, నియమించిన కార్యము న్యాయముగాఁ గాకున్నను తెలివితో నిర్వహింపఁగలవారుగనుక, సర్కారువారి చనవు సంపాదించిన బ్రాహ్మణులను జూచి కడుపుచిచ్చుగల నేఁటి బ్రాహ్మణేతరులలో చదువుకొన్నవారు కొందఱు 'బ్రాహ్మణులతో ప్రపంచము పాడైపోయినదో!' యని యఱచుచున్నారే కాని, ధర్మము న్యాయము మొదలగు నే విషయములందును వారికన్న వీరేమియు యోగ్యతగలవారు కాక పోవుటచే, వీరిద్వేషము, ఎవరునుకొనని పనికిరాని ప్రాఁతమనుస్మృతి కాపీలను కచ్చితో కాల్చుటకు తప్ప నింకెందుకును పనికిరాకపోయినది. తత్త్వదృష్టి, ధర్మబుద్ధి, న్యాయాభిమానముఁ గాక అసూయా మూలమగుటచేత, ఈ బ్రాహ్మణద్వేషముచేత బ్రాహ్మణులు తమతప్పులను దిద్దుకొనుట యట్లుండగా, ఏగుణములచే వారిట్లు నైయాయిక ప్రపంచమున నధఃపాతముఁ జెందుచున్నారో, ఆగుణములనే యబ్రాహ్మణులును వృద్ధిచేసుకొని వారితోడ పాతాళ లోక యాత్రలో పోటాపోటీ చేయుచున్నారు! కాని వేమన్నకు బ్రాహ్మణఖండన మందంతకన్న నెంతో యుదాత్తమైన యాశయము గలదు.—

"ఆ. బ్రాహ్మణులకు సకలభాగ్యంబు లిచ్చుచు
గౌరవింపవచ్చుఁ గోరివారు
జ్ఞానమొసఁగి జనులఁ గడతేర్పఁ గలిగిన..;" (౨౫౧౦)

అట్లు లేకున్నప్పుడు,

"ఆ. బ్రాహ్మణులకుఁ బెట్ట ఫలము గద్దందురు
కుక్కలకును బెట్ట కొదవరేమి ?" (౨౭౦౯)

ఇట్లు చెప్పఁబట్టినను తిట్టుటకు మూలము అసూయగాక, వారిలోపములను దిద్ద వలెనను నిష్కళంక శ్రద్ధయే యగుటచే, వేమన్నను అట్టి విప్రులు కూడ గౌరవించిరి.

"ఆ. ఇలను శూద్రుఁడౌట యెఱుఁగరా వేమని
మనసు నతనితోడ మరులు కొనియె
కొలిచిరి ద్విజులెల్ల కోటానఁగోటులై..." (ఓ. లై. ౧౨-౧-౩౦)

ఈపద్యము వేమన్న చెప్పినను చెప్పకున్నను, కోటానగోట్లు ద్విజులు ఇతనిని గొలుచుట యసత్యమేయైనను, కొందరైనను అతనిని గౌరవించి యుండుట సత్యము. ఇట్లు తమదోషముల నెఱింగినవారు, న్యాయధర్మములను గౌరవించు శ్రద్ధావంతులు బ్రాహ్మణులలోఁ గొందరైనను సర్వకాల సర్వావస్థలయందును ఉండుటచేతనే, యెన్ని మతములు మాఱినను, ఎన్ని రాజ్యములు తలక్రిందైనను, ఎందఱు ఎదుర్కొని పోరినను, బ్రాహ్మణజాతి మూలముట్టుగ నశింపక యిదివఱకును నిలిచి గౌరవింపఁబడు చున్నది. నేఁటికిని అబ్రాహ్మణుఁడగు గాంధిని మహాత్ముఁడని నిష్కల్మషముగా నమ్మి. యతని ఖండనఖడ్గములకు చెవియొడ్డి యతనియుపదేశములను త్రికరణశుద్ధిగా నాచరించువారిలో, బ్రాహ్మణులున్నంతమంది బ్రాహ్మణేతరు లున్నారనుట నాకు సందేహము. అది యట్లుండె.

ఇట్లు బ్రాహ్మణులు తత్త్వజ్ఞానమునకుఁ గాని ధర్మస్థాపనకుఁగాని పనికిరారైరి. కేవలము జాతిలో మే మధికులమని మర్యాదలు లాగుకొనుచుండిరి. కట్టె 'గుడ్డెద్దు జొన్న' వంటిదే కాని వారియాధిక్యమెందును గానరాదయ్యెను. అందఱివలెనే రోగములు చావును వారికిని వచ్చుచున్నవి. తాపత్రయములలో నేదిగాని వారిని మన్నించి వదలలేదు.

"ఆ. బాపఁడనఁగ నేమి ? భక్తుఁడనఁగ నేమి ?
జోఁగియనఁగ నేమి ? సాంపురేక
ఎన్ని పేరులైన నినజుఁడు పనిదీర్చు..." (౨౩౨౦)

మనుజులకు అన్నిచింతలకంటె ఈ 'ఇనజుని' చింతయే బలవంతమైనది. పేదతనము వచ్చిన బిచ్చమెత్తియో దొంగిలించియో బ్రదుకవచ్చును. రోగమువచ్చిన మందులు దినవచ్చును: ముదిమివచ్చిన మీసములకు బన్నమైన వేసుకొని సుఖముగా నుండ వచ్చును; కాని చావువచ్చిన? తరువాత నేమి యను జ్ఞానమావంతయైనను లేకయుండు టచే, అకస్మికముగా, అవశ్యముగా, ఇక్కడి సుఖదుఃఖములన్నియు బొత్తిగా విడిచి,

యొకటేమాట, ఆయంధకారరూపములోఁ దూఱవలెనన్న నెవరికి భయముండదు ? కాని దీనికిఁ దప్పు లేదు. ఇఁక మతమా,

“ఆ. విష్ణుభక్తులెల్ల వెలిబూదిపాలైరి,
వాదమేల మత విభేదమేల ?
తెలియ లింగధరులు తిరుమణిపాలైరి…” (౩౫౪౫)

ఇరువురికిని చావు తప్పనిది. వారు చచ్చినఁ గాల్తురు, వీరుచచ్చినఁ బూడ్తురింతే. కావున నిట్టి చావుస్వరూపము తెలియవలదా ? ‘చావు దెలియలేని చదువేటి చదువురా ?’ (౩౪౭౭) యని వేమన తలఁచెను. ✓

ఈపలుచిక్కుల సంసారపుముడిని విడఁదీయుటకు మార్గమేమి యని వెదకుట విధిలేని పని యయ్యెను. భక్తి గలిగి కొలిచిన శివుఁడో కేశవుఁడో యొకభగవంతుఁడు తన్నుద్ధరించునేమో చూతమని ‘భక్తి గలుగ ముక్తిఁబడయుట సులభంబు’ ‘భక్తికల్గు చోట పరమేశ్వరుండుండు’ (౨౭౧౪, ౧౬) అని నమ్మి తనచిక్కులను దీర్ప భగవంతుని పలుమాఱు ప్రార్థించెను. కాని యితని యాత్రమున కాపరమేశ్వరుఁడు పలుకలేదు. ఇట్లు వానిడిచి యేడ్చెను.

“ఆ. పలుకుమన్న నేల పలుకవయున్నావు ?
పలుకు నన్నుఁ జూచి ప్రబలముగను ;
పలుకవయ్య నీదుపలుకు నేనెఱిఁగద” (౨౪౬౪)

ఈ వెసరిన సమయమందే వేమన్నకు రసవాదవిద్యాభినివేశముచేత యోగుల సంబంధము కుదిరినదనవచ్చును.

వెనుక అద్వైతమతము నాశ్రయించిన వారిలో ననేకులు దాని యనుభవమును సాధింపలేక వ్యవహారమందు ద్వైతులుగనే యుంటిరని చెప్పితిని. కాని, దీనినిగూర్చి యూరక చర్చించి ఫలము లేదని తమంతట తాము, ఏకొండలలోనో అడవులలోనో యుండి అయాద్వైత తత్త్వమును సాధింపవలయునని పట్టుపట్టి పనిచేయుచున్న కొందఱు మొదటినుండియుఁ గలరు. వారే యోగులు.

అద్వైతమందనేక భేదములు గలవు. కాని మనదేశమందు ముఖ్యమైనవి మూఁడు ; శ్రీవైష్ణవము, వీరశైవము, శాంకరము.

మొదటిదగు రామానుజసిద్ధాంతము, చిదచిదాత్మకమైన యీప్రపంచమును భగవంతుఁడు తననుండియే సృజించెను గావున అది, మంటితోఁ జేయబడిన కడవ మంటికంటె నెట్లు వేఱుకాదో యట్లే భగవంతునికంటె భిన్నము గాదని చెప్పుచు, వాకారణమున ‘(విశిష్ట) అద్వైత’ మనఁబడినను, ముక్తిదశయందును జీవుఁడును భగవంతుఁడును వేఱువేఱుగానే యుందురనుటచే దీనిని ద్వైతమనియే చెప్పవలసి

యున్నది. రెండవదియగు వీరశైవము, పై విశిష్టాద్వైతమువలెనే ముఖ్యతత్త్వములం
దెక్కువ భేదము లేకున్నను, మోక్షావస్థయందు శివునితో సాయుజ్యమును జెప్పుచు
జీవబ్రహ్మలకైక్యము దానికన్న నెక్కువగా నంగీకరించినది. * (మూఁడవదియగు
శాంకరాద్వైతము మోక్షస్థితిలో మాయాజనితమైన భేదజ్ఞానము పూర్తిగా నశించి
నిత్యశుద్ధబుద్ధమైన బ్రహ్మస్వరూపము మాత్రము నిలుచునని చెప్పుచు సర్వాద్వైత
మనఁబడుచున్నది.

ఈముగ్గురిలో వైష్ణవులు, మోక్షమనఁగా, భగవల్లోకములో అతనివంటి దివ్య
మంగళవిగ్రహము గలిగి ద్వంద్వాతీతులై యతనికైంకర్యసౌఖ్యము ననుభవించుటయే
యని తలఁచిరి గావున, ఆయధికారమును భగవంతుఁ డనుగ్రహించుటకు దృఢమైన
భక్తి వారికి చాలును. కాని యా యవిచ్ఛిన్న భక్తిని సంపాదించుటకును యమనియ
మాది సాధనలు కావలయును గావున వారు ప్రపత్తియను నింకొక సులభమార్గమును
వెదకికొనిరి. అనఁగా భగవంతుని యెడ తమ సమస్తభారమును అర్పించి నీవేదిక్కని
నమ్మియుండుట. అదియును తామే చేయుటకు చేతఁగానివారు యోగ్యుఁడగు
గురువునాశ్రయించి, యతఁడు భగవంతుని యెడఁదనకుఁగల చనవుచే సిఫారసు
చేయఁగా ఆభగవంతునికి దయగలిగి తప్పులను క్షమించి తమ్ముద్ధరించి ముక్తి
నిచ్చునని నమ్మిరి. ఇదే ఆచార్యనిష్ఠ ప్రపత్తి యనఁబడును. ఎట్లును వారికిఁ
గావలసినది, సామాన్యముగ అహంకారమమకారాదులను వర్జించి భగవంతునియెడ
దైన్యము స్థిరముగా నుండుటకు ఎంత దేహేంద్రియమనోదండనలు ముఖ్యమో
అంతే కాని, యంతకు మీఱి హఠయోగాదులు సాధింపవలసిన పనిలేదు గావునను
యోగులు పరమఫలముగాఁ జెప్పునట్టి యద్వైతానుభవమునందు వారికి నమ్మికలేమి
గావునను వారా మార్గమును వదలిరి. కావుననే శ్రీవైష్ణవులు వ్రాసిన యోగశాస్త్ర
గ్రంథమొకటియుఁ గానరాదు. నాథమునులు 'యోగ రహస్య' మను గ్రంథమును
వ్రాసిరఁట కాని యది యింకను బైలుపడలేదు. ఎట్లును ఇప్పుడు పాతంజలయోగ
సూత్రములు, యోగతత్త్వోపనిషత్తు, హఠప్రదీపిక మొదలగు గ్రంథములు చెప్పునట్టి
దియు, ఇప్పుడును సామాన్యముగ యోగులనఁబడు వారాశ్రయించినదియును అగు
యోగవిద్యకును శ్రీవైష్ణవాద్వైతులకును సంబంధము గానరాదు.

ఇఁక శంకరులయద్వైతము యోగసాహాయ్యము లేనిది బ్రతుకుటయే కష్టము.
ఎందుకనఁగా వారి సిద్ధాంతము సమస్తమును మిథ్యయనియు, శుద్ధనిర్గుణ బ్రహ్మయే
సత్యమనియు, ఈ మిథ్యాజ్ఞానము నశించి శుద్ధబ్రహ్మముగా నిల్చుటయే మోక్ష
మనియు చెప్పుచున్నది. అనఁగా ఆమోక్షావస్థయందు తెలిసికొనుకర్త, తెలియఁబడు

* (Vide Bhandarkar's Vaishnavism and Saivism. P. 135)

కర్మము అను భేదమేలేక కేవలము తెలివిగా మాత్రము నిలిచియుండుట. ఎన్ని ప్రమాణములు చెప్పినను ఎంత వాదించినను, అనుభవ ప్రమాణము లేనిది యీ సిద్ధాంతము నమ్ముటకష్టము. అట్టి జ్ఞాతృజ్ఞేయశూన్యమైన జ్ఞానావస్థ సాధ్యమనియు, అసంప్రజ్ఞాతసమాధిస్థితియదియే యనియుఁ జెప్పి యోగశాస్త్రము దానిని సాధించుమార్గములను తెలుపుచున్నది. కావున శాంకరాద్వైతులు యోగము వదలలేరు.

అద్వైతానుభవము విషయమున వీరిరువురికి నడుమనున్న వారు వీరశైవులు. శివతత్త్వము సహజమగు 'శక్తి' బలముచే 'లింగ' మనియు 'అంగ' మనియు రెండుగాఁ బరిణమించును. లింగము పూజ్యదేవత; రుద్రరూపము. అంగము జీవాత్మ. 'శక్తి' కూడ 'కళ' యని 'భక్తి' యని రెండు తెఱఁగులగును. కళ శివునియందుండు సృష్టికిని సంసారమునకును కారణమగును. భక్తి జీవునియందుండు ముక్తిహేతువగును. ఇట్టి యవిచ్ఛిన్న భక్తిచే జీవునికి శివునితోడి 'సామరస్యము' అనఁగా—ఆనందమయమైన ఐక్యము—కలుగును. అదే ముక్తి, కాని యీ యైక్యము, శాంకరాద్వైతుల యైక్యమువలె, జీవునికి సంపూర్ణముగా ఆత్మనాశము గలిగించి పరబ్రహ్మతో నేకీభవింపఁజేయదు. జీవునికి తానానందమనుభవించుచున్నానను జ్ఞానము గలదు. * (విశిష్టాద్వైతులవలె వేఱుగా నుండక పాలలో నీరు చేరినట్లు గాఁబోలు, శివునితో సాయుజ్యము నందును దీనికఖండభక్తిసాధనము ఆవశ్యకము గావున, అందుకు వారికి యోగసాహాయ్యము తప్పనిది. ఇట్టి యద్వైతము నభ్యసించువారు శివయోగులనఁబడిరి. తక్కిన యోగులు వట్టి యోగులు.

శంకరాద్వైతము బ్రాహ్మణజాతియందే వ్యాపించినది. బ్రాహ్మణులలో ననేకులు ఇప్పటికిని శాంకరులే. కాని వారియందు యోగవిద్య వ్యాపింపలేదు. అద్వైతము సిద్ధాంతమందే కాని వారి వ్యవహారమందు లేదని చెప్పుదురు. ఇదిగాక అనూచానముగా జాతిసిద్ధమైవచ్చిన వైదికకర్మానుష్ఠానమును వదలుట వారికి సాధ్యము కాలేదు; బ్రహ్మజ్ఞానము సంపూర్ణముగఁ గలిగి పరిశుద్ధుఁడైన వానికి తప్ప తక్కినవారికి కర్మత్యాగమును సంఘము సమ్మతింపలేదు. కర్మత్యాగము, సంసారవిరక్తియుఁ గల వారికి అప్పుడ్యోగాభ్యాసము సాధ్యముగాదు. సన్న్యాసాశ్రమమును స్వీకరించినవారికిని సంఘముపై నధికారము, మఠముల యాజమాన్యము మొదలగునవే కాక, త్రికాలపూజ, అభిషేకములు, సమారాధనలు, మెరవణులు మొదలగు సన్న్యాస ధర్మములు ఇంటికర్మముల కన్న నధికములైనవి... కావుననే అద్వైత బ్రాహ్మణులలో యోగులపురూపమైనారు. ఎట్లును కర్మభూమియగు దక్షిణదేశములో వారరుదు.

---

* (Vide Bhandarkar's Saivism P. 134 to137)

ఇఁక వీరశైవము బ్రాహ్మణప్రాబల్యము నణఁచుటకై పుట్టిన మతము. ఈమతము నాశ్రయించుట కందఱును అర్హులు. బ్రాహ్మణులలోనున్నన్ని నిత్యకర్మముల గలాటా వారిలో లేదు. మనలోవలె వారిలోను మతములలో నధికారము గ్రహించిన కర్మఠ సన్న్యాసులున్నారు గాని, సామాన్యజాతుల గుంపే వారిలో బలమగుటచేతను, అద్వైతులలోవలె నిర్గుణోపాసనచేయుచున్నను సగుణోపాసనచేతనే కాలక్రమమున బ్రహ్మానుభవము సిద్ధింపఁగలదను అనుకూలము లేను గనుక భక్తి యఖండముగా లేక మోక్షము సిద్ధింపదు గావునను వారిలో తప్పక యోగవిద్య ననేకులాశ్రయింపవలసి వచ్చినది. యోగమును పూర్తిగా సాధింపఁగల్గినవారనేకులు లేకపోవచ్చును గాని, సాధింపఁ బ్రయత్నించినవారు తక్కినమతములకన్న నీమతములో నెక్కువగలరని తలఁచుచున్నాను.

ఇట్టి శివయోగులనేకొందఱూళ్ళయందు మఠములలోనో గృహస్థులుగానో వసించియుండినను, అనేకులు ఆలుబిడ్డలు లేనిబ్రహ్మచారులై అడవులలోనో కొండలయందో వసింతురు. స్వర్ణవాదవిద్య వీరిలో చాలమంది యెఱుఁగుదురను ప్రతీతి గలదు. విరక్తులై యోగాభ్యాసులైన వారికీ కృత్రిమస్వర్ణమం దాశయేల కల్గినదని మన కాశ్చర్యము గలుగును. ప్రాయశః హఠయోగసాధనకు దేహశక్తియు నారోగ్యమును ప్రధానములు గావున, దానికిఁ గావలసిన పుష్టాహారములు ఎక్కువ కష్టము లేక సంపాదించుటకును, ఆయుర్వేదము ప్రకారము స్వర్ణమును భస్మాదిరూపములచేత నిత్యమును సేవించుట చాలమంచిది గావున దానికిని, సహజమైన బంగారు దొరకుట కష్టమై కృత్రిమముగా తయారుచేయవలసిన యక్కర వారి కేర్పడియుండును. కాని కృత్రిమమైన బంగారునకు సహజమైనదాని గుణములుండునా యనుప్రశ్న కలుగును. చూచినవారు ఉపయోగించినవారు ఎవరైన దీనికుత్తర మీయవలయునే కాని నే నెఱుఁగను.

వేమన బీదతనమును బోఁగొట్టుకొనుటకై, బంగారు తయారుచేయు విద్య నేర్వఁగోరి వీరి నాశ్రయించియుండునని యూహించితిమి. వా రావిద్యను సామాన్యముగ నెవరికినిఁ జెప్పరు.

"దాతవ్యం గురుభక్తాయ నదద్యాద్దుష్టమానసే"
"వనితాపుత్రమిత్రాదిగోప్యం సిద్ధిప్రదాయకమ్" *

అని వారు భావించిరి. అనేక సందర్భములలో నిట్లు విషయములను గుప్తములుగా నుంచుట, తమకొకవిధమైన విలువను గౌరవమును సంపాదించుకొనుటకే కాని

* గురుభక్తునకీవిద్య చెప్పవలయును. దుష్టమనస్సుగలవానికి చెప్పరాదు. భార్య, పుత్రులు, మిత్రులు మొదలగు వారికిని దీనిని దెలుపక గుప్తముగా నుంచిన సిద్ధించును. (దత్తాత్రేయ తంత్రము పే. ౧౧౨)

వేఱు కాదు. ఈవిషయము ప్రాచీనులే యంగీకరించిరి. చూడుఁడు—హఠయోగులకు, దేహములోపలిభాగమును శోధించు ధౌతి, నేతి మొదలగు కర్మములాఱుగలవు.

“కర్మషట్కమిదం గోప్యంఘటశోధన కారకమ్”

(హఠప్రదీపిక, ద్వితీయోపదేశము. ౨౩-వ)

అని పైకసరత్తులుగూడ రహస్యముగ నుంచవలెనని శాసనముగలదు. పైశ్లోకమునకు వ్యాఖ్యచేయుచు బ్రహ్మానందయోగి,

“గోపనాభావే షట్కర్మకమన్యైరపి విహితంస్యాదితి యోగినః పూజ్యత్వాభావః ప్రసజ్యేతేతిభావః” (గుప్తముగా నుంచనియెడల నీకర్మము లందఱును చేయఁగల్గుదురు గావున, యోగికి పూజ్యత లేక పోవునని భావము.)

అని వ్రాయుచున్నాఁడు. ఎట్లును స్వర్ణవాదమువంటి విలువగల విద్యలను రహస్యముగానుంచుట మనుష్యస్వభావము. ఇట్టిదానిని సంపాదించుటకై వేమన్న చాల గురుసేవ చేసియుండును. వారును ‘గోప్యం గోప్యం మహాగోప్యం’ అని యెన్నో బాసలు చేయించుకొని యితనికేదో కొంత తెలిపియుందురు. ఇంత కష్టపడి తాను సాధించిన విద్యను స్పష్టముగా బహిరంగపఱుప నిష్టములేక కాఁబోలు, ఇతఁడును. ఈవిద్యనుగూర్చిన పద్యములన్నియు ఇతర వాదగ్రంథములందలి పద్యముల వలెనే, స్పష్టముగాక చేసినాఁడు.

ఇట్లు బంగారమును సాధించు నాశకుతోడు తీవ్రమైన తత్త్వజిజ్ఞాసగలవాఁడగుటచే వేమన, పైవారిని సేవచేయునప్పుడు వారి నడతలను చక్కఁగా గమనించి యుండును. సంసారులకును, వారికిని గలభేదములఁ జూచి యాశ్చర్యపడి యుండును. వారికి అడవి, యూరు, పగలు, రాత్రి, యను భేదము లేదు; ఆహారమునకై యీవస్తువులు కావలెనని కాని యీ కాలమునఁ దినవలెనని కాని నియమముగానరాదు; ఉపవాసములకు వెఱవరు; రోగాద్యుపద్రవములు వారిని జేరవు; దృఢకాయులుగా నుందురు; చలి, గాలి, యెండ, వాన, దేనికిఁగాని వెఱవరు; సమాధిలోఁగూర్చున్న గంటలకొలఁది బహిః ప్రపంచజ్ఞానమే లేకయుందురు; తామేదో మహానందమనుభవించువారైనట్లు కానవచ్చి లౌకికములైన సుఖములనన్నింటిని అసహ్యముతోఁ జూతురు; నిత్యబ్రహ్మచారులుగా నుందురు; సర్వసందేహములను గలిగించు నిత్యకర్మములు, విగ్రహపూజలు మొదలగువానిలో పాల్గొనక, తాము బ్రహ్మస్వరూపము నెఱిఁగినట్లు మాటలాడుదురు; జాతిభేదాదులగమనింపరు; సృష్టిస్థితిలయములను గుఱించి మనకెల్లఁగలుగు సందేహములన్నియు తీర్చుకొన్నవారివలె నుందురు; ఏదైనను ప్రశ్నించిన మనకర్థముగాకున్నను తమకు సందేహము లేక ప్రత్యుత్తరమిత్తురు;

సామాన్యులకు లేని కొన్ని విచిత్రములగు శక్తులు సిద్ధులు గలవారని ప్రసిద్ధిగో నుందురు! ఇట్టివారిని జూచినప్పుడు తనకుఁగలతత్త్వ సందేహములను దీర్చుట వీరికి తప్ప తక్కినవారికి సాధ్యముగాదని నమ్మి, ఏమైనను జేసి యెంతకష్టమైననుపడి, వారి వంటి బ్రహ్మజ్ఞానమును తానును సంపాదించి యోగిగావలయునని, ఇది కాలికే యోగుల బిడ్డలపై కోపగలిగిన వేమన్న, నిర్ణయించెను.

"ఆ. ఇహమున సుఖియింప హేమతారక విద్య
పరమున సుఖియింప బ్రహ్మ విద్య;
కడమ విద్యలెల్ల కల్ల మూఢుల విద్య....." (౪౩౭)

అని నిర్ణయించుకొని యట్టియోగులలో ముఖ్యుఁడుగా నుండినవాఁడు 'గాఁబోలును. లంబికాశివయోగి నాశ్రయించెను. ఇతని శ్రద్ధకు సంతసించి యతఁడును సరహస్యమగు యోగవిద్య నుపదేశించెను. దానిని గూర్చి ముందు మనవిచేయుదును.

శ్రీ

ఐదవ యుపన్యాసము

# వేమన యోగసిద్ధి-మతప్రచారము

వేమనకు లంబికాశివయోగివలన యోగమార్గోపదేశము లభించెనని చెప్పితిని. ఆ యోగ సాహాయ్యముచే వేమన యేమి సాధించెనని యూహించుటకుముందు యోగసామాన్య స్వరూపమును గొంతవఱకు దెలుపవలసి యున్నది. సాధకునకుఁ దప్ప తక్కినవారికి దీనినిగురించి చర్చించు నధికారమే లేదు గావున నీవిషయమును దడవుటకే భయపడుచున్నాను. కాని విధిలేదు. బహిరంగమైనబుద్ధితో, ఎంతనాకు గ్రహించుటకు సాధ్యమో యంత మనవిచేయుచున్నాను.

సకల జగత్కారణమైన మూలవస్తువొకటి కలదని మన ప్రాచీనులు వేల కొలఁది యేండ్ల క్రిందనే గ్రహించిరి. దానితత్త్వము తెలిసిన పక్షమున, సృష్టియందలి సందేహములకెల్ల నందు ప్రత్యుత్తరములు లభించుననియు, బంధములన్నియు నుడుగు ననియుఁ దలఁచిరి.

“భిద్యతే హృదయగ్రన్థి శ్ఛిద్యన్తే సర్వసంశయాః
క్షీయన్తే సర్వకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే”

అది సగుణమయినను నిర్గుణమైనను శూన్యమైనను దాని స్వరూపము, ననుభవపూర్వకముగ నెఱుఁగక తీఱదని తేలినది. కాని దాని నెఱుఁగుట యెట్లు? మితమైన శక్తిగల కన్నుముక్కు మొదలగు బహిరింద్రియములచే సాధ్యము గాదు. సాధ్యమైనచో అమితమైన ప్రభావముగల మనస్సను అంతరింద్రియముచేతనే కావలయును. కాని యీమనస్సు చంచలమైనది. నిమేషకాలమైనను ఒకవిషయమును ధ్యానించుదార్ఢ్యములేనిది. దానికితోడు శరీరమందును సంసారమందును గలుగు వివిధావస్థలు దానిని ఒకచోట నిలువనీయవు. కావున మనస్సు ఈదేహమునకును బహి

* (పరావరమూర్తిని జూచిన వెంటనే హృదయపుముడి వదలును. అన్ని సందేహములును దీఱును. అన్ని కర్మములును క్షీణించును.) ముండకోపనిషత్తు (౨–౨–౮)

స్సంసారమునకును లోపడక తనంతట అఖండముగా నిలిచి కార్యమును నిర్వహించు మార్గమొకటి వెదకకలసివచ్చెను. అదే యోగము.

"యదా పంచావతిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ
బుద్ధిశ్చ న విచేష్టతి తామాహుః పరమాం గతిమ్,
తాం యోగమితి మన్యన్తే స్థిరామిన్ద్రియధారణామ్"

ఎప్పుడు పంచేంద్రియములు మనసుతో చేరి నిలచునో, బుద్ధియల్లాడదో, అదియే పరమగతి; అట్టి యింద్రియధారణమే యోగమందురు.)

(కఠోపనిషత్ ౨—౧౧.)

[illegible] వశక్తకమనియు దానికి మనోనిగ్రహము దేహదండనము నే [illegible] సంగీకరించిరి. కాని, ఆ దేహమనోనిగ్రహ [illegible] లతో సకమైన శాస్త్రముగా తెల్పిచిన [illegible], [illegible], హిందువులకే చెల్లవలసియున్నది. దేహమును స్వాధీ [illegible] నానావిధముల దండించి, మనసును బిగబట్టి బహిరంగముల [illegible] బూనకొన్నప్పుడు, పైరీటికిని కలుగు అనేకపరిణా [illegible] చక్కగా గనునించి, అందుగలుగు అనిష్ట ఫలముల నివారించి [illegible] పరబ్రహ్మానుభవమును సాధించుటకు కొన్ని పద్ధతులు గాదలచునో, [illegible] సానుభవపూర్వకముగా యోగశాస్త్రకారులు వ్రాసిరి.

[యోగ [illegible] మొకటి ధర్మము తనయందలి దుర్గుణములను వదలుట.] యోగ్యత సంపాదించుటకు మొదల అయోగ్యతను పోగొట్టుకొనవలయును గదా; దేహబలమును సంపాదించుటకు మొదలు రోగములకు మందుదిన్నట్లు. ఒకరిని హింసింపక [illegible], ఒకరిసొమ్ము దొంగిలింపక, ఇంద్రియలోలుడుగాక, తనకొరకు [illegible] యొకరిచ్చినను గ్రహింపక, [illegible] ఇది యమమందురు.

తరువాత పరిశుభ్రముగానుండుట, సంతోషము, తపస్సు, వేదశాస్త్రములు చదువుట [illegible] —వీనిని సాధించుట. ఇవి నియమమనబడును.

ఇట్లు దేహమనస్సులు కొంతవరకు పరిశుద్ధములైన తరువాత దేహమందిది వఱకున్న రోగములు నశించుటకును, క్రొత్తవి రాకుండుటకును శ్రమము, సహించుశక్తి గలుగుటకును కొంతవ్యాయామము చేయుదురు. వ్యాయామమనగా 'గరిడీ' [illegible] ఇప్పటి మన, [illegible] చేయునట్టిదిగాదు. చేతులు, కాళ్ళు మొదలగు [illegible] మొత్తముగ దేహముగాని, యొక్కొక్కగతిలో పలుమారు ఆడించుట యిప్పటి పద్ధతి. ఇందువలన కండల, మాంసము బలసి

దేహమున శ్రమ పుట్టును. ఒక విధమైన నిలుకడలేని చురుకుదనము గలుగును. రోగముల యుద్దేశమది కాదు. శ్రమమును సహించుట, దేహమందు జడ్డు పెరుగనీక లఘువుగా చేసికొని నెమ్మదిని సంపాదించుట - ఇది వారు కోరునది. కావున ఏదో యొక కష్టమైన రీతిలో చాల ప్రొద్దు నిలుచుకొని యుండుట, కూర్చుండుట, పరుండుట, వారు సాధింతురు. వీని నాసనము లందురు.

ఇంతైనను దేహమున కిప్పుడును చలనమునిచ్చి తన్మూలమున మనస్సును చలింపజేయు వస్తువొకటి గలదు. అది వాయువు. దానిని స్థిరముగా నిలుపనిది మనస్సు నిశ్చలము గానేరదు.

"చలేవాతే చలంచిత్తం నిశ్చలే నిశ్చలంభవేత్"

(గాలికదలిన మనసుకదలును, అదినిలిచిన నిదినిలుచును)

(హఠయోగప్రదీపిక. ఉపదేశము ౨. ప. ౨.)

కావున లోని యూపిరి బైటికి బోనీయక, బైటియూపిరి లోనికి రానీక లోపలనే పట్టి నిలుపుట యావశ్యకము. దీనినే ప్రాణాయామ మందురు. దీనిచే మనస్సునావరించియున్న మాలిన్యములన్నియు నశించునందురు.

తరువాత కన్ను, ముక్కు, మొదలగు పంచేంద్రియములు తమతమ విషయములైన, రూపము, వాసన, మొదలగువానియెడ బోనీయక మనస్సే కట్టిపోయి స్వప్రకృతి పరాధీనములై యుండునట్లు సాధింపవలయును. ఇదే ప్రత్యాహారము. ఇవి యైదును బైటి సాధనలు.

ఇట్లు శరీరము స్వాధీనమై మనస్సునకు చాంచల్యము తగ్గిపోవును కనుక దృష్టి ఏదైన యొక వస్తువునందైన మనసు నిలుపవలయును. ఇది ధారణ. అట్లు తప్పక దృష్టి యందు మనసును పోనీయక నిలుపుట ధ్యానము. ఈ రెంటికిని భేదము. దీనిని ధ్యానించుచున్నవాడు అని ధ్యాత, ధ్యేయము, ధ్యానము అను మూడు పదార్థములు కలవు. ఈ ధ్యానము ముదిరి సాగినచో యిట్టి మనసు ధ్యేయమునందే లీనమై వస్తుమాత్రము నిలిచి, తనను కర్త ధ్యానము మరచు ఈ రీతిని అలరించును. దీనినే సమాధి యందురు. ఇదే అష్టాంగ యోగము.

ఈ సమాధి రెండు విధములు: సంప్రజ్ఞాతమని; అసంప్రజ్ఞాతమని. మొదటి దానిలో గూర్చున్న యోగికి మొదలు ధ్యేయవస్తువుయొక్క స్థూలరూపము గోచరించి క్రమముగా దాని సూక్ష్మరూపము గూడ స్ఫురించును. ఆ మూలప్రకృతి గోచరించినపుడు 'ఋతంభర' యను నొకవిధమైన ప్రజ్ఞ కలుగును. దానిచే యథార్థజ్ఞానము గలిగి సందేహములన్నియు నివర్తించును. శ్రుతిప్రమాణముచేతను అనుమాన ప్రమాణముచేతను గలుగు తెలివికన్న ఈ 'ఋతంభర' యను తెలివి గొప్పది.

ప్రత్యక్షము, పరోక్షము, భూతము, వర్తమానము, భవిష్యత్తు అను భేదము లేక యన్ని విషయములను సాక్షాత్తుగా నిందుగోచరించును. ఈసంప్రజ్ఞాతసమాధిగూడ అభ్యాస బలముచే క్రమముగా వశించి అసంప్రజ్ఞాతసమాధిగా మారును. ఆయవస్థలో ఆ మిగిలిన ధ్యేయవస్తువు స్ఫూర్తియగుటగూడ వశించి కేవలనిర్మలజ్ఞానముగా మాత్రము శేషించియుండును. ఇదే కైవల్యావస్థ. ఇది పాతంజలియోగశాస్త్రముచే గ్రహింపఁగల ముఖ్యవిషయములు.

కాని యీయభ్యాసప్రవాహములో ముఖ్యమైన యీశ్వరవ్యక్తి యెక్కడనో మునిఁగి పోయినాఁడు! ఈమతము ప్రకారము ఈశ్వరుఁడక్కరయే లేదు. ఉన్న యోగసాధనమునకు మేలు. అంతే. నామరూప మయమైన యీ ప్రపంచమందలి పరిణామములు, తాపములు, సంస్కారములు, పరస్పరవిరుద్ధములగు సత్త్వరజస్తమో గుణములు—వీనిచేత పుణ్యమైనను పాపమైనను, సుఖమైనను దుఃఖమైనను అంత యును వివేకముగల వానికి దుఃఖముగానే తోఁచును గావున * ఇన్ద్రియ్యవహారము లకు హేతువైన చిత్తమును స్వాధీనము చేసికొనుట, దానికల్పనలు తన్ను ఆవరింపక యుండునట్లు అడ్డగించుట, ఇదే పరమార్థమని వీరిమతము. అదే మోక్షము. ఇట్లగుటచే మూలకారణమును వెదకఁ బ్రయత్నించి తుదకది దొరకక యీ కష్టములనుండి తప్పించుకొను మార్గమును వెదకుకొని వీరు కృతార్థులమనుకొనిరా యని సందేహము కలుగుచున్నది. కాని, సంప్రజ్ఞాత సమాధిలోనున్నపుడు అతీతానాగతజ్ఞానము, అపరోక్షజ్ఞానము, విచిత్రమగుప్రతిభయుఁ గలుగునని చెప్పియుండుటగాన, అదియే సత్య మగునేని మనకు సామాన్యముగఁ గలుగు ప్రశ్నలకన్నిటికిని అందు ప్రత్యుత్తరము దొరకవలసి యుండును. వినను యోగులెవరును అప్రత్యుత్తరములు నిస్సందేహముగాఁ జెప్పి మనల నుద్ధరించి యుండలేదు. కావున నీయోగశాస్త్ర కైవల్యము, అప్పులవారి బాధలు పడలేక యింటిమూలలో దాఁగుకొని తలుపువేసుకొనుటవంటిది తప్ప నిజమైన జ్ఞానమోక్షమగునా యని శంకింపవలసియున్నది. ఇట్లు సందేహించిన వారికిట్లు ప్రత్యుత్తరము గలదు.

"సోయమేవాస్తు మోక్షాఖ్యోఽవస్థావిశేషోఽత్ర,
మనఃప్రాణలయే కశ్చిదానన్ద స్సంప్రవర్తతే"

(మతాంతరులిది మోక్షమననిండు. కాదననిండు. మనస్సు ప్రాణమును లయించి నపి యొకవర్ణింపరాని యానందము మాత్రమున్నది)

(హఠయో-ఉప- ౪. శ్లో. ౩౦.)

* (చూ. పాతంజలయోగ. సూ—౨ పా. సూ. ౧౫).

కాని మనప్రశ్నకిది ప్రత్యుత్తరముగాదు. మఱియు యోగశాస్త్ర ప్రవర్తకుఁడగు పతంజలి యీ 'ఆనంద' మనుపేరె యెత్తలేదు. 'దుఃఖమేవ సర్వం వివేకినః' అని చెప్పిన యతఁడు సుఖదుఃఖరూపమగు చిత్తధర్మ నాశమే మోక్షమనియెను. ఆ ముక్తావస్థలో ఆనందమును నిరానందమును ఒకటియు లేదని భోజరాజు స్పష్టముగా వ్రాసెను. * అద్వైతులు ముక్తావస్థయందు సచ్చిదానందమయమగు బ్రహ్మసాక్షాత్కారము—అనఁగా తానే బ్రహ్మమగుట—కలుగుననిరి. శైవులగు నద్వైతులును ఇట్లే తలంచిరి.—

" క. అమనస్క సౌఖ్యమద్భుత
మమలంబసదృశ మఖండమక్షయ మవిత
ర్క్య మచంచల మమృతమయం
బమితం బది యెఱుఁగుదురు మహాసిద్ధవరుల్"

(శివయోగసారము. ౪ ఆశ్వాసము.)

ఇట్లు కేవల యోగులకును అద్వైత యోగులకును అసంప్రజ్ఞాత సమాధి ఆనందరూపమా శూన్యరూపమా యను విషయమున భేదము కలదు గాని యద్వైతవిషయమున—అనఁగా రెండు గాక యొకటిగా నగుటలో భేదములేదు. ఈశ్వరుని కేవలమొక సాధనముగా మాత్రము గొని సుఖదుఃఖములు రెంటినుండియు విడుదల పొందఁ గోరిన కేవలయోగులను వదలితిమేని, ఈశ్వరసాక్షాత్కారమే ప్రధాన ఫలముగాఁగొని సాధించు నితర యోగులందఱును ఆ కడపటి సాధనావస్థలో ఆనందమున్నదనియే చెప్పెదరు. అది యట్లుండె.

అట్టి కైవల్యమును శాంతిమార్గమున సాధించుటకు చాల దినములు పట్టును. అనేకుల కాయువు చాలదేమో యను భయము గలుగును. కావున సాధ్యమైనంత త్వరలో దాని సాధించి ముక్తిఁబొందఁ గోరువారు దేహమనస్సుల నెక్కువ బలవంతపెట్టి లొంగఁదీయుదురు. ఈమార్గమునకే హఠయోగమని పేరు. హకారమునకు ఊర్ధ్వగతియగు ప్రాణవాయువును ఠకారమునకు అధోగతిగల అపానవాయువును అర్థమఁట. ఈరెంటికిని ఐక్యము సంపాదించి సాధించుట హఠయోగము. కావున వీనికి దేహమనస్సులను దండించు ఆసనప్రాణాయామములు ముఖ్యములు. ఇదిగాక దేహమందలి రోగములను నశింపజేయుటకును, శ్వాసకోశములు, కడుపు, నాసారంధ్రములు మొదలగు వానియందలి కఫాదిదోషములను బోఁగొట్టుకొనుటకును, ధౌతి, నౌళి మొదలగు కర్మములను, బ్రహ్మచర్యమును సాధించుటకు వజ్రోలి మొదలగు యోగములును వీరు

* (పా. యో. సూ. భోజరాజవ్యాఖ్య. కడపటి సూత్రమునకు)

సాధింతురు. ఈ మార్గములచే సాధింపగా కడుపుకింది మూలాధారమందున్నడు కుండలిని యను శక్తి, నిద్రించుచుండెను, [illegible] సుషుమ్న [illegible] దలి ఇడ, పింగళి అను నాడులలో సహజముగా సంచరించుచు ప్రాణము, [illegible] నడుమనున్న సుషుమ్న యమునా [illegible] గంగాను [illegible] మూలాధారము మొదలు బ్రహ్మరంధ్రము [illegible] చక్రములు [illegible] శక్తి చలించి సాధనబలముచే పైచక్రముల [illegible] క్రమముగా [illegible] కట్టకడపటిదగు సహస్రారచక్రమును జేరగా, అందు బ్రహ్మ [illegible] యసంప్రజ్ఞాతసమాధి కలుగును. అదే జీవన్ముక్తి. కుండలిని యుద్బోధము గానిది బ్రహ్మస్థానమును బొందవీలులేదు.

"యేన మార్గేణ గన్తవ్యం బ్రహ్మస్థానం నిరామయమ్
ముఖేనాచ్ఛాద్య తద్ద్వారం ప్రసుప్తా పరమేశ్వరీ"

(బ్రహ్మస్థానము [illegible] జేరవలయునో [illegible] ద్వారము [illegible] మూసి, పరమేశ్వరి [illegible] కుండలి) [illegible] యుండును.) ( [illegible] ఉప. 3. ప. ౧ )

కావున దానిని లేపుట ముఖ్యము. ఇట్లు హఠయోగము సాధనము; అసంప్రజ్ఞాతసమాధి సాధ్యము. దానినే రాజయోగ [illegible].

కాని హఠయోగపద్ధతియందు రాజయోగసిద్ధికి [illegible] సన్నికర్ష [illegible] లనేకములు కలవట. హఠయోగము కొన్ని సిద్ధులనిచ్చును. దాని నభ్యసించువారికి చావుండదట. అధునిక [illegible] శాస్త్రజ్ఞులు చాలా [illegible] చిరంజీవులగుట [illegible] యోగుల వాదము సులభమైనది. [illegible] పులు చావు కావున దానిని [illegible] !

యావద్బద్ధో మరుద్దేహే యావచ్చిత్తం నిరాకులమ్.
యావద్దృష్టిర్భ్రువోర్మధ్యే తావత్కాలభయం కుతః!"

హఠ. [illegible] ౬౦.

"తే. కట్టుపడియుండు [illegible]
చిత్తమెందాక [illegible]
కదలకుండాక భ్రూమధ్యకలిత దృష్టి,
యరయనందాక ప్రాణభయంబు లేదు

(శివయో. : అశ్వా.)

ఇదిగాక ఆకాశసంచారము, కామరూపము. పరకాయప్రవేశము మొదలగు విచిత్రసిద్ధులు. హఠయోగ సాధనచే లభించునట. కావున సాధకులు ముఖ్యఫలమగు

సమాధిని విడిచి వీనితోనే తృప్తిపడి యుండుట స్వాభావికము. అట్లగుటచే హఠయోగమును బోధించువారందఱు దీనికి ఫలము రాజయోగమే యనితలంచి సాధింపవలయునని హెచ్చరిక చేయుచున్నారు. ఆంధ్రయోగినులలో అగ్రగణ్యురాలగు తరిగొండ వెంకమ్మ యిట్లు చెప్పినది....

“ మఱి కొందఱతి మహామహిమ గాఁ గను
గుణనిజయోగక కర్మగురుని చెంత జేరి,
సాధకుల్ జీర్ణ దుష్కర్మ మార్గమున
సాధనంబుగ యోగ సరణులఁ దెలిసి,
యలసుట వాసనాభ్యాసముల్ సేసి,
కలిమి బాహ్యలక్ష్యముల్ చూపుచును,
కూటస్థమగు లోని గురి గానలేక,
లాలితంబుగ మంత్ర తంత్ర యోగ
ఫలములఁ గోరుచుఁ గామకులగుచు,
జలబుద్బుదము వంటి జన్మంబులను
సిద్ధులఁ గోరి ప్రసిద్ధమై యోగ
సిద్ధాంతమందు సుస్థిరమతిలేక,
అగణిత విషయ సుఖాసక్తి మీఱ,
తగ నణిమాద్య సిద్ధక్రియల్ నేర్చి,
మఱి పామరుల కెల్ల మహిమలం జూపి,
తిరుగుచు వారలీ దేహవాసనలు,
వీడంగ నేరరు వేదాంత మందుఁ,
గూడ నేరరు తట్టి సాధన గాని...”
( యోగసారము. ద్వితీ. ప్రక. )

కాని హఠయోగ సాధనము లేనిది రాజయోగము ఫలింపదంట!

“మ. హఠశూన్యంబగునేని ఫలింపదు మంబో రాజయోగంబొగిన్ ;
హఠయోగంబును రాజయోగరహితంబౌ నేని సిద్ధింప ; దీ
హఠరాజంబుల రెండుఁ గూడ సతతాభ్యాసంబుఁ గావించు ని
శ్చలసంకల్ప సమభ్యమానసునకున్ సాధ్యంబగున్ సర్వమున్.”
( శివయోగసారము. ౨. ఆశ్వా )

ఈ హఠవిద్యకే సంబంధించిన ‘శివ’ యోగములు రెండుగలవు. మంత్రయోగము; లయయోగము. మంత్రములను జపించుచు తన్మయుడగుట మొదటిది.

ప్రాణాయామధ్యానములచే దేహము శుద్ధమైనప్పుడు లోపల నొకవిధమైన నాదము అఖండముగా వినఁబడునఁట. బైట మనము వినుశబ్దము ఆహతము: అనఁగా దెబ్బ గొట్టుటచేఁ గలిగినది. ఇది యనాహతము. అనఁగా మన మెఱిఁగినట్లు ఏరెండు పదార్థముల ఒరయికయును లేకయే కలుగునది:—

> "మత్త. ఆయనాహతనాద మెంతయు నుద్భుతంబయి యాత్మలో
> మ్రోయుచుండు నిరంతరంబు సముద్రఘోషముభంగి, భృం
> గాఘురధ్వని రీతి, వేణుసమంచిత స్వరలీల, వీ
> ణాయతంబగు మ్రోఁత చందమువలె మనోలయహేతువై"
>
> ( శివయోగ–౩ ఆ. )

ఆ నాదమునే వినుచు అందు మనఃప్రాణములను లయింపఁజేయుటయే లయ యోగమందురు. హఠయోగప్రవర్తకుఁడగు 'శ్రీఆదినాథుఁడు' సపాదకోటి లయ ప్రకారములను జెప్పినాఁడఁట! అందులో నాదలయమే ముఖ్యమనితలఁచి హఠ యోగులు సద్య మనలను బ్రదికించిరి!

( హఠ–౪ ఉపదే. శ. ౭౭ )

(వేమన్నకు గురువైన 'లంబికాశివయోగి' యీహఠయోగుల గుంపునకుఁ జేరిన వాఁడు. లంబిక యనునది లంబికాశబ్దభవము. దవడలని యర్థము. వానిపైఁగల శిరో రంధ్రములో నాలుకను జొనుపవలెను. భ్రూమధ్యమందలి యెడమప్రక్క చంద్ర స్థానముగలదు. నాలుకను ఆచంద్రస్థానము నంటునట్లుచేయవలెను. అప్పుడొక యగ్ని జనించును. దానిచే ఆ చంద్రస్థానమునుండి కరిఁగి అమృతము స్రవించును. దానిని త్రాగిన యోగికి రోగము, చావు, ఆకలి, దప్పి, ఆలస్యము, నిద్ర, మొద లగునవేవియు నుండవు. కాని నాలుక యంతపొడవుగా సాఁగుట యెట్లు? మూఁడు సాధనములు: నాలుకక్రింది నరమును క్రమముగా కోసివేయుట; వ్రేళ్ళతోఁబట్టి ప్రక్కలకల్లాడించుట; ఆవుచన్ను పిండినట్లుగా లాఁగుట! ఇట్లు కృత్రిమముగా నాలుకను పొడిగించుకొని, పైఁజెప్పిన లంబికావివరములోఁ జొనిపి క్షణార్థ ముండినను యోగి విషవ్యాధిమృత్యువులను దప్పించుకొనునఁట! * దీనినే లంబికా యోగమనియు ఖేచరిముద్రయనియుఁ జెప్పుదురు. కాని యిది బాహ్యఖేచరి. అంతః ఖేచరివేఱఁట. కన్నులు సగము మూసి దృష్టిని నాసాగ్రమందు నిలిపి చూచిన మండలాకారమైన తేజోదర్శనమగును. ఇందు మనఃప్రాణములు లీనముచేసి యొప్ప లల్లార్పక 'చూచునతండు జగద్గురుండగు' ననియు నదియే నిజమైన ఖేచరియనియుఁ జెప్పుదురు; మఱియు,)

* ( చూ. హఠయో–౩ ఉప. శ. ౩౨ నుండి ౫౦ వఱకు )

"మ. ధరణిం గొందఱు సద్గురూక్తగతి నంతఃఖేచరీముద్రికా
కరభావం బెఱుఁగంగ నేరకకదా వాలాయముం బాహ్యఖే
చరియుం బట్టి నిరూఢసాహసమహోత్సాహరంధ్ర గ్రంథని
ష్ఠురులై జిహ్వలుఁగోసికొం(డ్రది సుముక్తి మెత్తురే యుత్తమా!"

(శివయో-౪-ఆశ్వా.)

అంథికా శివయోగి యొకవేళ నీ యాంతరఖేచరిని తరువాత నెఱిఁగి యాచరించి యుండిన నుండవచ్చును గాని, మొదలితఁడు నాల్కను గోసికొన్నవాఁడే యని యతని పేరే తెల్పుచున్నది. అనఁగా నితనికదే పేరని కాని, అసలాపేరుగల వ్యక్తియొకఁడుండి వేమన్నకు గురువైనాఁడని కాని నిశ్చితముగాఁ జెప్పలేము. మఱి యిటువంటియోగి యొకనికో యతఁడు శిష్యుఁడైయుండుట తప్పు కాదు వాడుకలో నున్న యతనినే గురువుగా నంగీకరింతము.

ఆ గురువుకడ్డ శిష్యునికిని ప్రప్రథమమందు పై హఠయోగవిద్యలో నుపదేశము జరిగినది. ఇతఁడును నాలుకను గోసికొన్నాఁడు. ఎవఁడో నాబంటివాఁ డిదంతయు బట్టి భ్రాంతియని తిరస్కరించెను గాఁబోలు, వాని నొప్పింపలేక, గురువుగారియందలి నమ్మకము చేతనో, తన యనుభవముచేతనో దానియందు సందేహములేక యిట్లు ఆక్రోశించినాఁడు:—

"ఖేచరీముద్రకు కీలెఱుంగఁగ లేక
నాలుకలాడువట్టి నారినెల్ల
త్రొక్కి నాల్కఁ బట్టి తుదఁ గోయుదురయ్యరా!

(వే. కై. ౧౩-౪-౧౬. మఱియు నెక్కు ప్రాఁతప్రతులు.)

ఇట్లే పంచాక్షరీమంత్రము, ద్వాదశాక్షరీమంత్రము మొదలగు వానిని కూడ నితఁడు కొన్నాళ్ళు జపించినట్లున్నది. "ముక్తికిఁ దాఁ దల్లి సుమీ పంచాక్షరి" యని (వే. వి-౧-౨౦-) చెప్పియున్నాఁడు. తరువాత ప్రాణాయామసాధనకు మొదలిడినాఁడు. 'ఊఁగి లాగిలాగి యొసరఁగ బిగఁబట్టి పూరి గాలి విడిచి' (౫౧౫) నాసిని సాధించినాఁడు. ఆ సందర్భమున నితనికి,

"క. భువి పొందుటుడిగి దూర
శ్రవణంబును దూరగమన జవము నక్కృతి
ద్రవము సు, సుదూరదృష్టియు,
నవిగళ నాదశ్రవణము నగు బోధమునన్"

(శివయో-3-ఆశ్వా.)

అని చెప్పిన నిష్ఠలలో తిక్కన చెప్పిందినను, నాదశ్రవణము మాత్రమే కలిగినది. ఆ లంబయోగమును దాననుభవించినాఁడు;

"ఆ. నాదములకుఁ జేవి నాదంబుఁ బొంగించి
భేదమింతలేక పెనఁగినపుడు
నాఁటి కాల్వరలెను నాఁటిరా యీనాఁడు..." (౨౧౮౮)

ఇట్లే షట్చక్రభేదనమగు కుండలీయోగమును గూడ సాధించినాఁడు. (౩౧౫౨-౫౬) అంకములో కడపటి సహస్రారచక్రమును జేరు సాధనలో,

"ఆ. నిటలమున్గ మిక్కి నిక్కి చూడంగను
కటిలమాప కళలఁ గూరుఁ గలుగ" (౨౨౨౨)

అట్లగుటచేత, ఇంకను పూర్తిగా అద్వైతానుభవములేక మనసు చలాచలముగా నున్నది గావున, ఆత్మపరమాత్మల స్వరూపము వేఱువేఱుగాఁ దెలియఁగోరియున్నది యింకను సాధ్యముగాక,

"ఆ. నినుఁజూచెనేని తన్ను భావమున
తన్నుఁజూచెనేని నిన్ను మఱచు;
ఏవిధమున మనుజుఁ డెఱుఁగు నిన్నును దన్ను?..." (౨౨౪౦)

అని కష్టపడినాఁడు. ఈ సంప్రజ్ఞాత సమాధియందే స్వగుణ స్వరూపము క్రమముగా నిట్లు అనుభవమునకు వచ్చునఁట:

"క. శ్రీవెలయఁగ సాకారము,
నావల దీపాకృతియును, నాశిఖలాగున్
దీవార శూకరూపము,
భావన పణుసిధము, సగుణభావము లివియే

(శివయో-౧-౫.)

ఇట్టి తేజోదర్శనము వేమన్నకును గలిగినది:

"ఆ. కనులకెదుటి నడుమ కానంత నిలిపిన
బొమలు మీఱి చూడ్కిఁ బొందఁజేయు,
క్రమమెఱిఁగి లోన కాంతిని గట్టురా..." (౨౧౩)

కాని యింతటితో నుండక,

"ఆ. కనుల చూపు నిలిపి కాంతిని గమనించి
కాంచవలెను చిత్రకళల దాఁటి" (౨౧౦)

అనుకొని సాధింపఁగా, భావరూపమైన పైఁజెప్పిన యుపాస్యవస్తువు అభావస్వరూపముగా మాఱి తుదకు సోహంభావసాధనచే 'భావాభావాతీతం'బైన నిర్గుణము అనుభవమునకు వచ్చినది. అది 'వియత్సదృశంబై'—అనఁగా ఆకాశము వలె బయలై—యుండునఁట. * ఆబయలందే బ్రహ్మమున్నదఁట.

"ఆ. తెలిసి నిలిపిచూడు దీపించు నాకళల్,
కళలుడుపక చూడు కలుగు బయలు;
బయలు నంటిమాను బ్రహ్మంబు గాంచెను..." (౧౯౬౩)

కాని యీబయలే బ్రహ్మ యని వేఱొక్కచోట వేమన చెప్పెను.

"క. బయలున సర్వముఁ బుట్టును,
బయలందే లీనమగును, బ్రహ్మంబనఁగా
బయలని మదిలోఁ దెలిసిన
బయలందే ముక్తి బట్టబయలగు వేమా" (౨౬౯౬)

మఱియు నాబ్రహ్మము తానేతప్ప వేఱుగాదని తేల్చుకొనెను. "తన్నుఁదా నెఱిఁగినఁ దానెపో బ్రహ్మంబు" (౨౭౨౨) కావున 'ఏవిధమున మనుజుఁడెఱుఁగు నిన్నును దన్ను?' అని తనకు వేసినప్రశ్నకిప్పుడు ప్రత్యుత్తరము లభించినది.—

"ఆ. నిన్నుఁ జూచుచుండ నిండును తత్త్వంబు,
తన్నుఁ జూచుచుండఁ దగులు మాయ;
నిన్ను నెఱిఁగినపుడె తన్నుతా నెఱుఁగును..." (౨౨౩౯)

తాను బ్రహ్మమైనపుడు తక్కినవన్నియు నేమి తప్పుచేసినవి! కావున సమస్తమును బ్రహ్మమే. "బ్రహ్మమన్నిటఁ దగుఁ బరిపూర్ణమైయెప్పు" (౪౪౯౬)

ఇట్లు రాజయోగపగమారఢ్యమైన యద్వైతానుభవము సాధించిన వెంటనే, ఆసనములు, ప్రాణాయామము మొదలగు హఠవిద్యల నతఁడు తిరస్కరించెను. ఇది,

"ఆ. ఏఱుదాఁటి తెప్పకేఁగిన పురుషుండు
పుట్టి సరకుఁ గొనక పోయినట్లు" (౪౬౦)

అని యితఁడే వేఱొక విషయమై చెప్పిన న్యాయమువంటిదే కదా! చూడుఁడు.—

"ఆ. ఆసనములు పన్ని అంగంబు బిగియించి
యొడలు విఱుచుకొనెడు యోగి వెల్ల
బెట్టిసాము కన్న చింతాకు తక్కువ..." (౩౩౪)

* (శివయోగ ౧ అ.)

"ఆ. కల్లగురుఁడు గట్టు కల్లకర్మంబులు
మధ్యగురుఁడు గట్టు మంత్రచయము
ఉత్తముండు గట్టు యోగసామ్రాజ్యంబు....." (౯౬౩)

కాని నాకొకటి తోఁచుచున్నది. హఠమార్గము చాలకష్టమైనది. దానిని సాధింపఁగల యోర్పును సామర్థ్యమును గలవారరుదు. అనేకులిందలి సిద్ధుల కాసపడి యంటటితో చాలించుకొనుట సత్యము. అట్లుగాక రాజయోగమును సాధించి ఆత్మజ్ఞానమును సంపాదించుటకే దృఢచిత్తముతో హఠమును సాధించుచు కష్టపడువానిని జూచి కరుణించి సమర్థుఁడగు గురువు, స్వశక్తితో నొకనిమిషమందు శిష్యునికి అసంప్రజ్ఞాతసమాధిఁ గల్గించి బ్రహ్మసాక్షాత్కారముఁ జేయింపఁగలఁడఁట! "సద్గురు పాదప్రసాదంబున క్షణమున రాజయోగమున మనసు నాశమౌ తోడనె నాశమౌ గాలియు" (శివ. ౮. అ.) దీనినే తాంత్రికులు "వేధదీక్ష" యందురు. శిష్యుని దేహమందలి షట్చక్రస్థానముల నెఱిఁగి, మంత్రబీజాక్షరన్యాసము చేసి, మోకాళ్ళు మొదలు నాభి, హృదయము, కంఠము. వరుసగనంటును గురువు 'వేధింప' వలయునఁట. తోడనే శిష్యుఁడు పాపములన్నియు నశించి, బహిరంగ వ్యాపారము లన్నియు నిలిచి క్రిందఁబడునఁట. అతనికప్పుడు దివ్యత్వము గలిగి సర్వము తెలియఁగఁ గలఁడఁట. కాని యట్టి సామర్థ్యముగల గురుశిష్యులిరువురును దొరకుట దుర్లభమఁట! * వేమనకుఁగూడ హఠయోగమువలన వేసరియుండిన వేళలో గురువు ఈ వేధదీక్ష నిచ్చెను గాఁబోలు. వివేకానందుఁడు మొదలగు శిష్యులకు రామకృష్ణపరమహంసుఁ డిట్టి దీక్షనే యిచ్చినట్లున్నది. †

"ఆ. గతము చేసినట్టి కర్మబంధము లెల్ల
పరిసి పోవు సత్యగురుని వలన
కుమ్మరి కొకయేఁడు గుదియకు నొకనాఁడు..." (౧౭౮౯)

('గుదియకునొకయేటు' అని ప్రాఁతప్రతులు)

ఇదియే నిజమగునేని అశనాదులు నిరర్థకములని యితఁడు తిరస్కరించుట సహజము. కాని యితఁడు తనయనుభవము నితరులకు బోధించినప్పుడు అట్టిగురువు నాశ్రయింపుఁడని చెప్పలేదు; మీరే సాధింపుఁడన్నాఁడు.

"ఆ. ధాత్రి జనులకెల్లఁ దగ నెఱింగించెద
తొవర మాఱని జూపు నుపమయొకటి;
మనసు చెదరనీక మహిమతోఁ జూడుఁడీ....." (౨౧౩౪)

* చూ. కులార్ణవతంత్రము, ౧౪-వ ఉల్లాసము.

† See 'The Life of Sree Rama Krishna.'

"ఆ. తారకంబుఁ జూచు దారివేఱె కద్దు,
సమముగాను జూడఁ జక్కఁబడును:
వెత్తిగాను జూడ వెలుఁగెల్లఁ బాఱురా..." (౧౯-౨-౨)

అనఁగా నిది స్వప్రయత్నముచేతనే సాధింపవచ్చునన్నమాట. ఏమో! ఎవ రెఱుఁగుదురు?

"ఆ. రాజయోగి మహిమ రాజయోగికిఁ గాక
యితరజనుల కెల్ల నేమి తెలియు..."? (౩౨౯౩)

ఇట్లు అసంప్రజ్ఞాతసమాధిమహిమచే తానే దైవమని యెంచిన వెంటనే. యింతవఱకే యుత్తమమా పొందుమాయని యూఁగులాడుచుండిన హరిహరులు ఇతని ప్రపంచమునుండి యంతర్ధానమైపోయిరి. "తాను దేవుఁడైన దైవమేల కొలుచురా" (౩౨౯౩) యను వానివద్ద నే దేవతలకుప్పు పుట్టును? ఇతఁడు,

"ఆ. బ్రహ్మఁ జంపి విష్ణుభాగంబులోఁ గల్పి
విష్ణుఁ జంపి శివుని వీటఁ గలిపి
శివునిఁ జంపి తాను శివయోగి గావలె....." (౨౭౭౩)

అని సంకల్పముచేసి గెలిచినవాఁడు! కావుననే వెనుకఁ జెప్పినట్లు,

"ఆ. బ్రహ్మ నంత కెమరు పల్కినవాఁడును
అవి విష్ణుమూర్త్తి నుడఁచువాఁడు
మాఁడుకనులవాని మొనసి నిల్పినవాఁడు
కానఁబడరు నీవు కాని వేమ" (ఓ. లై. ౧-౨-౧-30)

అని చెప్పుకొని త్రిమూర్తులపై కసిదీర్చుకొనెను. కాని శైవుఁడై పుట్టినందుకు అందఱికిని అగువలెను శివునకు శిక్షనీయ లేదు; అంతే గౌరవముగా పరమేశ్వరుఁడు సంతోషింపవలసియున్నది.

పై రాజయోగసాధనవలన వేమన నిజముగా తత్త్వజ్ఞానమును సంపాదించెనా? అతఁడు బోధించిన యద్వైతమే పరమతత్త్వమా? అను ప్రశ్నలకు బదులుచెప్పుట నాశక్తికి మీఱినపని. (బ్రౌనుదొర ఇతని సిద్ధాంతము అర్థము కానిదనియు నిష్ఫలమైనదనియుఁ జెప్పెను. * నాకా ధైర్యము లేదు. నాకెంతమాత్రము నమ్మికగలదు: వేమన్న తాను తత్త్వజ్ఞుఁడైతినని దృఢముగా నమ్మెననుటలో సందేహములేదు.)

ఇట్లు ఇతఁడు ఈ సంసారుల ప్రపంచమునందలి దంభవంచనాదులకు రోసి, అందేమోక్షోపద్రవము గలదనుకొని, వైరాగుల ప్రపంచమునఁ బ్రవేశించెను. కాని, పాపము, మనుష్యులయోగ్యత యెందున్నను ఒకటే యను తత్త్వమును అతఁడచ్చట

* See Brown's Vemana. Preface. P. II.

నేర్చుకొనవలసి వచ్చెను. ఎందఱో యోగిబ్రువులు తాము సిద్ధులమని, మాంత్రికులమని, విరక్తులమని, తత్త్వజ్ఞులమని, వేషములు వేసి ప్రపంచమును ప్రతారణచేయుచుండిరి. ‘సర్వోపాయ పరిభ్రష్టా వేశ్యాభవతి తాపసీ’ |* యనునట్లు ఇంకొరమును జీవనము జరుగనివారి కీయోగివేషము కల్పవృక్షమువంటిది గాయెను. తక్కిన విద్యల లోగుట్టును ఇతరులు చాలవఱకు నెఱుంగఁగలరు. కాని ఈ ‘యోగుల’ కసరత్తులు, బహిరంగోపాసనములు, సమాధులు మొదలగు నానికి మోసపోనివారరుదు. ఇట్టి వారిప్పటికిని మన సంఘమునందంతటను సంచరించి, చదువుకొన్నవారిని లోపఱచికొని, సంసారములు ధ్వంసముచేయుచున్నారనుట మీ రెఱుఁగుదురు.

“ఆ. బ్రతుకుదెరువు లేని బడుగులందఱు పెద్ద
యోగివరులమనుచు పొంగిరి గద
బండవాండ్రు మునుపు పండుబు లిడుదురు...” (౨౭౭౩)

కడపటికెన్నాళ్ళు భోగమునందును యోగమునందును కష్టపడి యతఁడు నేర్చుకొన్న ముఖ్యవిషయములివి.—

సంసారము సారములేనిది, దుఃఖమయము; మాయారూపము; (ఈ ‘మాయ’ శబ్దమున కతనికి నిజమైన యర్థమేమో తెలిసికొను మార్గములేదు. ఈమాయ సంసారము మనసులోనే పుట్టినది. దీనిఁ ద్రెంచుకొనుట ప్రధానపురుషార్థము. దానికి కర్మములు పనికిరావు. ఉపవాసములు, విగ్రహారాధనలు మొదలగువానిచే ఆమాయ తెగదు. కాఁబట్టి ‘కర్మగుణములెల్ల కడఁబెట్టి నడవమి, తత్త్వమెట్లు తన్నుదగులుకొనును?’ (౯౮౮) అని యతని ప్రశ్న. ఆతత్త్వము నెఱుఁగుటకు నామతిలు విడిచి మనస్సునిల్పి ధ్యానించుట చాలును. తక్కిన సాధనములక్కఱలేదు. దీనికై యడవులకు కొండలకు పోఁబనిలేదు. పల్లెలలో ఇండ్లలోనుండి నేమ చేయవచ్చును. కాని పట్టణములందుండక పోవుట మేలు; ఎందుకనఁగా:—

“ఆ. పట్టణంబులందు పతులకు సతులకు
మోహ మెచ్చు దానియూహ లెచ్చు
ముక్తిమార్గమునకు యుక్తియే తెలియదు...” (౨౩౮౫)

కనుక ఆమోహమును వదలించు బ్రహ్మచర్యము ముఖ్యముగా సాధింప వలయును. కామాతురత్వము నిలుపుటకు అందరికిఁ జేత, దానివలని దుష్ఫలములను ఎఱిఁగి క్రమముగా స్వాధీనపఱుచుకొనవలసినదే కాని, కృత్రిమములగు హఠవిద్యల చేతఁగాదు. ‘పేని గడ్డిగట్ట నేనుఁగు నిలుచునా?’ (౯౮౩) యని యతఁడడుగు చున్నాఁడు. ఇది స్వాధీనమైనచో తక్కిన సాంసారికదుఃఖ హేతువులైన క్రోధ

---

* అన్నియుపాయములును పనికిరాకపోయిన వేశ్య తాపసియగును. అని తా

తాభావములంతటనే నశించును. పంచేంద్రియములు పంచభూతములందు సంచరించు చున్నన్నినాళ్ళును ఈజగత్తున్నట్లు కానవచ్చును. (౨౩౩౫) కావున నాయింద్రియముల నంతర్ముఖముగాఁజేసి మనస్సులోఁ గలిపి చూచిన, ఇన్నిటికిని కారణమయిన జీవుఁడొక్కఁడే నిత్యమనియు తక్కిన వన్నియు అనిత్యమనియుఁ దెలియును. ఆ జ్ఞానముగలిగిన తరువాత కన్నులు విచ్చి చూచినను ఆ జీవుఁడొక్కఁడే ఈ ప్రపంచమందలి చరాచర వస్తువులందెల్ల నంతర్యామిగా నున్నాఁడని తెలియును. అతఁడు లేనిదేదియు నిలవదు. కావున నదియే బ్రహ్మము. అనఁగా తానే బ్రహ్మము. కావున నీ బహిఃప్రపంచమందొకరియొక్క యెక్కువయు నింకొక్కరితక్కువయు లేదు. జాత్యాది భేదమున కర్థము లేదు. వ్యావహారికమైన గౌరవమునకు కారణ మజ్ఞానము. ఇది లేని వారందఱు నొక్కటే. కావుననే మైల, ఎంగిలి మొదలగునవి యెల్ల వట్టిభ్రాంతులు.

ఎప్పుడీ విషయములు ఇతని మనస్సున తట్టెనో, వాని నప్పుడే తానాచరించి, మీరును అట్లు చేయుఁడని యితరులకు బోధింప మొదలు పెట్టెను. ఇదివఱకును నే నుదాహరించిన పద్యములవలన వేమనయందలి స్పష్టసిద్ధమైన స్వభావమొకటి మీకు స్పష్టమై యుండును. అదేదనఁగా ఉద్రేకము. ఇతఁడు చెడినచేష్టలకును, పడినపాట్లకును, సాధించిన సాధనలకును, అంతములేదు. మనసులోఁ దోఁచినది నోటఁజెప్పుటకును చేతఁ జేయుటకును భేదమట్లుండఁగా, అసలంతరమే యుండదు. యమనియమాది యోగసాధనలచే ఇతని కన్నియు సిద్ధించి యుండును గాని, శాంతి మాత్ర మెక్కువ సిద్ధింప లేదని చెప్పవలసి యున్నది. తన కిష్టము కాని పనులు చేయు వారిని, తన మాటలను వినని వారిని జూచి, వారియజ్ఞానమున 'కయ్యో పాప' మనుటకు బదులు ఇతని కసహ్యము జనించును. ఆ యసహ్యము మనసులో నుండక నోటినుండియు నసహ్యముగానే పలుమాఱు వెడలును! అట్టిసందర్భములలో తా వాడు మాటలలో యుక్తియున్నదా లేదా యని కూడ విచారింపఁడు. చూడుఁడు.—

ఎప్పుడును యోగానందమునందే తేలియాడువారికి బహిరంగములగు వేషము మొదలగువానిపై నంత యక్కఱ యుండదు. వస్త్రములు శుభ్రముగా నుంచుకొనుట, అందుకై చాకలివానితో కలహించుట మొదలగు పనులకు కాలమును ఉండదు. కావున నట్టివారు చినిఁగిన మురికిబట్టలతోనే కాలముఁ గడపవచ్చును. కొందఱదియు వలదని 'కౌపీనవంతః ఖలు భాగ్యవంతః' అని యనుకొని యుందురు. వేమన కూడ తొలుత కొన్నాళ్ళు 'గోచిపాతకంటె కొంచెంబు మతిలేదు' (౪౫౦) అని యనుకొన్నను, తరువాత ఇంకను దూరము పోయి సాక్షాత్పరమశివసారూప్యమును బొందినాఁడు. ఇట్టి సందర్భమున ఇతని నెవరో 'కోత్యాటలాడించి వెళ్ళియనుచు

నూరు వేలఁగొట్టిరి (౧౩౩౯) అప్పుడు దానికతఁడిచ్చిన అపహాస్యోత్తర మట్లుండ దిందు. ఈ తర్కయుక్తి వినుఁడు.—

"ఆ. తల్లిగర్భమందు తాఁ బుట్టినప్పుడు
మొగలు బట్టలేదు తుదను లేదు,
నడుమ బట్టఁగట్ట నగుఁబాటు గాదొకో..." (౧౫౪౫)

కాని, యీయోగవిద్య, ఈకవిత్వము—తల్లిగర్భమునఁ బుట్టినప్పుడే వేమన్నకు వచ్చినవా? ఏమియుక్తి! కాని యీవైరాగ్యము ముదురుటకు ముందు వేమన ఈ బహిరంగ శుద్ధిగూడ మంచిదనియే తలఁచెను.

"ఆ. మాసిన తలతోడ మలినవస్త్రముతోడ
ఒడలి జిడ్డుతోడ నుండెనేని
అగ్రజన్ముఁడైన నట్టె పొమ్మందురు..." (౩౦౫౧)

ఇట్లే యెంగిలిని గూర్చిన యితని వాదమును విచిత్రమైనది. సామాన్యముగ నోటిలోనిజొల్లు ఆహారాదులదోషముచేతను, రోగక్రిములచేతను దుష్టముగానుండును గావున, మనుష్యదేహమందు వెడలు మలములలోనదియు నొకటిగా భావించి, దాని సంపర్కముచే ఇతరులకు రోగములసంక్రమణములును అసహ్యమును కలుగకుండ వలెనని, యెంగిలి చేయరాదని, యెంగిలి యన్నము తినరాదని, మనుష్యులు నియమము లేర్పఱచుకొన్నారు, ఎంగిలియన్నము నితరులకు పెట్టరాదని వేమనయు నొకమాఱు తలఁచినవాఁడే. (౬౩౯) కాని దానినతిచేసి వీధులలో, నడుచునప్పుడును ఎంగిలిమంగలములు త్రొక్కుదుమేమోయని పేడనీళ్ళు చల్లుకొని యడుగులు పెట్టువారును, ఎంగిలి పాత్రములు దర్భచేసి కాల్చిననుగాని పనికిరావనువారును మనలో నున్నారు. ఇది యసహ్యమని యందఱంగీకరింపవలసినదే; కాని విరక్తుఁడైన తరువాత వేమన్న యేమన్నాఁడో వినుఁడు.

"ఆ. ఎంగిలెంగిలనుచు నీనోటితోడనే
వేదములను జదువ వెఱ్ఱులార!
ఎంచిచూడ నదియు నెంగిలి గాదొకో..." (౫౯౬)

వాని దోసమూలమైన నితని దింకొకమూల! వేదము శబ్దమే! అదియు ఎంగిలి యన్నమాట కర్థమేమి? శబ్దమునకుఁగూడ సాంక్రామికరోగములు వ్యాపించునా? అను నీ మాత్రపు ప్రశ్నలు వేమన్నకు తోఁపలేవని కాదు. తోఁచినను ఆ యుద్రేకపుటుడుకులో గమనింపలేఁడంతే.

ఇట్లే ఏకాదశి మొదలగు దినములలో నుపవాసముండిన పాపములు నశించి పుణ్యముగలుగును: తపస్సుచేసిన నష్టైశ్వర్యములు లభించును; తిరుపతికో శ్రీశైలమునకో

పోయి యందలి దేవునకు సేవచేసిన మోక్షమునిచ్చును. అని, సామాన్యముగ నందఱును నమ్ముదురు. కొందఱొకింత యుపవాసముండి శనిరోగములు తెచ్చుకొన్నవారున్నారు. తపస్సు చేయుటలోను నష్టైశ్వర్యులైన వారు కలరు. దేవళములలో మూలవిగ్రహములకే కాక యందలి కంబాలకు దూలాలకును మ్రొక్కువారును లేక పోలేదు. కావున ఈ యుపవాసము, తపస్సు, విగ్రహపూజ, మొదలగువాని యందలి దోషములను గమనించి ఖండించువారున్నారే కాని యివి శుద్ధముగా నిష్ఫలములని యే తెలివిగలవాఁడును ఇదివఱకు చెప్పలేదు. కాని ఈపాపకార్యములకు వేమన్న ధర్మశాస్త్రములలో శిక్ష లేమనుకొన్నారు ?

“ఆ. ఒక్క ప్రొద్దులున్న నూరిపందై పుట్టు
పృథివిదసుము సేయ బేదయగును;
నిగిడి శిలకు మ్రొక్క నిర్జీవుఁడగును...” (౩౯౪)

ఇవన్నికన్న వైయక్తికము ఒక్కటియున్నది. వేమన్న దాని తెలిపినది. అదేదనఁగా సృష్టియందలి స్త్రీవ్యక్తి. మొదటినుండియు మనుష్యజాతిలో మగవాఁడు తన సులోచనములతో నేమి ప్రపంచస్వరూపమును నిర్ణయించెను. సహజముగా గర్భధారణము, ప్రసవము మొదలగు ప్రకృతి సిద్ధమైన భారములు మోయవలసి యుండుటచే తనకన్న దుర్బలురాలైన యాఁడుది తనకు తప్పక కావలసిన వస్తువగుటచే, తన చేతిక్రింద నుండవలయుననియు, తను చెప్పినట్లు వినవలెననియు పురుషుఁడు నిర్ణయించెను. అది తనకెంత యావశ్యకమో కాను దానికంతె గదా యని యాలోచింపవలసిన యక్కర యతనికి తోఁపలేదు. స్వార్థము ప్రకృతిస్వభావధర్మము. దానికితరులు విఘ్నము గల్గించుటయును ఇతరుల కష్టసుఖముల నెవ్వరును సామాన్యముగ గమనింపరు. కావున స్త్రీ, పురుషుని యిల్లు, వాకిలి మొదలగువాని వలె ఆస్తిలో చేరిపోయెను. దానిని సంరక్షించుట, కాచుకొనుట, ఇంటి పనికి రాకున్న పడఁగొట్టుట మొదలగు విధికార్యములు మగవానికి వచ్చి యతఁడు ‘భర్త’ యాయెను, తక్కినపనులకరవైన యాఁడుదియు ‘భార్య’ యాయెను. కాని యిల్లు వాకిండ్లకు లేని తెలివి, స్త్రీలకు, పురుషులకువలెనే కలదు కావున, స్వాతంత్ర్య కాంక్ష కావలె వీరికిని కలిగెను. దేహబలము యుండియుండిన, వీరేశలింగము పంతులుగారి ‘ఆఁడుమళయాళము’ ఎన్నఁడో నిజమైయుండును. అది లేకపోవుటచే ఇతరవిధముల మగవారిని వశపఱచుకొని వారిపై దౌరతనము చేసి కసి దీర్చుకొనవలెనను ప్రయత్నము జరిగినది. స్త్రీపురుషులు నాగరికతను జూచి యొకరు మోహించి లోపడుట సమానమైనను, స్వాతంత్ర్యము గలవాఁడగుటచేత మగవానికి తన మనసును నిల్పుకొను శక్తిపోయినది; స్త్రీకి పారతంత్ర్యముచేత నది వచ్చినది. కావుననే యేదో

మార్గములచేత పురుషుని ముగ్ధునిగాఁ జేయవచ్చునో యవన్నియు స్త్రీ నేర్చుకొనవలసి వచ్చెను. తుది మొదలు లేని యలంకారములు, వేషములు, మఱుఁగులు, మానములు స్త్రీధర్మములైనవి. నేఁటికిని స్త్రీమనసు నెఱుఁగుటకు పురుషుఁ డెన్ని విద్యలు నేర్చినాఁడో యన్నిటికన్న నెక్కువ పురుషుని మనసు నెఱుఁగుటకు స్త్రీలు నేర్చినారనుట సత్యము గాకపోయినను సత్యమైన విషయము. మగనిపైని స్వాతంత్ర్యమును సంపాదించిన యావిద్యలు క్రమముగా మగజాతిపై ప్రయోగింపఁబడినవి. కావుననే పురుషుని చెఱుచుటకే స్త్రీ పుట్టినదను మర్యాద యొకటి మగవారిలో ప్రబలించెను. మనువు ఇట్లు చెప్పినాఁడు.—

"స్వభావ ఏష నారీణాం నరాణామిహ దూషణమ్.
అవిద్వాంసమలం లోకే విద్వాంసమపివా పునః
ప్రమదాహ్యుత్పథం నేతుం కామక్రోధవశానుగమ్" (మను. ౨ అధ్యా.)

(మగవారిని చెఱుచుట స్త్రీల స్వభావము. చదివినవానినిగాని చదువనివానినిగాని కామక్రోధవశుఁడైనవానిని తప్పుదారి కీడ్చుశక్తి స్త్రీకి కలదు.)

కావున మగవాఁ డెట్లూరకుండఁగలఁడు? తాను చేసిన తప్పెఱుఁగక, వారి నణఁచుట తన స్వభావముగాఁ జేసికొని, అందుకుఁ గావలసిన బందుకట్లు, సంకెళ్లు, తలుపులు, తాళములు, ఎన్నియో కనిపెట్టినాఁడు. ఇల్లే చెఱసాలగా మార్చుకొన్నాఁడు. ఎప్పుడును వారిపై 'నిగా' యుంచుటయే యతని ధర్మమైనది.

కాని హిందూసంఘమందలి స్త్రీలెల్ల నిట్లే యుండిరనియు, మగవారెల్ల వారిని గూర్చి యిట్టి భావములే కలిగియుండిరనియు చెప్పలేము. పరస్పరవిరుద్ధములైన విషయములకు హిందూసంఘమునందున్నంత విశాలావకాశము మఱెక్కడను లేదు గాఁబోలు. అదే మనుస్మృతిలో నొకచోట,

"యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్రదేవతాః
యత్రైతాస్తు నపూజ్యన్తే సర్వాస్తత్రాఫలాః క్రియాః"

(మను. 3-౫౬)

(స్త్రీల నేచోట పూజింతురో యాచోట దేవతలు సంతోషింతురు. వారు పూజింపఁబడని స్థలములో నెన్ని సత్కర్మములు చేసినను నిష్ఫలములగును.)

అని చెప్పఁబడినది! ఇదిగాక స్త్రీ స్వశక్తి, సృష్టిచేయు బ్రహ్మయొక్క శక్తియని నిర్ణయించిన తాంత్రికులు, జగన్మాతృరూపిణియగు శక్తి నుపాస్య దేవతగాఁ జేసికొన్న తరువాత, స్త్రీవిషయమందిట్టి యపచారములు తప్పని గమనించినారు.—

"శతాపరాధైర్వనితాం పుష్పేణాపి నతాడయేత్
దోషాన్న గణయేత్ స్త్రీణాం గుణానేవ ప్రకాశయేత్"

(కులార్ణవతంత్రము. ౧౧ ఉల్లాసము.)

(నూఱుతప్పులు చేసినను స్త్రీని పూవుతోనైనను గొట్టరాదు. వారి దోషములు బైలు పెట్టరాదు. గుణములనే వెల్లడిచేయవలెను.)

శిష్టపురుషులింకను దూరముపోయిరి. స్త్రీయందు పాపమను పదార్థమే యుండదనిరి!

"వనితాయాం తథా శక్తౌ దురితం నైవవిద్యతే" (లక్ష్మీతంత్రము, ౪౩ అధ్యా)

ఇది మఱొక ధ్రువముగదా. ఐనను సామాన్యముగ స్త్రీ భోగ్యవస్తువనియు, మగవానిని జెఱుచుటకే సృజింపఁబడినదనియు రూఢమూలమైయున్న భావము మనలో నింకను నశింపలేదు.

వేమన యిట్టిపక్షమందు పెరిగినవాఁడు. స్త్రీలచే చాలకష్టము లనుభవించినవాఁడు. తాను సాధించు మనోనిగ్రహమునకు వారు పలుమాఱు విఘ్నములుగా దాఁపురించి యుండవచ్చును. కావున నట్టియవస్థలో తనదౌర్బల్యమును నిందించుకొనక, స్త్రీజాతినే బూతులు దిట్టినాఁడు.

"గతులు పతులవలనఁ గానంగలేరయా" (౩౫౩౨)

"అఁడు దనఁగ రోత—..." (౨౩౧)

ఇత్యాదులనేకములు. మఱియు, ప్రభువు, ప్రజలు వీరినిగూర్చిన,

"ఆ. ప్రజలయొనర్పు చెడుగు ప్రభునకు వచ్చును,
ప్రభుపు మంచియుండు ప్రజకు సగము,
ప్రభువొనర్పు చెడుగు ప్రజలకు రాదురా..." (౨౭౨౨)

ఈన్యాయమే భార్యాభర్తల విషయమందును వర్తించునని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. కాని వేమన్నకివి న్యాయమని తోఁపలేదు.

"ఆ. పతియొనర్పు చెడుగు పతికవశ్యమువచ్చు;
పతియొనర్పు మంచి సతికి సగము;
పతియొనర్పు చెడుగు సతికేల రాదొకో?" (౩౫౨౭)

ఒకటే విధమైన రెండుసందర్భములలో నొకటి నిస్సందేహముగా నంగీకరించి, రెండవదానిని మాత్రమన్యాయమని తలఁచుటకు అసూయయా అజ్ఞానమా కారణము? ఈపద్యములన్నియు అతఁడు బ్రహ్మజ్ఞానము సంపాదింపక మున్ను వ్రాసినవని కొని తృప్తిపడుదమనుటకు వీలులేదు. దానిని సంపాదించిన తరువాత నేమైన తన యభిప్రాయమును మార్చుకొని ఆడువారిని గూర్చి 'అయ్యో పాప' మనెనా? వారి

నడచిన బిడ్డ ఆత్మజ్ఞానము నుపదేశించెనా? లోకలోకములం దిరిగి యుండతికిన్ని బోధనలు చేసినవాఁడు, ప్రపంచమంతయు మగవారియందునియే తలఁచినట్లు కానవచ్చుచున్నదే కాని, 'అందువాఁడున్నారే, వారు చదువుసంధ్యలు లేక మగవారికన్న నన్యాయము పొందుచున్నారు' అని యెవరినైన దగ్గఱకుఁ బిలిచి శిష్యురాండ్రనుఁగాఁ జేసుకొనెనా? ఇతని పద్యములన్ని జదివినను అట్టి మనఃపరిణామమున్నట్లు కానరాదు. ఒకవేళ వారిసహవాసముచే మరల తాను బలిహుఁడైపోవునేమో యని భయపడెనముకొందమా? త్రిమూర్తుల కెదురు నిల్చితినని చెప్పుకొన్నవానికి స్త్రీశక్తియంత కన్న బలవంతమయ్యెనా? అట్లని యతని రాజయోగసిద్ధి విలువయేమి? ఆ 'ఋతంభర' యను ప్రజ్ఞ మహాత్మ్యమంతయు వట్టిమాటలేనా? తరిగొండ వెంకమ్మవంటి యోగినిని మనకు ప్రసాదించిన 'సుబ్రహ్మణ్యయోగి' యీవిషయమున నిరతిశయమైన ప్రపంచమునకొక్క యుపకారించినాఁడని తలఁచిన దప్పేమి? అది యట్లుండనిండు.

(వేమన్న యిట్లు హీనకులమందుఁ బుట్టి, సంసార సుఖదుఃఖము లన్నియు ననుభవించి, గురువాద సంబంధమున శివయోగుల సహవాసమునఁబడి విరక్తుఁడై హఠయోగమును సాధించి, యాపిమ్మట రాజయోగియై, హరిహరాది సగుణోపాసనమీఁది బ్రహ్మసాయుజ్యయోగమునకు అద్వైతానంద మనుభవించి జీవన్ముక్తుఁడైనాడని మన మూహించితిమి.)

ఈ సందర్భమున వేమన మతమును గూర్చిన కొంత సిద్ధాంతమును కొంత చర్చింపవలసి యున్నది. వేమన్న తాంత్రికుఁడని కొందఱందురు * అగునని యే చెప్పవచ్చును, కాదనియుఁ జెప్పవచ్చును. తాంత్రికశబ్దమునకు చాలవిశాలమైన యర్థము కలదు. తంత్రమనఁగా పరబ్రహ్మసాక్షాత్కారమును సంపాదించుటకు పనికి వచ్చు సాధన. మంత్రములు, బీజాక్షరములు, యంత్రములు, ముద్రలు, పూజలు మొదలగు బహిరంగములు, షట్చక్రభేదము, కుండలినీయోగము మొదలగు నంతరంగములును తంత్రమున జేర్చఁబడుచున్నవి. దీని నాశ్రయించినవారు తాంత్రికులు. అనఁగా హిందూదేశమందన్ని మతముల వారును తాంత్రికులే. వారివారి మతసిద్ధాంతములను సత్యాపనముచేసి యనుభవింపగోరు వారందరును తంత్రమార్గమునే యవలంబించిరి. కాని కొందఱు ఆ మార్గమందు మద్యమాంసాదిపంచమకారములకు ప్రాముఖ్యము నిచ్చి యందుచే తమ పూజాదిసాధనలు బహిరంగముగా జరుపుకొనలేక రహస్యముగా నుంచుకొనుటవలన, ఆక్రియ వారికన్న భిన్నులై 'తాంత్రికు' లనఁబడుచున్నారు. స్మృతి ప్రకారము సంతరించినవారందఱును స్మార్తులైనను శంకరాద్వైత

* ఈ మతము శ్రీ వేమూరి విశ్వనాథశర్మ గారిది. దీని విషయమై వివరించుచు వారు దయచేయుంచి నాకొక దీర్ఘలేఖ వ్రాసిరి.

బ్రాహ్మణులు మాత్రమా పేరున పిలువఁబడినట్లు, వీరికి వ్యవహారముచే నా పేరువచ్చినది. ఈ తాంత్రికులును అద్వైతులే. కాని వీరు శివతత్త్వమును పూజించుటకుముందు శక్తిని పూజింతురు. కావున 'శాక్తేయులు' అనఁబడిరి. ఉత్తరదేశమందు వీరిగుంపు బలము. మద్యమాంసాది సేవనచేతను, శ్మశానపూజాదుల చేతను వీరిని వామాచారులనియు నందురు. వానిని వర్జించిన దక్షిణదేశమువారు దక్షిణాచారులనఁబడిరి. వేమన వామాచారుల గుంపుతో సంబంధమే లేనివాఁడు. వారి యాచారము లొకటియు గిట్టవు. వామాచారము లట్లుండనిండు. జాతిభేదము వారికిఁగలదు. చక్రపూజాసమయమందు మాత్రము జాతిభేదమున్న గమనింపఁగూడదు కాని దానికి బైట మనకు నాలుగుజాతులైన వారికైదు జాతులు (మహానిర్వాణతంత్రము. ఉల్లా. ౮ ప. ౫) వేఱువేఱు జాతులకు వేఱువేఱు సంస్కారములు. (అదే. ౧౩) బ్రాహ్మణాదులు మగ్గుటకిని ఉపవీతములు గలవు. (అదే. ౯-౫) తమకన్న తక్కువజాతివారి యన్నము తిన్నవారికి ప్రాయశ్చిత్తముగలదు. (అదే. ౧౧-౧-౨౯) కాశిమొదలగు తీర్థక్షేత్రములు పావనములని వారినమ్మిక. (యోగినీ తంత్రము. ౧౬ పటలము) బ్రాహ్మణులకు మర్యాద చేయవలయును (అదే. ౧౩) విగ్రహపూజ యున్నది. ప్రతిమలశిలలని కొన్నవారికి నరకము వచ్చునని వారందురు. (కులార్ణవ తంత్రము. ౧౨ ఉల్లా) ముఖ్యమైన యుపాస్యమూర్తి స్త్రీరూపము గావున స్త్రీలయెడ వారికి మర్యాద యెక్కువ. ఇవన్నియు వేమన్నకు గిట్టవని వేఱుగా చెప్పఁబనిలేదు.

ఇఁక దాక్షిణాత్యులగు తాంత్రికులగుంపులో చేరినవాఁడన్నను ఇదే కష్టము వచ్చును. దాక్షిణాత్యులలో మాత్రము తాంత్రికులు కానివారెవరు? వైష్ణవులు, శైవులు, శంకరాద్వైతులు — అందఱును తాంత్రికులే. వారితంత్రములలో మంత్రములు, బీజములు, మొదలగువాని స్వరూపములందు భేదమున్నదిగాని, సామాన్యతంత్ర స్వభావమునందు భేదములేదు, కుండలినీయోగము మొదలగు పాతసాధనలన్నియు వారును అంగీకరించినవారే. పైవామాచారులందుఁ గలభేదజాతులన్నియు వీరలోను గలవు. ఇవిలేక, శక్తిపూజచేయక, వామాచారమును వదలిన తాంత్రికులు మనదేశమం దున్నారా! నే నెఱుఁగను.

ఇఁక వామాచారతాంత్రికులకు ప్రమాణగ్రంథములగు ('కులార్ణవ తంత్రము' 'మహానిర్వాణ తంత్రము') మొదలగు గ్రంథములందలి తత్త్వములకును వేమనతత్త్వమునకును సామ్యమున్నది. కారణము స్పష్టము. ఇరువురి మతమును అద్వైతమే. కొన్ని సమానములైన సిద్ధాంతము లనేకభిన్నమతగ్రంథము లందుఁ గానవచ్చును. ఒకటి యుదాహరింతును. 'కులాచారమును' రహస్యముగా నుంచవలయునను సందర్భమున కులార్ణవతంత్రమున క్రిందిపద్యము గలదు.

"వేదశాస్త్రపురాణాని సామాన్యగణికా ఇవ
ఇయంతు శాంభవీ విద్యాగుప్తా కులవధూరివ" (౧౧ ఉల్లాస)

ఇదే పద్యము 'హఠయోగ ప్రదీపిక' యందు 'విద్యా' యనుటకు బదులుగా, 'ముద్రా' యనుమార్పుతో, 'శాంభవిముద్ర' ను గూర్చి కలదు. (హఠ. ఉప ౧. ప. ౩౫.) మఱియు శివయోగసారమునందు ఇదే శ్లోక మీ యిట్లాంధ్రీకరింపఁబడినది.

"తే. వేదశాస్త్రములును బహువిధపురాణ
ములును సామాన్యగణికల పోలెనుండు;
శాంకరీ విద్యయొకటె యీజగతిలోన
గుప్తమై కులస్త్రీవోలెఁ గొమరుమిగులు" (శివ. ౪. ఆ)

ఈ కారణముచేతే పైరెండు గ్రంథములు వ్రాసినవారు కౌలతాంత్రికులన వీలు లేదుగదా. ఇదే పద్యమునే వేమన్నయు తెనిఁగించెను. కాని భావమును మార్చెను.

"ఆ. వేద విద్యలెల్ల వేశ్యల వంటివి
భ్రమలఁ బెట్టి తేట పడఁగ నీవు
గుప్తవిద్య యొకటె కులకాంత వంటిది......" (౩౬౩౧)

అందఱికిని దొరకునవి కావున వేశ్యలవంటివని వారు చెప్పఁగా ఇతఁడు 'భ్రమలఁబెట్టి తేటపడఁగనీవు' కాబట్టి వేశ్యలవంటి వన్నాఁడు. కులకాంతవలె గోప నీయమన్నివారు చెప్పఁగా నితఁడు గుప్తవిద్య కులకాంతవలె మనకు సులభముగా వశమౌలింమనను మన్నాఁడు! ఇట్టే,

"పుట్టమీఁదఁగొట్ట, భుజగంబు చచ్చునా!"
"ఓటికుండ నీర మొప్పార నిలుచునా!"
"ఏటివంకఁదీర్ప నెవ్వరి తరముౘూ!"—

ఇత్యాద్యుపమానములు కులార్ణవము మొదలగు తంత్రములందుఁ గలవు. వేమన దీనిని వానినుండియే గ్రహించియుండవచ్చును. హఠయోగమును వామాచారతాంత్రి కులు తక్కువవారికంటె నెక్కువ యుపయోగించుకొన్నవారు కావున వారిగ్రంథములు కొన్ని యితఁడు చూచియుండిన నుండవచ్చును. అంతేకాని యితఁడేతంత్రిమార్గ మును గాని నేరుగా నవలంబించియుండెనని నేనునమ్మఁజాలకున్నాను. ఇతని సిద్ధాంత మద్వైతము; సాధనకు హఠయోగమూలముగు రాజయోగము, హఠసాధనలో లో కొన్ని తాంత్రికమార్గముల నాశ్రయించిన నుండవచ్చును. అందును 'వజ్రోలి' మొదలగు అసహ్యసాధన లితఁడు చేసినాఁడని నేనమ్మను.

ఇట్లు జీవన్ముక్తిమార్గమును తానెఱిఁగి యుండి ప్రజలకు బోధించుటకై యితఁ డనేకదేశములు తిరిగినట్లు తోఁచెడిని. కాని యేయేచోట్ల సంచరించెనో స్పష్టముగాఁ

చెప్పలేను. తంజావూరి రాజా లాకాలములో వేమన్నను తమవద్ద నుంచుకొని బంగారు చేయువిద్య నేర్వవలయునను వారితో ప్రార్థించుచున్నట్లు పాడుక కలదని శ్రీ వంగూరి సుబ్బారావుగారు వ్రాసిరి (వం. సు. వేమన. పు. ౧౫౭) ఇప్పటికిని అక్కడ వేమన్న పటము కలదను విషయము కూడ లే విన్నవించితిగదా. ఇట్లు పోయినచోటనెల్ల మత విషయములు, సాంఘికదురాచారములు, సామాన్యనీతులు ఇత్యాదివిషయములనుగూర్చి పద్యములు చెప్పి బోధించుచు, ఎక్కడ నేది దొరకిన నది భుజించి యవకాశము దొరకినప్పుడెల్ల పరమాత్మ చింతచేయుచు, ఇల్లు, వాకిలి, సంసారము అన్నియు వదలి, తిరుగుచు కాలక్షేపము చేసినవాఁడు.

"క. పరమాత్ముని చింతనలోఁ
దిరముగ నుండుటయె తగును ధరనాఁకటికిన్
దిరిపెము నెత్తి భుజించుచు
దొరవలె గృహవేదికందుఁ దొంగుము వేమా" (౨౪౪౫)

ఇతని బోధనల నెందరో ప్రజ తిరస్కరించిరనుటలో నాశ్చర్యములేదు. అసలతని మతసిద్ధాంతములు చదువుకొన్నవారికే యర్థముగానివి. వానియందేమేని సత్యముగలదేని యది యుపాసనగలిగి కష్టపడి దేహమును మనస్సును దండించిన వానికి తప్ప ఇతరులకనుభవమునకు రాదు. కంటికి కనబడునదంతయు మాయ యనియు సత్యము వేఱే కలదనియుఁ జెప్పిన నెందఱికి నమ్మిక కలుగును? దేవుఁడనఁగా అందరికంటె గొప్పవాఁడని, సర్వశక్తిగలవాఁడని, కోరినదిచ్చువాఁడని, నమ్మినవారికి— తమకు సర్వవిషయములందును గలయశక్తి నెఱిఁగినవారికి—నేనే దేవుఁడను భావము ఎట్లుగలుగును? మఱియు నితనియందలి గొప్పకష్టము మతసంబంధములగు బహిరంగములైన రూపములను క్రియలను పూర్తిగా ఖండించుట. వానిని వదలుట మనుష్య స్వభావమునకే విరుద్ధము. ఏ మతమెంత మంచిదైనను, గొప్పదైనను, దానికి తగిన బహిరంగ వ్యాపారము లేనిది మనుష్యులలో మర్యాద గలుగదు. దేవుఁడు లేఁడని యూరకయుండఁగలరే కాని ఉన్నాఁడని నమ్మినప్పుడు తమబహిరింద్రియములకు తృప్తిగా పూజోత్సవములు నడుపకుండుట యెవరికిని సాధ్యముగాదు. ఆధ్యాత్మిక ప్రపంచమున వీనికి విలువున్నను లేకున్నను ఆధిభౌతిక ప్రపంచమున ఇవిలేనిది బ్రదుకట కష్టము ఇదిగాక. యీబహిరంగములందే మనుష్యునికి సహజమైన కళాప్రియత్వమునకు తృప్తి గలుగును. కావున నీ వేషములను కర్మములను నిందించినవారెవ్వరుగాని సఫలమనోరథులు గాలేరు. అట్లుండ, అవన్నియు వదలి ముక్కుమీఁద దృష్టినిలిపి కూర్చుండుఁడని వేమన యెంత కొట్టి చెప్పినను అతనినోరు నొచ్చుటతప్ప వేఱుఫలమెట్లు కలుగును? ఇఁక నితని సంఘసంస్కారపునీతులంటిమా, అవి నిండిన చెఱువుకట్ట నొక చే

మాలు ప్రేలుపేలాడినట్లు, ఇదివరకున్న సాంఘికవర్తనములన్నిటికిని మూలోచ్ఛేదము చేయఁ బ్రయత్నించుచున్నవి. ఉన్నదున్నట్లుగా నొకయోగికే తోఁచు.

"ఆ. ఉర్వివారికెల్ల నొక్కకంచముఁ బెట్టి
పొత్తుగుడిపి కులము పొలియఁజేసి
తలనుచేయి పెట్టి తగనమ్మఁ జెప్పరా.....!" (౫౮౫)

అని యింతపెద్దగొంతుకతో నఱచినను, జనసామాన్యమునకట్లు చేయుట సాధ్యమా? సంఘసంస్కారికుండవలసినప్రధానగుణము ఏసంఘమును తాను సంస్కరింపఁదలఁచునో, దానిలోనే తానుచేరి, వారి సుఖదుఃఖములను తాను ననుభవించి, వారిజ్ఞానాజ్ఞానములతో సహానుభూతి గలిగియుండుట. అప్పుడు జనులు క్రమముగా అతని వర్గము చేసికొందురు. అతని మనసుతో శోధింతురు. అతని శ్రద్ధకు లోనగుదురు. అట్లుగాక బైటనుండి యెన్ని యుపన్యాసములిచ్చినను లాభము లేదు. వేమన్న తా నన్నివిధముల ప్రపంచవ్యవహారమునకు విరోధముగానే నడుచుచున్నాఁడు. కావున నితనిసిద్ధాంతము లనేకులకంటలేదు. సహజముగా నుద్రిక్తస్వభావము గలవాఁడు గావున, ఇతరులతప్పులను గని యసహ్యపడఁగలఁడే కాని, వారియందలి గుణములను గమనింపలేఁడు. గుణమే లేని పదార్థమేదియు భూలోకమందు లేదు. మఱియు నిదానముగా జనులను దగ్గఱకు పిలిచి పదిమాఱులు వారికిఁ జెప్పి బోధించు ఓర్పుగాని పాండిత్యముగాని కలవాఁడు కాఁడు. తనమాటలను తిరస్కరించినవానినిగూర్చి యిట్లే దేమనుచున్నాఁడు వినుఁడు.—

"ఆ. ఎద్దుకైనఁగాని యేడాది తెల్పిన
మాట తెలిసి నడుచు మర్మమెఱిఁగి
మొప్పె తెలియలేఁడు ముప్పదేండ్లకునైన..." (వే-ప్రా ౩౪౬)

ఇట్లైనను వేమనయందు బలవత్తరమైన గొప్పగుణమున్నది. అదేదనఁగా శ్రద్ధ. తాను గొప్పతత్త్వము నెఱిఁగితినను దృఢమైన నమ్మకము తోడు. బ్రదికియుండు లోపల దానినంద ఱెఱుఁగునట్లు చేయవలయునను పట్టుదలయుఁ గలవాఁడు కావున, ఎవరు వినని, వినకపోని, తనపని తాను వదలలేదు. ఆశ్రద్ధాగుణముచేత, ఇతనివలెనే యప్పటి సాంఘిక, మతస్థితులతో తృప్తిలేనివారు, అనేకులు ఇతని మందేమోయున్నదని నమ్మి యాశ్రయించి యుందురు. అట్టివారి నితఁడు తాను నిరర్థకములని తేల్చుకొన్న హఠయోగము మొదలగు మార్గములలో దింపక, కేవల చిత్తశుద్ధి గలిగి శాంతిని సంపాదించు మార్గమును మాత్రము వారికి బోధించెను. శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు ఇట్లు వ్రాసిరి.—

"ఇట్లు కేవలకర్మాద్వైతియు, జాతికులాభిమానకమునకు నతీతుండును, పరోపకారమే పరమధర్మముగాఁగల యోకవి చరమావస్థయందొక మతమును స్థాపించెనఁట. ఆమతమును అంగీకరించువారు ఈ క్రింది యేడు సిద్ధాంతములను అంగీకరింపవలయును. (౧) దొంగతనము చేయరాదు. (౨) ఎల్లప్పుడును భూతదయ కలిగి యుండవలెను. (౩) ఇతరుల మనసు నొప్పింపరాదు. (౪) ఉన్నదానితో తృప్తిఁజెంది యుండవలయును. (౫) ఇతరులను మత్సరింపరాదు. (౬) కోపము విడువవలెను. (౭) ఈశ్వరారాధన మెల్లప్పుడును జేయుచుండవలెను. క్రైస్తవులకు ౧౦ ఆజ్ఞలెట్టివో యీ సంప్రదాయమువారికీ సప్తాజ్ఞ లట్టివి" *

వేమనయొక్క పైమతము నాశ్రయించిన వారినెవరినిగాని చూచుటకు వీలు కలుగలేదు. ఇదే సత్యమైన యెడల, వేమన, సామాన్యజనులకు తత్త్వ విచారణయందరాని సందని గుర్తించి, ఈశ్వరుఁడొక్కఁడు కలఁడనిమాత్రము తెలిపి, అతని కొలుచుటకును, పరోపకారమునకును, తమమనసు నిమ్మదికిని పనికివచ్చు పైనియమములను మాత్రము నిత్యముగా నాచరింపుఁడని సర్వమత సారమును శిష్యుల కుపదేశించినట్లు కానవచ్చుచున్నది. ఇతని శిష్యపరంపరవారు, ఈమతము నెంతవఱకు ఆచరణలో నిలుపుకొన్నారో యెఱుఁగను. కటార్లపల్లె యోగివేమన్న మతమును ఇదియేయైనను, అతని పరంపరవారతనికి ఉత్సవములు పూజలు చేయువేళ గొఱ్ఱెల మేకపోతుల రక్తప్రవాహములతో అర్ఘ్యపాద్యము లిచ్చుచున్నారు! శిష్యులు గురువునకు విరోధముగానే వర్తించుట సృష్టియందలి రహస్యములలో నొకటి. అట్లుగాకుండుట సంభవించునేని, ప్రపంచమునకెల్ల, ఎల్లకాలమునకు, ఒక్కఁగురువు చాలునుగదా. కావున ఇతరమహాపురుషుల మతములన్నియు శిష్యులలో నేమవస్థకు వచ్చినవో యంతకన్న మంచిస్థితిలో వేమన్నమతమువారు నేఁడుండిరేని యది పరమాశ్చర్యమగు విషయమే యగును.

) వేమన్న తనయోగసాధనకాలము నెక్కఁడగడపెననువిషయము యథాప్రకారము సందిగ్ధమే. పామూరివద్ద కొండగుహలో ప్రవేశించి మరల బైటికి రాలేదనువాడుకను మొదలే చెప్పితిని గదా. అంతకంటె బలవంతమైన సాక్ష్యము లభించువఱకు నదియే నమ్మదగును. శ్రీశంకరాచార్యులు ఇట్లే కడపట గుహాప్రవేశము చేసిరని వాడుక. ప్రపంచ వ్యవహారమును చేతనైనంతనడిపి యఖండబ్రహ్మానుభవానందమును జెందుటకై

* పైలక్ష్మణరావుగారి వ్యాసమముద్రితము. దానిని నేను పూర్తిగా చూడఁగల్గియుండిన నెంతో లాభపడియుందును. కాని సాధ్యముగాలేదు. పైవ్యాసభాగము వం-సు-గారి వేమనలో నుదాహృతము. ( మా. పు. ౧౨౧ )

సమాధిగట్టు చేయుదురు. కొందఱు శిష్యానుగ్రహార్థము ఏదో యొకచోట సజీవ సమాధిలో 'గోరీ' చేసికొందురు. తుంగ వేమన్నది యిట్టి సమాధియే యని అనేక చెప్పితిని. ఇప్పటికిని వారు సజీవులై ముక్తిసుఖము ననుభవించుచున్నారనియే జనులు నమ్ముదురు.

వేమన్నయు నట్లే సుఖముగా నెందైన శాశ్వతముగానుండగలండు! ప్రపంచము వలన ప్రపంచమునకై, యతఁడు పడిన కష్టములకు అంతమాత్రము నెమ్మదియైనను అతనికి గోరుట మనధర్మము!

శ్రీః

## ఆఱవ యుపన్యాసము

# వేమనవంటివారు

మతము, రాజ్యము మొదలగు నేవిషయములందు సంఘమునకధఃపాతము కలిగినను దానినుద్ధరించి సంస్కరించుటకు ఒక్కఁడు జనింపఁజాలఁడు. అతఁడెంతటి మహాపురుషుఁడైనను మనుష్యుఁడే. కావున మానవసామాన్యములగు నిర్బంధములకును మేరలకును లోఁగక తీఱదు. అందును జాతులు భాషలు వేఱువేఱుగాఁగల హిందూసంఘమువంటిదాని నొకఁడు నిర్వహింపఁగల్గుట యట్లుండనిండు; దానికిఁ బ్రయత్నించుటయే యసాధ్యము. కావున నిట్టిసమయములలో సంస్కరణోద్రేకముతో నిండిన యనేకులు బయలుదేఱుదురు. మనకుఁ గల్గిన యిప్పటి రాజకీయాధఃపాతమును సంస్కరించుట కెందఱు మహామహులవతరించుచున్నారు. చూడుఁడు. ఇట్లే వైదికమతమును ఇతరమతములను వేఱువేఱుగా స్థాపించిన యాచార్యుల తరువాత, మనుష్యులకు సహజమైన సుఖకాంక్ష, స్వార్థపరత మొదలగు గుణములచే, ఆయామతములవారు పారమార్థికదృష్టి చాలవఱకు వదలించి, బహిరాడంబరములలో మాత్రము జాగ్రత్తగలిగి వర్తించుచు, అజ్ఞానమునకు అకార్యమునకును మతమొక సాధనముగాఁ జేసికొనఁగా, సామాన్యప్రజల నాయవస్థనుండి తప్పించి సన్మార్గమున కీడ్వఁదలఁచి ప్రయత్నించిన వేమనవంటివారు హిందూసంఘమందనేకులుదయించిరి. వారు తలఁచినదే సన్మార్గము కాకపోవచ్చును. కాని యప్పటి సామాన్యసంఘమున్నదిమాత్రము సన్మార్గము కాదనుటలో సందేహము లేదు. తత్త్వము, నీతి, ధర్మము మున్నగు విషయములను తమ మనస్సాక్షిచేతను అనుభవముచేతను నిర్ణయించుటకు బదులు, తమపెద్దలు మాటలను వినియో, లేక వారిపెద్దలు వ్రాసిన గ్రంథములను చదివియో నిర్ణయించుస్థితికి వచ్చిన సంఘము బ్రతుకు బొమ్మలాటవంటిదే కాని సత్తుగలపదార్థము గానేరదు. అనఁగా అందఱును తమంతట పైవిషయములను నిర్ణయించుకొనుట సాధ్యమా న్యాయమా? యని యడుగవచ్చును. అన్నిటికిని ఇతరులనే నమ్ముకొనుట యెంత న్యాయమో యిదియు నంతే; రెండును అనుచితములే. మన యనుభవములనే నమ్ముకొన్నప్పుడు మన యజ్ఞానము మనల నెంత చెఱచునో, యితరులను నమ్ముకొన్నప్పుడు కాని

యజ్ఞానము మనల నంతే చెఱచును. మనుష్యుఁడు ఏవిషయమందును కేవల స్వతంత్రుఁడు గాఁడు; పట్టి పరతంత్రుఁడును గాఁడు; మధ్యవర్తి; లేకున్న బ్రదుకుసాఁగదు. కావున,

"క. వినవలె నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపవలెన్
కని కల్ల నిజముఁ దెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు మహిలో సుమతీ."

కావున పెద్దలు * ఇతిహాసములను, వారెట్టివారైనను, తన విమర్శపుసానలోఁ బట్టి చూడవలెను. అట్లుగాక వేదములు ఒకరు వ్రాయక తమంతటఁ బుట్టినవని, వానిలో గల్ల నొకలేశవిషయము ప్రశ్నాసాధ్యమని, దానికి ప్రతిబింబము పంచమవేదము మహాభారతమని, దానిసారము భగవద్గీతయని, దానిని 'పిసికి పిండిలి చేసిన పిడుచ' తమమతాచార్యుల భాష్యమేయని, దానికి తమ తాతగారు వ్రాసిన వ్యాఖ్యానమే సరియైనదని— కన్నులు మూసికొని, తలవంచుకొని, ఉన్న వివేచనాశక్తికంతయు నీళ్లు వదలియుండుట. ఆశక్తి నిచ్చిన భగవంతుని యెడఁ జేయు మహాపచారము. ఇట్లు మహాపురుషులగు మతకర్తలవతరించి చాలసూక్ష్మదృష్టిచే తత్త్వములను చర్చించి తమకుఁదోచిన సిద్ధాంతముల స్థాపింపఁగా, వారిమహాత్త్వమును జూచి విస్మితులైన తరువాతివారు, దానికిమించి తామేమియును తెలిసికొనఁ జాలమని, దీనులై, తమసర్వస్వమును వారికి ధారవోయుదురు. తెలుసుకున్న సజ్జ్ఞానులగువారు తమవిషయమందట్లే విధేయతతో వర్తించునట్లు బోధించి, స్వాతంత్ర్యమను పదార్థమే నశింపఁజేయుచుండఁగా, వారి వానిదరి నుండి మేల్కొల్పుటకు స్వతంత్రవిమర్శను వారియెడ నంకురింపఁ జేయుటకు, కొందఱు బయలుదేఱినఁగాని ముక్తిలేదు. ఇట్టివారిలో వేమన యాంధ్రులలో ముఖ్యుఁడని యెఱిఁగితిమి గదా! అతని వంటివారిని మఱికొందఱిని గూర్చి నేఁడు సంగ్రహముగా విన్నవించుచున్నాను.

ఇట్టివారిలో వేమన్న తరువాత నందఱికంటె మొదలు మన కెంచఁగఁ దగినవాఁడు,

## సర్వజ్ఞమూర్తి

ఇందుకు రెండు కారణములు గలవు. వేమన్న కితఁడు అచ్చుప్రతిబింబమువలె నుండుట యొకటి. రెండవది కన్నడమువాఁడగుట. మొదటినుండి తెలుఁగువారికి

* (ఈపద్యము వేమన పద్యములలోను గలదు. ౩౧౧౯)

కన్నడము వారియంత సమీపబంధువులు. ఇతరులుగారు. దేశములు రెండును చాలవఱకు కంటుకొనియుండుటయే కాక, ఇరుతెగలవారును పలుమాఱొకరినొకరు ఏలుచును, ఒక్కరాజునకే లోబడుచునుండి, మతప్రచారము, వాఙ్మయరచనము మొదలగు విషయములందొకరికొకరు సేవచేసినవారు. కావుననే యిరువురి మార్గములును చాలవఱకొకటే తీరుగా నుండును. అట్లగుటచేత వారు మనలఁగూర్చియు, మనము వారిని గూర్చియు తెలిసికొనవలయుననుట ముఖ్యధర్మమని వేఱుగ చెప్పఁబనిలేదు.

వేమన్న చరిత్రమునుగూర్చి యెన్నిచిక్కులుగలవో యితనినిగూర్చియు నన్ని కలవు. 'బసవరసు' అను ఆరాధ్యబ్రాహ్మణునికిని, అంబలూరు అను గ్రామములోని కుమ్మరివిధవయగు 'మ్రాలి' అను దానికిని ఇతఁడు జనించినట్లు కథ: కథయే కాదు, అతని పేరిటిపద్యములును గలవు.* కాని యితఁడు చిన్ననాఁటనుండి తల్లిదండ్రులను లక్ష్యపెట్టక, తాను పరమేశ్వరునివరమున జనించినవాఁడననియు, మున్ను కైలాసమున ఈశ్వరుని సేవకుఁడైన పుష్పదత్తుఁడను వాఁడననియుఁ జెప్పుకొనెను.† వేమన్న కిట్టి సంకరజన్మకథ లేకున్నను అతనికిని క్రమముగా తల్లిదండ్రులపై నభిమానము నశించినది.

"ఆ. తల్లిదండ్రిమీఁద దయలేని పుత్రుండు
పుట్టనేమి వాఁడు గిట్టనేమి!" (౧౨౩)

అని వ్రాసినను, తుదకు

"ఆ. తల్లి గౌరమగును తండ్రియు శంభుండు
ప్రమథగణము నఖిలబంధువితతి
తనకుఁ బుట్టినిల్లు తనకు కైలాసంబు." (౧౮౭)

వేమన్న కాలమైనను మేలు; సర్వజ్ఞునిదికను చిక్కు. ఒక పద్యములో బసవేశ్వరుని శిష్యుఁడనని యున్నది. (౯౮౫) వేఱొకపద్యములో ఇంగ్లీషువారు శ్రీరంగపట్టణమును వశపఱచుకొన్న విషయమున్నది! (౧౦౦౧) అనఁగా పండ్రెండవ శతాబ్దము మొదలు పదునెనిమిదవ శతకమువఱకును ఇతఁడు జీవితమన్నమాట! ఇతనిని గూర్చి యెక్కువ పరిశోధనచేసి పద్యములను ప్రకటించిన ఉత్తంగి చెన్నప్పగారు పదునాఱవ శతాబ్దము వాఁడై యుండునని యూహచేసిరి.§ కాని యదియు సాధనములులేని చరిత్రకారుల యూహలవంటిదే కాని, యెక్కువ నమ్మఁదగినది గాదు.

---

* (చూ—ధార్వాడ ఉత్తంగి చెన్నప్పగారు ప్రకటించిన 'సర్వజ్ఞ పదగళు', పీఠికా ప్రకరణము.)

† (చూ—ప. ౨—౧౪)

§ చూ—సర్వ—పీఠిక—పు. ౩౯)

ఇతఁడు తలిదండ్రులను తిరస్కరించె నంటిని. దానికి కారణము వట్టిధూర్తత్వమై యుండదు. ఇతని జన్మ విచారమున. వేరొక్కరి జనులుపహసింపఁగా తాను సామాన్య మనుష్య మాత్రుండను గానని వారి కితఁడు ప్రతిఘటించి నిలిచియుండును. 'శూద్ర ప్రజలు' 'కాపు కవిత్వములు' మనలో పాతమాటలే కదా. ఇట్లు జాతినిబట్టి వ్యక్తిని తిరస్కరించువారిపై నితఁడు కత్తిగట్టెను గావుననే యిట్లనుచున్నాఁడు.—

"మత్తు నీరలి హుట్టి హత్తు సావిర హాడగు;
హత్తు చిప్పొందు హాణమిల్ల; తొత్తుండె
ఎత్తణవరెంద సర్వజ్ఞ." (౧౧౧౨)

(నీటఁబుట్టిన ముత్యము పదివేలు చేయును. అట్టి కప్పచిప్పలు పదివేసినను ఒకరూక చేయవు. తలిదండ్రుల లెక్కడిలెక్క? అన్నాఁడు సర్వజ్ఞుఁడు.)

వేమనవలెనే యితనికిని తిరస్కృతియం దెక్కువ నమ్మకముగలదు. ఇతని సర్వజ్ఞుఁడను పేరుగూడ తలిదండ్రులు పెట్టిన పేరుగాఁ దోఁపదు. సర్వజ్ఞుఁడను బిరుదు గలవారనేకులున్నారు గాని, అట్టి పేరుగలవారిని నిపుణులనే నెఱుఁగను. ఇఁక ఇతఁడును పండితుఁడు గాఁడు గావున, ఇతని శక్తికి మెచ్చి యే ప్రభువు గాని యాకాలమున నీబిరుదు నిచ్చియుండఁడు. కావున యెవరో యితని ధూర్తపుమాటలు విని 'వీఁడేమి సర్వజ్ఞుఁడా?' యని యాక్షేపించిరి గాఁబోలు. 'ఏల కాఁగూడదు?' అని ఆపేరే యితఁడుంచుకొని పద్యములు రచించి వారి మొగమునఁ బొలిచేయఁజొచ్చె నేమో! ఇదియు నిజమేని తన పుట్టినపేరు జాతి మాఱ్చుకోఁదలఁపని వేమన్నకన్న సంఘ తిరస్కారమున నితఁడొక మెట్టు ముందు పడినాఁడని చెప్పవచ్చును.

వేమనవలె నితఁడును చాలకాలము కుటుంబిత్వభోగము కలవాఁడు. చదువు సంధ్యల నిర్బంధమున కెక్కువ లోఁగినవాఁడు కాఁడు. సహజముగా పదునైన కవితాశక్తి కలవాఁడు. హాస్యప్రియుఁడు. 'నక్కనగిసు వానుకితేసు'—నవ్వ నవ్వించుమాట లెన్న—యని నిర్ణయించినవాఁడు (౧౨౩౬) అట్లే నవ్వ నవ్వింపఁగలవాఁడు. కావుననే ఇహలోకసౌఖ్యమును వేమన్న కన్న నెక్కువ ప్రీతితో తృప్తితో ననుభవించినవాఁడు. వేమన్నయందు చిన్ననాఁటినుండి అతృప్తియను ధర్మము మిఱిమీఱి యున్నది. ఇతనియందును గలదుగాని యంతలేదు. అనఁగా నితఁడు గొప్ప ధనవంతుఁడుగా నుండెనని కాదు. తృప్తి మనోధర్మము గాని వస్తుధర్మము గాదు. వేమనవలె నితనికిని నేయి, పాలు, పెరుఁగు, పప్పు మొదలగు సామాన్యవస్తువులమీఁదనే కాక, మినపవడలు, ఓలిగలు, కజ్జాయములు మొదలగు విశేషపు తిను బండములపైఁ గూడ నాదరము మెండైనను, జొన్నలు, కొఱ్ఱలు, రాగులు మొదలగు ధాన్యముల

పైనను అభిమానముగలదు. * ఇతని సంసారలక్షణమేమనఁగా: వచ్చని యిల్లు, వచ్చుమనకు డబ్బు, రెండెడ్లు, వినుకరు కొడుకులు (?) వట్టిపోని ఆవులు, పెను దీయక పనిచేయుకోడలు; ఒక ముసలి యావు, తన మనస్సు నెఱుఁగఁగల గుణవతియగు భార్య: ఇవి యున్నచో 'స్వర్గక్కె కిచ్చు హచ్చెంక సర్వజ్ఞ'— (పే ౨౭౩) స్వర్గమునకు నిప్పంటించుమన్నాఁడు సర్వజ్ఞుఁడు. అనఁగా నితను వేమనకంటె బుద్ధిమంతుఁడై యేక పత్నీవ్రతమును మర్యాదగా పాలించి బ్రతికినవాఁడని యూహింపకుఁడు. అతనివలె నితఁడును జారస్త్రీలు, వేశ్యలు మొదలగు వారికి లోపడుటయే కాక, ఆ ప్రపంచమున నతనికన్న నొక చేయి యెక్కువగానే పోరాడిన వాఁడని చెప్పవలసి యున్నది. ఎట్టివారు జార స్త్రీలను విషయమును తెలుపుటకితఁ డనేకపద్యములు వ్రాసినాఁడు. (౧౭౮-౧౩౩౧) స్త్రీవశీకరణమునకు తక్కిన వేఱువెల్లఁకులేమియుఁ బనిలేదఁట. బాగుగా వేఱుచేవారు తప్పక స్వాధీనమవుదు రఁట! (౧౭౨) ఇట్లే వేశ్యలను గూర్చియు పలుపద్యములితఁడు వ్రాసెను. (పే. ౨౪౯) వారి విషయముగా నొక్కమంచిమాటయైనను వ్రాయలేదు సరిగదా; మీఁదుమిక్కిలి కట్టిమాటలచే వారి ముసులు కొలిపి దబ్బయిక దగాచేసిన వాఁడే జాణయనియు నొకచోటఁ జెప్పినాఁడు! (౧౩౬౬) కాని యీవర్తనము అనుచితమని యితఁడెఱుఁగును. ఇతరులకట్లే బోధించెను. నిజమైన సుఖమేదనఁగా;

“ జోళదా బోనాగి మేలె కెని మొసరాగి
వేళెగె బగెవ సతియాగె, మూళేయను
కోళ దిక్కెంద సర్వజ్ఞ ” (౧౫౫౯)

జొన్నన్నము, మీఁగడపెరుగు, వేళకువచ్చుసతి-ఇవియున్నచో వేశ్యను కొఱంతచేయును — — అని యర్థము; అవి లేనప్పుడు వేశ్య పనికివచ్చునని తాత్పర్యము !

ఇట్టి తృప్తిగల స్వభావము గలవాఁడు గావుననే, వేమనవలె అడుగడుగునకును బ్రహ్మను దిట్టక, మనకు తెలియని విషయములను గూర్చి చింతించి, మనకు సాధ్యము గాని కార్యములను సాధింపఁ బ్రయత్నించి, కష్టపడుటకన్న 'శివతోరిదనాశిపాలదె లేను సర్వజ్ఞ'—శివుఁడు చూపినట్లుంతట లెస్స—యనుకొన్నాఁడు. (౮౧౪)

“ బందీతు రోగ నినగెందు అంజికె బేడ,
బందుదను ఉండు సుఖిసుత్త, రోగవం
దంధిగ రద్దేళు సర్వజ్ఞ.”— (383)

(రోగము వచ్చునేమోయని భయపడవలదు. వచ్చినది తినిసుఖింపుము. రోగము వచ్చినపుడు లేచి పొమ్ము.)

---

* (చూ-లేసుపద్ధతి. అన్నపద్ధతి.)

అనఁగా, ఇతఁడు శాంతమూర్తియు, దప్పుడు లేక, యోగులవలె చప్పిడి బ్రతుకు బ్రతికినవాఁడని కాదు. 'వేమనవలెనే యితనిని రెగఁబెట్టుటయు భోగిని 'జోకొట్టి నట్లే' మాటఁపదములో ఇరువురును ఒకరికొకరు ఎందును దీసిపోరు. స్వర్గతి త్రిపాఠి తెలిని చేయుగలవే. కాని వేమన్నకన్న నితనిలో నెమ్మది, ఉదాసీనత కొంచెము మెక్కువగాఁ గానవచ్చును. కావుననే వేమన కున్నంత అసహ్యము ప్రపంచముపై నితనికుండలేదు.

వేమనవలె నితనికిని సంగీతమందభిరుచి కలదు. అతనికన్న కొంచెమెక్కువ ప్రవేశము కలదేమో. తంత్రి వాక్యము మేలని అందును వీణ శ్రేష్ఠ యని యితఁడును తలఁచెను. (౧౧౨౯) వేమనకు ప్రియమైన ఆటవెలఁదికన్న ఇతని త్రిపది సంగీతమున కెక్కువ పనికివచ్చు స్థిరమైన లయగతిగలది ఇది పద్యమనుటకన్న పాటయనుటయే మేలు. ఏకనాదము కన్నన్నకన్న నితని కెక్కువ పనికివచ్చును. ఈ త్రిపదిలో పద్యములవలె, గురువు గురువుగాను లఘువు లఘువుగాను ఉచ్చరించఁజాలదు. కాళ్ళు పదికకుతగినట్లుగా కొఁదును కొంతమార్చి సరిచేసి కొనవలసియుండును. సంగీతగాంధర్వ కితని యుపదేశ మొకటి చాల విలువయైనది కలదు.

"అర్థవిల్లదహాడు వ్యర్థసాసిర విద్దు,
అర్థియిం కత్తె యరచి, దదరల్లి
అర్థవుంటెంద సర్వజ్ఞ" (౧౨౦౭)

(అర్థములేని పాటలు వేయియైనను వ్యర్థము. మనసిచ్చి గాడిదయరచినను అందును అర్థముగలదు.) అర్థములేని పాట యంతకంటె చెడుగని భావము. వేమన్నకు తోడిరాగముపైఁ బ్రీతియుంటిని. ఇతఁడు నాటిరాగము శ్రేష్ఠ యని నమ్మెను. (౨౬౯) తోడివలె దీనియందును అసహ్యము, పట్టుదల, అతృప్తి, స్వతంత్రము మొదలగు భావములను జూపవచ్చునైనను, దైన్యము దానియందువలె దీనియందంత స్పష్టముగాఁ జూపసాధ్యముగాదు. మనుష్యుఁడనై, యొందుకును జేతగాని వాఁడనై, యేమియుఁ దెలియనివాఁడనై, పుట్టితినే యను దుఃఖము వేమనకున్నది: నిజమే కాని దానినిగూర్చి దుఃఖించిన 'దేహము కృశించునే' కాని (౩౧౫) ఫలములేదు. గావున ఉన్న నాళ్లువాళ్లు చేతనైనంత పనిచేసి తనకును ఇతరులకును సుఖముగా బ్రతికి చత్తమను భావము సర్వజ్ఞునిది. నాటి రాగమందీ ధీరగుణము చక్కఁగాఁ జూపవచ్చును.

కావున యుద్ధసమయములందు శౌర్యము, ప్రాణమునకు వెఱవకుండుట ఇత్యాది గుణముల నితఁడు చాల ప్రశంసించి యున్నాఁడు. "అమ్మనాడిరి యువదు బొమ్మ నాదడెయేను?" (౭౨౯)—బ్రహ్మయెదురు పడిననేమి? తన బిరుదును

జెప్పిపోదురవలెయును — అని యితని మతము. 'జాతి విరసునావధిని గంజాచివరే!' (౬౫౮)— జాతివీరులు చచ్చుటకు వెఱచి వెనుదీయుదురా?'— యనియు 'మురియు బంటగా తిరియుదా క్షత్రియు నరయు ముక్కుకవె!' (౬౭౫)— తెగినచ్చినపుడు నరుక లేక యాకత్తి యేల నారుకొని త్రాపట? —అని రితేపలి తీవ్రముగాం బలుకును.

“ఆ. పరబలంబుఁ జూచి ప్రాణరక్షణమున
కుఱికి పాఱిపోవు పిరికివాఁడు,
యముఁడు నిగిరితేను యధ్వగడ్డంబయా!...” (౨౪౩౨)

అని వేమన్న గూడఁ జెప్పెను. కాని యీవిధమైన శౌర్యంబునందు అతనికంత యభినివేశము గానరాదు.

ఇట్లు శౌర్యమునందును సంసారసుఖమునందును ఆశకలవాఁడు కావున నీ యితఁడు దానిని దక్కఁగొనుటకు కొన్నాళ్లు రాజసేవ చేసియున్నాడు. వేమనయు చేసి యుండునని యూహించితిమిగాని యతనికది చాలదినములు సాగియుండదు. ఈ విషయమందితనికున్నంత యనుభవమతనికి లేదు. ఆనిష్ఠుర చాలనాళ్లు ఉండఁజిప్పెట్టు కొనఁగల రాజు ఆ కాలమందే కాదు, ఏ కాలమందును గలుగఁడు. ప్రాజ్ఞుడైన కొన్ని దినములాపసి చేసిచూచి త్వరలోనే యతఁడు విసిగి.

“ఆ. ఎంత సేవఁజేసి యేపాటుపడినను
రాచమూక నమ్మరాదుగన్న!
పాముతోడి పొందు పదికాలకైనను...” (౬౫౮)

అని తెలిసికొని యాపీడవదలించుకొనెను. సర్వజ్ఞుడు గాక, రాజులచిత్తవృత్తి నాశ్రయించి నడిచి, వారి మంత్రుల యడుగులకుమడుఁగులొత్తి. కొలువులోని గొప్పవారలెవరైన వినయవిధేయతలు చూపి, సేవించినాఁడు. (౬౫౫-౬౬౦) 'స్వామికార్యమునకు నడుము గట్టి' (౭౦౬)— స్వామి కార్యమునకై చెప్పుచేతలందుకొనుచు— అని సంకల్పించి పనులు చేసినవాడె కాని చేయడు. కాని, ధూర్తత్వము, చోరత్వము, అసత్యము మొదలగు దుర్గుణములు వానియందు చూచి, వాని ఫలమనుభవించి విసిగి దిగజారినాఁడు. * 'మనకు ఛిన్నపనికేని దర్శనోపాయనందు సన్యాసలేదు'— మునివలె విరసి దొరకొలువుకన్న సన్యాసము మేలు (౬౫౦) అని నిశ్చయించుకొన్నాఁడు.

మొదటినుండి యితఁడు బసవేశ్వరప్రతిపాదితమైన లింగధారివీరశైవమతము నకుఁ జేరినవాఁడు కావున నితనికి తలఁచుకొన్నప్పుడు సన్యాసము సిద్ధము. శివయోగు

* (చూ. రాజనీతిపద్ధతి)

లకు అనుభవమునకుఁ జేరినవారిలో కరవులేదు. ఇట్టివారిలో నెవఁడో యితనిని జంగముగాఁ జేసి యోగమార్గ ముపదేశించినాఁడని తోఁచుచున్నది. కాని యీయోగసాధనకు మొదలు ఇతనికి సామాన్యముగ సంభవించెను, బహిరంగ వేషములందు నమ్మిక కలదు. విభూతిరుద్రాక్షలు ధరించిన వానికి పాపము బయలైయున్న కోటికి శివుఁడు వచ్చునని యితఁడు తలఁచెను. (౯౯) లింగము లేక రోఁటియు తినరాదు. (౧౦౫) తాను భుజించు వస్తువుల నెల్ల మొదలు శివార్పణము చేసి పిమ్మట భుజింపవలెను. (౧౦౭) జంగములు సాక్షాచ్ఛివస్వరూపులు. వారికిచ్చిన శివునికి నైవేద్యము చేసినట్లే (౧౪౨) కావున 'తినుము తిండాఁడయా కరకు జంగమునకు'— తిరిపెమెత్తి తెచ్చియైనను పిలిచి జంగానికి పెట్టుము—(౫౪౯) అని యితని బోధ. కొందఱ్యాకపయమున వేమనవలెనే యితఁడును అతివాదియై 'తిరిపెమెత్తియో పీడించియో దొంగిలించియో తెచ్చి పిలిచి దానమిమ్ము' (౫౫౦) అని చెప్పెనను, దానపాత్రవిషయమున నతనికున్నంత విశాల దృష్టి యితని కున్నట్లు తోఁపదు. ఇతనిమతమున అందఱికిచ్చుటకన్న శివభక్తులకిచ్చు దానమే శ్రేష్ఠము. (౫౫౧-౫౫౩) కాని గతిలేని చేతఁగానివారేమి దానము చేయఁ గలరు? ఇతని యుత్తరము, 'జంగాలు తెచ్చిన బియ్యము వండి పెట్టుట, ఉండుటకు తావిచ్చుట, త్రాగుటకు నీరిచ్చుట! (౫౫౪, ఇది గూడ చేయుటెని పేదవారుండరు గదా!'

ఇట్లితనికి వేమన్నకన్న శివపక్షపాతమును, ఇతరదేవతలయం దనాదరమును కొంచెమెక్కువగా నుండెను. 'నరసింహుని యవతారము పెద్ద విచిత్రమే కాని శరభుఁడు గోటితోఁ జంపునపుడు విష్ణుప్రాణిసక్కవలె నాయెను' (౧౨౫) కావున 'పదిజన్మములెత్తి. ఎద్దుగేదెలను గాచి, పాండవుల సేవకుఁడైన హరి యేటిదేవుఁడు?' అని యితఁడు ప్రశ్నించుచున్నాఁడు. (౧౩౪) కాని యోగసాధనకుఁబూని చేయఁగా అందుఁగలుగు చిత్రవిచిత్రములగు ననుభవములు గమనించి, బ్రహ్మసాక్షాత్కారసౌఖ్య మనుభవించుటకు మొదలిడిన వెంటనే యితనికి బహిరంగములగు భావములన్నియు వేమనకువలెనే నశించినవి. ఈవిగ్రహపూజలు, ఈవేదవాదములు, ఈజాతిభేదములు మొదలగునవన్నియు తత్త్వసిద్ధినొందుటకును తరముగావని తలఁచెను. "చెడు రాళ్ళకు కట్టిపూజ చేయుదు వేమా!" (౨౩౭) అని చెప్పిన యతనివలెనే యితనికిని, దేవళమందలి శివలింగము సంబారము నూఱుటకు పనికివచ్చుగుండే కాని వేల్పు కాదని తోఁచినది. "సంబారమరేవ బలుకల్లు హరనెందు నగుబాటువరారు సర్వజ్ఞ" (౧౬౫) ఎన్ని వేదములున్న, నేమిఫలము? "అనుభవించు వేద వేదము" (౯౧౬—అనుభవించిన వాని వేదమే వేదము. మఱియు "నాల్గువేదములను నాల్గుచన్నులు; నాదమే నురుగు పాలు, దీనిని సాధింపశక్తి శివయోగికితప్ప తక్కినవారికి లేదు" (౪౭౪) వేమనయు

"వేదసారమెల్ల వేమన యెఱుఁగును" (౩౬౦౪) అని చెప్పెను. యోగులెల్ల నిట్లే చెప్పుకొందురు.

"మథిత్వా చతురో వేదాన్ సర్వశాస్త్రాణి చైవహి
సారస్తు యోగిభిః పీతస్తక్రం పిబతి పణ్డితః"

(జ్ఞానసంకలిని తంత్రము. ౫౦)

(అన్ని వేదములను శాస్త్రములను మథించి యోగులు సారము త్రాగుదురు. పండితుఁడు పట్టిన మజ్జిగ త్రాగును.)

కాఁబట్టి జ్ఞానికి వాదములతోఁ బనిలేదు. మఱియు బ్రహ్మజ్ఞానము గలవాఁడు దూరముండవలయునే కాని దానినిగూర్చి చర్చించుట, దొంగిలింపఁ బోయినవాఁడు తుమ్మినట్లగును (౩౨౪) వేమనయు "లోనెఱుఁగుమాట వెల్లడి వాచాబ్రహ్మలు పలుక వలదురవేమా" అని చెప్పెను. (౩౨౪౦) యజ్ఞయాగాదులందతని కెట్టి ద్వేషమో యితనికి నంతే. ఒక మేకను జంపి తిన్నవాఁడు స్వర్గమును జేరఁగల్గునేని యెప్పుడును మేకలను లెక్కలేక చంపి తిను కటికవాఁడు దేవేంద్రుఁడే కావలదా! అని యితని ప్రశ్న. (౨౮౪) ఇఁక వేమనవలెనే జాతిభేదములనుగూర్చి దండెత్తిన బసవన్నమతమునఁ జెందిన యితనికిని పరబ్రహ్మనిధియను తోడై, యితని వానికి పరమశత్రువుగాఁ జేసినది. అందుచేతనే యెక్కువయనఁబడు బ్రాహ్మణుల యెడ ద్వేషమును తక్కువయనఁబడిన చండాలురయందు కనికరమును గలిగినది. బ్రాహ్మణులు ధర్మవ్యాఖ్యాతలని యెరిఁగి యితనికిని వేమన్నవలె వారిపై కోపము. యోగ ధ్యానముల నెఱుఁగక బ్రాహ్మణులు భోగులైపోయిరని నగచెను. (౨౨౫) "తల్లి కూఁతురాలు తా నెట్లు బాఁపఁడు?" (౧౮౪౬) అని యడిగిన వేమన్నవలెనే, నిజముగ సంబంధమునకేదియు లేని తల్లి భార్య మొదలగువారితో కలిసి వర్తించినను, అట్టి కూర్మలను దాఁటక వారికన్న తానెక్కువయను బ్రాహ్మణుఁ డేటి బ్రాహ్మణత్వమని యడిగెను. (౨౨౪) వారిని నమ్మి యెవరు బ్రతుకనేరరని యుతనుపమితె సతీఁడు ఆక్రోశించెను! (౨౦౪) కాని నీతి నెఱిఁగిన బ్రాహ్మణుఁడు లోకమునకు దేవుఁడంటివాఁడని నిర్వచనగాఁ జెప్పెను. (౨౨౨) కాపురుషు జన్మవిషయమైన యెమ్మెలెక్కువ. దబ్బర; 'ఒక భూమిపై నడచి, ఒక నీటినే త్రాగి ఒక యగ్నిలోఁ బడి నుండి పోవుచుండఁగా, నడుమ కులగోత్రము లెక్కడివి?' (౨౪౮) కావునే "స్వర్గది హొలెగేరి యిల్ల" (౨౬౩) "దేవరిలి కులభేదవిల్ల" (౨౬౪)—స్వర్గమున మాలవాడ లేదనియు, దేవునికి కులభేదము లేదనియు, ధాడిగానుగా నమ్మఁ జెప్పెను.

ఇఁక నాదేవుఁ డెట్టివాఁడు! అతఁడు జగమునకెల్ల నొకఁడే ప్రభువు. (౧౫౦) అతఁడు ఒక్కఁడు. నిరాకారుఁడు. (౧౫) సర్వవ్యాపి; పాలలో నేయివలె, నీటిలో

నన్నివలె అన్నిటి [illegible]నను గలఁడు. (౨౭౫) నీవున్న చోటనే నీలోనే కలఁడు (౨౭౬) అద్వైతానుభవ[illegible]మనియోగులైన ప్రశ్నించిరని,

"కన్నులనెదుట మెఱపులోపలఁగా నన్నలనెదుట [illegible]లోపలఁగా
[illegible] [illegible] పదములోపలఁగా, ఇరువుల
[illegible] యుండెను సర్వజ్ఞ ?" (౨౭౦)

'[illegible]లో, నున్నని రాతిలో, వన్నెల పటములలో నుండఁగలవాఁడు. నీలో నాలో [illegible]' యని యితఁడు ప్రతిప్రశ్న వేయుచున్నాఁడు. యోగ [illegible] [illegible] [illegible] [illegible] తానే తానై యున్న యందే బ్రహ్మసాక్షా త్, [illegible] (౨౭౪) జీవులకే అజ్ఞానరూపము మాయ కలదు గాని యితనికి లేదు (౨౭౨) [illegible] తానెఱిఁగిన నామాయ నశించును (౨౦౬).

[illegible] జీవ[illegible]లకు భేదమే యితని యనుభవమునకు వచ్చినది గాని. వేమనవలె [illegible]ద్వైతానుభవము కలిగినట్లు తోఁపదు. శివపక్షపాతము మొదలు [illegible] "ముగ్గురందిన మూలమూర్తియొకఁడు" (౨౦౦౬) యని చెప్పి "తన్ను తానెఱిఁగిన తానపో బ్రహ్మము" (౧౭౫౭) అన్న వేమనవలె నిశ్చయముగా [illegible] చెప్పలేదు. [illegible]వలె అల్పప్రీతిలో మునుగుచుండఁగను జూచుచున్నను [illegible], [illegible] దొరికినదానికి సంతోషించు స్వభావము గలవాఁడగుటయే యితఁడు [illegible] [illegible]చుచున్నాను. పరమఫలమైన యద్వైతావస్థ లక్ష్యంప [illegible] రాజయోగముల యభ్యాసముచే నితనికి వేమనకుఁగలిగినతిక్కలైన ఫలము లన్నియు — [illegible]. బహిరంగద్వేషము మొదలగునవి — లభించినవి. మఱియు బ్రహ్మాద్వైతమును సాధింపవలయునని యితఁడు ప్రయత్నింపలే దవని చెప్పవచ్చును.

"అద్వైతమునోడాడి యిద్దువను హోగాడి
ఉద్దను [illegible] తుడిగేవ. [illegible]
[illegible] సత్తంతె సర్వజ్ఞ" (౨౭౫)

'అద్వైతమునకైతనికి [illegible] పోఁగొట్టుకొనుట, పాడునైన [illegible] [illegible] [illegible]' అని యనుకొన్న వాఁడితఁడు. కాని యితనికి జీవా ద్వైతము — [illegible] [illegible]లందఱు నొకటే యనుట — సిద్ధించినది. "తానద్వైత మైన [illegible] [illegible] కలహి పవలెను ? బుద్ధిలో తన్నెఱిఁగిన వానికి లోకపు జగడ [illegible]" (౨౭౭) [illegible] [illegible]మైనయోగి వేషము, తిండి మొదలగు వానిఁగూర్చి కలఁతలు పెట్టుకొనక, దొరకినది తిని దొరకకున్న నూరకుండి, యేయింటిపంచనో యేచెట్టుక్రిందనో పరుండి, యెప్పుడును శివధ్యానానంద మనుభవించుచు, చావు వచ్చి

నప్పుడు సంతోషముగా లేచిపోవ సిద్ధముగా నుండవలసినదే కాని, సంసారమునం బడి అలుబిడ్డల పంచనుండిన కైలాసము లభింపదనియే సర్వజ్ఞుడు తలంచెను. వేమన వలెనే యితనికిని ఆశ్రమ కొంపలం బడి యుండుట నసహ్యము. మానసులో ధ్యానముచే నగునది. మఠము, అడవి, కొండ అన్నియు నొకటే యనియు, అదిలేని వారికి వేషముల 'గర్భగుడి' లో నున్నను, కొండకోనయందున్నను ఒకటియే యనియు నిశ్చయించినాడు. (౫౧౭) ఇతడు తన జీవితము సిద్ధికై వెచ్చించెననుటలో సందేహము లేదు. కాని యంతకన్న నెక్కువ తెలియదు.

వేమన వలెనే యితడును గాలకందక వేలసంఖ్యగా పద్యములు చెప్పిన వాడు. సామెతలు గొలుసుకట్టి వ్రేళ్ళ మాటలకు బదులుగా వాడుకలే యుపయోగించిన వాడు. తెలుగు మాటల క్రమము దొరికిన దారిపైనెల్ల పదములల్లి పాడివేసిన వాడు. ఇట్టి అట్టి అనక వచ్చిన ట్లెల్ల వాగినట్లనిపించును. శబ్దములు పద్యములు కాకపోవచ్చును: లక్షణవ్యాఖ్యము గానచ్చును; కాని ఆత్మీయమాటలు, అంటని భావములు కనిపించుచుండు వేమలను. వేమన వలెనే యితడును దేశసంచారము చేసి పండితు లెఱుగని శాస్త్రసమ్మతి ధర్మములను లౌకికముగా ప్రజలకు బోధించిన వాడే. కాని యంతకన్న నీతినిక లౌకికమెక్కువ. తన మాటలు వినని మూర్ఖుల నితడు ఎద్దులని, గుల్లాములని, గాడిదలని చెప్పగట్టినవాడు. ఇతడును అట్టి కుంటెట కాళ్ళ వాదము వారి నెవరో గ్రహింపలేదు. కాని వారితో కలహించుటకిష్టము లేదు; ఫలము లేదు గావున. వారిని గూర్చి యితడే యున్నాడో వినుడు.—

“ నెలవన్న మునులన్న హోలిక నుండెదరే
హోలికను హోలికదని జేయ; మూర్ఖుని
కలహమే జేయ సర్వజ్ఞ ’— (౯౪౦)

‘భూమిని ఆకాశమును చేర్చి కుట్టగలవారున్నారనిన, కుట్టగలరు కుట్టగల రనవలెను, మూర్ఖులతో కలహమేమేలను) కావున ‘మూర్ఖు అందంతే అన్ని’)—మూర్ఖుడు చెప్పినట్లు చెప్పుడు—అని యితడు బోధించెను. (౯౮౩)

తోడసంతిని గానకాలమైన శయ్య, అందటికిని అర్థమగు భాష, ఎల్లరు అనుభవించి యెఱిగిన యుపమానములు, మరుగులేని మాటలు, నవ్వినవ్వించు హాస్యము —ఇవి యితని కవిత్వమునందు ముఖ్యాంశములు. జ్యోతిషము, వైద్యము, శకున శాస్త్రము, కామశాస్త్రము—మొదలగువాని యందితనికి వేమనకంటె నెక్కువ ప్రవేశము గలదు. రసవాదమునందు ఆతనికున్నంత నమ్మకయు ననుభవమును గలదు. అసభ్యవిషయముల నితని కవితలో నెగ్గులేదు. ఇతడును అర్థముగాని ‘కూట’ పద్యము లను అందంగా వ్రాసినవాడే. ఇట్లు, స్వభావమునందలి యల్పభేదము చేత దృష్టిలోను

ఇరువురికిని కొంత భేదము గాఁ గలదివను, కొంత్తముమీఁద ఇరువురును ఒకరికొకరు తీర్చిన ప్రతిమలఁ వచ్చును.

ఇవిగాక యిరువురును ఒకరితోనొకరు మాటలాడుకొని వ్రాసినట్లున్న పద్యములు కొన్ని గలవు. చూడుఁడు.—

(౧) "కట్టలూడిదలు శివ బట్టలవ కద్దనే?
కట్టలూ బేవ; బిస భేవ; కణ్ణ్రవర కట్టెనరె సాకు సర్వజ్ఞ" (౧౪౫)

"ఆ. బండతోళ్ళు దెచ్చి బంధించి కట్టంగ
లింగఁడేమి వొఁగిలించినాఁడో!
ఆత్మలింగమునకు నర్పింపనేరరో!—" (౨౨౫౨)

(౨) "ఒడల గండిని ముక్తి సడెవె నెంబువ హెద్ద
బడగాయలి హుత్తి హొడెయుండగిహ సర్ప
మడియువదె హేళు; సర్వజ్ఞ" (౫౧౦)

"ఆ ఒడలు బడలఁజేసి యోగులమనువారు
మనసు కల్మషంబు మాన్పలేరు
పుట్టమీఁదఁ గొట్ట భుజగంబు చచ్చునా?..." (౫౦౮)

(౩) "కొట్టూ బహా కాలదలి కొట్టణలి కరియదె
హుట్టియు బైరగె దేక్కె, పరరింగె కొట్టు హొదలతె సర్వజ్ఞ"— (౬౦౫)

"ఆ. ధనము గూడఁబెట్టి ధర్మంబు సేయక
తాను తిన్నదనక దాఁచు లోభి;
తేనె నీగగూర్చి తెరువరికియ్యదా?..." (౨౧౦౪)

(౪) "కల్లుప్ప కప్పురవు సొల్లిరదు ధాతొందు,
ఖుల్ల నొళ్ళిదన రూపొందు, గుణదోళగె,
ఎల్ల అంతరవు సర్వజ్ఞ" (౬౨౪)

"ఆ. ఉప్పు కప్పురంబు నొక్కపోలికనుండు
చూడఁ జూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా..." (౫౩౪)

ఇట్టివింకను గలవు. ఈపోలికలు కేవలమాకస్మికములేనా, లేక యొకరి నింకొకరు చూచి వ్రాయుటచేఁ గల్గినవా యను చర్చకు తేటతెల్లమైన ఫలము లేదు. అసలిద్దఱి

కాలము స్పష్టముగా నిర్ణీతము గాలేదు. కావున ఇరువురిలో నెవరు ముందుండిరో చెప్పలేము. ఊర్ధ్వంగి చెన్నప్పగారు భావించినట్లు సర్వజ్ఞుడు పదునాఱవ శతాబ్దము వాఁడై, వేమన మనము తలఁచినట్లు పదునేడవశతకపు తుదిలోనివాఁడైనచో వేమనయే యితని ననుకరించె ననవచ్చును. కాని వేమన్న కన్నడదేశమునకు సమీపముననున్న వాఁడైనను, తెలుఁగుదేశమందును అరవదేశమందును తిరిగినట్లు కానవచ్చుచున్నదే కాని, కన్నడుల సహవాసమునకు లభించెనని స్పష్టముగాఁ జెప్ప వీలులేదు. తెలుఁగు దేశమున సర్వజ్ఞునిపదములకు వ్యాప్తి కానరాదు గాని, యితఁడు ఇంచు కొంత పంచరించినట్లున్నది. తెలుఁగువారిని ఇతఁడు తిట్టి వ్రాసిన పద్యములు గలవు. (౧-౨౪౪-౫౫) శ్రీరాముఁడు లంకను జయించిన తరువాత లంకలోని స్త్రీలకును కిష్కింధాపట్టణపు పురుషులకును జరిగిన సంకరసంస్కారవివాహముల ఫలము తెలుఁగువారని యితని మనుష్యశాస్త్ర సిద్ధాంతము! (౧-౫౫) మఱియు కన్నడదేశమందు వలసపోయి నిలిచిన యాంధ్రుల సేకులు గలరు. ములకనాటి బ్రాహ్మణులు, కోమట్లు, మంగలివారు, భట్టురాజులు మొదలగు తెలుఁగువారి సేకులు మైసూరు సీమలో నిప్పుడును గలరు. కాని కన్నడులాంధ్రదేశమందు చాలతక్కువ. కావుననే వేమన పద్యములకు కన్నడసీమలో కొంతప్రచారము గలదు. కనుక వేమన్న వాసనయే సర్వజ్ఞనకుఁ దగిలియుండునా యను సందేహముకూడ గలుగవచ్చును. కాని యింతకన్న నెక్కుడు దూరము ఈవిషయమును నిర్ణయించుట సాహసము. మఱియు నిర్దయిను ఎరికెంగెరెయను గురువు గాఁగల సామ్యముగల వారనుటలో సందేహములేదు.

## కన్నడ వచనకారులు.

ఇతనివలెనే యోగమార్గము నాశ్రయించి శివసాక్షాత్కారమునకై ప్రయత్నించినవారు కన్నడవీరశైవులలో ననేకులు గలరు. వారిలో పెక్కురు తమతమ యనుభవములను సిద్ధాంతములను కొంత పద్యపు నడకగల 'వచనముల' లో వ్రాసినారు. బసవేశ్వరుఁడే యీపద్ధతిని మొదలపెట్టినవాఁడని తోఁచుచున్నది. వీరు సర్వజ్ఞ వేమన్నలవలె చిక్కన విషయములకెల్ల చేయిచేయరు. చేసినను నిర్వహించుకొనఁగల కవితాశక్తియు వారికి లేదు. ఇతరుల బాహ్యాచారఖండనము, స్వమతమందలి భక్తి, శివసారూప్యమందలి నమ్మిక, శివయోగసాధనపద్ధతులు—ఇవి వీరి వచనములయందు ప్రముఖముగాఁ గానవచ్చును. వీరిలో కొందఱు స్త్రీలును గలరు. మచ్చునకు రెండు మూఁడాంధ్రీకరించి చూపుదును.

(౧) "లోకపు వంకరను మీరేల తిద్దెదరు? మీమీ తనువుల నూరడింపుడు మీమీ మనసుల నూరడింపుడు. పొరుగింటివారి దుఃఖమునకు వారేడ్చిన మెచ్చడు కూడలసంగమదేవుడు."

(బసవేశ్వరన వచనగళు. శివానుభవ గ్రంథమాలా. బెంగళూరు. పు. ౧౯)

(౨) "నా దేహమును దండముగా జేయవయ్యా; నా తలను సొర బుఱ్ఱగా చేయవయ్యా; నా నరములను తంత్రులను జేయవయ్యా; నా వ్రేళ్ళను పుల్లలుగా జేయవయ్యా; ముప్పదిరెండు రాగములు పాడవయ్యా; ఎదకొత్తుకొని వాయింపవయ్యా; కూడలి సంగమదేవా" (పై. పు. ౨౦)

(౩) "కొండపైని కల్లు కట్టుకొని మృగములకు వెఱచిన రీతియయ్యా? సముద్రపు గట్టున కల్లు కట్టుకొని నురుగు తెరగులకు భయపడిన రీతియయ్యా? సంతలో ఇల్లు కట్టి శబ్దమునకు నాణుచిన రీతియయ్యా? చెన్నమల్లికార్జునదేవా వినుమయ్యా! లోకమునందు పుట్టిన పిదప స్తుతినిందలు వచ్చిన మనసున కోపింపక నెమ్మదిగా నుండవలెను."

(మహాదేవియక్క. కర్ణాటక కవిచరితె. ౨ భా. పు ౧౦౯)

(౪) "ఏనుగును గాదని యెనుబోతు నెక్కిన నెవరేమి చేయుదురు? కస్తురి విడిచి బురదను బూసుకొన్న నెవరేమి చేయుదురు? పాయసము విడిచి మద్యము త్రాగిన నెవరేమి చేయుదురు? తెలిసి తెలిసి గుహేశ్వరుని శరణులతో వాదించిన నెవరేమి చేయుదురు చెప్పుమా మడివాళయ్యా!"

(వచనశాస్త్రసార. ౧ భాగము. పు. ౧౨౫.)

పైనందఱు మొత్తము మీద శివాద్వైతవాదులు. ఇట్టి వచనములు కన్నడ భాషలో లెక్కలేనన్ని కలవు.

ఇదిగాక శిష్టభక్తిగల కన్నడమాధ్వులలో పండితులట్లుండగా, పామరులలో సామాన్యమైన యీ వేషభాషలు, వాదములు, జాతిభేదములు మొదలగువాని ప్రాబల్యమును జూచి యసహ్యపడి యాభావములను తమభక్తిని పాటలరూపమున వెల్లడి పఱచిన పురందరదాసు, కనకదాసు మొదలగువారనేకులు గలరు. వీనినే 'దేవర నామము' లందురు. మనలో రామదాసు, త్యాగరాజు మొదలగువారి కీర్తనలట్టివే. తత్త్వసిద్ధాంతములందెంత భేదమున్నను మతాంతరులయెడ ద్వేషాసూయలున్నను సద్గ్రంథకర్తలు, దంభాచారములు మొదలగు మతవాదుల దుర్గుణములపై కత్తిగట్టుటలో వీరందఱును చాల పనిచేసినవారు. పామరజనములలో నేటికిని సత్యము, భక్తి, నమ్రత, సౌశీల్యము మొదలగు గుణములు నిలచి యుండుటకు వీరే కారణభూతులుగాని, సూత్రములు, భాష్యములు, వ్యాఖ్యలు వ్రాసిన పండితులుగారు.

## తిరువళ్ళువరు

మన యింగ్లీషువారిలో కొందరు అరవవారితో చాలవ్యాప్తి గాంచిన తిరువళ్ళువ నాయనారి 'తిరుక్కురళ్' అను గ్రంథములో వేమన పద్యములనుపోలిన మాటలు యుండునట ప్రకృతోపన్యాసనిబంధనలలో నొకటి. కాని యిరువురికిని పోలికలు చాల తక్కువ. నాకు ద్రవిడభాషాజ్ఞానము అంతకంటె తక్కువ కాని తెలిసినంతలో అతనినిగూర్చి కొంత సంగ్రహముగా విన్నవింతును.

తిరువళ్ళువరు చాల ప్రాచీనుడు. ఇతని కాలము క్రీస్తుశకము మొదటి శతక మని యోచకులు తలంచినారు. మద్రాసులోని మైలాపూరిలోనున్న వాఁడు. 'భగవంతుఁ'డను బ్రాహ్మణునికి 'ఆది' యను చండాల స్త్రీకిని జనించిన వాడని కథ. * వళ్ళువరను వారు ఒక తెగమాదిగలే కావున ఇతని పేరు నీకథలోఁ గొంత సత్యమున్నదని సూచించెడిని. ఇతని నిజమైన పేరేమో తెలియదు. నేతపని వృత్తిగాఁ బ్రతికినవాఁడు. ఇతని భార్య వాసుకి. వీరియువురి దాంపత్యము అపూర్వమైనచాల సౌఖ్యవంతమై యుండెడిదఁట.

ఇతఁడు వ్రాసిన గ్రంథము 'కురళ్'. 'కురళ్' అనఁగా ఒకవిధమగు చిన్న ఛందస్సు, యిటువంటిదిలో ఇంచుమించు సగముండును. ఇతని పద్యములన్నియు ఆ ఛందస్సులో నున్నవి. ఇది ధర్మము, అర్థము, కామము, అను మూఁడు పురుషార్థములనుగూర్చి మూఁడు భాగములుగా వ్రాయఁబడిన యుపదేశశాస్త్రము. తాను బ్రాహ్మణుఁడు గాకపోవుటచే నధికారములేదని యితఁడు మోక్షమునుగూర్చి వ్రాయక వదలెననికథ. కాని యుపోద్ఘాత మందలిపద్యములలోను, సన్న్యాసధర్మప్రకరణమునందును భగవంతునిగూర్చియు మోక్షోపాయములను గూర్చియు సంగ్రహముగానైనను వ్రాసియే యున్నాఁడు. కావున ఆకథ నిజము నమ్మఁబనిలేదు. మఱియు ఇతఁడు సుఖమైన సంసారిగానుండి, గృహస్థధర్మములగు అతిథిపూజ మొదలగువని యొరుపు కర్మనిష్ఠుఁడై. సత్యము, నీతి మొదలగు సామాన్యలౌకిక ధర్మముల నెక్కువశ్రద్ధతో నెఱపుచు, దృఢమైన యేకభక్తి గలవాఁడై యున్న వాఁడంతే కాని వేదాంతవిషయముల నెక్కువగా పరిశీలించినవాఁడు కాకపోవచ్చును. ఇతఁడు పైధర్మార్థకామములలో నొక్కొకదాని యంగములను ప్రత్యేకముగా విభాగించి ప్రతివిషయమునకు పదిపద్యముల ప్రకారము మొత్తము ౧౩౩౦ పద్యములు వ్రాసెను. గ్రంథకర్తయొక్క విషయ విభాగ శక్తిని సూక్ష్మదృష్టిని ఇందుఁ జూడవచ్చును.

* 'కురళ్' తెనుఁగగు 'త్రివర్గదీపిక' పీఠికలో, అత్యద్భుతములైన గాథలు ఇతనిని గూర్చి కలవు కాని యవి శుద్ధ పురాణము.

దీనికి తోడు చక్కని కవితాశక్తియుఁ గలదు. అనఁగా వేమన్నకుఁటి యాశుధార గాదు. తిక్కనవలె నెమ్మదిగ చెక్కి చిక్కఁగఁ దీర్చిన రచన యితనిది. భావములందును అతనియున్నతి యితనికి లేదు. మార్దవము, తీర్పు, నెమ్మది యిందుఁ గానవచ్చును. కావుననే వేమనపద్యములవలె నొకమాఱు విన్నంతనే యిది బాణము వలె నెదలోఁ దూఱదు. సూత్రములవలె పలుమాఱు మననము చేయవలయును. హిందూదేశమందలి యన్నిధర్మశాస్త్ర గ్రంథములందును గానవచ్చు అహింస, సత్యము, వైరాగ్యము, శాంతి, దాంతి, ఆతిథ్యము రాజధర్మములు మొదలగువానినిగూర్చి యందఱును ఆదరింపఁదగిన సామాన్యనీతుల నితఁడు వ్రాసెనే కాని యిందు క్రొత్తదేమియు లేదు. కాని వాని నితఁడు సంగ్రహించి పోగించి, ఏర్పఱిచి, చిత్రకారుఁడు బొమ్మను చేసినట్లు, సలుప్రక్కలు నిదానముగాఁ బరికించి, ఎక్కువతక్కువలు దిద్ది, తీర్చి, నెమ్మదిగా కవిత్వపు మెఱుఁగులిచ్చి, పరిపూర్ణముగా బైటఁబెట్టినవాఁడు. కాని, ప్రాచీనులందఱివలె నీ విషయములను మితిమీఱి చిలికలుగా విభజింపఁ బూనుటచేతను, ప్రతివిషయము మీఁదను పదిపద్యములు తప్పక వ్రాయవలయునను నియమముచేతను, అందందు కవితాశిల్పము పలుచనై చప్పిడియైనట్లు కానవచ్చును.

వేమన్న విరక్తకవి. ఇతఁడు సంసారికవి. కావుననే యతఁడు చిన్న బిడ్డలు 'మురికిముద్ద'లని 'మూతిఁ జొంగ బెట్టి ముద్దాడనేలరా?' (వే. బ్రౌ, ౧౧౧౨) యని యసహ్యపడి మొగమాటలఁ ద్రిప్పుకొనఁగా, ఇతఁడు,

"చిన్న బిడ్డలు చిఱుఁగేలఁ జెలిచినట్టి
సోన మమృతంబు కంటె సంబాసుగాదె?" (స్వాంధ్రీకృతము
(కురళ్-అరత్తుప్పాల్-పుదల్వరై ప్పెరుదల్. ౪)

అనెను. వేమన స్త్రీవ్యక్తిని తిరస్కరించి విధిలేక దానిని లోఁగినట్లు తోఁచును; తిరువళ్ళువరు స్త్రీయెడ బాలగౌరవముతో ఆత్మమానముతోఁ జూచిన వాఁడు. "తమకు ప్రియులైనవారి కౌఁగిలింతకు తామర కంటిదేవుని లోకమందును ఏమి సుఖము గలదు?" అని యితని ప్రశ్న (కురళ్ - కామత్తుప్పాల్ - పుణర్చ్చి మహిళ్దల్. 3) ఈ కారణముచేతనే యితనిని తిరస్కరించిన వారెవరును లేకపోవుట యట్లుండఁగా ననేకులు పండితులు దీనిని పొగడి వ్యాఖ్యానములు వ్రాసిరి. ఇది ప్రమాణగ్రంథ మయ్యెను. ఉత్తరవేదమని, దైవమాలని దీనికి పేర్లుగలిగెను. సుమతిశతకపు కర్తయైనను 'శ్రీరాముని దయచేతను' అని యుపక్రమించుటచేత, శ్రీరామద్వేషులెవరైన దానిని దిరస్కరింపవచ్చును గాని, యితఁడు, నామలింగానుశాసనము వ్రాసిన యమరునివలె, ఏదేవతను పేరుతోఁ బిలువక, 'ఆది భగవంతునికి' నమస్క-

రించి గ్రంథముపక్రమించి, అందు ఏమత పక్షపాతమును జూపక, సర్వమత సాధారణములగు శాశ్వతనీతులనుగూర్చి మాత్రము వ్రాయుటచేత, అందఱికిని కావలసిన వాఁడయ్యెను. కావుననే యీ గ్రంథము ౧౫౦ ఏండ్లకు ముందే 'లాటిను' భాషలోనికిని, తరువాత, జర్మన్, ఫ్రెంచి ఇంగ్లీషు భాషలలోనికిని పాశ్చాత్యులు పరివర్తించుకొనిరఁట. * నేఁటికి నలువదేండ్లకు వెనుకనే 'త్రివర్గ దీపిక' యను పేరుతో కినుపర్తి వెంకటరామశ్రీవిద్యానందుఁడనువారు దీనిని తెలుఁగులో మొదటి రెండు ధర్మార్థ కాండములు పరివర్తించి ప్రకటించిరి. ఆంధ్రులుఁ దాని నెక్కువ గమనించినట్లు కానరాలేదు. సహజమే. ఎందుకనఁగా, ఆంధ్రీకరించిన వారికే యది యితరులకర్థము కాదని గట్టినమ్మకము కలుగుటచే వారే దానికి వ్యాఖ్య, దానికి తాత్పర్యమును వ్రాయవలసివచ్చెను; ఇట్లు వ్యాఖ్యతో నాంధ్రీకరణమును దానితో మూలమును అర్థముచేసికొనుటకును నిలిచియుండఁగల ధైర్యమును వహింపఁగల్గినవాఁడు ఈ ప్రపంచమున నింకను బుట్టలేదు. ఇది గాక శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణగారు తెనిఁగించిరఁట కాని యింకను నది వ్రాఁతలోనే యున్నట్లున్నది. † దీని పద్యాని యాంధ్రీకరణ మొకటి తెలుఁగు భాషకు త్వరలో తెచ్చుకొనుభాగ్యము మనకై యున్నది. ఆదియట్లుండె.

సామాన్యములగు నీతులవిషయములఁ దప్ప వేమన్నకు నితనికిని పోలికలు చాల లేవు. అతఁడు దుర్నీతి నెక్కువగా ఖండించినాఁడు; ఇతఁడు నీతియుక్తమని చెప్పినాఁడు; అతనిది విరక్తి; ఇతనిది రక్తి. అట్లుగాక వేమన్న అన్యాయమార్గమునఁ జెప్పిన నితనివలెనే చెప్పెను. కాని యీపోలికయు మనుష్యులకు మనుష్యత్వమును బట్టి పోలిక యున్నట్లు. అపకారము చేసిన వానికిని ఉపకారము చేయుటయే మంచిది; ఇంటికివచ్చిన యతిథి నాదరింపవలయును: అసత్యము లాడరాదు; ఇత్యాది విషయములలో ఏనీతి శాస్త్రకారుఁడును వేఱువిధముగాఁ జెప్పఁడు. కావున ఇట్టి వానిలో నీయిరువురను పోల్చి చూచుటకంటె తిరువళ్ళువరునుండి రెండు పద్యములు యథాశక్తి తెనిఁగించి చెప్పి యీతని విషయము చాలింతును.

## నిష్కల్మషత్వము

"మనసునిల్పుకొనుండు మనిలేక, ధర్మ
మనని కొండెల్ల నాడంబరంబు"

(అఱత్తుప్పాల్ — అఱన్ వలియుఱుత్తల్ — ప. ౩)

---

* See V. V. S. Iyer's preface. LXIII.

† Vide, 'Maxims of Thiruvolluvar' by V.V.S. Iyer. Preface xx. తిరువళ్ళువరును గూర్చిన యనేక విషయములిందుండియే గ్రహించితిని.

## ఆతిథ్యము

"అతిథులకుఁ బెట్టి మిగిలినదారగించు
నరునిపొలమున విత్తులు నాటవలెనె!"

(అఱత్తుప్పాల్. విరుందోంబల్. ప. ౫)

## శాంతి

"ఓర్పువలయు నెప్పుడోరులతప్పులు; వాని
మఱచుటింతకంటె మంచిగుణము"

(అఱ-పొఱైయుడైమై. ప. ౨)

## శ్రీవర్ణనము

"కనియు వినియు మూర్కొనియును తాఁకియు
తినియు నొందఁదగిన తీపులెల్ల
వెలసి నిలిచినవి! మెఱుఁగు గాజులతోడి
తరుణిఁ గూడి దీని తనువునందు"

(కామత్తుప్పాల్ – పుణర్చ్చి మగిళ్దల్ – ప. ౧)

ఇతరులనాటి యిట్లుండఁగా తెనుఁగువారిలోని వేమనవంటివారు పలువురున్నారు. వేమనవంటివారనఁగా అతనిమతమువంటి మతము నాశ్రయించిన వారు; బహిరాడంబరములను వదలి, జాతిభేదాదులను తిరస్కరించి, యోగసాధనముచే అద్వైతమును సాధించినవారు; లేక సాధింపఁదలఁచినవారు, అట్టివారిలో నొక్కఁడు,

## పోతులూరి వీరబ్రహ్మము

వారిచే నితఁడు కంపాలి. ఇతని కాలము సుమారు పదునేడవశతాబ్ద మధ్యము. వేమన్నను గూర్చి మనము నిర్ణయించిన కాలమే సరియైనచో నితఁడతనికి సమకాలికుఁడగును. స్థలము పోతలూరు. కర్నూలు మండల మందలి బనగానపల్లెలోనుండిన గరిమిరెడ్డి వెంకటరెడ్డి యనువారియింట ఇతఁడు చిన్నప్పుడు పసులఁగాచుచుండెను. అప్పుడేనండే యితఁడనేకాద్భుతకార్యములు చేసెను. వచ్చినవారిని ప్రశంసించెను. ఊరిదేవర జాతరలో ఇతని యాజ్ఞప్రకారము అందలి యొదుర పండిత విగ్రహము లేచి వచ్చి యితనికి చుట్టకాల్చుకొనుటకు నిప్పుదెచ్చి యిచ్చెనఁట! అంతేకాదు నిగ్ర

హారాధనలు, జాతిభేదములు, జాతరలు మొదలగువానిని ఖండించి ప్రజలకు హితోపదేశము చేసెను. ఇతఁడు సన్న్యాసిగాఁడు. గొప్ప సంసారి. భార్య గోవిందమ్మ. ఐదుగురు కొడుకులు ఒక్కకూఁతురును ఉండిరి. ఇతని శిష్యులందఱిలో దూదేకుల సిద్ధయ్య ప్రసిద్ధుఁడు. పండ్రెండేండ్ల చిన్నవయసునందే తనమహామ్మదీయమతమును తల్లిదండ్రులను వదలి వీరబ్రహ్మము నాశ్రయింపఁగా, అతఁడును నిరాక్షేపముగా నితనిని శిష్యునిగా నంగీకరించి బోధించెను. ఈగురుశిష్యుల భక్తివాత్సల్యములు చాల మనసును కరఁగించునట్టివి. శిష్యుని కొఱకితఁడు 'సిద్ధబోధము' అనుగ్రంథమును వ్రాసెనఁట. అందులోని వీక్రింది రెండు పద్యములు.—

"క. నీవును నేనును తానును
భావింపఁగ నొక్కఁడనుచుఁ బరఁగెఁడు గాదే
నీవును నిన్నెఱిఁగినచో
నీవేయఁగు దాను నేను నిజముగ సిద్ధా!"

"క. నీలోన వెలుఁగు వెయ్యది
నాలోనను వెలుఁగునదియె నఖిలంబున నా
నాలోకనంబు గలిగిన
నీలోననె గాంతువయ్య నిజముగ సిద్ధా!" *

ఇతఁడును వేమన్నవలె సర్వసమత్వముగల యద్వైతవిద్యను బోధించు పెక్కు పద్యములను పాటలును వ్రాసినట్లున్నది. కాని నాకవియెక్కువగా లభింపలేదు. 'పోతులూరి వీరబ్రహ్మముగారి నాటకము' అను గ్రంథమున కొన్ని కలవుగాని యవి నాటకకర్త వ్రాసినవో వీరబ్రహ్మము వ్రాసినవో చెప్పలేను. ఒకటి మచ్చునకు.—

రాగం - మధ్యమావతి - ఆదితాళం.

"సంసారైనా నొకటి-సంసారము విడిచిననొకటి, (పల్లవి)
హంసనటించే విధ మెఱిఁగుంటే సంశయములు తనమదివిడిచుంటే. సం.
"ఇలవార్తలు వినకుంటే - తన-యింద్రియములు వశముంటే
కలలోమరవకయుంటే మరి కల్లలన్ని తొలఁగుంటే ||సం||
"నిలుకడ శాంతముంటే-తన-నిజసమాధిగలిగుంటే
పలుమరుయోగుల భాషలు వినుచును, చలముమఱచి తానిలుకడయుంటే

(వీరబ్రహ్మముగారి నాటకము. పే. ౭౧)

---

* బెజవాడ టి. వి. రాఘవాచార్యులు గారు ప్రకటించిన 'వీరాచార్య చరిత్రము', పు. ౧౨. ఇందలివిషయము లీగ్రంథమునుండియే గ్రహింపఁబడినవి. ఇది గాక తప్పులతడకగు గుజిలీ ప్రతి యొకదానిలో కొన్ని పాటలిట్టివి చూచితిని.

ఇదిగాక 'వీరాచార్యచరిత్ర' మందు ఈ క్రిందిపద్యమునకొకటి యుదాహరింపఁబడినది.

" దిల్లరరాళ్ళకు మ్రొక్కుచునుంటే చిత్తము చెడునుర వోరివోరి!
చిత్తమునందలి చిన్మయజ్యోతిని చూచుచునుండుట సరేసరే
రాళ్ళప్రొద్దులని యుండుకనుంటే వానరగ చెడుదువు వోరివోరి "

(వీరాచార్యచరిత్రము. పే. ౩)

ఈపద్యములు చూడఁగా, వేమనకవిత్వము నందున్నంత వేగము గాని అచ్చు పట్టుగాని యిందులో లేదని తెల్లమగును. కాని సామాన్యజనుల కింతమాత్రము చాలును. దీనిని వ్రాసినవాఁడు విరక్తుఁడై మాతయోగసిద్ధులనింతలఁ జూపిన మహావీరుఁడఁట. ఆతనిపదముల నేఁటికిని పాడుచుండుటయును, అతని ననేకులు పూజించుచు ఉత్సవాదుల నిప్పటికిని జరుపుచుండుటకును కారణమయినది. కంగార్లపల్లెయుంగ వేమన్న యిట్టివాఁడే కదా. వీరబ్రహ్మముసమాధియును స్థాపించిన మఠమును 'కంది మల్లయపాలెము' అందురఁట. ఇతఁడును సజీవముగా 'సమాధి'లోఁ బ్రవేశించిన వాఁడే. ఈతనిపౌత్రియగు ఈశ్వరమ్మ యను నామెయు బ్రహ్మచారిణి యగుయోగినిగా నుండి ప్రసిద్ధిగాంచెనఁట. ఈశ్వరమ్మగారి మఠము నాయూరనే కలదఁట. ఇతని శిష్యుఁడు దూదేకుల సిద్దయ్యయు ఇట్టివే కొన్ని పాటలు వ్రాసెను. ఈతనివిషయమగు స్తోత్రములు సంస్కృతభాషలోఁ గలవు. *

## ఏగంటివారు.

ఇట్టి అద్వైతమును బోధించుపాటలు 'ఏగంటివారి వచనాలు' అను పేరు గలవి మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథమందిరమునఁ గలవు. †

ఏగంటివారెవరో ఒకరో అనేకులో ఏయూరివారో యెప్పటివారో తెలియ నవకాశము నాకు లభింపలేదు. కొన్ని గుజిలీ ప్రతులలో నీపాటలు కొన్ని 'యేగంటి లక్ష్మయ్యగారి వచనాలు' అని ముద్రింపఁబడినవి. ఆంధ్రదేశమునందు వీని కెక్కువ వ్యాప్తి కలదని వినుచున్నాను. జనాలలో నెక్కువవ్యాప్తిని గాంచుటకును మననము చేయుటకును పద్యములకన్న పాటలెక్కువ పనికి వచ్చునను తత్త్వమును పండితు లనేకులు గమనింపలేదుగాని, పామరులు మాత్ర మెఱిఁగి యాచరణకుఁ దెచ్చిరి. అట్టి పాటలలో సామాన్యముగాఁ గానరాని భాషాసౌష్ఠవము, విషయమును సంగ్రహించి

* చూ. వీరబ్రహ్మనాటకము. పే. ౮౩.

† శ్రీ. వే. ప్రభాకరశాస్త్రిగారు నాకిది చూపిరి.

చెప్పాశక్తి, ధారాళ శైలీ సరళత్వ - ఇవి యోగి పాట పదము లందు ఎక్కువగా గానవచ్చును. ఒకటి యుదాహరింతును.

"ప॥ ఆనందమయుఁడు గావలెను,
మనసు పదిలము సేయవలెను; ఈ
తనువులోపలి తెలివి తా నెఱుఁగవలెను.
కనుచూపు లోపటి కావలెను, అందు
ఘన చిదానందలింగము గానవలెను. ॥౧॥
"వాయువుల కుంభింపవలెను, నిక్కి
ప్రాయమున కుండలిని పైకెత్తవలెను.
తోయజంబులు దాఁటవలెను; అందు
మాయకుం డిడు నాదము విన వలెను. ॥౨॥
"మూఁడురోదలు దాఁటవలెను, అందు
జోడు ఛాయని గుర్తుని జాడ గనవలెను:
మేడ మీఁదికి చేరవలెను; అందు
తోడుగా నున్న ... గనవలెను. ॥౩॥
"వేయి పడగలక్రింది ... ; అందు
తేయు రేకులమీఁది వెలుఁగు గనవలెను;
అరయోడను మాంసగ నవలెను; అట్టి
బాయకేగంటి గురు పదవి గనవలెను, అనంద." ॥౪॥
(కృ. లై. ౧౩-౪-౩౦)

కన్నడమందలి 'వచనముల' వలె తెలుఁగులో ఇట్టి అద్వైతబోధకము లగు పదములు లెక్కకు మీఱి కలవు. ఇవి గాక ఇట్టి వేదాంతమును పద్యరూపముగ వ్రాసిన శతకకర్తలు అసంఖ్యాకులు. (శ్రీ వ॥ సుబ్బారావుగారు ఇట్టివారిని సుమారేఁబది మందిని పేర్కొనిరి. (వే-మ-వేమన. పు. ౧౨౭) ఇట్టివారిలో గొప్పవాఁడగు

ఆనంద భరద రాజయోగి

రచించిన 'సదానంద యోగిశతకము' నుండి రెండుపద్యములు :--

"సీ॥ స్నానమొల్లఁడు దేవతార్చనము సేయఁ
డమల విజ్ఞాన సంపన్నుఁ డైనయోగి
లోకులకు తెలియరా వానిలోని గుట్టు!
సర్వ తత్త్వయోగి శ్రీసదానందయోగి!" (౨౪)

"బ్రాహ్మల మటందు కొందఱు పలుకరెట్లు?
బ్రహ్మనెఱుంగఁగ వేరె బ్రాహ్మణుఁ డగునె!
బ్రహ్మ నెఱిఁగిన వాఁడెపో బ్రాహ్మణుండు, వఱ్ఱవేమ. (౬౬)

ఆధునికులలో వేమన్న యందెక్కువ భక్తిగలిగి యతని పద్యములనేకము లేర్చి కూర్చి 'వేమనజ్ఞానమార్గపద్యము' లను పేరఁ బ్రకటించినవాఁడును, నెల్లూరిజిల్లా నారాయణరెడ్డిపేట రామస్వామియోగికుమారుఁడు, దిగంబరయోగి శిష్యుఁడును అగు

ముత్యాల నారసింహయోగి

'జీవతత్త్వ ప్రబోధ కుసుమావళి' యనుపేర నీవేమన మతమునే ప్రకటించుచు నెక్కుడి కందపద్యములతో గ్రంథమొకటి వ్రాసెను.

వీరందఱికిని యోగశాస్త్ర పరాయణమగు నిర్వికల్పసమాధియు పరతత్త్వ సాక్షాత్కారమును ఎంతవఱకు లభించినదో లభింపనేలేదో చెప్పలేము. ప్రథమావస్థ ననుభవించిన సాధకులును, గట్టినమ్మికచే వ్రాసిన భక్తులును వీరిలో నెందఱో యుండ వచ్చును. రామకృష్ణపరమహంసుఁడు, వివేకానందుఁడు మొదలగు వారి యనుభవ ములపై, మాటలపై నమ్మిక గలిగి, తమకట్టి యనుభవమేమియు లేకున్నను ఆవిషయ ముపై నుపన్యాసములిచ్చి బోధించువారు మనలో నెందఱు లేరు?

ఇంతటితో నేఁటి యుపన్యాసము ముగింపవలసినదే కాని రామకృష్ణపరమ హంసుని పేరెత్తిన తరువాత నూరక దాఁటిపోవ సాధ్యములేదు. ఇదివఱకుఁ జెప్పిన యోగులెల్లరును తమతమ దేశముల యెల్లలు మీఱినవారు కారు. కొందఱు తామున్న యూరే దాఁటి బైట వచ్చినట్లు తోఁపదు. కాని శ్రీరామకృష్ణుఁడు భరతఖండమందే కాక ఖండాంతరములందును కీర్తి గన్నవాఁడు. కడచిన శతాబ్దమున (౧౮౩౬) వంగ దేశమున సామాన్య బ్రాహ్మణ కులమున జనించి, ఎక్కువ చదువుసంధ్యలు లేక, ఒకానొక కాళికాదేవి గుడిపూజారిగా నున్నవాఁడితఁడు. కాని సహజమైన యార్ద్ర హృదయము, ఆధ్యాత్మిక తత్త్వములందభిమానము, దైవభక్తియుఁ గలవాఁడగుటచే, ప్రయత్నములేకయే యితనికి దేవతాసాక్షాత్కారము మొదలగు ఆధ్యాత్మికానుభవ ములు తమంతట కలుగుచుండెడివఁట. ఉన్నదున్నట్టు చిన్నవాఁటినుండి యితనికి సమాధియనుభవము గలుగుచుండెనఁట. ఇతఁడు తాంత్రికపూజలు, హఠలయాదిసాధ నలు సక్రమముగానే యాచరించి తుదకు రాజయోగిగా పరిణమించెను. ఇతని జీవిత మున జరిగినవని చెప్పఁబడు విచిత్రములకు లెక్కలేదు. హిందూదేశమందలి యన్ని మతముల ప్రకారమును ఇతఁడాచరించి తత్త్వానుభవమును బొందెనఁట. ఇతనిని బట్టి పిచ్చి వాఁడని యప్పుడును కొందఱు తలఁచిరి. ఇప్పుడును అట్లనుకొనువారు లేకపోలేదు,

అది యెట్లున్నను, విజ్ఞానప్రధానమైన ఆంగ్లేయవిద్యను అభ్యసించిన వారనేకులు ఆధ్యాత్మిక ప్రపంచమందే నమ్మికలేక కేవల నాస్తికులైయున్న సమయమున—ఆస్తికత గలవారు హిందూధర్మములు మోక్షసాధకములు గావని తిరస్కరించి క్రీస్తుమతమునో లేక దానియూపాంతరములగు బ్రహ్మసమాజమునో ఆర్యసమాజమునో ఆశ్రయించు చుండిన కాలమున—హిందువులలో ఆస్తికులనబడువారు పరస్పర జాతిమతద్వేషము లతో వారికి మోక్షములేదని వీరును వీరికి లేదనివారును తన్నులాడుకొనుచున్న సందర్భమున—ఈమహాపురుషుడు జన్మించి, సగుణనిర్గుణోపాసనల వివిధభేదము లను తాను ప్రయత్నపూర్వకముగా సాధించి, సర్వమతములకు సారమొక్కటియే యనియు, దైవమని యొకటినంగీకరించు ఏమతమునందు శ్రద్ధతో నుపాసనచేసినను పరమఫలమైన యద్వైతములభించుననియు, నమ్మునట్లు తానాచరించి చూపి, విజ్ఞాన ధనులైన వివేకానందునివంటి వారిననేకులను లౌకిక వైదికులను శిష్యులనుగాఁ జేసికొని, వారిమూలమున హిందూమత శాస్త్రముల ఘనతను యూరోపు, అమెరికాయున్నగు ఖండాంతరములందును చాటింపఁ జేయఁగలిగెను! ఇతని మతప్రకారము అద్వైతమే ప్రధానతత్త్వమని చెప్పుటకుఁ గాని ఖండించుటకుఁ గాని నాకుశక్తిలేదని మొదటనే విన్నవించితిని గదా. అదియెట్లున్నను దేశమునకితఁడనుగ్రహించిన గొప్పయుపదేశము, భిన్నమతములవారు ఒకరొకరితో కలహింప నక్కరలేదనుట. ఏమతము నాశ్రయించి నను ఫలమొక్కటియే కావున వారివారి సంప్రదాయమునకు ఇష్టమునకు తగినమతము ననుసరింపవచ్చును ఐహికప్రపంచమున శాంతిదాంతులుగలిగి పరోపకారము అనాథసేవ చేయుటయే పరమధర్మమని యితఁడు బోధించెను. సంఘసంస్కారము, మతసంస్కారము అను పేరుతో జాతిభేదములు, విగ్రహారాధన మొదలగు వానినెల్ల నొకటేమారు మూలముట్టుగ నశింపఁజేయఁ బ్రయత్నించుట పిచ్చిపని; అవియొకచోట నడఁచిన వేరొకచోట, ఒకరూపమును పాడుచేసిన వేరొకరూపమున పైకిలేచును; దయ, దాక్షిణ్యము, భక్తి, నమ్మిక మొదలగునుదారగుణములు ప్రజలలో పెంపొందించినచో వైజాతిభేదాదులు తమంతట తమబలమును గోలుపోవును. కావున వానినడంచుటయుఁ గాని స్థాపించుటయుఁగాని శ్రద్ధవహింపక యుదాసీనముగా నుండుట యావశ్య కము; చండాలస్పర్శ చేసిన 'నాజన్మమే చెడిపోయెను, నేను ముక్తికి దూరుఁడనైతిని', అని నిష్కల్మషముగా నమ్మినవానిని బలవంతముగాఁ బట్టితెచ్చి మాలపల్లి మధ్యలో నిలిపినను; తిరుపతికిఁబోయి దేవునికి 'పొంగలి సేవార్థము' చేయించిన నాకు ముక్తి లభించునని దృఢముగా నమ్మి తిరిపెమెత్తి కర్చుకు సంపాదించుకొని కాళ్ళనొప్పులు గమనింపక కొండయెక్కి పరమానందముతో దేవుని దర్శించి 'ధన్యుఁడనైతిని గదా', యని కన్నీళ్ళు రాల్చువానికి 'ఇది వట్టి రాతిబొమ్మరా, దేవుఁడును గాదు. దయ్యమును

గాదు. దీనికేల బ్రమొక్కెదవు?" అని యెంత చెప్పినను, ఏటి కెదురీదినట్లగును గాని ఫలములేదు; వారిమనస్సు నెమ్మదిని తెలిపినట్లగునంతే; ఒకయభిప్రాయము మనసులో, స్థిరముగా నిలుచుట కెన్నాళ్ళు పట్టునో, దానిని పోఁగొట్టుటకంతకన్న నెక్కువపట్టును.— ఈతత్త్వములను రామకృష్ణపరమహంసునివలె, నెరిఁగినంత వఱకును, ఇతరబోధకులెవరును గమనింపలేదు. ఈజాతిభేదము మొదలగునవన్నియు తానును తుదలోవదలినవాఁడే. కాని యితరులనట్లుచేయుమని నిర్బంధించి తిట్టలేదు. నిర్బంధములతోను దూషణలతోను శ్రద్ధజనింపఁ జేయుట యసాధ్యమనియు, అనావశ్యకమనియు ఖండించి యుపదేశించువానికన్న మౌనముతో నాచరించువాఁడు మంచి సంస్కర్తయనియు నెఱిఁగెను. బలవంతపు మాఘస్నానముతో పుణ్యము వచ్చెనో కాని చలి విడువదుగదా! *

---

* పై రామకృష్ణపరమహంసుని జీవితచరిత్రవిషయములు 'The Life of Sree Ramakrishna' అను గ్రంథమునుండి సంగ్రహింపఁబడినవి.

శ్రీః

ఏడవ యుపన్యాసము

# వేమన కవిత్వము, హాస్యము, నీతులు

వేమన కవులని పేరు సంపాదింపని కవులలోఁ జేరినవాఁడంటిని. పేరు వచ్చుటకు రెండు హేతువులు: ప్రజయొక్క యభిరుచి నెఱిఁగి వారికి తృప్తిగా వ్రాసినవానికి వచ్చును; కవియొక్క గొప్పతనము నెఱుఁగఁగల ప్రజ యున్నను వచ్చును. వేమన విషయమం దీ రెండును లేక పోయినవి.

ఇతఁడు ఇతరులకు హితము గావలయునను నుద్దేశముతో వ్రాసెనే కాని, వారు తృప్తిపడవలయునని వ్రాసినవాఁడు కాఁడు. వారు తన్ను పొగడవలయునని, యాశపడి కాని, తిరస్కరింతురని జంకి కాని, తన త్రోవను వదలినవాఁడు కాఁడు. మనలో చాలకాలమునుండి 'కావ్యం యశసేఽర్థకృతే' యను సిద్ధాంతము ముఖ్యముగా నెలకొన్నది. కావ్యములు వ్రాయుటకు మొదటి ఫలములు కీర్తి; ద్రవ్యము. కావున కీర్తినిచ్చు పండితులకును ద్రవ్యమునిచ్చు రాజులకును ప్రీతి కలిగించిచో కృతార్థుల మైతిమని యనేక కవులు తలఁచిరి. దానికిఁ దగినట్లు 'కవిసార్వభౌముఁడు' మొదలగు బిరుదులును, ఎకరాలకొలఁది యినాములును అగ్రహారములును వారికి లభించుచుండెను. తమమనసుకు తృప్తి గల్గించినవారి విషయమున ప్రాచీనులు చూపిన మర్యాద, ఔదార్యము అత్యద్భుతములు. కాని కవికి స్వాతంత్ర్యము పోయినది. ఇతఁడితరులచేతి బొమ్మయైపోయినాఁడు. కృష్ణదేవరాయలవంటి కొరయాజ్ఞను తిరస్కరించి 'ఊరకకృతుల్ రచియింపుమటన్న శక్యమే?' యని, పెద్దనవలె, ధీరముగాఁ జెప్పఁగల సుకవి లేక పోయినాఁడు. ఉన్న యభిరుచికి ఉదాహరణములిచ్చువారే కాని, దానిని సరియైన త్రోవలో మార్చి దిద్దఁగలిగిన ధీరులు లేరైరి. క్రమముగా కవిత్వమునకు జీవనము సంపాదించుకొనుట యొక ఆనుషంగిక ఫలముగాఁ గాక, ప్రధాన ఫలముగా పరిణమించెను. ద్రవ్యముగలవారెవరే విషయమున పద్యములు వ్రాయుమని చెప్పినను 'సరే' యని కవి నడుముగట్టుకొని సిద్ధముగా నుండవలసి వచ్చెను. ఏ పెద్దమనుష్యుఁ డూరికి వచ్చినను, ఏ గుమాస్తాను వేఱొక యూరికి మార్చినను, ఏ యిల్లాలికి దొరతనమువారి బిరుదు లభించినను, ఆ సందర్భములందెల్ల తప్పక,

ఏమూలలోనో యున్న కవిని జుట్టుపట్టుకొని యీడ్చుకొనివచ్చి, యందఱియెదుట బ్రోయుట విధిలేని పనియైనది. కవియను పేరుగలవాఁడు ఎవ్వరిని జూచుటకు పోయినను వాని యూరుపేరులు తెలిసికొని కలిపికొట్టి పద్యములు వ్రాసి పొగడుట ప్రథమ కార్యమైనది. కవికి స్నేహము, ద్వేషము, భక్తి, అభిమానము, అసహ్యము మొదలగు తన భావము లేవియున్నను లేనట్లే. తిట్టుటకు అధికారము లేదు, పొగడ్తలకు విలువలేదు; ఎందు కనఁగా, తాను తిట్టవలసి యున్నను ఒకరు పొగడుమన్న వానిని పొగడవలసినదే కాని, తన యిచ్ఛానుసారము కాదు గావున.

ఇట్టి కవిత్వమును వ్రాసి ప్రఖ్యాతిని సంపాదించుట వేమనవంటివానికి రుచించునా? చూచిన వస్తువులందెల్ల తప్పులుపట్టు స్వభావము గలవాఁడు, పట్టిన తప్పులను స్పష్టముగా మొగము ముందఱ చెప్పక యూరకుండనివాఁడు, ఇతరులను కీర్తికొఱకో ద్రవ్యముకొఱకో ఊరక యెట్లు పొగడఁగలఁడు? ఒకని యందలి గుణములు తనమనసుకు వచ్చిన పక్షమున సంతోషించి పద్యములు వ్రాయుస్వభావము వేమన్నకు కలదని గుంటుపల్లి ముత్తమంత్రి మీఁది పద్యము తెలుపుచున్నది. కాని అది, 'మా వాఁడు బుద్ధిమంతుఁడు' అని వాత్సల్యముతోఁ జెప్పు అభిమానపు మాట వలెనే యున్నదే కాని, యందులో ప్రపంచమందలి యందఱి తలవెంట్రుకలను తెలుపు చేయునట్టి ముత్తమంత్రి కీర్తి వర్ణింపఁబడినదా? లోకుల కెవరికిని త్రాగుటకు నీరును లేనట్లు తెచ్చి పోసిన యతని దాన ధార వర్ణింపఁబడినదా? కావుననే యీ పద్యమునకు దాత యగు గుంటుపల్లి ముత్తమంత్రియే వినియున్నను, వేమన్న కొక గోటుదక్కియు నిచ్చి యుండఁడు. తన [1]దరిద్రావస్థలో ద్రవ్యార్జనకొఱకు బైలుదేఱినప్పుడు ఇట్లు ధనికులను పొగడి వేమన్నయు పద్యములు వ్రాసినాఁడేమో యనుసందేహమును గలిగించు పద్యమొకటి గలదు.—

'ఆ. పడుచు నిచ్చువానిఁ బద్యమిచ్చినవాని
కడుపు చల్లఁజేసి గారవమున
నడపలేనివాఁడు..............' (౨౩౭౫)

తక్కినది మీరు పుస్తకమందే చదువుకొనుఁడు. కాని, యీపద్యముగూడ ఇట్లు ద్రవ్యము కొఱకు తన యాత్మను జంపుకొనియైన ముఖస్తుతిచేసి పద్యములు వ్రాసిన వానిపైఁ గూడ 'అయోగ్యపాపము' లేక, వట్టి చేతులతో పంపించు 'బండగోవు' లను తిట్టి వేమన వ్రాసినదే యనియుఁ జెప్ప వచ్చును. ఇట్లగుటచే ఇతఁడు ఇతరులకేది రుచించునని గమనించి యాప్రకారము వ్రాయఁ గల్గుట

[1] అనుసంధానము

ఇదిగాక యితఁడు సహజముగా బహిరంగద్వేషి. అనఁగా, దేని యందైనను ముఖ్యముగ గమనింపఁ దగినది సారభూతమైన లోపలితత్త్వమే గాని, బైట యాకారము, వేషము, పని మొదలగునవి కావనుట యితని సామాన్యదృష్టి. మనస్సు శుద్ధముగా నున్నఁ జాలును; బైటి స్నానపానాదు లక్కఱలేదనువాఁడు. తాను గట్టిన 'చిఱుఁగుబట్ట' యే 'చీనాంబర' మని, తన 'ముఱికి రొంపయే' 'ముక్తి' యని చెప్పుచు, ఆక్షేపించినవారి వదరుఁ గొట్టినవాఁడు. "భక్తిలేని పూజ ఫలము లేదు" గావున, అడకలవాఁడు దేవళములకుఁబోయి, పత్రి, తులసి కర్చుపెట్టవలసిన పనిలేక 'మంచాననే మ్రొక్కు' (౨౩౨౫) వని చెప్పినవాఁడు కాని మంచము నందైనను 'మ్రొక్కుట' తప్పనిది గదా! అది బహిరంగమే కదా. బహిరంగము అంతరంగము రెండును ఒకటికొకటి యనుకూలములే కాని ప్రతికూలములు కావు. బలవంతముగా నాసని వేఱుపఱుప వచ్చునే కాని సహజముగా ఆరెండును అన్యోన్యాశ్రయములు; ఒకటినొకటి వదలనివి. భక్తిలేక పూజచేయవచ్చును; పూజలేక భక్తియు సాధ్యమే; కాని సహజముగాదు. అంతరంగము తనకు సంబంధించినది. బహిరంగము పరులకై యెక్కువగాఁ జేరినది; అనఁగా తనకును అందు సంబంధము లేకపోలేదు. దానము చేయవలయునని అంతరంగమందు బుద్ధియున్నఁ జాలునా? బహిరంగముగా చేయకున్న నితరులకు ఫలములేదనుమాట యట్లుండనిండు. అసలు తనకు తృప్తి కలుగునా? హృదయము నిర్మలముగా నుండవలసినదే, కడుపులో అజీర్ణాదిమలములు లేకుండఁ జేసికొనవలసినదే; కాని అంతమాత్రమున దేహము పైభాగము ముఱికి ముద్దయి చిరపేలుపడి క్రుళ్ళిమున్నను తొందఱలేదన వచ్చునా? ఇతరుల కసహ్యమనుట మఱచి పోదముగాక; మన ముక్కుకే యది యోర్వవచ్చునా? ఒకవేళ అట్టోర్చుకొనుట బలవంతముగా వాడుక చేసికొని బహిరింద్రియములను చంపుకొన వచ్చును గాని నిజముగా నది యుక్తమనవచ్చునా? కావున ఈరెంటిని పరస్పరసహాయములుగాఁ జేసికొనుట బుద్ధిమంతుని లక్షణము మాత్రమే కాదు; సమర్థుని లక్షణము గూడ.

వేమన యిట్టి తత్త్వసిద్ధాంతమును కొంతవఱకును కవిత్వమునందును ఉపయోగించెను. కవిత్వమునకు భాష, ఛందస్సు మొదలగునవి బహిరంగములు. అర్థ భావములంతరంగములు, అవి ఒక విశిష్టవిధముగా తీవ్రముగా నున్ననే కాని కవిత్వమను పేరురాదు. చూడుఁడు.

"ఆ. పైరు నిడిన వాని ఫలమే సఫలమగు,
పైరు నిడనివాఁడు ఫలము గనునె?
పైరు నిడని వాఁడు బహుభాగ్యవంతుఁడా…" (౨౬౧౩)

ఈ పద్యమందు కవిత్వములేదు. వేమన్న యిది వ్రాయకుండినను నష్టములేదు. అట్లే బహిరంగములైన భాషాఛందస్సులును ఒకవిశిష్ట విధముగా నుండనిది కవిత్వమనుపేరు రాదు. చక్కనిభాష, తప్పులేని ఛందస్సు గలిగియున్నను 'ఆంధ్రనామసంగ్రహము' నందు కవిత్వమెట్లులేదో యట్లే, అర్థభావములు మంచివైనను భాషాఛందస్సులు నాగరకతనుదప్పి యుండుటచేత నీక్రింది పద్యమునందును అదిలేదు.

"వృక్షఖండములైన పూదించి నలగొట్టి
చకటిగా జేయొచ్చు వసుధలోన
అక్కవేసైన వెనుక అంటించుటరుదురా...విశ్వ"

(డా. లక్ష్మణ మొదల్యారు గారి వేమనపద్యములు ; (౨౭౬౨)

వేమన యీపద్యము నట్లే వ్రాసెనో వ్రాయలేదో యనుమాటవేఱు. అతని పద్యముల నేకములు వ్రాతప్రతులలోను అచ్చుప్రతులలోను నిట్లేయున్నవి. అనేక పద్యములందు ఆటవెలది నడకకును, సీసపు నడకకును భేదమే యితఁడు గమనించినట్లు తోఁపదు. భాషావిషయమందును శుద్ధమైన శబ్దప్రయోగములుఁ గాని, సంధులను చక్కఁగా కలుపుటయుఁ గాని, యితఁడు ప్రత్యేకముగ పరిశ్రమించినట్లే తోఁపదు. అచ్చులకును వకారయకారములకును గల భేదమును పలుమాఱితఁడు గమనింపలేదు. 'ఎమనికిమనువచ్చు నారాయణిన వచ్చు' (౨౧౫౯) ఇత్యాది నిరర్గళప్రయోగములు చక్కలుఁ గలవు. ఇఁక అసభ్యములగు పదములు, అర్థములు, లెక్కలేనివి.

ఇఁక సామాన్యప్రజకు బహిరంగము ముఖ్యము. దేవళ్ళగోపురముల యెత్తు, దేవతకుఁగలనవరత్నాలసొమ్ములు, భండారమిందలోని తాళములసంఖ్య మొదలగు వానినిజూచి వానిమాహాత్మ్యమును వీరిభక్తిని నిర్ణయించువారువారు. ఇట్లు కవి వ్రాసిన పద్యములు గూడ పుష్టిమైనభాష, పందెపు గుఱ్ఱము నడకవంటి ఛందస్సుఁ గలిగి, అనుప్రాసయమకాదులతో సభామందిరమును గడగడలాడించునట్లున్న 'భలే' యని మెచ్చుకొందురు. వేమనకవిత్వమందది యెక్కడిది!

మఱియు సామాన్యముగ కవిత్వమును విని సంతోషించు ప్రజలెవ్వరు? తెగలుగా నుందురు; పరులకు దాసులు; స్వామిదాసులు. మొదటి తెగవారు పామరులు. వీరెక్కువ చదువుసంధ్యలు నేరనివారు గావున, సామాన్యముగ మనసును తటాలున పట్టియూడ్చు వేమనవంటివానికవిత్వమునకు లొంగి లోలోపల సంతోషించినను, రాజసభలలోని పద్యాల పందెములలో ఎదుటివారిని పరాభవించి, గండపెండేరములను బహుమానముగాఁ బడసిన బిరుదుకవులను జూచి బెరగై, వారినే సరస్వతియవతారములని పొగడి తిప్పించుకొందురు గాని, వారితో వేమనను పోల్చుమాటను ధైర్యమే వారికుండదు. సభలోపండితులు మహావిద్వాంసు లంగీకరించినవానిని కాదనుటకు

ఈ నిరక్షరకుక్షులు, కర్తృకారకమున్నదె? ఆ విద్వాంసులే రెండవ తెగవారగు స్వయంవాసులు. ఏకాలమందో యేకారణముచేతనో మనసులో నిలిచిన సిద్ధాంతములను యుక్తమా కాదా యని చర్చింపక అవియే సత్యములనియు తక్కినవి అసమంజసములనియు నిర్ణయించువారు వారు. కవిత్వమునకు దోషములు, గుణము, అలంకారములు, రసములు, కథలు, పాత్రములు, వర్ణనములు మొదలగునవన్నియు ఇట్టివనియు ఇన్నియనియు నిర్ణయముగా ఏర్పాటుచేసికొనినవారు కావున, ఆ నియమములను స్వల్పముగా మీఱినను గ్రంథకర్త తలవంచుకొని సిగ్గుపోవలయును; లేదా సభ విడిచి నిరాశుడై పోవలయును. ఇట్లే కాని వీరొక మెట్టునుక్రిందికి దిగరు; దిగుట శాస్త్రసంస్కారము తప్పినమాత్రమే కాదు, దిగవలెనను ఆకాంక్షయే వారికి తోఁపదు. అట్టి పైవిషయములలో తెగిన గాలిపటమువంటి వేమన్నను వీరు కవియని యెట్లు పిలిచి సంభావింతురు?

ఇట్లు "శృంగేరీ బహిరస్మాకం వయం శృంగేర్యా బహిః" అన్నట్లు విద్వాంసులు వేమన్నను గమనింపలేదు. వేమన్న విద్వాంసులను గమనింపలేదు. వేమన ప్రాచీనపురాణకవుల రచనలను చదువుకొన్నవాఁడే కాని తరువాతి ప్రబంధకవుల దారి యతఁడెఱుఁగఁడని మొదలే విన్నవించితిని. విద్వాంసులట్లు కాక, అక్షరాభ్యాసమునకు తరువాత కొన్నాళ్లు రఘువంశము, భారతము మొదలగు మృదుకావ్యములను చదివిన శాస్త్రముచేసి, తరువాత నైషధము, వసుచరిత్ర మొదలగు ప్రౌఢగ్రంథములలో, ఒడి మెదిగినవారు. ఇట్లు నిన్న మొన్నటి వారి కవిత్వములేఁ చదువుకొని ప్రాచీనకవుల మార్గము తెలియఁగక, తనకవిత్వమునందు తప్పులు పట్టు విద్వాంసులను లక్ష్యముచేయవలసిన యక్కర వేమన్నకు తోఁపలేదు. అతఁడు సుఖముగా ఇంటిలోనో లేక యేచెట్టు క్రిందనో కాలుమీఁద కాలువేసుకొని కూర్చుండి, యిట్లన్నాఁడు.—

"ఆ. అరసి కవులకెల్ల నల్పుండు తానెఱిఁగి
చెప్పలేఁడు గాని తప్పు బట్టు;
గోము నెచ్చుకుక్క దొంతులు పెట్టునా?..."

(వే. వై. ౧౩. ౩. ౧౯.)

కాని, యెన్నటికైన తనమాటలవిలువ గ్రహముచేసికొని యంగీకరింప వలసిన వారు పండితులే యగుదురుగాని, పామరులకంటె సాధ్యముగాదని వేమన్న యెఱుఁగక పోలేదు. చూడుఁడు.

"ఆ. వేముఁడిట్లు చెప్పు విరసపువాక్యముల్
వేముఁడిట్లు పోవు వెఱ్ఱిపోక,
పామరులకు నెల్ల ప్రతిపక్షమై యుండు
పండితులకు నెల్ల పరమ వేమ" (వే. వై. ౧-౨-౧-౩౦)

చదువుకొన్నవారెల్ల పామరులనియును, చదువనివారె పండితులనియు వేమన్న తలంచెనని యూహింప సాధ్యముగాదుగదా. అట్లైన నప్పటికిని ఇప్పటికిని చదువుకొన్నవారికని కవిత్వపు విలువకు లొంగిరే యున్నారు. జీవితమునందు దినదినపద్యముల నుపయోగింపని పండితుఁడాంధ్రదేశమందున్నాఁడా? వేమన్నను కవియని బాహాటముగాఁ జెప్పక పోవచ్చును; ఎఱుఁగకయు పోవచ్చును. అందుచే నతనికి బిరుదు బహుమానము లీయక పోవచ్చును. దానికి కారణము వేఱు. కష్టపడినవారు కష్టమునకు ఫలమిత్తురు. నైషధమువంటి 'యౌషధ' కవిత్వమును అర్థము చేసికొనుటకై తలపగులఁ గొట్టుకొను నోర్పును సంపాదించుకొన్నవారు, మొదట వేమాత్రమును శ్రమనియ్యని మెత్తని వేమనపద్యములవంటి వానిపై నెక్కువ శ్రద్ధ పుచ్చుకొనుట సహజము గాదు. మిరియపు కాఱులు ముద్దయగు 'గోంగూరపచ్చడి' తిని జీర్ణించుకొనఁగల గుంటూరి వారికి అది జడ్డింపినపుడే నోటనీరూరును; కాని వారికి పాలు పెరుగు రుచింపవా? వానిని వారు వదలిరా? మఱియు పదార్థమెంత విలువయైనదో యది యంత సులభముగా దొరకవలయు ననుట సృష్టి ధర్మము. ఎంతసులభమో యంత దానికి వెలతక్కువ యనుట యర్థశాస్త్రసిద్ధాంతము. గాలివంటి యమూల్యపదార్థము మనకు సులభముగా లభింపకున్న మనగతియేమి? సులభము గావుననే దానికి వెలయిచ్చువారెవరు? వేమనకవిత్వము గాలి వంటిది. అది దూఱని చోటులేదు; దొరకని తావులేదు. కావుననే యందఱును దాని నుపయోగింపక తీఱదైనను అతనిని పిలిచి మహాకవియని మర్యాదచేయుట కెవరికిని కాఁబట్టకపోయినది.

ఇట్టి సర్వవ్యాపకత్వమును వేమన పద్యములకు సంపాదించి యిచ్చిన కవితా గుణములేవి? ఈ ప్రశ్నను విడదీయుటకు ముందు 'కవిత్వమనఁగా నేమి?' యని కొంత విచారింపవలసియున్నది. కాని కవిత్వము పరబ్రహ్మమువలె మాయతో నిండినవస్తువు. ఉన్నదని భావింపవచ్చును గాని చేతికి స్పష్టముగా దొరకునది కాదు. ఎందఱో మహామహులెన్నియో విధముల దీనికి లక్షణము వ్రాయఁ బ్రయత్నించిరి గాని, యా కవితాదేవత యందఱిమీఁదను చేతికందక నిలిచి మనప్రక్క చూడక్క నిగిడించి యింకను నవ్వుచునేయున్నది. మఱియు లక్షణమెప్పుడును బహిరంగములను తెలుపఁ గలదుగాని యంతరంగమును దెలుపుశక్తి దానికి లేదు. మల్లెపూవును ఎన్నఁడును చూచి యెఱుఁగని వానికి దాని స్వరూపమును దెలుపుటకు ప్రయత్నించిన వారేమి చేయఁగలరు? రేకులు, కాఁడ మొదలగు వాని సంఖ్య, కొలఁత, వన్నె, మొదలగునవియిట్టివని చెప్పవచ్చును; కాని యితరపుష్పములందెందును లేని దాని పరిమళము ఇట్టిదని వర్ణించిచెప్పి యొప్పించుటయెట్లు? ముక్కుగలవాఁడు దానిని సాక్షాత్తుగా మూర్కొన్నప్పుడు తప్ప తక్కినయేమార్గముచే నేవిధముగాఁ జెప్పినను కాని

కది యర్థముగాదు; ప్రతిపదార్థముయొక్క తత్త్వమును ఇట్లే. సాక్షాత్తుగా అనుభవించినవారికి అనుభవింపఁగల వారికిఁ దప్ప తక్కినవారి పాలికి లేదు. కవిత్వము గూడనట్టిదే. కాని తా ననుభవించిన వస్తువును అంగాంగములు పరీక్షించి యిదియిట్టి దని లక్షణము చేర్పఁబూనఁ బ్రయత్నించుట మానవ స్వభావము. కాని యెంత ప్రయత్నించినను బహిరంగములు దాఁటి లోఁతుగా దిగినవారు లేరు. ప్రకృతము మనముగూడ నంతే చేయఁగలము.

సామాన్యముగ ఒకవస్తువును గూర్చి తనకుఁ గలుగు భావములను భాషమూలమున ఇతరుల మనసు కెక్కునట్లు తెలుపుచుట కవిత్వ మనవచ్చును. అనఁగా, భావించువాఁడు, అతని భావము, దానికి విషయమైన వస్తువు, దానిని తెల్లడించుభాష, దానిని విని గ్రహించు సభ్యులు—ఈయైదును కవిత్వసృష్టియందలి పంచమహాభూతములు. ఈయైదింటిలో ఏది లేకున్నను కవిత్వము కాఁజాలదు. కవిలేనిది కవిత్వ ముండదని చెప్పఁబనిలేదుగదా. అతనికి భావము ఉండవలయును. భావమనఁగా పదార్థములయొక్క స్వరూపజ్ఞానముగాని, యిది మంచిది చెడ్డది యను నభిప్రాయముగాని కాదు. మఱి విషయమును గూర్చి మనకుఁగలుగు ద్వేషము, కోపము, అసూయ, అసహ్యము, ప్రేమ, భక్తి మొదలగునవి భావములనఁబడును, దొంగను ఉదాహరణముగాఁ దీసుకొందము. ఈ యనంతపురము సీమలో ప్రసిద్ధుఁడై యుండిన గజదొంగ 'పాముల సింగన్న.' వానినిగూర్చి చెప్పవలసినప్పుడు వాని ఒడ్డు, పొడువు, వన్నె, కులము, భాష, ఆయుధములు మొదలగు వానిని కన్నులు మూసికొని చెప్పుట, వానిని గూర్చిన మనజ్ఞానమును తెలుపును. అతని వలన దేశమున కెంత నష్టకష్టములైనవో గమనించి యతఁడు చెడ్డవాఁడని తీర్మానించి చెప్పుట యభిప్రాయము. ఈరెండు సందర్భములందును కవిత్వమునకు చోటులేదు. ఇదిగాక, అతనితో దెబ్బలు దోపులు దిన్నవారికతనిపై కోపము జనించును: అతని సాహస కార్యములు చూచిన కొందఱి కాశ్చర్యము మెప్పును గలుగును. ఇత్యాదులే భావములు. ఇవిలేనిచోట తత్త్వశాస్త్రము, నీతిశాస్త్రము ఉండఁగలవే కాని కవిత్వముండదు. కావున కవిత్వమునకు భావములు ప్రాణముల వంటివి. ఇఁక భావములకు ఆధారమగు విషయము, దానిని తెలుపుచుభాష కవిత్వమున కావశ్యకములని చెప్పనక్కఱ లేదు. ఐదవ మహాభూతము విని సంతసించువాఁడు. హృదయమున జనించిన భావములను ఎవరు విన్నను వినకున్నను బైలపెట్టుట మనుష్య సామాన్య ధర్మము గావున, కవిగూడ నట్లే తన కొఱకే వ్రాసికొని మూసిపెట్టుకొనవచ్చును గాని యిది కవిత్వమగునా కాదాయని చర్చింపవలసిన, విని సంతోషింపవలసిన, మనము లేకున్న, దాని పాలికి మన మెట్లు

లేమో యట్లే మన పాలికదియులేదు కావున, కవితా సృష్టియందు సభ్యేతరో యావశ్యక మైన వస్తువేదని చెప్పలేము.

పైని యైదు వస్తువులలో భావము, విషయము, అను రెంటిని గూర్చి మనము చింతనిసేరు ఏభావమైనను, ఏవిషయమును గూర్చియైనను కవికుండవచ్చును. కవికి, తానే సాక్షాత్తుగా చెప్పునప్పుడు, మృదువులగు ప్రేమ; భక్తి, మెప్పు, మొదలగు భావములే యుండవలయును కాని, తీవ్రములగు అసూయ, ద్వేషము, అసహ్యము, క్రూరత మొదలగునవి యుండరాదని కొందఱు తలంతురు. నేనును ఇట్లు తలంచి యుండినవాఁడనే. కాని యది పొరబాటు. కావ్యమునందు అన్ని భావములును హృద్యములుగానే యుండును. మనకు దేనిపై కోపమో ప్రీతియో కలదో దానిపై కవికిని అట్లే యుండవలయునని తలంచుట యన్యాయము. అసాధ్యము. మనకుఁ గావలసినది ఆ భావమును కవియెంత నిజముగా తీవ్రముగా తాననుభవించి, మనల ననుభవింపఁజేసినాఁడనుటయే కాని వేఱు కాదు. ఇట్లే కొందఱు కవిత్వమునకు విషయము లైన వస్తువులను నియమింపఁ బ్రయత్నింతురు. ఇటీవల మోటారుబండ్లు, సిగరెట్లు మొదలగువానిని గూర్చి కూడ దేశాంతరములలో కవిత్వము బయలుదేఱుచున్నదనియు మనదేశమున కట్టి యవస్థ రానీయ దనియు వారు హెచ్చరింతురు. నాకు మోటారు బండి శబ్దముపై అసహ్యము. దాని వేగముపై ప్రీతి. కావున ఈ భావములను తెలుపఁజూచుచు పద్యములు నేనేల వ్రాయరాదు? మద్యమును గూర్చి కాళిదాసు మొదలగువారందఱును కమ్మని పద్యములు వ్రాసియుండఁగా సిగరెట్లు చేసిన తప్పేమి? భావము లిట్టివే కావలయునను నిర్బంధము లేనప్పుడు విషయములకుమాత్ర మేల నిర్బంధము? ఎట్లు నిర్బంధింపఁగలము?

తక్కిన కవి, భాష, వినువాఁడు అను మూఁడు పదార్థములలో ప్రతియొక్క టియు కొంత విశేషధర్మము గలిగి యుండవలెను. ఎవఁడైనను ఎట్టి భాషలలో వ్రాసినను అది యెవరి మనసున కైనను ఎక్కును అని చెప్పలేము. కవిత్వమందలి ముఖ్యలక్షణధర్మము ఇతరుల మనస్సు కెక్కుట. ఇది మన కర్థముగాని రహస్యము. 'ఇట్లు వ్రాసినదానిని విని మేము మెచ్చెదము' అని శాస్త్రము వ్రాయుట యెవ్వరికిని సాధ్యముగాలేదు. అట్టి ఆకర్షణశక్తి యెవఁడో యొకనికి దేవుఁడు ప్రసాదించి యుండును. అట్టివాఁడు తప్ప తక్కినవారు కవులు కాఁజాలరు. అతఁడే తనకుఁ గావలసిన విషయములతో తన భావములను తెలుపుచు భాషనుగూడ ఏఱుకొనును. 'అర్థాలముగాఁ జూచిన, సంగ్రహము, స్పష్టత, సరళత మొదలగునవి కవిత్వభాష కుండవలసిన ప్రధానగుణములు. వినువారు సహృదయులుగా నుండవలయును. అనఁగా కవి యెట్టి హృదయముగలదో యట్టి కలవారనుట హృదయమునందు జనించు భావములను పరిగణనచేయఁగలను ఆలోచి

పెట్టుకొని, క్రమముగా భావించుశక్తిని యనేకులు చంపుకొనియుందురు. అట్లుగాక యేభావమైనను సంపూర్ణముగా ననుభవించు సహజమైన హృదయసత్వము గలవారు సహృదయులు. ఇట్టివారు కవిత్వమును విన్నప్పుడు తమ హృదయమును మఱచి కవిహృదయముతో మాఱఁగల్గుదురు. అనఁగా కవిత్వమును విని యానందించుటకు అహంకారము పనికిరాదన్నమాట. అహంకారమనఁగా గర్వము కాదు. నేను, నాది, నాభావము, నాసిద్ధాంతము, అనునట్టి జ్ఞానము. అది యుండుపక్షమున కవి యేమిచెప్పినను 'అది నాకేవిధముగా నన్వయించును, నాయభిప్రాయముల కనుకూలముగ చెప్పినాఁడా లేదా' యను దృష్టికలిగి, దానికి తగినట్లు మనకు సుఖమో దుఃఖమో కోపమో అసహ్యమో కలుగును. వేమన్న సమాధినుండి లేచివచ్చి, నాయీయుపన్యాసములను విని వెక్కిరించి వెటకారము చేయుచు చక్కనిపద్యము రచించి నా మొగము ముందఱనే చదివినాఁడని కొందము. అప్పుడు నాయందు సహృదయత్వము గలదేని, అది యెందుకైన తగినదేని, వేమన హాస్యబుద్ధిచే నాకుఁ గలుగు అవమానము, నిరాశ మొదలగు అహంకారగుణములను మఱపించి, అసహృదయులందఱి కవిత్వపు చక్కఁదనము మాత్రము నేను గ్రహించి సంతోషించునట్లు చేయవలయును. అనఁగా కవిత్వమునకు విషయమైన వస్తువు కొఱకే కవిత్వములేదు. చంద్రుఁడు, మల్లెపూవు మొదలగు జడవస్తువులపై నెంతమంచికవిత్వమును వ్రాసినను అవి యెట్లు దాని సౌఖ్యము ననుభవింపలేవో యట్లే మనపై వ్రాసినను, మనము మనమైయుండు వఱకును, దాని మాధుర్యము కాననేరము. అట్లుగాక మన యభిప్రాయములు భావములు మఱచి కవితో నేకీభవింపఁగలమేని, అప్పుడు, ఇట్టిదని నిర్వచింపరాని యొక యానందము కలుగును. ఈయానందము ప్రత్యక్షసిద్ధమే కాని, ప్రమాణములతో స్థాపించి చూపుట సాధ్యముగాదు. ఇట్లు కవితాప్రపంచమందును మమతాపరిత్యాగపూర్వకమైన సాయుజ్యమే మోక్షానందమునకు కారణము.

ఈ సాయుజ్యమును గలిగించుటకు ఛందస్సొక గొప్పసహకారి వస్తువు. ఛందస్సునందు ముఖ్యముగా నుండు, ఉండవలసిన గుణము లయము. లయమనఁగా, ఇక్కడ, క్లుప్తమైన కొలఁతగల యొకవిధమగు శబ్దముల నడక. దీనికి తక్కిన యే పదార్థముల సాహాయ్యమును లేకయే మనలను మఱపించుశక్తి కలదు. మనము ఏపని చేయుచున్నను, ఎక్కడనో యొకమూలలో వినవచ్చు మృదంగము తప్పెట మొదలగు వాద్యముల లయప్రకారము వ్రేళ్ళైనను ఆడించక యుండలేము. మనకన్న నాగరకత తక్కువగలవారు దానివెంట నిస్సంకోచముగా నాట్యమే చేయుదురు. తీవ్రమైన భావమునకు, దానిని వ్యంజించు భాషకు తోడుగానిదియు చేరెనేని 'చిచ్చునకుఁ దోడు కరువలి వచ్చి' నట్లేకదా. కావుననే కవిత్వముయొక్క పరిపూర్ణఫలము పాటలందు

పద్యములందు లభించునంత వట్టిగద్యమందు లభింపదు. గద్యమందు కవిభావములు కవిభావయు నుండవచ్చునే కాని, వానిని స్పష్టముగా పట్టిచూపు పంజరముండదు. అది యుండనిండు.

కవిత్వస్వరూపమునుగూర్చి నేఁజెప్పిన పైవిషయములలో క్రొత్తది యేమియు లేదు. కాని యందులో నొకవిషయమును మాత్రము ముఖ్యముగా నొత్తి చెప్పుట కింత వ్రాయవలసెను; అది వినువారియహంకారత్యాగము. వేమనవంటి స్వతంత్రుని కవిత్వమందలి మాధుర్య మనుభవించుట కదిలేనిది సాధ్యము గాదు. వేమన పెక్కు బండబూతుపద్యములు వ్రాసెను. అట్టి పదములు మనసోట నుచ్చరింపరానివను భావము మనము మఱచిపోవువఱకును వానియందలి కవితాధర్మము మనకు గోచరింపదు. వేదములకాలమునుండి మనలో బూతులున్నవి. మనలోనే యేల? అందఱి యందును గలవు. శామాగురులను వారిని ఖండించువారును అన్నిభాషలందును బూతుకవిత్వమును వ్రాసినవారే. నేఁటికిని అట్టివి వ్రాయువారు, విని సంతసించు వారును విద్యావంతులలోనే కలరు. కాని వానిని బైలుపఱుపరాదను భావము ఇప్పుడు బలమగుచున్నది. అంతమాత్రముచేత అది కవిత్వము కాదనలేము.

కాని, యెవ్వరికిఁగాని 'తాను' అనుపదార్థ మొకటి యుండువఱకును అది పూర్తిగా లేదనుకొని మఱచిపోవుట యసాధ్యము. ఇతరులను మఱపించి వశము చేసికొనుటయే ప్రధానధర్మముగాఁ గలిగిన కవిగూడ నీతత్త్వమును మఱవరాదు. 'నేను' అను నీయహంకారముండువఱకును, ధర్మము, నీతి మొదలగువానిని గూర్చి బుద్ధిచే నేర్పడిన సిద్ధాంతము లెప్పుడును మనవెంటనే యుండును. కవికిని మనకును హృదయసత్త్వ మొక్క తీరుగానుండి యాకారణముచేత అతనియందు జనించిన ప్రేమ శోకాదిభావములు మనహృదయమునందును ప్రతిబింబింపవచ్చును గాని, యిరువురిబుద్ధులు, అనుభవములు వేఱువేఱగుటచే అతని సిద్ధాంతములన్నియు మన మంగీకరింపలేము. చూడుఁడు. వేమన్న యిట్లు వ్రాసెను.

— "ఆ. సతులఁ గవయనేల? సుతులఁ బడయనేల?
వెతలు పడఁగనేల? వెఱ్ఱితనము
నేలమీఁదిరాయి నెత్తికెత్తినయట్లు..." (౩౮—౨౪)

ఈసిద్ధాంతమును మనలో నంగీకరించువారెందఱు? నూటికొక్కరు గలరా? కాని యీపద్యముఁ జదువునపుడు అతనిహృదయమందుఁగల సంసారముమీఁది యసహ్యమను భావము క్షణమాత్రము మనహృదయములందును సంక్రమించును, అంత మాత్రమున వెంటనే మనము కావిబట్టలు కట్టుకొనఁబోము. కవి కవిత్వమింతటితో చరితార్థమైనది. కవి సిద్ధాంతములు మన యభిప్రాయములును ఒకటిగానుండినా

యట్లుండుటకును అతనిభావము మనహృదయమున నిలిచియుండి ఆపద్యము పలుమాఱు జ్ఞప్తికి వచ్చును.

ఇట్లు కవి యభిప్రాయములన్నియు మనమంగీకరించుటకవకాశ మియ్యని, బుద్ధి, అనుభవము మొదలగువానిభేదమట్లుండఁగా, వీనికన్నను బలవంతముగానుండి మనుష్యులనహంకారత్యాగముచేయనీయనివస్తువు వేఱొకటి కలదు. అది నాగరకత. మనవేషము, భాష, నడత మొదలగువాని స్వరూపము నిది నిర్ణయించును. అనేక కారణములచేత అప్పుడప్పుడు నాగరకతకు సంబంధించిన యభిప్రాయములు మాఱును. మన పూర్వికులు మగవారికిఁగూడ 'ఎల తేఁటి దాటులన్ బమ్మెరవోవఁదోలు తెగఁబారెఁడు వెండ్రుక' లున్న నలంకారమనుకొనిరి, ఇప్పుడాఁడవారికిఁగూడ వెండ్రుక లింత కుఱుచగా కత్తిరించుకొన్న నంత నాగరకత యనుభావము వ్యాపించుచున్నది. ఇట్లైనను మనము నీతిని ధర్మమునైనను వదలుదుముగాని యనాగరకులముగా బైట వర్తింప నిష్టపడము. ఇతరులు మనలను నాగరకులనవలెనను వాంఛతో మన మెంతో కష్టపడుదుము. అసత్యమునకైనను అంగీకరించి తిట్టవలసినవానిని సభలో పొగడుదుము. కాఁబట్టి, కవియొక్క పద్యములందనాగరకపుమాటలు—అనఁగా మన కాలమున నట్లు తలఁపఁబడినవి—ఏమాత్రమున్నను, అవి తటాలున అతని కవిత్వముచే మనకుఁ గలుగు మఱపును మఱపించును. అభిప్రాయము వేఱైననంత కష్టములేదు. వేమన-పద్యములు ప్రజలయందీ నాగరకదృష్టిని పలుమాఱు గమనింపక వ్రాయఁబడినవగుటచే వాని వ్యాప్తికిఁ గొంత విఘ్నము కల్గినదని వెనుకనే చెప్పితిని. కావున కవిసహృదయులిరువురు పరస్పరము సర్దుకొనవలసినవారు. వీరిసామాన్యస్వభావము గమనించి మన్నించుచు అతఁడు తన స్వాతంత్ర్యమును కొంత వదలుకొనవలయును, అతనియందలి విశేషగుణములవలని యానందఫలమనుభవించుటకై వీరు తమ స్వత్వమును చాలవఱకు త్యాగము చేయవలయును. వేమన్న తనధర్మము నిర్వహించుటలో కొంత యుదాసీనము చూపెను; ఇప్పుడతనిఁదిట్టి ఫలములేదు. మనమును అతఁడు మాజాతిని దిట్టినాఁడని, మా పద్ధతులు తిరస్కరించినాఁడని, మాకసహ్యమైన యనాగరకపు మాటలుచెప్పినాఁడని, మఱచిపోలేక మదనము చేయుచుంటిమేని, యతని యసాధారణ కవిత్వమునుండి కలుగఁగల యానందమను లాభమును పోఁగొట్టుకొనవారమగుదుము.

వేమన కవిత్వమందలి యసాధారణగుణములలో ముఖ్యమైనది భావముల తీవ్రత. అవియంత తీవ్రముగానుండుటకు కారణము ఆభావము లతనివే కాని యితరులవి కాకపోవుట. మనుష్యులలో ననేకులు ఎప్పుడును ఇతరుల భావములను తమపై నారోపించుకొనువారే. పదార్థములు మంచివి చెడ్డవి యను నభిప్రాయములను అందఱను తమంతట పరిశీలించి యేర్పఱుచుకోలేరు. కావున ననేకవిషయములలో మన

,మితరుల యభిప్రాయములే యను వాదము చేయుచున్నది. ఉంకాయ ఆరోగ్యకరమగునా కాదా యను విషయమున సామాన్యజనులందఱును వైద్యుల యభిప్రాయమునే నమ్మవలయునుగదా. కాని యది నానాలుకకు రుచించునా రుచింపదా యను విషయమునఁ గూడ ఇతరుల మొగముఁ జూచి చెప్పవలసివచ్చెనేని, తక్కినవెల్లినను కవిత్వమునకది ప్రళయ కాలము. ఈవిషయమున ప్రాచీనకవుల పారతంత్ర్యమును మొదటే విన్నవించితిని. ఇతరులకై వారు వ్రాసిన గ్రంథములలో నెల్ల సగానికి సగము కవిత్వము సున్న. ప్రాచీనులలో నవేకులు కవులనుట, వారిగ్రంథములకంటె, చాటుపద్యములలో నెక్కువగాఁదోఁచును. అల్లసాని పెద్దిరాజు, తనప్రభువగు కృష్ణదేవరాయలను మనుచరిత్రము పీఠికయందెన్నియో తెఱఁగుల వర్ణించి, తనకతనియెడఁగల మెప్పు, గౌరవము, ప్రేమ మొదలగు భావముల ప్రకటింపఁ బ్రయత్నించెను. కాని రాయలమరణానంతరమింటిలో మూలఁగూర్చుండి యేడ్చుచు చెప్పిన "యెదురైనచో తన మదకరీంద్రము డిగ్గి" అనుపద్యము మనమనస్సులను గరఁగించినట్లు పైపీఠిక పద్యములలో నొక్కటియును జేయఁజాలదనుట సహృదయ వేద్యము. కారణమిది శోకము పొంగిపొరలివచ్చునపుడు తనకొఱకే వ్రాసినది. అవి రామరాజభూషణుఁడు, రామభద్రుఁడు మొదలగువారి మొగములు చూచుచు వ్రాసినవి. ఈదోషము ఆధునిక కవులలోను అనేకులకుకలదు. విచిత్రములయిన కల్పనలు చేయఁగలవాఁడు కవియని యాకాలపువారు తలఁపఁగా, విచిత్రములైన భావములను జూపువాఁడు కవియని యీకాలపువారు తలఁచుచున్నారు. భరతమాత రాటము, రాధాకృష్ణులు మొదలగు విషయములఁగూర్చి యీకాలమున బయలువెడలుచున్న యసంఖ్యపద్యములలో ముక్కాలుమువ్వీసము కవిత్వము సున్న. వీరుచూపు భక్తి, ప్రేమ, శోకము మొదలగు భావములన్నియు సొంతముగా హృదయమందుద్భవించినవి గాక, యేరవీంద్రనాథుని నుండియో, యేసరోజినీదేవినుండియో యెరవు తెచ్చుకొన్న వగుటచేత, ఈ పద్యములు, చిన్నబిడ్డలాడు నాటకములవలె కొంతవఱకు వినోదముగాను చాలవఱకు అసహ్యముగాఁనుండును. వేమన యందిట్టి భావదాస్యము లేదని వేఱుగ చెప్పఁబనిలేదు.

ఎప్పుడు భావమిట్లు సహజమయ్యెనో యప్పుడే భాషకొకవిధమైన బిగువును బలమును గలుగును. అది కృత్రిమమైన నడయు సడలి తేపలుగా నుండును. భావము నిండు కడవవంటిది. భాష దానిని పైకీడ్చుత్రాడు. అసలు కడవయేలేని వట్టిత్రాటిని ఎంత మెల్లదిగా నీడ్చినను అది చక్కగా దృఢముగా మీఁదికి రాదు. ఊఁగులాడును ; ముడులుపడును ; చేదువానికి చేదునట్లే తోఁపదు. అట్లే భావదార్ఢ్యము లేని భాషలో ధారయుండదు ; పదములచేరిక యెగుడుదిగుడుగా నుండును ; కంఠపాఠ

మనిపించును గాని కవిత్వమనిపించదు; అధికపదములు దొర్లును. నాకుఁ జూడఁగా కవిత్వమున అపశబ్దములకంటె అధికపదములు గలుగుట పెద్దదోషము. అపశబ్దములచే వైయాకరణుల ముఖము చెడును గాని కవి భావము చెడదు. అధికపదములచే తప్పక చెడును. తీవ్రమైన భావములు గలవానికే యట్టి తొడుకులేని భాష చెప్పఁగలదు. అనఁగా తీవ్రమైన భావములుగలవారికెల్ల అట్టిభాష వచ్చునని కాదు. అసలు కవిగా సృజింపఁబడినవానికే యీవ్యాపారమున్నయింపును. తీవ్రమైన భావములు మనుష్యుల కందఱికిని కలవు, కాని యాభావములను బైటఁ బెట్టవలసినప్పుడు మఱికొందఱికిని వచ్చునది కవిత్వముగాదు; వత్తి, కొందఱి కది వాలుకళే యంటియుండును. మఱికొందఱికిది వ్రాతఁలోను గలదు. కవులనఁబడువారిలో ననేకులిట్టి నత్తివ్రాఁత వారే. బుద్ధిమంతులైన వారి కీరెంటికిని మందొకటే; చేతనైనంతవఱకును మౌనము వహించుట.

వేమన యిట్లు తీవ్రములైనభావములు, అడ్డులేనివాలుక కలవాఁడు కావుననే యతనిరచనలో భావము భాష యీరెండును ఒకటితోనొకటి పందెము వేసికొని కుప్పించి యెగిరినట్లు, హృదయమునుండి పైకివచ్చుచున్నవి. ఈవేగమును నిరోధించుటకు ఛందస్సు యతిప్రాసలు మొదలగు ఏనిర్బంధములకును చేతఁగాదు. ఇవి వానికి లొంగి పడుకొనవలసినదే కాని యవి వీనికి లొంగి కుంటుచు నడవలేవు. కావుననే యందఱికివలె వీనిర్బంధములు సంకెళ్ళవలెనుండక, ఇతని కవితకు కడియములుఁగరాల వలె అలంకారములైనవి మఱియు కొన్నిచోట్ల పైనిర్బంధములను విడిచి తెగించి వ్రాసినను, మఱికొన్నిచోట్ల లేనినిర్బంధములను కల్పించుకొని, యంతే ధారాళముగా వ్రాసి, వేమన విచిత్రములైన దొమ్మరి లఘువులను చూపుచున్నాఁడు. మనలో వృత్తిజాతులందలి యక్షరసంఖ్యానియమమును ప్రాసనిర్బంధమునువదలి యతినిమాత్ర ముంచుకొన్న చిన్నసులభమైన పద్యము ఆటవెలఁదిగదా. దానిలోను ప్రాసమును చేర్చుకొని యితఁడుచేసిన సరళమైన సాముచూఁడుఁడు.

"ఆ. చదువులందు పాడి మొదవులందును స్త్రీల
పెదవులందు రాజ్యపదవులందు
అశలుడిగినట్టి యయ్యలు ముక్తులు......" (౧౪౬౯)

"ఆ. అకులన్ని తిన్న మేక పోతులకేల
కాక పోయెనయ్య కాయసిద్ధి?
లోకులెల్ల వెత్తి పోకళ్ళఁ బోదురు......" (౨౨౩)

ఇతనియందలి యర్థముగాని కవితారహస్యములలో ఈయాటవెలఁది యొక్కటి. 'ఇంత చిన్నవృత్తములో, అంతగొప్ప భావములను, యతిస్థానములు వదలక, వేమన

ముందు అతుకులు తిరుగుడులు లేక, కత్తిరించినట్లున్న శబ్దార్థములతో, ఎట్టితఁడు అచ్చువేసినాఁడురా! యనుప్రశ్న పద్యములు వ్రాయుటకు చేయివేసిన వారికెల్ల తెగనిది. ఇతని పద్యములు చదివినతరువాతఁగూడ ఆటవెలఁదులే వ్రాసెదనని చేయి వేయువాఁడు నాకుఁ జూడఁగా పెట్టెవాఁడు. శ్రీవాసుదేవపురూపముగా నిదేపద్ధతిలో ఒక యాటవెలఁది చాటుపద్యము వ్రాసెను.

"ఆ. చిన్నచిన్న రాళ్ళు చిల్లరదేవుళ్ళు
నాగులేటి నీళ్ళు నాఁపరాళ్ళు
సజ్జజొన్నకూళ్ళు సర్పంబులును దేళ్ళు
పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు"

కాని యిట్టివి నాలుగైనను వ్రాయకమునుపే, యతనికి రెడ్డిరాజుల ముందు సభామందిరములలో చేయెత్తి పాడుటకు తగిన సీసపద్యపు గాంభీర్య దైర్ఘ్యములపై మనసుపోయినది. ఒక్కొక్కరి కొక్కొక్కజాతిపద్యముపై సహజముగు నభిమాన ముండును. కాళిదాసు మందాక్రాంతి, భవభూతి శిఖరిణి, తిక్కనకందము సుప్రసిద్ధములే. తెలుఁగువారిలో తరువాతి కవిచౌడప్ప, సుమతీశతకకర్త, మొదలగు శతక కవులనేకులు కందమందభిమాన మెక్కువగాచూపి, చక్కని పద్యములను వ్రాసిరి. అట్లే వేమన్నకును ఆటవెలఁదిపై నభిమానము సహజభావములలో నొక్కటి. కాని కారణమును గలదు. తన యభిప్రాయమును స్పష్టముగా చిక్కులేక చెప్పఁగోరు వారెవరుగాని పెద్దపెద్ద వృత్తములను వాడరు. వానికి చేయి వేయుట యేనుఁగును గట్టినట్లు. కడుపునిండ దానికి తిండి మొదగించుటయే పెద్ద కష్టము. కాఁబట్టి యేలకలములతో తెచ్చి దాని పొట్టనింపవలసి యుండును. అర్థభావములకు మితియున్నదిగాని భాషకులేదు. కావున ఏవో శబ్దముల చెత్తనుజేర్చి పద్యములు నింపవచ్చును గాని యసలువస్తువు చెడక తప్పదు. వేమన యిట్లు మొదలు చెఱచు బేహారి కాఁడు. కావుననే తెలుఁగు ఛందస్సులలో నెల్ల చిన్నదియగు ఆటవెలఁది నితఁడు పరిగ్రహించె ననవచ్చును. కందములు, తేటగీతి మొదలగు పద్యములు గూడ నితఁడు వాడినాఁడు గాని వానిలో చాలవఱకు ఈ ముద్దు, ఈ చెక్కన చక్కఁదనము, ఈ బిగువు, ఈ లగువు లేదు.

దీనిలో ఇతఁడు యతికిచ్చిన మర్యాద, అందము, అగ్గలమైనది. ఆంధ్ర వాఙ్మయములో యతిని పరస్పర విరుద్ధముగా విచిత్రముగా వాడిన వారిద్దఱు; మొదటివాఁడు తిక్కన సోమయాజి, యతికావలసిన వారు ప్రయత్నముగా నితని కవిత్వమందు వెదకి చూడవలసినదే కాని, యది తప్పక యందుండినను సామాన్యముగ చేతికిఁ జిక్కదు. అయినను సారముగా పాదమధ్య మందొకచోట పదము

నిలుచుట యతియని ప్రాచీన నియమము. దానిని వదలుకొని తెలుఁగువారు, అట్టిచోట మొదటి యక్షరము మరల నావృత్తి కావలయునని యొక వెఱ్ఱిపట్టు పట్టుకొన్నారు. వారి పీడను వదలించుకొనలేక తిక్కనయు, యతి వచ్చినదనిపించి ముందుకు వెడలినాఁడు.

"గురుభీష్మాదుల నూముమండ సభమీకున్
గీడు నాఁడట్లు ముష్కరులై చేసిరి యంతచేసియును
పశ్చాత్తాపముంబొంద నోపర........"

(భారతము, ఉద్యోగపర్వము.)

అన్నప్పుడు అప్పకవీయము చేతలేనివారికిందలి యతి కానిపింపదు. ఈతప్పించుకొని తిరుగు కౌశల్యము తిక్కన కబ్బినట్లు మఱెవరికిని అబ్బలేదు. కాని యీమార్గమే కొంతసులభమని తిక్కన వారసులు నాశ్రయించిరి త్రోవనే త్రొక్కిరి. నేనెఱిఁగినంతవఱకు వేమన్న యొకఁడే ఈ విషయమున తిక్కన కెదురు తిరిగినవాఁడు. ఎక్కడికి యతియుండవలయునో యక్కడికి పదమే కాదు, అభిప్రాయమును తెగినిలుచును. వెంటనే అయ్యక్షరావృత్తియు తడవుకొనక్కరలేక స్పష్టముగా దాఁపురించును. లేదా ప్రాసము స్పష్టము. చూడుఁడు.

"ఆ. కడుపు బోరగించి కన్నులు మూసిరించి
ఒఱ్ఱిగుసుకొన్న బీదయోగి
యమునిబారిగొట్టి యతఁడేమి సేయును..." (౭౪౩)

"ఆ. కోఁతిఁబట్టి తెచ్చి క్రొత్తపుట్టము గట్టి
కొండముచ్చులెల్ల కొలిచినట్లు
నీతిహీను నొద్ద నిర్భాగ్యులుందురు..." (౧౨౦౧)

ఇతని భావములెట్లు కృత్రిమములు కానివో యితని భాషయునట్లే. ఇదే నిజమైన యచ్చతెనుఁగు. ప్రాచీనులకు సంస్కృతమువలె, అధునికులకు ఇంగ్లీషువలె, స్వభావస్వరూపమును జెఱచునట్టి రెండవభాష యేదియు వేమన్న యెఱుఁగఁడు. కావుననే, యోగరహస్యములను తెలుపు పారిభాషిక పదములతో నిండిన పద్యములు తప్ప, తక్కిన యేమాట చెప్పినను, తెలుఁగు మాటలాడనేర్చినవాని కెవ్వనికిని ఇతని పద్యము లర్థము కానివి యుండవు. గొప్ప తత్త్వవిషయములు చెప్పునప్పుడును ఇతని ధారయిట్లే యుండును. 'ఈ సౌలభ్యమందే అనన్యసాధారణమయిన యతని కవితాశక్తి యడఁగి యున్నది.' తాను చెప్పు ప్రతిన్యాయమునకును ఒక యుపమానము తప్పక యుండును. ఆ యుపమానములు గూడ ఊహాకల్పితములు గాక, ఇంటిచుట్టు మట్టుగల వస్తువులగుటచే, వాని సొగసును బిగువును అందఱనుభవించి యానందింతురు. ఇదివఱకే యెక్కువ యుదాహరించితిని, కాని మఱి రెండైనను ఉదాహరింపక యుండలేను.

"ఆ. గసుల గన్న వేఱు పాలేక వర్గము;
పుష్పజాతి వేఱు పూజయొకటి;
దర్శనములు వేఱు దైవం బదొక్కటి..." (౨౪౭౦)

"ఆ. తల్లి దండ్రి బావ దాయాదితోఁగూడి
యిల్లు పట్టుకున్న యింపులెల్ల,
కోతిమీఁది దొంగకూడడిగిన యట్లు..." (౧౭౫౧)

ఇట్టి నాయకులగాని యభిప్రాయములతో మనమేకీభవించిన నేమి? ఏకీభవింపకున్న నేమి? వీనిమూలమున విన్నవారెవరు సంతోషింతురుగాని పామఱుఁడుగాని కీసని మఱవఁగలఁడా! సంపంగిపూవుల వాసన తలకొప్పి దేచ్చును. కాని యేమి చేయఁగలము? ముక్కు కోసికొనవచ్చునా? కోపమువచ్చిన పెరటిలోని చెట్టును గొట్టివేయవచ్చును కాని మైనూనసీసాలో నెక్కడికిఁ బోయినను పూచిన సంపంగి గ్రమ్మఁగునే! వేమన సిద్ధాంతముల నంగీకరించని వారికనితోడి బ్రతుకుకు అంతే.

ఇతని కవిత్వమునకు కొంత మెఱుఁగు పెట్టి దానిని దుర్వారబలముగల దానినిగాఁ జేసినది హాస్యము. మనలో నయముతోడి హాస్యము లేదని మొదలే విన్నవించితిని. నవరసములలో హాస్యమునుగూడఁ జేర్చియున్నను, ప్రాచీనుల హాస్యము అసహ్యములును అసభ్యములును వర్ణించుటయందుమాత్రము పరిశాస్త్రమైనది. కావుననే హాస్యరసప్రధానములగు ప్రాచీన ప్రహసనములను చదువుట కిప్పటి నాగరకత గలవారు రోసింతురు. ప్రాచీన నాటకములలో కొంచెము నాగరకతగల హాస్యమును జూపుటకై యేర్పడిన పాత్రము విదూషకుఁడు. కాని వాని హాస్యముగూడ, ఎప్పుడు చూచిన తిండిపోతుతనము—వీనిచే చెప్పఁదగినట్టి అసహ్యపు నవ్వే. కాళిదాసు మొదలు ఇట్టి పద్ధతిని కొంతవఱకు తప్పించి మాళవికాగ్నిమిత్ర నాటకమున కొంత జాణతనము, చమత్కారముగల విదూషకపాత్రమును తయారు చేసెనుగాని, సంప్రదాయజ్ఞులు దానిని ఖండించుటచేతఁ గాఁబోలు, తరువాతి నాటకములలో యథాప్రకారముగా తిండిపోతు విదూషకునినే యమ్మగొట్టెను. తరువాతి వారు సరే సరి. తెలుఁగువారమగు మనము అన్నివిధముల సంస్కృతము వారినే యనుసరించిన వారము. ఆవిదూషక పాత్రము యట్లే చెక్కుచెదరక కీర్తిశేషులగు శ్రీకోలాచలం శ్రీనివాసరావుగారు మొదలగు ఇప్పటివారి నాటకములలోఁగూడ అవతరించి వచ్చినది. చక్కని హాస్యమును సృజించుటకు సామర్థ్యము గాని, దానిని విని కడుపునిండ నవ్వుటకు శక్తిగాని మనలో లేకపోలేదు. ప్రాచీన సంస్కృతాంధ్ర పండితులలో సభ్యముగా, చాతుర్యముతో, వినువారి కడుపులు చెక్కలగునట్లు నవ్వింపఁ గల

వారిని చేసెనుఁగుదురు. కాని వాఙ్మయమంతయు, జీవితమును వేఱుచేసికొన్న వారగుట చేత, పేరు పట్టుకొని వ్రాయనుపక్రమించిన వెంటనే యెక్కడలేని బాముములను అప్పుడు మనవారికి దాఁపురించును. మఱియు సంప్రదాయమునకు దాసులై యభిప్రాయములందును, భావములందును స్వాతంత్ర్యములేనివారివద్ద హాస్యమునకు అవకాశమును చాల తక్కువ. హాస్యమునకు మూలప్రకృతి యితరులయందలి తప్పులను బైలుపెట్టుట. అందును తప్పుకలదను నభిప్రాయమే సామాన్యజనులకు లేనట్టి చోటులందలి తప్పులను ఆకస్మికముగా బైటికి దీసినపుడు హాస్యమునకు బలమెక్కువ. ఇట్టిసూక్ష్మ దృష్టి గలవాఁడు తన చుట్టుగల తప్పులను గూర్చి గమనించి, చెప్పుకొనక, తనలోనే నవ్వుకొనును. అట్టివాఁడు తన వేషము, భాష, ఆచారము, విద్య ఇత్యాదులన్నియు నిష్కళంకములని దృఢముగా నమ్మినవారికి, ఇతరులందలి తప్పులను గమనించు సామర్థ్యమో సంప్రదాయమో యుండును. అందుచే వారియందసహ్యముజనించి తిట్టఁ గలరు కాని నవ్వింపలేరు. కావున నే మొన్న మొన్న వీరేశలింగము పంతులుగారి వ్రాతలు బైలుపడువఱకును తెలుఁగు భాషలో నయమైన హాస్యము పుట్టవనియ్యెను. వారిహాస్యమునందును సంఘసంస్కార దృష్టి ప్రబలముగా నావేశించి, 'స్వదోష దృష్టిని చాలవఱకు తప్పించుటచేత, నెల్లు ఎత్తిపొడుపులును ఎక్కువై రసము చెడినది. ఒకరితప్పులను బైటఁబెట్టినదల్ల హాస్యము గానేరదు. బైటఁబెట్టుటలోఁ గూడ మార్గమున్నది హాస్యమును గల్గించుటయు నొకశిల్పము. షోకుకగారలతో మాత్ర మిట్టెట్టుగానో యట్టె తప్పులు పట్టిన మాత్రమున నితరులు నవ్వరు. ఆ రహస్యములు శిల్పమాత్రమే యెఱుఁగును. హాస్యమువలని ఫలము జనుల చిత్తసంస్కారమైనను అదే ముఖ్యోద్దేశముగాఁ గలవాని వ్రాతలు హాస్యగంధులు; నీతిని బోధించవలయు ననియే పద్యములు వ్రాయువారి వ్రాఁతలో కవిత్వము లేనట్లు. వారిదృష్టియంతయు ఫలముమీఁద నుండునుగాని శిల్పముమీఁదనుండదు. వీరేశలింగము పంతులుగారి హాస్యరస మిందువలనే చెడినది. వారి ప్రహసనములను చదివి నవ్వుటకు సామాన్యముగా నాకు సాధ్యముగాదు. నిజముగా తెనుఁగుభాషకు మొట్టమొదట హాస్యరసము చవిచూపిన ధీరుఁడు గురుజాడ అప్పారావుగారే. వారి 'కన్యాశుల్క' మందున్నంత హాస్యరసనైర్మల్యము తక్కిన యెవరి గ్రంథములందును లేదనుట యతిశయోక్తి కాదు.

వేమన్నయు గొప్ప బోధకుఁడును సంస్కర్తయుఁ గావున అతని యందును హాస్యరసము కలుషితమై యున్నను, అందందు సహజముగా అసభ్యరచనలు చేసినను, తెగిన గాలిపటమువంటి స్వతంత్రబుద్ధి కలవాఁడు కావున, ఒక్కొక్కమాఱు తన పని తాను మఱచి స్వచ్ఛమైన హాస్యముతో తృప్తి కలిగించుకొనును.—

"ఆ. పాలసాగరమున పవ్వళించినవాఁడు
గొల్లయింట్ల పాలు కోరనేల ?"

యను ప్రశ్న వచ్చినది. తక్కిన సమయములందు ఇవన్నియు "బూటకపురాణ కథలు" (౨౭౫-౨) అని చెప్పియుండును. కాని యిప్పుడా యుద్రేకము లేదు. ఇప్పటి జవాబు వేఱు:—

"ఎదుటివారి సొమ్ము లెల్లవారికి తీపు..." (౨౫౧౮)

ఇది విన్నవాఁడెంత కృష్ణభక్తుఁడైనను నవ్వక యుండలేఁడు. 'గొప్పగురువులు ఊళ్ళలోనుండరు గాని కొండ గుహలలోనుందురు. వారియాశ్రయములేనిది ముక్తి మార్గము దుర్లభము' అని యెవఁడో యన్నాఁడు. ఔను నిజమని వేమన్నయు నన్నాఁడు;—

"ఆ. గుహలలోనఁ జొచ్చి గురువుల వెదకంగ
క్రూరమృగము మొకంబు తారసిలిన
ముక్తి మార్గమదియె ముందుగాఁ జూపురా..." (౧౩౨-౨౫)

సామాన్యముగా ఇతరులలోపములనెత్తి ఖండింపఁబూనుకొన్నప్పుడు గూడ, వాని కెంత గావలయునో యంతటితో తృప్తిఁబొందక, యితరులకు నవ్వు గలిగింపవలయునను నుద్దేశముచేతనే కొన్ని కొసరుమాటలుచేర్చి వ్రాయుట యితనిపద్ధతులలో నొక్కటి. లోభివానినడుగుట నిష్ఫలము; గొడ్డుటావును బితికినట్లు; మేక మెడ చన్ను గుడిచినట్లు— అని చెప్పినఁజాలును గదా. ఇతని కంతటితోతృప్తిలేదు.

"ఆ. గొడ్డుటావుఁ బితుకఁ గుండఁ గొంపోయిన
పండ్లు రాలఁ దన్ను; పాలనీదు.
లోభివానినడుగ లాభంబు లేదయా..." (౧౩౩౩)

"ఆ. మేక కుతికఁబట్టి మెడచన్ను గుడువఁగా
ఆఁకలేలమాను నాశ గాక,
లోభివాని నడుగ లాభంబు గలుగునా?..." (౩౩-౨)

ఇందు కుండఁగొంపోవుట, కుతికఁబట్టుట మొదలగునవి పాలు ద్రాఁగఁబోవువాని యాత్రమును స్పష్టముగాఁ జూపి, వాని యజ్ఞానమునకు మనల నవ్వించును.

ఈ హాస్యప్రియత్వమునకుఁ జేరినదే వేఱొకశక్తి యితనియందుఁ గలదు. అందఱికిని దెలిసిన సామాన్యన్యాయమునే గంభీరముఖముతో రెండుపాదములతోఁ జెప్పి, మూఁడవపాదములో దానిని తలఁపని తలంపుగా శ్రోతృత్రోవకు కిటాలువఁద్రిప్పి చెప్పుట. ఉపవాసమున్న యెడల దేహమందు జీర్ణముగాని రోగములన్నియు జీర్ణమగునని వైద్యశాస్త్రము. వేమన్నయు నిట్లే తన పద్యము మొదలుపెట్టెను.

"ఆ. కూడుఁ బెట్టుకున్న కుక్షిలో జఠరాగ్ని
భక్షణంబు చేయుఁ గుక్షిమలము"

ఈమాట విన్నవారు 'ఏమిరా! వేమన్న ఉపవాసద్వేషియే. ఇంతలో తన యభిప్రాయమును మార్చుకొన్నాఁడా? అట్లైన మనశాస్త్రములు బ్రతికినవే!' యని సంతోషించు మనంతలోనే పిడుగువలె మూఁడవపాదము వెడలి పడి నిరాశ చేసినది.

"కూడు విడిచి మలము గుడుచురా యుపవాసి..." (౧౧౫౭)

దీనిని విని మనసు నొప్పుకొనువారే యెక్కువయైనను నవ్వఁగల రసికులును కొందఱుందురు. కాని యీక్రిందిపద్యమునువిని నవ్వనివారుఁడరు.

"ఆ. సకలతీర్థములను సకల యజ్ఞంబుల
తలలు గొరుగకున్న ఫలము లేదు.
మంత్రజలముకన్న మంగలిజల మెచ్చు!..." (౩౩౩-౨)

పైకవితాధార, హాస్యము—వీనికి తోడు ఇతని నామము నాంధ్రదేశమున నాచంద్రార్కస్థాయిగాఁ జేసినవి ఇతనినీతులు. ఇహలోకమున ఇతరులకును, తనకును సౌఖ్యమును గలిగించునవి నీతులని మొదలే విన్నవించితిని. కావున ఇతని నీతులును స్వార్థములని పరార్థములని రెండు తెగలగును, తత్త్వవాదములకువలె ఇతని నీతులకును అనుభవమే మూలముగాని పుస్తకములు కావు. కావుననే యవి యప్పుడును ఇప్పుడును అనేకులకున్నట్లు, ఇతనికి, పుస్తకములు వ్రాయుటకును ఇతరుల కుపన్యసించుటకును మాత్రము కావు. మంచిచెడ్డలను రెంటిని తాను జేసి యందలితత్త్వమును చక్కఁగా నెఱిఁగి, యితరులకు బోధించినవాఁడగుటచే సామాన్యనీతిగ్రంథములలో లేని తీవ్రత యితనిపద్యములలోఁ గలదు.

"ఆ. విన్నవానికన్న కన్నవాఁడధికుండు
కన్నవానికన్న కలియువాఁడు" (౩౭-౨-౨)

అనుమాట యితనినీతులందును అన్వయించును.

నీతులు పరార్థములని స్వార్థములని రెండు తెఱఁగులంటిని. కాని యనేక ధర్మశాస్త్రకారులమతము పరీక్షించిన నన్నియు స్వార్థములే యగును. పరోపకార మెందుకు చేయవలయును? అని యడిగిన నీకు పుణ్యము వచ్చునని వారందురు. పుణ్యమునకు ఫలము ఇహపరలోకములందు సుఖము. ఇట్లే పరుల కపకారముచేసిన పాపము వచ్చును. ఫలము నరకాదులు. కావున ఇతరులకు సుఖము గలుగఁజేయుటకు తనకు దానివలన సుఖముగల్గునను నాశయు, దుఃఖము కలుగఁజేయకుండుటకు తనకు దానివలన దుఃఖముగల్గుననుభయమును నీతిసామాన్యమునకు మూలముగా నున్నట్లే యేర్పడినవి. కావున పరార్థనీతులును స్వార్థములే. 'తనవలన ఇతరులు సంతోషించిన తనకు

సంతోషము కలుగవలయును, దుఃఖముగలిగిన తాను దుఃఖింపవలయును' అను నుదారభావమును ప్రజలలో వ్యాపింపఁజేసిన నీతిగ్రంథములు ప్రాచీనులలో నరుదు. ఇట్టి స్వార్థబుద్ధితోనే వారు ఘనమైన నీతికార్యము లన్ని చేసినారనుట సత్యమే. దానిచే సామాన్యముగా జనులలో నిప్పటికంటె నప్పుడు పరోపకారబుద్ధి యెక్కువగా నుండెననుటయు నేను మఱచిపోలేదు. కాని తనపనిచే నితరులకుఁ గల్గు సుఖమునకంటె తనకుఁ గలుగఁబోవు సుఖమునందే దృష్టియెక్కువగానుండుటచే, ఇట్టిపనులు నిష్కల్మషముగా తృప్తికరముగా నుండవు. ఇప్పుడు సర్కారువారి బిరుదుల నాశించి సత్రములు గట్టించు వానికి బిరుదు లభించిన తరువాత ఆ సత్రము గోడలెప్పుడు పడిపోయినను చింత యక్కరలేదు గదా. ఇట్లే స్వర్గాది సుఖముల నాశించువారికి, ధర్మశాస్త్రములందే పరోపకారము చేయవలెనని చెప్పఁబడినదో యదిమాత్రము చేసినఁ జాలును. తక్కిన దక్కఱలేదు. అదిగూడ ఎంతసులభము చేసికొనుటకు సాధ్యమో యంత సులభము చేయుదురు. గోదానము చేసిన పుణ్యమున, అది పాలుపిండినను, ఎండినను, మన స్వర్గలోక ప్రవేశము సుగమముగానుండు వైతరిణీనదిని దాఁటించుటకై మనకు అక్కడి దివ్యగోవు సిద్ధముగా నిలిచియుండును. కాని గోవులేనప్పుడు దానికి బదులు సువర్ణదానముచేయవచ్చునని ధర్మశాస్త్రములే కలవు. సువర్ణములేనప్పుడు వెండి కావచ్చును. ఇంతే వెండి యింతయుండవలయునని నిర్ణయములేదు. ఇన్నాళ్ళవఱకును రెండణాలరూకయు వెండిదే. అదిలేనప్పుడు రెండణాలరాగినాణెములు. వానిలో ఒకటి రెండు తగ్గినను బాధలేదు. కట్టకడపటనది యొక్క గొట్టుబిళ్ల క్రిందికిదిగును. కాఁబట్టి ఈపద్ధతి ప్రకారము ఒకగోవువెల ఒకబొట్టు! దానిని దానమిచ్చినను గోదానము చేసినట్లే. కాని యాబొట్టునుగూడ మూఁడు దమ్మిడీలుగా పగులఁగొట్టవచ్చును గదా. మితవ్యయము కులధర్మముగాఁ గల వైశ్యశిఖామణి యొకఁడు అది మఱచిపోలేదు. గనుక అతఁడు తాను గట్టించిన సత్రములో భోజనమైన తరువాత బ్రాహ్మణులకు తప్పక నిత్యమును తాంబూలములో ఒకదమ్మిడి పెట్టి 'సువర్ణపుష్పదక్షిణ' సమర్పించుచున్నాడనుట యెఱుఁగుదురు! కాఁబట్టి యిట్టి స్వార్థమైన పరోపకారములలో ఫలమెక్కువ యుండదని చెప్పఁబనిలేదు.

వేమన పరార్థ నీతులందు ఈస్వార్థదృష్టి చాల తక్కువ. 'ఇందుకంతబోవ మీశ్వరార్పణమన్న పుణ్యలోకమునకుఁ బోవు నతఁడు' (౩౪౭) ఇత్యాదిగా నొకటి రెండుమాటలు చెప్పినను మొత్తముమీఁద లంచమాసపెట్టియో, భయపెట్టియో, పరోపకారము చేయించుట కతనికిష్టములేదు. పుణ్యము, పాపము అను భావములు మనుష్యులు కల్పించుకొన్నవే కాని దేవుఁడు చేసినవి కాదని యితనిమతము.

" ఆ. మేనమామబిడ్డ మెఱసి పెండ్లామాయె
అరబులందు చెల్లెలాయెనదియు,
వలసిన పుణ్యంబు వలదన్న దోషంబు... " (ఓ.శై.౧౩-౪-౧౦)

మనుష్యులకు సహజముగా ఇతరుల దుఃఖమునకు దుఃఖించుట, సుఖమునకు సంతోషించుట, యను సుజాంగుణములును గలవు కావున అట్టి సుఖమును జోగొట్టి సంతోషమును గలిగించుటచే తనకుఁగలుగు సంతోషమే పరోపకారమందలి పరమార్థము. ఇదిగూడ స్వార్థమేకదా యను సూక్ష్మతార్కికుల వాదముతో మనకు పనిలేదు.

ఇట్టి పరార్థకార్యములలో వేమన్న కెక్కువ యభిమతమైనది ఔదార్యము. ఇతరులు తన్ను యాచించుటకు ముందే దానముచేసినవాఁడే దాతయని యితని యభిప్రాయము. ఈవిషయమందితఁడు అతివాదియని వెనుకనే విన్నవించితిని గదా. కావుననే యతనికి లోభివారిమీఁద చాల అసహ్యము పుట్టినది. సాధ్యమైనచో ప్రపంచమందలి లోభులనెల్ల పట్టిచంపినను పాపము లేదని యితఁడు తలఁచినట్లున్నది. వారిని చంపుట కితనిమందు —

"ఆ. లోభివానిఁ జంప లోకంబులోపల
మందుకలదు, వేఱుమతము గలదు,
పైకమడిగినంతఁ బ్రాణ(ము)వడి చచ్చు..." (౨౪౦౦)

ఇంత యసహ్యమునందును హాస్యము లేకపోలేదు. ఇంకను వినుఁడు.

"ఆ. పిసిని వాని యింటఁ బీనుఁగు వెడలిన
కట్టె కోళ్ళలకును కాసులిచ్చి
వెచ్చమాయెనంచు వెక్కివెక్కి యేడ్చురా......" (౨౫–౨౬)

ఇంతయుదారబుద్ధియున్నను వేమన్నకు పాత్రాపాత్రవివేకము లేకపోలేదు. దానమునకెవఁడు పాత్రము అని నిర్ణయించు నప్పుడు ఇతనికి కులము, జాతి, మొదలగు వానిమాట యట్లుండనిండు, గుణము గూడ నక్కరలేదు. ముఖ్యమైనది పేదతనము. అదియున్న తక్కిన దేమున్నను లేకున్నను అతఁడు పాత్రమే.

"ఆ. ద్రోహకారియైన దుష్టకాఁడైన
పతితుఁడైన వేదబాహ్యుఁడైన
అట్టి లేనివాని కడిగిన నీవి
ధనికునకొసంగఁదగను వేమ" (౨౦౯౫)

అన్నదానమునుగూర్చి యితని మతము మొదలే యుదాహరించితిమి. దీనికి తరువాత కన్యాదానముపై నితని కభిమానమెక్కువ. స్త్రీప్రజ యిప్పటికంటె పూర్వకాలమందు తక్కువ యని తెలియవచ్చుచున్నది. మఱియు బలవంతులగు మనవారు పలువురు బహుపత్నీవ్రతము నాచరించుచుండిరి. కావుననే యాకాలమందు మగవారు పెండ్లికెపడు కష్టముల కథలు పూర్వకాలపు వారిప్పుడును వింతగా చెప్పుదురు. అప్పటి పెండ్లి కన్యాదానము. ఇప్పుడది వరదానముగా పరిణమించినది—అనఁగా వరదక్షిణలు మొదలగునవి యపేక్షింపక ధర్మబుద్ధితో పెండ్లిచేసికొన్న వారికి; లేని

వారికి వరవిక్రయమే. ధర్మశాస్త్రములు వ్రాయుకాలము పోయినది గాని లేకున్న, ఏమియు వరదక్షిణ నాశింపక పేదల యింటిపిల్లను పెండ్లి చేసికొన్నవారికి జన్మాంతరమందు త్రిలోకాధిపత్యము వచ్చుననియు, వరదక్షిణ లేదని తిరస్కరించు వారికి ఆచంద్రార్కము అన్ని నరక బాధలను ఏకకాలమున గలుగుచుండు ననియును నే నిప్పుడు శాస్త్రములు వ్రాసి పరాశరుల పేరు పెట్టియుందును. ఇప్పటి యాడుబిడ్డల తండ్రులకష్టమును, కొడుకులుగన్న తండ్రుల క్రొవ్వును, దేవుడు చూచుచున్నవాడేని నేను ధర్మశాస్త్రము వ్రాసినను వ్రాయకున్నను పైఫలములతడు తప్పక యియ్యవలసియున్నది. వేమన కాలమందీస్థితి విపరీతముగానుండెను. ఐశ్వర్యవంతులెట్లో తమయింట్లకు భార్యలను కొనితెచ్చుకొనుచుండిరి. కాని పేదలకు పెండ్లియగుట కష్టముగా నుండెను. కావుననే యీ దానముగూడ ధనవంతులకు చేయరాదనియు పేదలకే చేయవలయుననియు వేమన శాసించెను. ఇట్లుచేయుట ధర్మమే కాదు, ఇందుచే సుఖమును గలదు.—

"ఆ. కలిమిఁజూచి యియ్యఁగాయమిచ్చినయట్లు
సమునకియ్యనదియు సరసతనము
పేదకిచ్చుమనువు పెనవేసినట్లుండు..." (౯౦)

నిజముగా పరులకుపకరింపవలె నను జ్ఞానమున్నవానికి, పరులను పీడింపరాదను భావము వెంటనే యుండును. ఈ యహింసా వ్రతముపై వేమన్నకు చాల ప్రీతి.

"ఆ. జీవి జీవిఁజంప శివుని జంపుటె యగు
జీవుఁడరసి తెలియ శివుఁడె కాఁడె..." (౧౬౨౪)

కావుననే యితఁడు యజ్ఞకర్మములను చాల నిందించెను. స్పష్టముగా హింస కానవచ్చుచున్న ఈ యజ్ఞములను జైనులు, బౌద్ధులు మొదలుగా నందఱును మొదటి నుండియు ఖండించిరి.

"యూపం కృత్వా పశూన్ హత్వా కృత్వారుధిర కర్దమమ్
యద్యేవం గమ్యతే స్వర్గే నరకే కేన గమ్యతే!" *

(తిలకమంజరి పీఠిక. పు. ౪.)

యని ధనపాలకవి యడిగెను. వైదికకర్మములందు శ్రద్ధాభక్తులుగల బ్రాహ్మణులలోనే మాధ్వులు ప్రత్యక్షముగా పశువును జంపుట వదలి, పిండితో పశువును జేసి కార్యము నెఱవేర్చుచు, అహింసాధర్మమున తక్కినవారికంటె నొకమెట్టు ముందుపడిరి. శ్రీవైష్ణవులలో తెంగలవారు యజ్ఞము లనావశ్యకములని త్రోసివైచిరి. తక్కినవారిలో యజ్ఞములు చేయువారే యపురూపమైనారు. కాని

* యూపస్తంభము నాటి, పశువులనుజంపి, నెత్తుటిబురదను గలిగించి ఇందుచే స్వర్గమునకుఁ బోగలమేని నరకమునకెవఁడు పోవువాఁడు? అని తా॥

శాస్త్రమునకేమో యజ్ఞములలోనిహింస హింసకాదని చెప్పుకొనుచున్నారు. వేమన్న కహింసమాత్రమే మతము. తనశత్రువునుగూడ హింసించుమనుట కిష్టములేదు.

> "ఆ. సంపదగినయట్టి శత్రువు తనచేత
> చిక్కెనేని కీడు చేయరాదు,
> పొసఁగ మేలుచేసి పొమ్మనుటే చాలు..." (౧౪౯౪)

నిజమే. శత్రుత్వము చావవలయునే కాని శత్రువు చావవలయునని కోరుట యన్యాయముగదా. సుసంస్కృతము మనుష్యులింతదూరము అహింసావ్రతమును పాలింపఁజాలరు కాని, యొకఁడిట్లు చెప్పెనో యతనిపేరనే గొఱ్ఱెలు, బఱ్ఱెలు బలియిచ్చుట నైనను నిలుపఁ బ్రయత్నించుట వేమనయందలి యభిమానముగలవారికెల్ల ముఖ్యధర్మమనుటలో సందేహము లేదుగదా.

ఇతని స్వాగనీతులలో స్వానుభవము, వివేకము, ఇంకను ఎక్కువగాఁ గానవచ్చును. మనుష్యులకీలోకమందు నెమ్మదిగా బ్రదుకుట కావశ్యకములగు ఓర్పు, వివేకము మొదలగు గుణములనివి బోధించును సంకల్పించిన ప్రయత్నములుగా నుండును. చూడుఁడు; శౌర్యము మంచిదే, కాని యిది సమానబలిష్ఠులమధ్య మాత్రము పనికివచ్చును. తనకంటె దుర్బలులైన వారియెడల శౌర్యమును జూపుట పేడితనమేయని యందఱంగీకరింతురు. తనకున్న బలమంతయు నొకని ప్రయోగించి చెడినవానిని జూచి 'బలే' యని మెచ్చుకొనువారు కొందఱున్నను అది యవివేకమనువారే యెక్కువ. వేమనయు నీ వివేకుల గుంపులోఁ జేరినవాఁడే.

> "ఆ. ఎదుటివాని బలము నెంచుకొనే క
> దిగొని బలము నెదిర్చెనేని
> ఎలుగు దివిటి సేవ కేర్పడు చందంబు..." (౭౪౬)

కావున,

> "ఆ. అనువుగానిచోట నధికులమనరాదు,
> కొంచెముండు టెల్ల కొదువగాదు,
> కొండ యద్దమందు కొంచమై యుండదా?..." (౧౨౫)

ఇట్లే యితరుఁడెవఁడైనను తన్ను దండించినయెడల సహింపక తిరుగఁబడుటయు శౌర్యముగానే తోఁచవచ్చునుగాని, అట్లు దండించుటవలన తనకు మేలేయగు పక్షమున సహించుకొనియుండుటయే వివేకమని వేమన్న మతము;

> "ఆ. చాకి కోకలుదికి చీకాకుపడఁ జేసి
> మైలఁ దీసి తెల్ల మడిచినట్లు
> బుద్ధిఁ జెప్పువాఁడు గ్రుద్దితే నేమయా?..." (౧౫౦౨)

పై రెండువిధముల నీతులను సాక్షాత్తుగాఁ జెప్పుట యొకతీరు. వాని నాచరించుటచేతను విడుచుటచేతను గలుగు ప్రాపంచికస్థితులను ఉన్నదున్నట్లుగాఁ

జెప్పి, ఆమూలముగా పైనీతులను వ్యంజింపఁజేయుట యంతకన్న బలవంతమైన కవితా మార్గము. వేమనకీమార్గమం దాశ యెక్కువ. శక్తియు నెక్కువ. చూడుఁడు.—

"ఆ. అలిమాటలు విని అన్నదమ్ముల రోసి
వేఱె పోవువాఁడు వెఱ్ఱివాఁడు
కుక్కతోఁకఁబట్టి గోదావరీఁదునా?......" (౨౯౭)

అని స్పష్టముగాఁ జెప్పుట యొక విధము. ఈక్రింది దంతకన్న బలవంతమైన ధ్వనిమార్గము.—

"ఆ. అలివంకవారు ఆప్తబంధువులైరి
తల్లివంకవారు తగినపాటి,
తండ్రివంకవారు దాయాది పగవారు..." (300)

ఇట్లే ప్రపంచమందు పలుకుబడి, మర్యాద సంపాదించుటకు తక్కిన యన్నిటికన్న ద్రవ్యము ముఖ్యము గావున దానిని సంపాదింపుఁడని స్పష్టముగాఁ జెప్పుటకన్న ఈక్రిందిపద్యమునందలి వస్తుస్థితికథనము ఎక్కువ ఫలకారి.

"ఆ. కులము గలుగువారు గోత్రంబుగలవారు
విద్యచేత విఱ్ఱవీఁగువారు,
పసిఁడి గల్గువాని బానిసకొడుకులు..." (౧౧౩౭)

ఇట్టి మఱి రెండు పద్యములు.—

"ఆ. పనస తొనలకన్న పంచదారలకన్న
జుంటితేనెకన్న జున్నుకన్న
చెఱకురసముకన్న చెలిమాట తీపురా..." (౨౪౦౪)

"ఆ. జాగుపుట్టువునకును జాజిపూవులతోడ
పాన్పు వేయునయ్య ప్రాఁతలంజ,
సొంతమగనిమీఁద చింతనిప్పులు చల్లు..." (౧౫౯౬)

మఱియు వట్టి యుపమానములనే చెప్పి, విషయము చెప్పక, వ్యంజింపఁజేయుట యితని యింకొక విచిత్రమార్గము.

"ఆ. తిరుమలకును బోవఁ దురక దాసరి గాఁడు;
కాశికేఁగఁ బంది గజము గాదు,
కుక్క సింగమగునె గోదావరికిఁబోవ..." (౧౯౪౪)

"ఆ. పొట్లకాయ రాయి పొడుగు త్రాటనుగట్ట
లీలతోడ వంకలేక పెరుగు,
కుక్కతోఁకఁగట్టఁ గుదురునా చక్కగా..." (౨౬౧౫)

ఇట్లు ధర్మము, తత్త్వము, నీతి, పరమత ఖండనము మొదలగు నేవిషయములు చెప్పినను ఇతని పద్యములందు అనన్యసాధారణమైన సారళ్యము, ధారాళత, చెక్కడపుపని, నిర్లక్ష్యము మొదలగుకవితాగుణములు నిండియుండును. ఇతని యేపద్యమును

విన్నను నిలిచి తటాలున అప్రక్క తిరిగి యొకమాఱైన చూడకుండుటను తెలుఁగుమాటలాడువాని కెవ్వనికిని సాధ్యము గాదు. ఈయాకర్షణశక్తి యితనియం దున్నంత తక్కినవారెవరియందును గానరాదు. తాను జెప్పుమాట యితరులహృదయమునందు పడి జారిపోక యందే యంటుకొనునట్లు చేయుటయే కవికితరులయందు లేని భగవద్దత్తమైనశక్తి. దానికి పరవశులై తక్కిన సహృదయులందఱును ఇట్టిదని చెప్పరాని యొకయానందమనుభవింప వలయునఁట. సృష్టిసిద్ధమగు అనిర్వచనీయ రహస్యములలో నొకటి. కాని యాసహృదయత్వముగూడ కొంతవఱకు సహజమైన శక్తి. స్వాభావికముగా కవిత్వము, సంగీతము మొదలగు కళలయందభిరుచి లేనివారెందఱో కలరు. ఆసహజమగు సహృదయత్వమును చదువు, వివేకము, అభ్యాసము వినిచే తగినత్రోవలో వృద్ధిఁబొందించుకొని నానాపరిపక్వబుద్ధులమైతిమేని యెక్కువ యానందమనుభవింపఁ గల్గుదుము. అట్లుగాక, నీతి, మతము, నాగరకత, ప్రాచీన సిద్ధాంతములు, మనకున్న బలవంతులగువారి రాద్ధాంతములు మొదలగు వానికి లోఁబడి తప్పుత్రోవలో దానిని బోనిచ్చితిమేని యనేకమహాకవులకవిత్వము మనపాలి కున్నను లేనట్లే యగును.

ఇదివఱకును కవిత్వమేది యనుచర్చ వచ్చినప్పుడు మనము సంస్కృతపండితుల సులోచనములు వేసికొనియే చూచినిర్ణయించుచుంటిమి. ఇప్పు డింగ్లీషువారి మద్దెనుతో చూచుచున్నాము. వారేది కవిత్వమనిరో మనము నదియే కవిత్వమనుచున్నాము. కాదన్నది కాదనుచున్నాము. ఇంతే కాని మనయనుభవములు మనమునమ్మి సిద్ధాంతము చేయుచుండలేదు. చదువుకొన్నవారిలో మొట్టమొదట వేమన్న పద్యముల గొప్పతనమును గుర్తించినవాఁడు బ్రౌను దొర. కాని యతఁడును. ఇవి క్రొత్తగా తెలుఁగు నేర్చుకొను దేశాంతరము వారికి పనికి వచ్చునే కాని, వీనిలో పురాణముల ప్రామాణ్యముగాని, ప్రబంధకవుల ప్రౌఢిమ గాని లేదనియే చెప్పెను. * తరువాతివాఁడు కాంబెలుదొర. క్రైస్తవమత ప్రచారమే పరమార్థముగాఁగల యితఁడు హిందువుల దంభాచారములను దిట్టుటకే వేమనపద్యముల నుపయోగించు కొన్నట్లున్నది కాని యతనికవిత్వమందంత యభిమానముఁ జూపలేదు. ఇఁక వేమన్న కవియని మనవారనుకోలేదు. పాశ్చాత్యులు సిఫారసు చేయనులేదు. కావున తెలుఁగువారిలో చదువుకొన్నపండితులకును ఇంకను వేమనపద్యముల కవిత్వపువిలువను గమనింపకయే యున్నారు.

ఎట్లు గమనింపఁ గలరు! వేమనపద్యము లెక్కిన పెద్దసింహాసనము 'మార్స్ మిల్లన్' గారి మూఁడవ 'రీడరు' కాలేజీలలోఁగాని, హైస్కూళ్ళలోఁగాని తెలుఁగు విద్యార్థులు వాని మొగముఁ జూచుట కవకాశమిచ్చిన పాపమున నెవ్వరైనఁ బోయినారా! పాఠపుస్తకములను నిర్ణయించువారందఱును ఇంకను తెలుఁగు పండితుని నిఘంటుజ్ఞానమును పరీక్షింపఁజూచుచున్నారే గాని, శిష్యుల మనోవికాసముపై దృష్టి గలవారపురూపము. కావ్యములను పాఠము చెప్పుట యనఁగా శిష్యునకు తెలియని

---

* (Br. Vemana, Preface III)

పదముల కర్థము చెప్పుటయే యింక యిప్పటికిని అనేకుల తలంపు. కాని కవియొక్క భావములు, అభిప్రాయములు, శైలి, మొదలగు వానినిగూర్చి చర్చించి తెలుప నక్కరలేదా?

ఇదిగాక యిప్పటి పాఠశాలలలో శుద్ధసంస్కృత పద్ధతిని ఇంగ్లీషుపద్ధతిని అవలంబించి వ్రాసిన పురాణములు, ప్రబంధములు, నాటకములు, నవలలు, మొదలగు వానిని నియమింతురుగదా! వానిలో ననేకములు వాతలే కాని వ్రాఁతలు కావు. ఈ రెండును ఎఱుఁగని శుద్ధమగు తెలుఁగుకవిత్వ మొకటి యున్నది గదా. దానిని తెలుఁగువిద్యార్థు లెఱుఁగవలదా? వేమన్నది ఇట్టి యచ్చ తెనుఁగుకవిత్వమనుట తెలుఁగువారంద ఱెఱుఁగుదురు. దీనికి నైషధ రాజ్యప్రబంధముల కిచ్చు గౌరవమీయ లేకున్న మానెనుగాని, తలతోఁక లేని నవలలు, నాటకములు మొదలగు వానితో సమానముగానైనను మన్నింపలేకపోయితిమేని మన తెలుఁగు గాని తెలివిగాని యెందుకు తరమైనది? ఇతనిలో అపశబ్దములు గలవు గావున పాఠశాలలకు తరము గాదని యందురేని, పూర్వకాలమువారి వ్రాఁతలన్నియు సుశబ్దములే యనుకొందము పోనిండు, కాని ఆధునికులచ్చే వ్రాయఁబడి పాఠ్యపుస్తకములుగా నియమింపఁబడిన గ్రంథములలో అపశబ్దములు లేనివి పదికొక్కటి చూపఁగలరా? మఱియును తెలుఁగు వంటి బ్రదికియుండు భాషలలో 'ఇవే యపశబ్దములు ఇవే సుశబ్దములు' అని నికరముగా శాశ్వతముగా నిర్ణయించుటకుఁ బూనుకొనుట వట్టి వెఱ్ఱియని యిప్పటివారును తెలిసికొనలేక పోవుట మన తప్పుగదా!

నిజము చూడఁబోయిన కారణమిదిగాదు. రహస్యము వేఱు. మనము సంప్రదాయమునకు దాసులము. దానిని మార్చుకొనుశక్తి మనలో ననేకులకు లేదు. వేమన పద్యములు పెద్దతరగతుల విద్యార్థులకు చదువ నియమించు సంప్రదాయము ఇదివఱకు లేదు. 'అది లేకయే ప్రపంచము జరుగుచున్నదే; పరీక్షలలో విద్యార్థులు 'ప్యాసు' అగుచున్నారే; ఈక్రొత్త సంప్రదాయము యేల! ఉన్నట్లుండనిమ్ము', అనుటయే మన యిప్పటిస్థితి. ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారు ఈవిషయమున ముందంజవేసి యట్టి సంప్రదాయమును గల్పించిరేని శిష్యులకు హృదయోల్లాసము గల్గించినవారగుదురు. తామును స్వధర్మమును నిర్వర్తించి ధన్యులగుదురు.

---

Printed at the Saraswathi Power Press, Rajahmundry—1945.

### (C) GRAMMAR

No. 15. VAIYAKARANA PARIJATAMU by V. Ch. Sitaramaswami Sastri, Pandit, University College of Arts. (Rs. 3—0—0)

### (D) LITERATURE

No. 2. THE UNIVERSITY LECTURES ON VEMANA— by R. Anantakrishna Sarma Lecturer, Maharajah's College, Mysore. (Re. 0—12—0)

No. 10 HISTORY OF SANSKRIT LITERATURE-PART 1, VEDIC PERIOD (IN TELUGU)—by M Suryanarayana Sastri, formerly Pandit, University College of Arts. (Rs. 2—4—0)

No 13. HISTORY OF SANSKRIT LITERATURE-PART II, LAUKIC PERIOD (IN TELUGU)— by the same author. (Rs 2—4—0)

No 18 HISTORY OF TELUGU LANGUAGE— by Dr. C. Narayana Rao, M.A., Ph.D., L T. Lecturer, C D. College, Anantapur (in two volumes) Each volume (Rs. 6—0—0)

No. 21. VYASAMANJARI OR COLLECTED ESSAYS IN TELUGU—by Sir C. R Reddy, M.A, (Cantab), M. L. C., Hon, D. Litt. (Andhra), Vice-Chancellor, Andhra University, Guntur. (Rs. 1—8—0)

No 29. Gona Budhareddy's Ranganatharamayanam— Edited by Veturi Prabhakara Sastri. (Rs. 7—8—0)

No 30. DWIPADA BHARATAM— Vol. 1— Edited by P. Lakshmikantam, M A. (Rs 10—0—0)

### (E) PHILOSOPHY

No 9. ANDHRA MIMAMSA NYAYA MUKTAVALI – (IN TELUGU)— A TREATISE ON PURVA MIMAMSA DARSANA-by K Gopalakrishnamma, M.A., L T., formerly Lecturer in Oriental Languages, Government Arts College, Rajahmundry. (Rs. 1—8—0)

### (F) SCIENCE

No. 14. VISWARUPAM— (dealing with the Physical Universe) written in popular Telugu— by K. Kondayya, M.Sc., Chemistry Department, Benares Hindu University, Benares. (Rs. 2/-)

No. 20. TELUGU EQUIVALENTS OF TECHNICAL TERMS IN PHYSICS— by A. Balankeswara Rao, B.Sc (Hons.), formerly Lecturer, Department of Physics, J. V. D. College of Science and Technology. (Re. 0-12-0) (Inclusive of Postage).

Text-Book on Zoology and Physiology (in Telugu)—by R. V. Seshaiya, M A., Annamalai University, Annamalainagar—(*in the Press*)

Text-Book on Trigonometry (in Telugu)—by K. Rangachari, M.A, B.L., M. R. College, Vizianagaram— (*in the Press.*)

## III SANSKRIT

### (A) VYAKARANA (Grammar)

No 6. CHITRAPRABHA—A COMMENTARY ON HARIDIKSHITA'S LAGHUSABDARATNA— by B. Hari Sastri - Edited with notes by Mahamahopadhyaya Kala Prapurna Tata Subbaraya Sastri, Maharajah's Sanskrit College, Vizianagaram (Rs. 3/-).

No 26. Guruprasadam and Guruprasadasesham— Edited by Mahamahopadhyaya Kalaprapurna Tata Subbaraya Sastri and Peri Venkateswara Sastri- Part I (Rs. 7-8-0)
Do do Part II (Rs 10-0 0)

### (B) NYAYA

No. 7. SANGAMESWARAKRODUM—ON JAGADISA'S SIDDHANTALAKSHANAM—by G Sangameswara Sastri (Re. 0—12—0)

### (C) VEDANTA

No 25. Vivaranaprameya Sangraha (Sanskrit Text) Edited by S. S. Suryanarayana Sastri, M.A., B.Sc., Bar-at-Law and Prof. Saileswar Sen, M.A., D. Litt., et., D. Phil. (Rs. 7-8-0)

*Note—Copies of the above English and Sanskrit publications can be had from Kitabistan, Allahabad, U. P., and Telugu publications from Venkatarama & Co., Guntur.*

# Andhra University Publications

## I ENGLISH

### (A) HUMANITIES AND SCIENCES

RAMALINGA REDDY SHASHTYABDAPURTI COMMEMORATION VOL. Part I—Sciences (Rs. 15/-)

Do. Part II—Humanities. (Rs. 15/-)

### (B) ECONOMICS AND POLITICS

No. 1. THE BEGINNINGS OF LOCAL TAXATION IN THE MADRAS PRESIDENCY—A STUDY IN INDIAN FINANCIAL POLICY—1863-71—by Prof. M. Venkatarangaiya, M.A., ... Head of the Department of History, Economics and Politics, Andhra University, Guntur. (Rs. ...)

... The WORLD ECONOMIC DEPRESSION ... FOR CO-OPERATION— by Sir J. C. ..., formerly Professor, ... History, Economics and ..., Andhra University. (Rs. 0—12—0)

No. 5. INDIA AND THE LEAGUE OF NATIONS—by Sir J. C. Coyajee (Rs. 3—4—0)

... IN GOVERNMENT— by ... Rangaiya, M.A. (Rs. 2/-)

... INDIAN POLITICS SINCE THE MUTINY— by Sir C. Y. Chintamani, Editor, Leader, Allahabad. (Rs. 2/-)

Copies of English Edition can be had from Messrs George Allen & Unwin Ltd., 40 Museum Street London, W. C. I. (Price 7s 6d net)

### (C) HISTORY

... BUDDHIST REMAINS IN ANDHRA AND THE HISTORY OF ANDHRA BETWEEN 225 AND ... A.D.— by K. R. Subrahmaniam M.A., Ph.D, Principal, Maharajah's College, Vizianagram. (Rs. 2/-)

No. 19. MODERN CHINESE HISTORY (POLITICAL, ECONOMIC AND SOCIAL)— by Prof. ... Yun ... (Chief ... Sino-Indian Cultural Society, Nanking) (Rs 0—8—0)

No. 27. Advanced History of India by the late Prof. P. T. Srinivasa Ayyangar, Ed. by G. V. Rao, M.A., LL.B., Reader in History, Andhra University (Rs. 8—8—0)

### (D) PHILOSOPHY

... MAN— by Dr. Rabindranath Tagore (Rs. 1—0—0)

No. 24. Vivaranaprameya Sangraha (English Translation) Edited by S. S. Suryanarayana Sastri, M.A., B.Sc., Bar-at-Law and Prof. Saileswar Sen, M.A., D. Litt., et., D. Phil. (Rs 6—8—0)

### (E) SCIENCE

No. 22. AN OUTLINE OF THE MINERAL RESOURCES OF ANDHRA DESA— by C. Mahadevan, M.A., D.Sc. (Madras), ... A. Sc. (Rs. 0—8—0)

No. 23. SCATTERING OF LIGHT AND THE RAMAN EFFECT— by Prof. S. Bhagavantam, M.Sc., Hon. D.Sc. (Andhra), Principal, University Colleges, Guntur (Rs. 5—0—0)

No. 23. Intermediate Practical Physics by Prof. V. Appa Rao, M.A., L.T. (Rs. ...—0—0)

No. 31. Natural Resources of Andhra Area & Allied Topics A symposium. (Rs. 2—8—0)

## II TELUGU

### (A) CATALOGUES

No. 11. A DESCRIPTIVE CATALOGUE OF THE TELUGU MANUSCRIPTS IN THE TANJORE ... LIBRARY— Edited by P. P. S. Sastri, M.A., Govt. Oriental Manuscripts Library, Madras (Rs. 1—8—0)

### (B) CRITICISM

No. 8. KAVITWATHATHWAVICHARAMU— by Sir C. R. Ramalinga Reddy, M.A. (Cantab.), Hon. D. Litt. (Andhra), M.L.C., Vice-Chancellor, Andhra University, Guntur (Rs. 1—8—0)

(For other publications see inside of ... Cover.)